అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
www.navatelangana.com
శుక్రవారం 08-3-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 67 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు వెల : 6.50

దురుద్దేశపూరితం

- పారదర్శకతకు విఘాతం
- ఎస్‌బీఐపై సుప్రీంలో కోర్టు ధిక్కరణ పిటిషన్
- దాఖలు చేసిన ఏడీఆర్, కామన్‌కాజ్ 13లో..



కేంద్రం సహకరించకపోతే
కొట్లాడుతం..
ప్రజల కోసమే ఒక మెట్టు దిగా..


బహిరంగసభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

- ప్రజావసరాలను మరిచిన గత ప్రభుత్వం
- నగరాభివృద్ధికి కేటీఆర్ ఆమరణ దీక్ష చేస్తే తాము సహకరిస్తాం : సీఎం రేవంత్‌రెడ్డి
- బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో గంజాయి, డ్రగ్స్ పెరిగాయని వ్యాఖ్య
- జాతీయ రహదారి ఎలివేటెడ్ కారిడార్‌కు శంకుస్థాపన
- పలు కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

"హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చేస్తాం.. నగరానికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చింది కాంగ్రెస్సే.. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకరించకపోతే కొట్లాడుతాం.. ప్రజల అవసరాల కోసమే ఒక మెట్టు దిగా తప్పితే.. రాజకీయాల కోసం కాదు.. ప్రజావసరాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం మరిచింది.. రానున్న రోజుల్లో కంటోన్మెంట్‌ను అభివృద్ధి చేస్తాం.." అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో గురువారం పర్యటించిన సీఎం, జవహర్‌నగర్ ఆర్మీ డెంటల్ కాలేజీ స్నాతకోత్సవంలో పాల్గొన్న అనంతరం సికింద్రాబాద్ అల్వాల్ టిమ్స్ సమీపంలోని జాతీయ రహదారి (ఎస్‌హెచ్01) ఎలివేటెడ్ కారిడార్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ప్రజల అవసరాన్ని మరిచిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. రాజీవ్ రహదారి (ఎస్‌హెచ్01) ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టును పక్కన పెట్టిందన్నారు. తాము అధికారంలోకి రాగానే ప్రధానమంత్రి నరేంద్రమోడీ, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి, ఈ ప్రాజెక్టు అవసరాన్ని వివరించి సమస్యను పరిష్కరించామని చెప్పారు. ఈ కారిడార్ పూర్తయితే మేడ్చల్, కుత్బుల్లాపూర్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు ప్రయాణం సులభతరం అవుతుందన్నారు. అలాగే మేడ్చల్ ప్రాంతంతోపాటు ఉత్తర తెలంగాణ ...13లో

తాడిచెర్ల సింగరేణికే...
డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

5లో..


కేంద్రమంత్రితో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైకోర్టులో సర్కారుకు షాక్

- ఎమ్మెల్సీల నియామకం గెజిట్ కొట్టివేత
- క్యాబినెట్ నిర్ణయాన్ని గవర్నర్ తిరస్కరించిందంటూ వ్యాఖ్య
- ఎమ్మెల్సీల నియామకంపై సర్కార్ పున:సమీక్షించాలంటూ సూచన
- దాసోజు, కుర్రా కేసులో హైకోర్టు ఉత్తర్వులు

నవతెలంగాణ - హైదరాబాద్

గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై రాష్ట్ర ప్రభుత్వానికి చుక్కెదురైంది. ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీఖాన్ నియామకం చెల్లదని హైకోర్టు స్పష్టం చేసింది. ఆ ఇద్దరినీ ఎమ్మెల్సీలుగా నియమిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్‌ను కొట్టేసింది. దాసోజు శ్రవణ్, కూర సత్యనారాయణల ఎన్నికను గవర్నర్ పున:పరిశీలించాలని ఆదేశించింది.గవర్నర్ తీసుకున్న నిర్ణయం రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం ఉందో లేదో అనేది మాత్రమే తాము చెబుతున్నట్లు వివరించింది. మళ్లీ కొత్తగా ఎమ్మెల్సీల నియామకాలు చేపట్టాలని ఆదేశించింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ అలోక్ అరధే నూతృత్వంలోని డివిజన్ బెంచ్ గురువారం తీర్పు వెలువరించింది. గవర్నర్ తమ పేర్లను ఏకపక్షంగా, రాజ్యాంగ విరుద్ధంగా తిరస్కరించారంటూ దాసోజు. సత్యనారాయణ దాఖలు చేసిన రెండు పిటిషన్లను అడ్మిట్ చేస్తూ తీర్పు చెప్పింది. వీళ్ల పేర్లను క్యాబినెట్ సిఫార్సు చేసిందంటే వాళ్లు ఆ పదవులను ఆశిస్తారనీ, అయితే, వాళ్లపై ఎలాంటి అభియోగాలు ఉన్నాయో, ఏ కారణంగా తిరస్కరించిందీ వంటి వివరాలు రికార్డుల్లో పేర్కొనలేదని చెప్పింది. అందుకే ఇద్దరి పేర్లను గవర్నర్ తిరస్కరిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని, ఆ మేరకు వెలువడిన ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు చెప్పింది. ఆ తర్వాత కోదండరామ్, అమీర్‌అలీఖాన్ నియామకాలు జరిగాయనీ, ఈ ప్రక్రియను ...5లో



లఢక్‌లో భారీ నిరసన ప్రదర్శన

మోడీకి సెగ
ప్రధాని కాశ్మీర్ తొలి పర్యటనలో గళమెత్తిన జనం

- లఢక్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనంటూ భారీ నిరసన
- నిరాహార దీక్ష ప్రారంభించిన మెగసెసే అవార్డు గ్రహీత వాంగ్‌చుక్

లఢక్ : జమ్మూకాశ్మీర్ పర్యటనకు వచ్చిన ప్రధాని మోడీకి నిరసన సెగ తగిలింది. 2019లో ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత తొలిసారిగా ప్రధాని నరేంద్ర మోడీ గురువారం జమ్మూకాశ్మీర్‌లో పర్యటించారు. అయితే లఢక్‌కు ప్రత్యేక హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. లఢక్ ప్రాంతంలోని లెహ్‌లో దుకాణాలు, వ్యాపార సంస్థలన్నింటినీ మూసివేశారు. ప్రజా జీవనం పూర్తిగా స్తంభించింది. మరోవైపు ఈ నెల 4న కేంద్ర హోం మంత్రిత్వ శాఖతో జరిపిన చర్చలు విఫలమవడంతో 21 రోజుల పాటు నిరాహార దీక్ష చేస్తానని పర్యావరణ కార్యకర్త, మెగసెసే అవార్డు గ్రహీత సోనమ్ వాంగ్‌చుక్ ప్రకటించారు.

నేను సోనమ్ వాంగ్‌చుక్‌ని. హిమాలయాల నుండి ప్రపంచ ప్రజలకు ఓ సందేశాన్ని అందజేస్తున్నాను. ఈ రోజు నుండి ఆమరణ నిరాహార దీక్షకు కూర్చుంటున్నాను. ఇది దశల వారీగా జరుగుతుంది. ఒక్కో దశలో 21 రోజుల పాటు నిరాహార దీక్ష చేస్తాను. అవసరమైతే పొడిగిస్తాను. మహాత్మా గాంధీ కూడా స్వాతంత్రోద్యమంలో 21 రోజుల పాటు నిరాహార దీక్ష చేశారు. ఆయన చేసిన సుదీర్ఘ దీక్ష అదే. ఆయన నడిచిన ...6లో

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్ : మోడీ



'వికసిత్ భారత్ వికసిత్ జమ్మూకాశ్మీర్' కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్ర మోడీ శ్రీనగర్‌లో పర్యటించారు. రూ.6,400 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి, వాటిని జాతికి అంకితం చేశారు. ఆర్టికల్ 370 రద్దుపై కాంగ్రెస్, దాని భాగస్వామ్య పక్షాలు జమ్మూకాశ్మీర్ ...13లో

జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్య పరిష్కారానికి కృషి చేస్తా

- ఫెడరేషన్‌కు మంత్రి ఉత్తమ్ హామీ
- మీడియా డైరీ ఆవిష్కరణ



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

జర్నలిస్టులకు ప్రభుత్వం ఇండ్ల స్థలాలు ఇచ్చే విషయంలో తాను శాయశక్తులా కృషిచేస్తానని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) మీడియా డైరీ-2024ను మంత్రి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యలపై చర్చ జరిగింది. సంఘాలకు సంబంధించి మంత్రి ఆరా తీశారు. ఎన్ని సంఘాలు ఉన్నాయంటూ పెడరేషన్ నాయకులను ప్రశ్నించారు. జీవో 239 ప్రకారం ప్రభుత్వ గుర్తింపు పొందిన సంఘాలు మూడు ఉన్నాయనీ, అందులో టీడబ్ల్యూజేఎఫ్ ఒకటి అని మంత్రికి తెలియజేశారు. మంత్రి మళ్లీ స్పందించి మాట్లాడుతూ ఇండ్లస్థలాల అంశం ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న విషయం తనకు తెలుసని అన్నారు. ఈ విషయమై తాను చొరవ తీసుకుని ముఖ్యమంత్రి దష్టికి తీసుకువెళ్ళి పరిష్కరిస్తానని చెప్పారు. జర్నలిస్టు ఫెడరేషన్ ఆధ్వర్యంలో సమగ్ర మీడియా సమాచారంతో డైరీ-2024ను తీయడంతో పాటు జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నందుకు ఫెడరేషన్ నాయకులను మంత్రి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, పిల్లి రాంచందర్, కార్యదర్శులు ఎస్‌కె సలీమా, గుడిగ రఘు తదితరులు పాల్గొన్నారు.

ఇండ్లస్థలాల కోసం సొసైటీ ప్రతినిధుల భేటీ

- సమన్వయ కమిటీ ఏర్పాటు

నవతెలంగాణ-హైదరాబాద్

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు హైదరాబాద్‌లో ఆయా హౌసింగ్ సొసైటీల ప్రతినిధులు సమావేశమయ్యారు. దీనికి తెలంగాణ మీడియా అకాడమీ చైర్మెన్ కె. శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఇండ్లస్థలాల సమస్య ఆయా సొసైటీల్లో ఉన్న జర్నలిస్టుల సంఖ్య, ప్రస్తుతం ఉనికిలో ఉన్న సొసైటీలను విలీనం చేసి ఒకే గొడుకు కిందకు తేవాలనే అంశాలపై చర్చ చోటుచేసుకుంది. దాదాపు రెండు గంటల పాటు సమావేశం జరిగింది.ది జర్నలిస్టు కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ, తెలంగాణ హౌసింగ్ సొసైటీ, దక్కన్ జర్నలిస్ట్స్ సొసైటీల మధ్య సమన్వయం కోసం ఒక కమిటీ ఏర్పాటు చేయాలని ఈ సమావేశం తీర్మానించింది. ప్రభుత్వంతో సంప్రదింపులు చేయడానికి ఈ కమిటీ పని చేయనుంది. ఈ సమావేశంలో టీసాట్ చైర్మెన్ బి. వేణుగోపాల్‌రెడ్డి, తెలంగాణ మ్యాగజైన్ ఎడిటర్ శ్రీనివాసరావు, సొసైటీల ప్రతినిధులు సూరజ్ భరద్వాజ్, విరాహత్ అలీ, విజయ్‌కుమార్‌రెడ్డి, రవీంద్రబాబు, భూపాల్‌రెడ్డి, బి. మహేశ్వర్, రామకృష్ణ, శ్రీనివాస్, విక్రంరెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ ఆత్మగౌరవానికి రేవంత్ బ్రాండ్ అంబాసిడర్

- ఎవరెవరు ఒక్కటైనా ఆయన్ను ఏమీ చేయలేరు : ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ఆత్మగౌరవానికి సీఎం రేవంత్‌రెడ్డి బ్రాండ్ అంబాసిడర్ అని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఎవ్వరొక్కటైనా ఆయన్ను ఏమీ చేయలేరని హెచ్చరించారు. ఇన్నాళ్లు కేసీఆర్ అవినీతిని బీజేపీ ప్రోత్సహించిందని ఆరోపించారు. ఎలాంటి అనుమతులు లేని ప్రాజెక్టులకు కేంద్రం అప్పు ఎలా ఇచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. కృష్ణా జలాలను సీఎం కేసీఆర్ తన మిత్రుడు ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డికి అప్పగించారని విమర్శించారు.గురువారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ నేతల మధ్య బీఆర్ఎస్ చిచ్చు పెడుతున్నదని విమర్శించారు. కేసీఆర్‌కు ముట్టిన కమీషన్లలో కేంద్రానికి వాటా ఉందని ఆరోపించారు. తన కొడుకును ముఖ్యమంత్రి చేయడానికి సహకరించాలంటూ మోడీని కోరిన ప్పుడు తెలంగాణ ఆత్మ గౌరవం ఏమైం దని ప్రశ్నించారు.

బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పందం

- కాంగ్రెస్ సీనియర్ నేత గజ్జల కాంతం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పందం చేసుకున్నాయని కాంగ్రెస్ సీనియర్ నాయకులు గజ్జల కాంతం ఆరోపించారు. బీజేపీకి అన్ని విధాలుగా సహకరిస్తూ...ఆ పార్టీతో బీఆర్ఎస్ కుమ్మక్కైయిందని నిజం కాదా? అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అన్ని చట్టాలకు బీఆర్ఎస్ మద్దతిచ్చిందని విమర్శించారు. మోడీ కాళ్ళు పట్టుకుని పదవులు, ఆస్తులు కాపాడుకోలేదా? అని ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం సీఎం రేవంత్ మోడీని కలిస్తే తప్పైందా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ లాగా రేవంత్ చీకటి ఒప్పందాలు, రాత్రి పూట కలవడాలు రేవంత్ చేయలేదనీ, బహిరంగంగానే మోడీకి వినతిపత్రం సమర్పించారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి భయంతోనే బీఎస్పీతో పొత్తు పెట్టుకున్నదని ఎద్దేవా చేశారు.

ఏఐసీసీ లీగల్ సెల్ కో ఆర్డినేటర్‌గా సి దామోదర్‌రెడ్డి

ఏఐసీసీ జాతీయ లీగల్ సెల్ కో ఆర్డినేటర్‌గా సి. దామోదర్‌రెడ్డిని నియమించింది. ఈమేరకు గురువారం ఏఐసీసీ లీగల్‌సెల్ జాతీయ కార్యదర్శి విపుల్ మహేశ్వరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల లీగల్ సెల్ వ్యవహారాలు దామోదర్ రెడ్డి పర్యవేక్షిస్తారు.

10న భారత్ జోడో న్యాయ్ యాత్ర మారథాన్

- పోస్టర్ ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఇండియా కూటమిని గెలిపించాలని కోరుతూ ఈనెల 10న భారత్ జోడో న్యాయ్ యాత్ర మారథాన్ చేపట్టనున్నట్టు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివసేనారెడ్డి చెప్పారు. ఉదయం ఆరు గంటలకు కృష్ణకాంత్ పార్కు నుంచి యూసుఫ్‌గూడ వరకు మారథాన్ కొనసాగుతుందని తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో అందుకు సంబంధించిన పోస్టర్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ స్పోర్ట్స్ సెల్ చైర్మెన్ మహమ్మద్ అసదుద్దీన్ పాల్గొన్నారు.

ఆర్టీసీకి రథ-చక్రాలు, పునాదులు సిబ్బందే

బాండ్స్ పేమెంట్స్ క్లియర్ చేస్తాం

- ఎన్నికల కోడ్ రాకముందే ప్రక్రియ ప్రారంభిస్తాం
- పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి : రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- ఆర్టీసీ అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకం: ఎండీ వీసీ సజ్జనార్
- ఘనంగా గ్రాండ్ ఫెస్టివల్ ఛాలెంజ్ అవార్డుల ప్రదానోత్సవం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆర్టీసీకి రథచక్రాలు, పునాదులు సిబ్బందేననీ, వారిని నిరంతరం ప్రోత్సహించడంలోనూ, సంక్షేమం విషయంలోనూ తమ ప్రభుత్వం ముందు వరుసలో ఉంటుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ భరోసానిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని టీఎస్ఆర్టీసీ కళాభవన్‌లో గ్రాండ్ ఫెస్టివల్ ఛాలెంజ్‌తో పాటు మేడారం జాతరలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఉద్యోగులకు, దసరా లక్కీ డ్రా విజేతలకు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పొన్నం ప్రభాకర్, టీఎస్ఆర్టీసీ ఎమ్‌డీ వీసీ సజ్జనార్‌తో కలిసి 157 మంది ఉత్తమ ఉద్యోగులకు అవార్డులను అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ..ప్రతి ఏటా అత్యుత్తమ విధులు నిర్వహించే మహిళా ఉద్యోగులకు కూడా మహాలక్ష్మి స్కీమ్ పేరుతో అవార్డులు ఇవ్వాలని ఆర్టీసీ ఎమ్‌డీ సజ్జనార్‌కు సూచించారు. 2013 బాండ్స్ పూర్తిచేస్తామని సీఎం ప్రకటించారని తెలిపారు. రేపటి నుంచే బాండ్స్ పేమెంట్లను ఉద్యోగులకు ఇస్తామన్నారు. ఎన్నికల కోడ్ వచ్చేలోపే పేమెంట్ చెల్లింపు ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించారు. పీఆర్సీపై సీఎంతో చర్చించి న్యాయం చేస్తానని హామీనిచ్చారు. పెండింగ్ బకాయిల చెల్లింపు ప్రభుత్వం దృష్టిలో ఉందనీ, వాటన్నింటినీ పరిష్కరిస్తామని భరోసానిచ్చారు. పీఎఫ్, సీసీఎస్ తదితరాలు కార్మికులకు అందేలా చూస్తామన్నారు. అవార్డులు పొందిన వారిని ఆదర్శంగా తీసుకుని మిగతా ఉద్యోగులు పనిచేయాలని పిలుపునిచ్చారు. మహిళలకు ఇస్తున్న జీరో టికెట్‌కు సంబంధించిన రీయింబర్స్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. మహాలక్ష్మి ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని 24 కోట్ల మహిళలు ఇప్పటివరకు వినియోగించుకున్నారన్నారు. ఆర్టీసీలో త్వరలోనే నియామకాలు చేపట్టబోతున్నామనీ, కొత్త బస్సులు కూడా రాబోతున్నాయని ప్రకటించారు. సంస్థ బాగుకోసం ఉద్యోగుల నుంచి సలహాలు, సూచనలను స్వీకరిస్తామన్నారు. వీసీ సజ్జనార్ మాట్లాడుతూ..ఆర్టీసీ అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమని కొనియాడారు. మేడారం మహాజాతరలో ఆర్టీసి అధికారులు, సిబ్బంది అద్భుతంగా పనిచేశారని ప్రశంసించారు.

మహాలక్ష్మి స్కీం అమలు తర్వాత సిబ్బందిపై పని ఒత్తిడి పెరిగిందనీ, అయినా, సిబ్బంది అంకితభావంతో పనిచేస్తున్నారని చెప్పారు. సిబ్బంది నిజాయతీతో ఉత్తమ సేవలందించడం వల్లే జాతీయస్థాయిలో సంస్థకు గుర్తింపు లభిస్తోందన్నారు. ఇటీవల ఏఎస్ఆర్‌టీయూ ప్రతి ఏటా ప్రకటించే ప్రతిష్టాత్మక ఐదు నేషనల్ పబ్లిక్ బస్ ట్రాన్స్‌పోర్ట్ ఎక్స్‌లెన్స్ అవార్డులను టీఎస్ఆర్టీసీ గెలుచుకుందని గుర్తు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో ఉద్యోగుల పెండింగ్ సమస్యలన్నింటినీ పరిష్కరించేలా కృషిచేస్తానని హామీనిచ్చారు. రెండు వేల కొత్త బస్సుల కొనుగోలుకు ప్లాన్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీఎస్ఆర్టీసీ సీవోవో డాక్టర్ వి.రవిందర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, పురుషోత్తం, కృష్ణకాంత్, వెంకటేశ్వర్లు, ఫైనాన్స్ అడ్వయిజర్ విజయ పుష్ప, సీఎంఈ రఘునాథరావు, తదితరులు పాల్గొన్నారు.

అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన రీజియన్లు ఇవే..

మహాలక్ష్మి పథకం అమలుకు ముందు : ఫస్ట్ బెస్ట్ రీజియన్ కరీంనగర్, సెకండ్ బెస్ట్ రీజియన్ మహబూబ్‌నగర్, థర్డ్ బెస్ట్ రీజియన్ నిజామాబాద్ నిలిచాయి.

మహాలక్ష్మి పథకం అమలు తర్వాత: ఫస్ట్ బెస్ట్ రీజియన్ హైదరాబాద్, సెకండ్ బెస్ట్ రీజియన్ సికింద్రాబాద్, థర్డ్ బెస్ట్ రీజియన్ వరంగల్ నిలిచాయి.

సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతన్నలు

కాలువలకు నీరు విడుదల చేయాలని డిమాండ్

నవతెలంగాణ-మంథని

సాగునీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు అధికారులు వేడుకున్నారు. పెద్దపల్లి జిల్లా మంథని మండల కేంద్రంలోని పాత పెట్రోల్ బంకు ప్రధాన రహదారిపై గురువారం రాస్తారోకో చేశారు. ఎస్సారెస్పీ డి-83 కాలువ పరిధిలోని కాకర్లపల్లి, రామకృష్ణాపూర్, మైదుపల్లి, సూరయ్యపల్లి, గాజులపల్లి ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో యాసంగి వరి సాగు చేసామని, కీలక దశలో పంటలకు నీరు లేక ఎండిపోతు న్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే చాలా పొలాలు ఎండిపోయాయని, వెంటనే కాలువ నీరు విడుదల చేస్తే సగం మేరకైనా పంటలైనా చేతికందుతాయని అన్నారు. కాలువ నీళ్లు రావని ముందే చెప్తే యాసంగిలో వరి పంట వేసే వాళ్లం కాదని ఆవేదన వ్యక్తం



చేశారు. మంథని సీఐ, ఎస్ఐ సిబ్బందితో ఘటనా స్థలానికి వచ్చి రైతులతో మాట్లాడారు. కానీ, తమకు నీటి విడుదలపై సంబంధిత అధికారులు స్పష్టతిచ్చేవరకు కదిలేది లేదని భీష్మించుకూర్చున్నారు.

సాగునీరు అందించి పంటలు కాపాడకపోతే ఆందోళనలు తీవ్రం చేస్తామని హెచ్చరించారు. దాంతో మంథని ఆర్డీవో హనుమ నాయక్ వచ్చి రైతులతో మాట్లాడారు. ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కాలువ నీరు అందేలా చూస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

బీజేపీ మనుధర్మాన్ని ప్రోత్సహిస్తోంది

ఆ పార్టీ పాలిత రాష్ట్రాల్లో మహిళల హక్కుల హరణ

- ఎన్ని చట్టాలొచ్చినా ఇంకా వివక్ష
- హక్కుల కోసం మహిళలు ఐక్యంగా పోరాడాలి: ఐద్వా జాతీయ ఉపాధ్యక్షులు పుణ్యవతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారతీయ జనతాపార్టీ మనుధర్మ శాస్త్రాన్ని ప్రోత్సహిస్తూ, రాజ్యాంగం మహిళలలకు కల్పించిన హక్కులను కాలరాస్తోందని అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ ఉపాధ్యక్షులు ఎస్. పుణ్యవతి విమర్శించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని "మహిళపై మనుస్మృతి ఇంకా రాజ్యం ఏలుతుందా" అనే అంశంపై హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం జరిగిన వెబినార్‌లో ఆమె ప్రసంగించారు. భారతీయ సమాజంలోని



అగ్రవర్ణాలు వేల ఏండ్లుగా ఈ గ్రంథాన్ని అడ్డం పెట్టుకొని మహిళలను అణగదొక్కారని ఆందోళన వ్యక్తం చేశారు. 1908లో జరిగిన మెక్సికో పోరాటం, 1857 ఉవ్వెత్తున ఎగిసిపడ్డ మహిళా కార్మికుల నిరసనలు మహిళాదినోత్సవానికి నాంది పలికాయని గుర్తు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా జరిగిన అనేక పోరాటాలు, స్వాతంత్రోద్యమంలో మహిళల పాత్ర నేపథ్యంలో వారికి అనేక హక్కులు కల్పించినప్పటికి ఆచరణలో పూర్తిగా అమలు జరగడం లేదన్నారు. మను ధర్మ శాస్త్రాన్ని ప్రజల నరనరాల్లో ఎక్కించి వివక్షకు బీజేపీ మరింత ఆజ్యం పోస్తోందని ఆరోపించారు. ఆ పార్టీ పాలిత రాష్ట్రాల్లో రాజ్యాంగం మహిళలకు కల్పించిన హక్కులపై అప్రకటిత నిషేధం విధించారని విమర్శించారు. ఆహారంలో, ఆహార్యంలో అన్నింటా ఇలా మనుధర్మం నిర్దేశించిన ఆటవిక న్యాయాన్ని ప్రచారం చేస్తున్నారని చెప్పారు. వందల ఏండ్ల క్రితం ఈ దురాచారాలకు వ్యతిరేకంగా ఆత్మబలిదానం చేసిన ప్రీతిలతా లాంటి వారిని చరిత్ర ఎందుకు మరిచిందని ప్రశ్నించారు. ఎన్ని చట్టాలు చేసినా, ఎన్ని సంస్కరణలు వచ్చినా పురుషాధిక్య భావజాలం మూలంగా అవి ఆచరణలో విఫలమవుతున్నాయని పేర్కొన్నారు. స్త్రీలు సంపాదిస్తున్న మొత్తంపై కూడా వారికి ఇంకా పూర్తి స్వేచ్ఛ రాలేదన్నారు. మహిళల హక్కులను కాలరాసేందుకు వర్ణ వ్యవస్థ ముసుగులో ఆధిపత్య కులాలు సృష్టించిందే మనుధర్మ శాస్త్రమని విమర్శలు గుప్పించారు. ఆధునిక మహిళ చరిత్రను తిరగ రాస్తుందని గురజాడ అప్పారావు మాటలను అక్షర సత్యాలు చేస్తూ మహిళలు సమానత్వం, సాధికారిత కోసం ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. ఈ వెబినార్‌కు సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ ఎస్.వినయకుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

తగ్గించిన జీతాలివ్వాలి... ఉద్యోగ భద్రత కల్పించాలి

- హ్యాండీక్రాఫ్ట్స్ (గోల్కొండ) జీతాలు తగ్గించడం సరికాదు
- మంత్రి శ్రీధర్‌బాబుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ స్టేట్ హ్యాండీక్రాఫ్ట్స్ కార్పొరేషన్(గోల్కొండ)లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాలను తగ్గించడం సరిగాదనీ, వెంటనే పూర్తిస్థాయి వేతనాలను చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జె.వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి జె.కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు పద్మశ్రీ, కార్యదర్శి జె.కుమారస్వామి మెమోరండాన్ని అందజేశారు. గోల్కొండలో 20 ఏండ్లుగా పనిచేస్తున్న 120 మంది సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల గురించి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హ్యాండీక్రాఫ్ట్స్ కార్పొరేషన్ కింద లేపాక్షి ప్రతిష్టాత్మక సంస్థగా అభివృద్ధి చెందిందని తెలిపారు. రాష్ట్రం ఏర్పడ్డాక గోల్కొండగా పేరు మార్చిన తర్వాత కూడా సంస్థ పురోభివృద్ధి చెందుతున్నదన్నారు. ఆ సంస్థలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సుదీర్ఘ సర్వీసు, అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని జీతాలను ఉన్నతాధికారులు ఏటా నిర్ణయించి అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ ఏడాది జనవరి నుంచి జీవో పేరుతో ఒక్కో ఉద్యోగి జీతంలో గరిష్టంగా 50 శాతం తగ్గించారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సంస్థ ఏర్పడినప్పటి నుంచి లేని కొత్త విధానం వల్ల ఈ సిబ్బంది జీతాలు భారీగా తగ్గాయని చెప్పారు. ^నాలు పూర్తిస్థాయిలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

హక్కుల కోసం పోరాడుతున్న మహిళలకు శుభాకాంక్షలు

మంత్రి కొండా సురేఖ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మరో ప్రాణికి జన్మనివ్వడం ద్వారా ఇంకో మనిషిని సృష్టించే శక్తి మహిళలకే ఉందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో 'డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ వుమెన్స్ అసోసియేషన్' ఆధ్వర్యంలో అంతర్జా తీయ మహిళా దినోత్సవాన్ని (మార్చి8) నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ మహిళల హక్కుల సాధన కోసం పోరాడుతున్న ప్రతి ఒక్కరికి శు భాకాంక్షలు తెలిపారు. 'సృష్టికి మూలం మహిళ. మహిళ లేనిదే సృష్టి లేదు. ప్రకృతికి మహిళ వరం లాంటిది. మహిళను



భూదేవితో పోలుస్తారు. కూతురుగా, తల్లిగా, చెల్లిగా, భార్యగా ఈ సమాజాన్ని మంచి మార్గంలో నడిపించే శక్తి మహిళలకున్నది. నాటి కాలంలో లాగా నేడు మహిళలపై అంతటి వివక్ష లేదు. ఇప్పటి పిల్లలకు ఇష్టానుసారంగా వారి జీవితాలను తీర్చిదిద్దుకునే స్వేచ్ఛను ఆ కుటుంబాలు కల్పిస్తున్నాయి' అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి హెూదాలో ఈ కార్యక్రమంలో పాల్గొనటం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

'రెరా' అనుమతి లేని ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టొద్దు : 'బిల్డాక్స్'తో జాగ్రత్త

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



జీహెచ్ఎంసీ, డీటీసీపీ, హెచ్ఎండీఏ ఇతర స్థానిక సంస్థల అనుమతులతో పాటు రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా)లో రిజిస్టర్ కాని ప్రాజెక్టుల్లో రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోవద్దని 'రెరా' హెచ్చరించింది. ఈ మేరకు ఆ సంస్థ కార్యదర్శి పీ యాదిరెడ్డి గురువారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేసింది. బిల్డాక్స్ కంపెనీ హఫీజ్‌పేటలోని సర్వే నెంబర్ 80లోని స్థలంలో ప్లాట్ల అమ్మకంపై ఓ వినియోగదారుడు 'రెరా'కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఈ నెల 6, 7 తేదీల్లో బిల్డాక్స్ ప్రతినిధులు, ఫిర్యాదుదారుడితో కలిపి 'రెరా' విచారణ జరిపినట్టు పేర్కొన్నారు. వినియోగదారుడి ఫిర్యాదు నిరాధారమని బిల్డాక్స్ ప్రతినిధులు వాదించారు. అయితే ఫిర్యాదుదారుడు కొండాపూర్ హఫీజ్‌పేటలోని బిల్డాక్స్ కంపెనీలో తాను ప్లాటు కొనుగోలు చేసినట్టు రశీదు సమర్పించారు. దీనిపై విస్తృత విచారణ చేపట్టిన 'రెరా' వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని నిర్ణయించింది. బిల్డాక్స్ కంపెనీ గుండ్లపోచంపల్లి సర్వే నెంబర్ 509/ పార్ట్‌లో భువి, వాసవి భురిడాక్స్ అనే ప్రాజెక్ట్ పేరుతో రెరా రిజిస్ట్రేషన్ కలిగి ఉంది. కానీ ఇతర ప్రాంతాల్లో సదరు కంపెనీకి ఎలాంటి అనుమతులు లేవని విచారణలో తేలింది. ఈ సందర్భంగా పలువురు కొనుగోలుదారుల నుంచి ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో బిల్డాక్స్ కంపెనీ ప్రాజెక్టుల్లో ఎలాంటి కొనుగోళ్లు జరపరాదని హెచ్చరించారు.

బీఆర్ఎస్ మాదాపూర్ డివిజన్ అధ్యక్షునిపై కేసు నమోదు

నవతెలంగాణ-మియాపూర్

ఓ ప్రయివేటు స్థలానికి నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేసినందుకు రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మాదాపూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఎర్రగుంట్ల శ్రీనివాస్‌యాదవ్‌పై మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మాదాపూర్ సీఐ జి.మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీ సర్వే నెంబర్ 4పీ, 6పీ, 6పీ, ప్లాట్ నెంబర్ 61, 61(ఏ) స్థలానికి సంబంధించి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు. ఆ భూమిలో రాజు క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేశారు. దాంతో సదరు ప్లాట్ యజమాని మాదాపూర్ పోలీసులను ఆశ్రయించాడు. శ్రీనివాస్‌యాదవ్‌తో తనకు ప్రాణహాని ఉందని కేసు పెట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌యాదవ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కాగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీకి శ్రీనివాస్‌యాదవ్ సన్నిహితుడు. ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితునిగా ఉంటూ ఈ దౌర్జన్యాలకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

రూ.50 లక్షల హవాలా డబ్బు పట్టివేత

- రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన

నవతెలంగాణ-మియాపూర్

అనుమతి లేకుండా తరలిస్తున్న రూ.50లక్షల హవాలా డబ్బును మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన రాయదుర్గం పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. రాయదుర్గం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం అర్ధరాత్రి ఇన్నోవా క్రిస్టా కారులో ఓ వ్యక్తి హవాలా డబ్బును తరలిస్తున్నట్టు మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టగా.. విక్రమ్ అనే వ్యక్తి డబ్బు తరలిస్తున్న కారును పట్టుకున్నారు. ల డబ్బుకు సంబంధించిన పత్రాలపై పోలీసులు ఆరా తీయగా ఎలాంటి పత్రాలు చూపించలేదు. పైగా.. పొంతనలేని సమాధానం చెప్పడంతో పోలీసులు అనుమానంతో అతన్ని అదుపులోకి తీసుకొని డబ్బును సీజ్ చేశారు. ఆ డబ్బును ఎస్ఓటీ పోలీసులు స్వాధీనం చేసుకుని రాయదుర్గం పోలీసులకు అప్పగించారు. ఆ డబ్బును మహారాష్ట్రకు తరలిస్తున్నట్టు సమాచారం. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సంపాదకీయం

చరితను తిరగరాయాలి

ఈ రోజు నేనే కాఫీ పెట్టిస్తానని చెప్పి భర్తే కాఫీ పెట్టివ్వచ్చు. ఇదిగో మీ దినోత్సవ సంబరాన కొత్త చీర తెచ్చానని అపురూపంగా అందివ్వనూవచ్చు. మహిళకు ప్రత్యేక ఉత్సవాలను జరిపి, ఆటలాడించి, పోటీలు నిర్వహించి, బహుమతులు పంచి, స్త్రీ గొప్పతనాన్ని వేనోళ్ల పొగడనూవచ్చు. నింగికెత్తి నినందిచనూవచ్చు. కానీ ఒకరోజు గడిచి పోతుంది. మళ్లీ కథ మామూలే. చాకిరి యథావిధి, సాధింపులూ, హీనపు మాటలూ, సనాతన ధర్మాలూ, సంప్రదాయ తలపోతలు... ఆడది గీత దాటి చెడిందనే అపవాదులూ గట్రా అన్నీ కొనసాగుతూనే ఉంటాయి. వేధింపులూ, అత్యాచారాలు, హత్యలు, కుల దురహంకార హత్యలు షరామామూలే. కొన్నేండ్లుగా జరుగుతున్నదిదే. మహిళకు ఉత్సవం చేయాల్సిందే. శతాబ్దకాలంగా ఎదిగిన మహిళల అడుగులను కొనియాడుతూ ప్రేరణ పొందాల్సిందే. కానీ స్త్రీల పట్ల ఆధునిక పాలకుల ధోరణి మారలేదు. ఆలోచనలు, అభిప్రాయాలూ మారలేదు. మహిళలు పొందిన ప్రగతి ఏదైనా ఉందంటే, అది వారు దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్నదే. అసలు మహిళా దినోత్సవ భావననే, శ్రామికులుగా వారి హక్కుల కోసం వాళ్లే చేసిన పోరాటంలోంచే ఉద్భవించింది.

మహిళలు చరిత్రను తిరగరాస్తారాని అపుడెపుడో గురజాడ చెప్పాడు. అందుకేనేమో వాళ్లను చట్టసభల్లోకి అడుగుపెట్టనిస్తలేము. అసలు కలాన్ని, కాగితాలనూ దక్కనివ్వటం లేదు. చూడండి దేశంలో మహిళల అక్షరాస్యత, పురుషులకంటే తక్కువ. మనదేశంలో పరిపాలన రాజ్యాంగం ప్రకారం, దాని ఆధారంగా జరుగుతుందనేది అందరికీ సామాన్యంగా తెలిసే విషయం. కానీ రాజ్యాంగేతర సనాతన ధర్మాలు, సంప్రదాయాలు అనధికారికంగానే అమలవుతుంటాయి. అవి ముఖ్యంగా మహిళలకు సంబంధించినవే ఎక్కువ. తత్ఫలితంగా స్త్రీ పురుషులు సమానమే నినాదం, ఇప్ప టికీ నినాదమే. నిజమయ్యేది ఎప్పుడో తెలుసుకోవటమే ఈ దినోత్సవం నాడు చేయాల్సిన పని. "ఎక్కడమ్మా నువ్వు లేనిది? ఏమిటి నువుచేయలేనిది! డాక్టరు వయ్యావు, యాక్టరువయ్యావు, కలెక్టరు వయ్యావు, మినిస్టరు వయ్యావు, సమాజ గమనం నువులేకుంటే గతితప్పి గంగ పాలవుతుంది" అన్నీ అయినా ఆమె పరిస్థితి మాత్రం గతి తప్పుతూనే వుంది. పాట మాత్రం కొనసాగుతూనే ఉంది. అందుకనే ఈ అసమా నతల కొనసాగింపునకు కారణాలను చర్చించుకోవాల్సిన సందర్భానికే ఈ దినోత్సవాన్ని ఉపయోగించాలి.




నేడు మహిళా సాధికారతకు, సమాజంలో సమానత సాధనకు రెండు శక్తులు ప్రధానంగా అవరోధంగా ఎదురౌతున్నాయి. ఒకటి కార్పొరేట్ పెట్టుబడి, రెండు హిందూ ఫాసిస్టు శక్తుల పెరుగుదల. మొదటిది మహిళను అసలు మనిషిగానే చూడదు. సరుకుగా మార్చేస్తుంది. వస్తు వినియోగదారుగా తయారు చేస్తుంది. శ్రమ చేసే వారందరినీ సరుకుగానే పరిగణిస్తుంది. ఏ సమానతైనా ఆ పరధి మేరకే. ఇక రెండోది నేడు మనదేశంలో ఎదుర్కొంటున్న సమస్య. రెండూ కలిసి చేస్తున్న దాడికి మహిళలు మరింత గురవుతున్నారు.అందుకే ఇరవైయేండ్ల పోరాటంలోనూ న్యాయం జరగక పడ్డ వేదన బిల్కిస్‌బానో అనుభవిస్తే, వీడు మా మాన ప్రాణాలను దోచుకున్నాడని ధైర్యంగా చెప్పినా కూడా మహిళా రెజ్లర్లకు న్యాయమే అందలేదు. నిర్లజ్జగా నేరస్తులైన పురుషుల వైపే ప్రభుత్వం నిలబడటం కన్నా వేరే రుజువులేమి కావాలి. ఇంట్లో వంట వండి, పిల్లల్ని కనిపెంచటం, భర్తకు సేవ చేయటం స్త్రీల విధులు అని ఢంకా బజాయించి చెబుతున్న నాయకమన్యుల ఏలుబడిలో సమానత గురించి ఉత్సవం చేస్తున్నామనటంలో అర్థమేమి? ఒక ఆడది కావటం, ఆదివాసీ కావటం వల్లనే కదా పార్లమెంటు నూతన భవనంలోకి, రామాలయ ప్రాణ ప్రతిష్ఠకూ అవకాశమే నిరాకరించింది. స్త్రీని బానిసగా చూసే ఆలోచనాపరుల పరిపాలనా దాడులను ఎలా ఎదుర్కోవాలో చర్చించటమే ఈ దినోత్సవ కర్తవ్యం కావాలి.

నేడు మహిళా సాధికారతకు, సమాజంలో సమానత సాధనకు రెండు శక్తులు ప్రధానంగా అవరోధంగా ఎదురౌతున్నాయి. ఒకటి కార్పొరేట్ పెట్టుబడి, రెండు హిందూ ఫాసిస్టు శక్తుల పెరుగుదల. మొదటిది మహిళను అసలు మనిషిగానే చూడదు. సరుకుగా మార్చేస్తుంది. వస్తు వినియోగదారుగా తయారు చేస్తుంది. శ్రమ చేసే వారందరినీ సరుకుగానే పరిగణిస్తుంది. ఏ సమానతైనా ఆ పరధి మేరకే. ఇక రెండోది నేడు మనదేశంలో ఎదుర్కొంటున్న సమస్య. రెండూ కలిసి చేస్తున్న దాడికి మహిళలు మరింత గురవుతున్నారు.

శ్రామికుల హక్కుల సాధన పోరాటం నుండే సమానత సాధనకు మార్గం పడుతుంది. వ్యక్తిగత స్వేచ్ఛతో పాటుగా ఉద్యమ స్వేచ్ఛ సాధించబడితేనే మహిళా సాధికారత సఫలమవుతుంది. ప్రపంచ చరిత్రను పరిశీలిస్తే విప్లవ విజయాల నుండే మహిళల సమానతకూ అంకురార్పణ జరిగిందనేది తెలుస్తుంది. మన సమాజంలోనూ సాంస్కృతికమైన, సామాజికమైన ఉద్యమ ప్రస్థానంలో సగభాగంగా ఉన్న మహిళలు పాల్గొనడం ద్వారానే ఈ దినోత్సవం ఆశించిన లక్ష్యాలను సాధించగలుగుతాము. నేటి ఆధునిక మహిళలు సైతం, ఎంత ఆధునిక విద్యను, విజ్ఞానాన్ని ఆర్జించినప్పటికీ ఆచరణలో మాత్రం, సంప్రదాయాల పేరుతో మూఢ విశ్వాసాలకు లోనవడం చూస్తున్నాము. ఒక్క మహిళలే కాదు. యువత కూడా అదే ధోరణిలో ఆలోచిస్తున్నారు. అది మారాల్సిన అవసరం ఉంది.

ఒకవైపు మూఢత్వం, రెండోవైపు కార్పొరేటు కన్స్యూమరిజం, సాంస్కృతిక తిరోగమన భావాలను, వాస్తవిక విషయాలపై తెరలను కప్పుతున్న మహాశక్తిగా కీర్తిస్తూనే, దేవతను చేసి ప్రతిమలా కూర్చోపెడుతున్నారు తప్ప సమానతా ధర్మాన్ని పాటించడం లేదు. వీటన్నింటినీ గుర్తెరిగి సంఘటిత శక్తిగా చైతన్యయుతంగా కదలడమే మహిళా దినోత్సవానికి సార్థకత.

...అమ్మే!



నువ్వేమైనా చెప్పు
మనిషి అంటే అమ్మే! ఆ అమ్మే మహా మనీషి!

కాల్చిన మంటకు వెరవకుండా,
కరిగిన వెన్నై, కాలం వడిలోకి
కడుపు నింపి పంపేది ఆమెగా.

నిద్రపుచ్చేది కాదు,తను మేల్కొని,
సూర్యోదయాన్ని వీనులవిందు చేసే
గానామృతమేగా ఆమె.

వేసారని వంటా వార్పు తప్ప
ఎప్పుడైనా, ఎక్కడైనా దేనికైనా
వెదుకాడిందా, వెంపర్లాడిందా ఆమె...

ఒడిలోని పిల్లను వడివడిగా ఎదిగించి,
ఒడినింపే వరకు కడతేరనని,
కడవరకు భీష్మించుకునేది అమేగా.

నన్నింత తీర్చిదిద్దడానికి
నాకన్నీ కూర్చిపోయడానికి ఎన్ని వేటలను,
కనిపించని మరెన్ని ఈటెలను
ఎదుర్కుందో కదా ఆమె.
నువ్వేమైనా చెప్పు
మనిషి అంటే అమ్మే! ఆ అమ్మే మహా మనీషి!

ఎన్నిసార్లు ఒంటరవ్వలేదు!
ఊరు మార్చినా, పేరు మార్చినా,
నన్ను మోస్తూ, నాన్నను చూస్తూ,
సుడిగుండాలను దాటి
సముద్రాన్ని చేరే తరంగిణియేగా ఆమె!

అమ్మకు కష్టం వస్తుంది,
ఆ కష్టానికి కన్నీళ్లుంటాయి,
అవి ఇట్టే ఇంకిపోయే ఒకే ఒక మందు
మన చిరునవ్వు.

ఒంటరైనా, ఓర్పు లేకపోయినా,
కూర్పు చేయలేకపోయినా,
ఎన్ని వేళ్లు తన వైపు లేస్తాయోగా...
నివ్వెర పోకుండా నీరసపడకుండా
కర్తవ్యానికి కంకణబద్ధురాలైనమూర్తి కదా ఆమె..

వేర్పాటులలో, విడాకులలో,
ఎన్ని పాట్లున్నా, మనుషుల అలవాట్లనే తప్ప
వారిని దూరం కానివ్వని
మహాగుణం మరెవరిది.

భక్తికి, అనురక్తికి, ముక్తికీ మాతృత్వానికి,
మరెవరైనా పోటీ పడగలరా...

చీరకట్టినా, కొంగు నడుముకు జుట్టినా,
కొడవలి చేపట్టినా, పిడికిలి పైకెత్తినా,
సవాలు సైతం దాసోహం అనేది ఆమెకేగా.
శాస్త్రం చదివినా, శాంతం నేర్పినా,
సమస్యను చేదించినా, సంఘం నిర్మించినా,
ఆమెకు ఎవరు సాటిలే...

నువ్వేమైనా చెప్పు
మనిషి అంటే అమ్మే! ఆ అమ్మే మహా మనీషి!

- జి.సునితారాణి, 9951300016

దేవదాసి వ్యవస్థను రద్దు చేయించిన దేవదాసీ బిడ్డ



డాక్టర్ దేవరాజు మహారాజు

సనాతన ధర్మశాస్త్రాలలో ఉందని నిమ్న వర్గాల బాలికలకు దేవుడితో పెండ్లి జరిపించి, వాళ్లని వేశ్యలుగా మార్చి సమాజ మంతా వాడుకునేది. వారినే దేవదాసీలనేవారు. ఆ దేవదాసీల వయసు నలభై దాటగానే వారిని వేలం వేసేవారు. వారిని వేలం పాటలో గెలుచుకుని, తీసుకుపోయిన వారు వారిని ఇంటి పనులకు, వ్యవసాయ పనులకు ఇతరత్రా వాడుకునే వారు.ఇలాంటి నీచ నికృష్ట వ్యవస్థను సనాతన ధర్మం పేరుతో మనువాదులు ఈ దేశంలో వేల సంవత్సరాలు కొనసాగించారు. రాజరాజచోళుని కాలంలో ఒక్క తంజావూర్ దేవాలయంలోనే నాలుగు వందలకు పైగా దేవదాసీలు ఉండేవారని చరిత్ర చెపుతోంది.

8 అక్టోబర్ 1947 మద్రాస్ అసెంబ్లీ సభ్యులు ఒ.పి. రామసామి రెడ్డి యార్, ముత్తులక్ష్మి రెడ్డి దేవదాసీ నిర్మూలన చట్టం కోసం ఒక తీర్మానం ప్రవేశపెట్టారు. అంతే-సభలో గందరగోళం ప్రారంభమైంది. సత్యమూర్తి అయ్యార్, శ్రీనివాస్ అయ్యార్, గోవింద రాఘవ అయ్యార్, శేషగిరి అయ్యార్‌ల బృందం దాన్ని వ్యతిరేకించింది. అలా చేయడం సనాతన హిందూ ధర్మానికి వ్యతిరేకమని మత శాస్త్రాలకు వ్యతిరేకమని ఆందోళన ప్రారంభించారు. సనాతన ధర్మాన్ని వ్యతిరేకించే స్థాయి ఈ చట్టసభకు ఉందా? అని కూడా ప్రశ్నించారు. ఇరు పక్షాల ఆందోళనలను ఎలా అదుపు చేయాలో ఆలోచిస్తూ, సభను నిర్వహిస్తున్న రాజాజీ మౌనం వహించారు. గందర గోళాల మధ్య ఆనాటి సభ ముగిసింది. ఆ సాయంత్రం ముత్తులక్ష్మి రెడ్డి పెరియార్ ఇ.వి. రామసామి దగ్గరికి వెళ్లి సలహా అడిగారు. ఆయన ఆలోచించి కొన్ని సూచనలు చేశారు.

1914లో ముత్తులక్ష్మి తన ఇరవై ఎనిమిదవయేట 1872 నేటివ్ మ్యారేజ్ ఆక్ట్ ప్రకారం సుందరరెడ్డిని పెండ్లి చేసుకున్నారు. తనను జీవిత భాగస్వామిగా సమాన స్థాయిలో గౌరవిస్తానని, తన నిర్ణయాలు తను తీసుకునే స్వేచ్ఛ ఉండాలన్న హామీ కాబోయే భర్త నుండి తీసుకున్న తర్వాతనే ఆమె సుందరరెడ్డితో వివాహానికి ఒప్పుకున్నారు. అలా పెండ్లి తర్వాత ఆమె పేరుకు రెడ్డి అనే పదం జతకూడింది. వారికి ఇద్దరు కొడుకులు పుట్టారు. ఒకరు డాక్టర్ కృష్ణమూర్తి, మరోకరు రామ్మోహన్. తమిళ సినిమా నటుడు జెమిని గణేషన్ ముత్తులక్ష్మికి అల్లుడు. తోడబుట్టిన సోదరి క్యాన్సర్‌తో చనిపోవడంతో ఒక డాక్టరుగా ఆమె క్యాన్సర్ ఆసుపత్రిని ప్రారంభించగలిగారు. అంతేకాదు, మహిళలకు, పిల్లలకు ప్రత్యేకంగా ఆసుపత్రులుం డాలన్నది ఆమె ఆలోచన-అందువల్ల మెటర్నిటీ, చిల్డ్రన్ హాస్పిటల్ కాన్సెప్ట్ ఆమెదే అయ్యింది.


మరునాడు 9 అక్టోబర్ 1947న సభ ప్రారంభం కాగానే సత్యమూర్తి అయ్యార్ చర్చ మొదలుపెట్టారు - "దేవదాసీలంటే సనాతన ధర్మం ప్రకారం శాస్త్రయుక్తంగా దేవాలయాలలో ఏర్పాటు చేయబడ్డ పరిచారికలు. వారు నేరుగా దైవసేవకులన్న మాట! వారు చేసే పవిత్రకార్యాలను బట్టి వారు భగవంతుని కృపకు పాత్రులవుతారు. వారికి భోగభాగ్యాలు లభిస్తాయి."- అంటూ శాస్త్ర నియమాలన్నిటినీ ఉటంకిస్తూ సత్యమూర్తి సుదీర్ఘ ప్రసంగం చేశారు. మిగతా వారు కొందరు ఆయన బాణీలోనే మాట్లాడారు. అంతా అయ్యాక ముత్తులక్ష్మి రెడ్డి లేచి ఇలా అన్నారు- "అయ్యర్ గారు చెప్పిన శాస్త్ర విషయాలన్నిటితోనూ నేను ఏకీభవిస్తున్నాను. ఇన్ని వందల సంవత్సరాల నుండి మేము చేస్తూ వచ్చిన సేవలకు మాకు అందిన దైవకృప మాకు చాలు. అందుకున్న భోగ భాగ్యాలు కూడా మాకు సరిపొయ్యాయి. ఇటువంటి పనులు- అంటే దేవదాసీలవృత్తి చేయడం వల్ల దేవుడి ఆశిస్సులు లభిస్తాయని నమ్మేవారూ, సనాతన ధర్మాన్ని గౌరవించాలని అనుకునేవారు నిరభ్యంతరంగా వారి ఇంటి ఆడవారిని స్వచ్ఛందంగా దేవదాసీలుగా మార్చుకోవచ్చు. మాకు అభ్యంతరం లేదు అయితే మా నిమ్న వర్గాల మహిళ లంతా ఈ వృత్తిని తిరస్కరిస్తున్నాం!" - అని ముగించారు.

సనాతన ధర్మం గురించి మహోపన్యాసాలిచ్చిన వారి నోళ్లు మూతప డ్డాయి. దొంగకు తేలు కుట్టినట్టు కిక్కురుమనకుండా కూర్చున్నారు. అప్పుడు అసెంబ్లీ "దేవదాసీ నిర్మూలన చట్టాన్ని ఆమోదించింది.- ఆ తర్వాత వివిధ రూపాల్లో ఉన్న 'దేవదాసీ వ్యవస్థ' రద్దయింది. అప్పటి మద్రాసు రాష్ట్రంలో రాయలసీయ కొస్తాంధ్ర ప్రాంతాలు కలిసి ఉండేవి. కోస్తాంధ్ర రాయలసీమ ప్రాంతాల్లో 'మాత మ్మ- జోగినీ' వ్యవస్థలు, మలబార్ ప్రాంతంలో ఉన్న 'నంగా'వ్యవస్థ: కన్నడ ప్రాంతంలోని 'బసివి' వ్యవస్థలు రద్దయ్యాయి. దేవదాసి వ్యవస్థ ఒక్కో ప్రాంతంలో ఒక్కో పేరుతో పిలవబడేది. అవన్నీ దేవ దాసీ నిర్మూలనా చట్టంతో రద్దయ్యాయి. ఆ ఘనత పూర్తిగా ముత్తు లక్ష్మి రెడ్డికి దక్కుతుంది. దేవదాసీ వ్యవస్థ నిర్మూలనా చట్టం కోసం అధికారికంగా అసెంబ్లీలో పోరాడిన డాక్టర్ ముత్తులక్ష్మీ, స్వయంగా ఒక దేవదాసి కూతురు! ఒక దేవదాసి బిడ్డ దేవదాసీ వ్యవస్థను రద్దు చేయించడం ఇక్కడ ప్రత్యేకంగా చెప్పుకొవాల్సిన అంశం. ఆ జీవి తంలోని సాధక బాధకాలు ఆమె పిన్న వయసులోనే తెలుసుకున్నారు కాబట్టి, ఆ పరిధిలోంచి బయట పడాలని కష్ట పడి చదువుకుని డాక్టర్ అయ్యారు. పెరియార్ ఉద్యమాన్ని ఆసరాగా చేసుకుని అనేక ప్రతికూల పరిస్థితులను ఎదిరించి పోరాడి అసెంబ్లీకి వెళ్ళారు.

సుందర రెడ్డిని వివాహం చేసుకుని సాధారణ జీవితం గడుపుతూనే, అసాధారణ ప్రతిభా పాటవాలతో వైద్య, సామాజిక, రాజకీయ రంగాలలో రాణించారు. ప్రపంచ ప్రఖ్యాత అడయార్ క్యాన్సర్ ఇనిస్టూట్‌కు ఈమే వ్యవస్థాపకురాలు. ఈ సంస్థకు - భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూను ఆహ్వానించి పునాదిరాయి వేయించారు. 18 జూన్ 1954న అది ప్రారంభ మైనప్పుడు దేశంలోనే అది రెండో క్యాన్సర్ ఆసుపత్రి అయ్యింది. ఇప్పుడది సంవత్సరానికి ఎనభైవేల మంది క్యాన్సర్ రోగులకు చికిత్స నందిస్తోంది. డాక్టర్ ముత్తులక్ష్మి 'స్త్రీ ధర్మ' పత్రికకు సంపాదకత్వం వహిస్తూ తమిళ భాషా సాహిత్యాలకు కూడా గణనీయమైన సేవలందించారు. మరోవైపు వుమెన్స్ ఇండియన్ అసోసియేషన్ (WIA) కు వ్యవస్థాపక అధ్యక్షురాలిగా పనిచేస్తూ ఆల్ ఇండియా వుమెన్స్ కాన్ఫరెన్స్ (AIWC) పత్రిక 'రోషిని'కి సంపాదకత్వం వహించారు.

30 జూలై 1886-22 జులై 1968 మధ్య కాలంలో 82 ఏండ్లు జీవించిన ముత్తులక్ష్మి, బ్రిటీష్ ఇండియా మద్రాస్ రాష్ట్రంలోని పుదుక్కొటై జిల్లా తిరుకోకర్నం గ్రామంలో జన్మించారు. ఆడపిల్లల చదువుకు తీవ్రమైన ఆంక్షలున్న ఆ కాలంలో మద్రాస్ మెడికల్ కాలేజి నుండి 1912లో వైద్యశాస్త్ర పట్టా సాధించారు. ఉన్నత విద్యకోసం ఆమె ఇంగ్లాండు వెళ్లారు. కానీ, WIA వుమెన్స్ ఇండియన్ అసోసియేషన్ వారి ఒత్తిడి మేరకు తన బంగారు భవిష్యత్ ద్వారాలు మూసేసుకుని వచ్చి, మద్రాస్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో చేరారు. అక్కడ ఏకగ్రీవంగా డిప్యూటీ ప్రెసిడెంట్‌గా ఎన్నికై బాధ్యతలు నిర్వహించారు. దాంతో మహిళా హక్కుల కోసం పోరాడే ఒక ఉద్యమకారిణీ అసెంబ్లీ వ్యవస్థలో ప్రవేశించినట్లైంది. ఆ రకంగా ఆమె పేరు అనేక విషయాలలో ప్రథమ స్థానంలో నమోదయ్యింది. ఇప్పటికీ అవన్నీ రికార్డులుగానే ఉండిపాయాయి.

సుందర రెడ్డిని వివాహం చేసుకుని సాధారణ జీవితం గడుపుతూనే, అసాధారణ ప్రతిభా పాటవాలతో వైద్య, సామాజిక, రాజకీయ రంగాలలో రాణించారు. ప్రపంచ ప్రఖ్యాత అడయార్ క్యాన్సర్ ఇనిస్టూట్‌కు ఈమే వ్యవస్థాపకురాలు. ఈ సంస్థకు - భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూను ఆహ్వానించి పునాదిరాయి వేయించారు. 18 జూన్ 1954న అది ప్రారంభ మైనప్పుడు దేశంలోనే అది రెండో క్యాన్సర్ ఆసుపత్రి అయ్యింది. ఇప్పడది సంవత్సరానికి ఎనభైవేల మంది క్యాన్సర్ రోగులకు చికిత్స నందిస్తోంది. డాక్టర్ ముత్తులక్ష్మి 'స్త్రీ ధర్మ' పత్రికకు సంపాదకత్వం వహిస్తూ తమిళ భాషా సాహిత్యాలకు కూడా గణనీయమైన సేవలందించారు. మరోవైపు వుమెన్స్ ఇండియన్ అసోసియేషన్ (WIA) కు వ్యవస్థాపక అధ్యక్షురాలిగా పనిచేస్తూ ఆల్ ఇండియా వుమెన్స్ కాన్ఫరెన్స్ (AIWC) పత్రిక 'రోషిని'కి సంపాదకత్వం వహించారు.



ముత్తులక్ష్మీ రెడ్డి దేశంలో ప్రప్రథమంగా పురుషుల కళాశాలలో ప్రవేశం సాధించిన తొలి మహిళ. మామూలు ఎకడమిక్ డిగ్రీ కళాశాలలో కాకుండా వృత్తికి సంబంధించిన మెడికల్ కళాశాలలో ప్రవేశం సాధించడం ఆ రోజుల్లో (1907) చాలా గొప్ప విషయం. అందుకే ఆమె తొలి మహిళా హౌస్ సర్జన్. దేశంలో తొలి మహిళా డాక్టర్ కాగలిగారు. అలాగే నాటి బ్రిటీష్ ఇండియాలో ఆమె తొలి మహిళా లెజిస్లేటర్ సోషల్ వెల్ఫేర్ అడ్వయిజరీ బోర్డుకు తొలి మహిళా లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు తొలి డిప్యూటీ ప్రెసిడెంట్ మద్రాస్ కార్పోరేషన్‌లో తొలి మహిళ కాగలిగారు. వీటన్నిటితో పాటు 1953లో 'అవ్వయ్ హోమ్' (అవ్వయ్ ఇల్లమ్)కు రూప కల్పన చేసి ఆ విషయంలో కూడా తొలి మహిళగా నిలిచారు. ఆడపిల్లల్ని మోసపూరితంగా ఇతర ప్రాంతాలకు తరలించి వేశ్యావృత్తిలోకి దింపడాన్ని ఆపడంలో ఆమె నెలకొల్పిన హోమ్ ప్రముఖ పాత్ర పోషించింది.

ముత్తులక్ష్మీ రెడ్డి దేశంలో ప్రప్రథమంగా పురుషుల కళాశాలలో ప్రవేశం సాధించిన తొలి మహిళ. మామూలు ఎకడమిక్ డిగ్రీ కళాశాలలో కాకుండా వృత్తికి సంబంధించిన మెడికల్ కళాశాలలో ప్రవేశం సాధించడం ఆ రోజుల్లో (1907) చాలా గొప్ప విషయం. అందుకే ఆమె తొలి మహిళా హౌస్ సర్జన్. దేశంలో తొలి మహిళా డాక్టర్ కాగలిగారు. అలాగే నాటి బ్రిటీష్ ఇండియాలో ఆమె తొలి మహిళా లెజిస్లేటర్ సోషల్ వెల్ఫేర్ అడ్వయిజరీ బోర్డుకు తొలి మహిళా లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు తొలి డిప్యూటీ ప్రెసిడెంట్ మద్రాస్ కార్పోరేషన్‌లో తొలి మహిళ కాగలిగారు. వీటన్నిటితో పాటు 1953లో 'అవ్వయ్ హోమ్' (అవ్వయ్ ఇల్లమ్)కు రూప కల్పన చేసి ఆ విషయంలో కూడా తొలి మహిళగా నిలిచారు. ఆడపిల్లల్ని మోసపూరితంగా ఇతర ప్రాంతాలకు తరలించి వేశ్యావృత్తిలోకి దింపడాన్ని ఆపడంలో ఆమె నెలకొల్పిన హోమ్ ప్రముఖపాత్ర పోషించింది. అలాంటి బాలికలకు, యువతులకు, ఆశ్రయం కల్పించి, విద్య నందించి, స్వతంత్రంగా జీవనం గడిపే విధంగా తీర్చిదిద్దేవారు. ముఖ్యంగా ముస్లిం హరిజన బాలికలకు స్కాలర్‌షిప్‌లు అందించి మరింతగా ప్రోత్సహించేవారు.

ముత్తులక్ష్మి తల్లి చంద్రమ్మాళ్ నిమ్న వర్గానికి చెందిన తమిళ స్త్రీ తండ్రి యస్. నారాయణ సామి ఉన్నత వర్గానికి చెందిన అయ్యర్. అభ్యుదయ భావాలు గల నారాయణసామి తన కుటుంబాన్ని, బంధు వర్గాన్ని ఎదిరించి దేవదాసి అయిన చంద్రమ్మాళ్‌ను పెండ్లి చేసుకున్నాడు. ఒక మహోన్నతమైన మానవీయ విలువను నిలిపినందుకు ఆయన బంధు వర్గం ఆయనను దూరం పెట్టింది. ఆయన అందుకు బాధపడలేదు. వీరిద్దరికీ కలిగిన కూతురే ముత్తులక్ష్మి. తండ్రి నుండి అభ్యుదయ భావాలు పుణికి పుచ్చుకుని పెరిగింది.కూతురు ఆలోచనలు పసిగట్టిన తండ్రి నారాయణసామి కూతురిని విద్యావంతురాలుగా, మానవతామూర్తిగా చూడాలనుకున్నాడు. అందుకే ఆమెను స్కూలుకు పంపడం ప్రారంభించాడు. ఆ రోజుల్లో అదొక సాహసోపేతమైన చర్య. ఆమె ఒక ఉపాధ్యాయురాలై బాలికలకు విద్యనందించాలని తండ్రి నారాయణసామి ఆశించాడు. కానీ, ఆమె అంతకన్నా ఉన్నతంగా ఎదిగి, అనేక సంస్కరణలకు కారణమైంది.

యుక్త వయసు రాగానే పెండ్లి చేసి పంపడం ఆనాటి ఆచారం. కానీ, ముతులక్ష్మి స్వంత నిర్ణయాలు తీసుకోగల స్థాయికి చేరుకుంది. అందుకే ఉన్నత విద్యకోసం ఆరాటపడింది. మెట్రిక్యులేషన్ పూర్తి కాగానే అక్కడి మహారాజా కళాశాలలో ప్రవేశం కోసం అర్జీ పెట్టుకుంది. అమ్మాయి కళాశాలలో ప్రవేశిస్తే అబ్బాయిలంతా ఆమె ఆకర్షణలో పడిపోతారని. వారి చదువు చెడిపోతుందని ఆ కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు ఇతర విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున వ్యతిరేకించారు. ఆ ప్రాంతం పొడుకొట్టై మహారాజుకు అది అనవసరమైన రాద్ధాంతమని అనిపించింది. ఆయన వ్యతిరేకతల్ని పట్టించుకోకుండా ముత్తులక్ష్మికి ప్రవేశం కల్పించారు. పైగా ఆమె సాహసానికి మెచ్చి స్కాలర్‌షిప్ కూడా ప్రకటించాడు. ఆ రకంగా ఆమెకు ఎదురైన అడ్డంకులు తొలగిపోయాయి. ఉన్నత విద్యకు ద్వారాలు తెరుచుకున్నాయి.

1914లో ముత్తులక్ష్మి తన ఇరవై ఎనిమిదవయేట 1872 నేటివ్ మ్యారేజ్ ఆక్ట్ ప్రకారం సుందరరెడ్డిని పెండ్లి చేసుకున్నారు. తనను జీవిత భాగస్వామిగా సమాన స్థాయిలో గౌరవిస్తానని, తన నిర్ణయాలు తను తీసుకునే స్వేచ్ఛ ఉండాలన్న హామీ కాబోయే భర్త నుండి తీసుకున్న తర్వాతనే ఆమె సుందరరెడ్డితో వివాహానికి ఒప్పుకున్నారు. అలా పెండ్లి తర్వాత ఆమె పేరుకు రెడ్డి అనే పదం జతకూడింది. వారికి ఇద్దరు కొడుకులు పుట్టారు. ఒకరు డాక్టర్ కృష్ణమూర్తి, మరోకరు రామ్మోహన్. తమిళ సినిమా నటుడు జెమిని గణేషన్ ముత్తులక్ష్మికి అల్లుడు. తోడబుట్టిన సోదరి క్యాన్సర్‌తో చనిపోవడంతో ఒక డాక్టరుగా ఆమె క్యాన్సర్ ఆసుపత్రిని ప్రారంభించగలిగారు. అంతేకాదు, మహిళలకు, పిల్లలకు ప్రత్యేకంగా ఆసుపత్రులుండాలన్నది ఆమె ఆలోచన-అందువల్ల మెటర్నిటీ, చిల్డ్రన్ హాస్పిటల్ కాన్సెప్ట్ ఆమెదే అయ్యింది. 1926లో ప్యారిస్‌లో జరిగిన వుమెన్స్ కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. లెజిస్లేటర్‌గా తన అనుభవాలు, ఆలోచనలు ఆమె "మై ఎక్స్‌పీరియన్స్ ఏజ్ ఎ లెజిస్లేటర్" పేరుతో 1930లో గ్రంథస్థం చేశారు. 1947లో ఎర్రకోట మీద ఆవిష్కరించిన తొలి భారతీయ పతాకంపై దేశంలో ముఖ్యమైన వారి పేర్లు రాశారు. అందులో ముత్తులక్ష్మి పేరు కూడా ఉంది. గాంధీజీ, అనిబిసెంట్, సరోజినీనాయుడు వంటి దేశనాయకులతో ఈమెకు సన్నిహిత సంబంధాలుండేవి. బహుముఖీనమైన ప్రతిభలో అనేక రంగాలలో కృషి చేస్తూ దేశసేవ చేసిన ముత్తులక్ష్మి కృషిని భారత ప్రభుత్వం గుర్తించి 1956లో పద్మ భూషణ్ ప్రకటించింది.

- కేంద్ర సాహిత్య అకాదెమీ అవార్డు విజేత, జీవశాస్త్ర వేత్త
(మెల్బోర్న్ నుంచి)

'మార్చి-8 మహిళలకు స్ఫూర్తి కావాలి'

"76 ఏండ్ల అజాది అమృత్ మహోత్సవంలో ఆమె మరణించింది.
అయినా ఆమె మానం నుండి రక్తం స్రవిస్తూనే ఉంది.
కాశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా...అత్యాచారాలకు గురైన శవాలు ఎందుకో ఈ మట్టిలో ఇంకటం లేదు....
మనువాదం, ఫాసిజం, పితృస్వామ్యం దేశంలో నలుదిశలూ ఊరేగుతున్నాయి.
ఆమె మాన ప్రాణాలు ఉక్కు పాదాల కింద నలుగుతూనే ఉన్నాయి"-

"ముండ్లపొదల్లో ఓ ఆడశిశువు... చెత్త కుండీల్లో మరో ఆడ శిశువు.. ఇద్దరు అప్పుడే భూమ్మీద పడిన పసికూనలు" ఇలాంటి వార్తలు నిత్యం వస్తుంటాయి. 1910 నుంచి మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు వస్తున్నాయి... పోతున్నాయి... కానీ మహిళల సామాజిక స్థితిగతుల్లో మార్పు రావటం లేదు. ఈ పరిస్థితిలో ఈ అజాదీ ఎవరిది? ఈ ఉత్సవాలు ఎవరివి? అన్న ప్రశ్న వస్తుంది. రోజురోజుకూ స్త్రీలపై హింస రకరకాల రూపంలో పెరిగిపోతూ ఉంది. ఇలా ఎందుకు జరుగుతోంది..? ముందుతరాల వారికి హింసలేని సమాజాన్ని అందించలేమా? ఆకాశంలో సగమైన స్త్రీల శ్రమ ఉత్పత్తిలో సగానికి తక్కువేమి కాదు...కానీ కడుపులో బిడ్డను కనాలన్నా, తాను ఏమి చదవాలి, ఎంతవరకు చదువుకోవాలి, ఎలా జీవించాలనే విషయాలలో నిర్ణయించుకొనే స్వేచ్ఛ మాత్రం స్త్రీకి లేదు. స్త్రీ నడక, నడత చివరకు నవ్వుపై కూడా ఆంక్షలు విధించారు. ఇలా స్త్రీలంటే చిన్నచూపు, వివక్ష. స్త్రీ ఎప్పుడు మగవాడి కను సన్నల్లో జీవించాలి. చిన్నప్పుడు తండ్రి, పెళ్ళి తర్వాత భర్త, ముసలితనంలో కొడుకుల ఆధీనంలో జీవించాలి. ఇలా స్త్రీని బందీని చేయటం ఈ సమాజం మొదటి నేరం. ఇక ఘనమైన మన చరిత్ర, సంస్కృతిలో కూడ "కార్యేషుదాసి, కరణేషు మంత్రి, భోజ్యేషు మాత, శయనేషు రంభా" అంటూ స్త్రీని పురు షునికి సొంత ఆస్తిగా మలిచారు. ఇలా భూస్వామ్య పితృ స్వామిక సంస్కృతిని వ్యవస్థీకృతం చేశారు. ఈ పరిస్థితి మారాలి. స్త్రీని కనీసం మనిషిగా చూసి గౌరవించే ఒక మానవీయ సమాజాన్ని నిర్మించే కృషి అందరూ చేయాలి.



అరుణ
9705450705

అమలుకు నోచుకోని చట్టాల కారణంగా స్త్రీలపై కుటుంబ, లైంగిక హింస, రాజ్యహింస రోజురోజుకూ పెరిగిపోతోంది. 1956, 1986 లలో చేయబడ్డ హిందూ వారసత్వ చట్టం ప్రకారం ఆడ, మగ తేడాలేకుండా ఆస్తిలో సమాన హక్కు ఇవ్వబడింది. కానీ భూస్వామిక పితృస్వామ్య వ్యవస్థలో ఏ కుటుంబం మహిళలకు ఆస్తిలో సమానవాటా ఇవ్వటంలేదు. 1961 వరకట్న నిషేధచట్టం చేసినప్పటికీ, వరకట్నం గౌరవంగా అమలు చేయబడుతూ ఉంది. పెండ్లి పేరుతో జరిగే తంతూ ఫక్తు వ్యాపారంగా మారి మహిళల పట్ల శాపమైంది. ఈ దురాచారానికి ఎంతోమంది స్త్రీలు బలైపోతున్నారు. ఈ దురాచారం కారణంగా ఆడశిశువుల భ్రూణ హత్యలు జరిగి, ఆడపిల్లలను గర్భంలోనే చంపుతున్నారు. ఫలితంగా దేశంలో స్త్రీల జనాభా తగ్గిపోయి, పెండ్లికాని ప్రసాద్‌లు పెరిగిపోతున్నారు. ప్రకృతికి విరుద్ధమైన ఈ చర్యను నిలువరించటానికి 1994 గర్భస్థ శిశువు పరీక్షల నియంత్రణ చట్టం చేయబడింది. అయిన భ్రూణ హత్యలు ఆగలేదు. ఏ డాక్టరు, తల్లిదండ్రులకు గాని శిక్షలు పడ్డ సందర్భమూ లేదు. కనీసం కేసులు కూడా రిజిస్టర్ కావటం లేదు. ఆడపిల్లలు లేకుండా కొత్త సహస్రాబ్దంలోకి మనం అడు గుపెట్టే సూచనలు కనిపిస్తున్నట్టు ఐక్యరాజ్య సమితి గణాం కాలు, విశ్లేషణలు చెబుతున్నాయి. ఇది ప్రమాదకరం. ప్రకృతి సహజ న్యాయసూత్రాలకు విరుద్ధం. పరిస్థితి ఇలాగే కొన సాగితే రాబోయేతరం మూల్యం చెల్లించక తప్పదు. ప్రకృతిపరంగా మగపిల్లల కంటే ఆడపిల్లలు ఎక్కువ మంది బతుకుతారు, జన్యుపరంగా ఆడపిల్లలు బలంగా ఉండటమే దీనికి కారణం. భారతదేశంలో భ్రూణ హత్యల కారణంగా స్త్రీల జనాభా తగ్గిపోతూ ఉంది. అనేక దేశాలలో పురుషులకంటే స్త్రీల సంఖ్య అధికంగా ఉంది. చట్టాల అమలులో చిత్తశుద్ధి లేని కారణంగా ఆడపిండాలను గుర్తించి మొగ్గలోనే తుంచి వేస్తున్నారు. డయాగ్నస్టిక్ పరీక్షాకేంద్రాలు మృత పంజరాలుగా మారాయి. దీనికితోడు 1991 నుంచి దేశంలో ప్రపంచీకరణ దశ మొదలై పాశ్చాత్య విష సంస్కృతి పెచ్చరిల్లి, స్త్రీ శరీరం సరుకుగా, అంగడిబొమ్మగా, విలాస వస్తువుగా మార్చబడింది. ఫలితంగా స్త్రీలపై లైంగిక హింస పెరిగిపోయింది. ఈ విషసంస్కృతి కారణంగా మన దేశంలో



ప్రతి గంటకు ఐదు గురిపై అత్యాచారాలు జరుగుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి.

బహుళజాతి కంపెనీలు తమ వస్తువులను ప్రచారం చేసుకొని, అమ్ముకొని, సొమ్ము చేసుకోవటం కోసం బుల్లితెరలో వస్తున్న ప్రోగ్రామ్స్, సీరియల్స్ ఆడవారినే విలన్లుగా చూపిస్తున్నారు. సినిమాల్లో హీరోయిన్ల పాత్ర అర్ధనగ్నంగా, ఆత్మగౌరవం లేనిదిగా చిత్రీకరిస్తున్నారు. హీరోలైతే జులాయిలుగా, అమ్మాయిలను వెంటబడి, వేధించటమే ప్రేమగా చూపిస్తున్నారు. చివరకు ఉపాధ్యాయులను కూడా వదలటం లేదు. దీని ప్రభావం నేటి యువతపై పడి మానవీయ సంబంధాలు దెబ్బతింటున్నాయి. పెరిగిన వస్తు వ్యామోహం, వినిమయం పాశ్చాత్య విష సంస్కృతి మూలంగా మొత్తం మానవ సంబంధాలు మార్కెట్ సంబంధాలుగా మారిపోయాయి. రకరకాల నేరాలు పెరిగి తుదకు విలువలు లేని సమాజం ఏర్పడింది. ఈ పరిస్థితిని నిలువరించాల్సిన పాలకులు బహుళజాతి సంస్థలకు, ధనికులకు అమ్ముడుపోయి బాధ్యతారహితంగా నడుచుకుంటున్నారు. మహిళల సమస్యలు చర్చించుకొని పరిష్కరించుకోటానికి చట్టసభలలో కనీసం స్త్రీలకు ప్రాతినిధ్యం లేకుండా పోయింది. ఏనాడు పార్లమెంట్‌లో మహిళా ప్రతినిధులు 11 శాతానికి మించిలేరు. గత యూపీఏ ప్రభుత్వం చట్టసభలలో మహిళలకు 33శాతం రిజర్వేషన్ ఇస్తూమహిళా బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టింది. కానీ ఆమోదం మాత్రం పొందలేదు. ఒకవేళ పొందిన స్త్రీలు చట్టసభలకు ఎన్నికైతే పంచాయతీరాజ్ అనుభవమే పునరావృతం అవుతుంది. స్త్రీలు డమ్మీలుగా మిగిలిపోగలరు. స్త్రీలను ఇంటికే పరిమితంచేసే భూస్వామ్య భావజాలం నేడు రాజ్యమేలుతోంది. ఈ రకంగా మొదటి నుండి రాజకీయ పరమైన వివక్ష కొనసాగుతూనే ఉంది. తీవ్ర ప్రజా ఉద్యమం ఫలితంగా యూపీఏ ప్రభుత్వం ఆర్భాటంగా తీసుకొచ్చిన నిర్భయ చట్టం-2013 అమలులోకి వచ్చిన స్త్రీలమీద హింసారూపాలు అత్యాచారాలు పెరిగిపోతున్నాయే గాని తగ్గటం లేదు. పైపెచ్చు ఇప్పటీ బీజేపీ ప్రభుత్వం చర్యలు ఇందుకు వత్తాసు పలుకుతున్నాయి. బిల్కిస్‌బానో కేసులో శిక్షలు పడిన పదకొండుమంది ముద్దాయిలను 'అమృతోత్సవం' పేరిట వదిలివేయటం, ముద్దాయిలు హారతులందు కొని మరీ స్వాగత సత్కారాలు పొందటం జరిగింది. అలాగే యూపీలోని 'హత్రాస్'లో దళిత యువతిని సామూహికంగా అత్యాచారం చేసి తగుల పెట్టారు. కాశ్మీరులో ఆసిఫా అనే ముస్లిం పసి కూనను పవిత్ర దేవాలయంలో రోజుల తరబడి అత్యాచారం చేసి చంపిన ముద్దాయిలను అరెస్టు చేస్తే, అక్కడి బీజేపీ వారు నిందితులను విడుదల చేయాలని ఊరేగింపులు చేయటం లాంటి సంఘటనలతో సభ్యసమాజం నివ్వెరపోయి సిగ్గుపడింది. ఈ సంఘటనలు 'బేటి బచావ్' ప్రభుత్వ(బీజేపీ) అసలు రంగు బయటపెట్టింది.

సామాజిక పరిణామంలో మొదట స్త్రీలకు మంచి గౌరవం ఉండేది. మాతృస్వామిక వ్యవస్థే ఇందుకు ఉదాహరణ. ఆ తరువాత వ్యక్తిగత ఆస్తి, వర్గ సమాజం ఏర్పడ్డాక స్త్రీలకు ఆస్తిహక్కు లేకుండా పోయింది. దీంతో స్త్రీలకు విలువ పోయి వంటింటి కుందేలు అయిపోయింది. ఇదే నేటివరకు కొనసాగుతూ ఉంది. సరిగ్గా వివక్ష ఇక్కడే మొదలైంది. స్త్రీలను రెండురకాల బానిసలుగా మార్చి వేసింది వర్గ సమాజం.

సామాజిక పరిణామంలో మొదట స్త్రీలకు మంచి గౌరవం ఉండేది. మాతృస్వామిక వ్యవస్థే ఇందుకు ఉదాహరణ. ఆ తరు వాత వ్యక్తిగత ఆస్తి, వర్గ సమాజం ఏర్పడ్డాక స్త్రీలకు ఆస్తి హక్కు లేకుండా పోయింది. దీంతో స్త్రీలకు విలువ పోయి వంటింటి కుందేలు అయిపోయింది. ఇదే నేటివరకు కొనసాగుతూ ఉంది. సరిగ్గా వివక్ష ఇక్కడే మొదలైంది. స్త్రీలను రెండు రకాల బానిసలుగా మార్చి వేసింది వర్గ సమాజం. ఇంటి బయట జీతమిచ్చే బానిసగా, ఇంట్లో జీతం లేని బానిసగా చేసింది. స్త్రీలు శ్రమ చేయటం తప్ప వారికి ఆస్తిని కలిగి ఉండే హక్కు లేదు. ఇది స్త్రీలను పూర్తిగా బలహీనపరిచింది. అప్పటి నుండి నేటి వరకు స్త్రీలు అనేక రకాలుగా దోపిడీకి గురవుతున్నారు, కాబట్టి స్త్రీల దోపిడీకి, వివక్షకు మూలం పెట్టుబడిదారీ మార్కెట్ ఉత్పత్తి విధానం.ఆర్థిక అసమానతలతో కూడిన ఈ విధానం నశించాలి. అందుకు మరో స్వాతంత్ర్య పోరాటం జరగాలి. సోషలిస్ట్ వ్యవస్థలు ఏర్పడాలి. సోషలిస్ట్ వ్యవస్థలో సామాజిక ఉత్పత్తిలో శ్రమ విముక్తి జరిగి స్త్రీల భాగస్వామ్యం పెరిగి వారి విముక్తికి దారి తీస్తుంది. ఇదే స్త్రీ విముక్తికి, అన్ని సామాజిక సమస్యల పరిష్కారానికి మార్గం.

(నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం)

నవచిత్రం



చేతన్ కృష్ణ, హెబ్బాపటేల్

ధూం ధాం..

చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'ధూం ధాం'. ఈ చిత్రాన్ని ఫ్రైడే ఫ్రేమ్ వర్క్స్ బ్యానర్ పై ఎంఎస్ రామ్ కుమార్ నిర్మిస్తున్నారు.
ఈ సినిమాను లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా దర్శకుడు సాయి కిశోర్ మచ్చ రూపొంది స్తున్నారు. గోపీ మోహన్ స్టోరీ స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ తుది దశలో ఉన్న ఈ సినిమా ఈ సమ్మర్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మూవీ టీమ్ ఆన్ లొకేషన్‌లో రిలీజ్ చేశారు.

దీన్ తననా..



అలీ

తెలుగు, హిందీ భాషల్లో నిర్మిస్తున్న ద్విభాషా చిత్రం గురువారం లండన్‌లో ప్రారంభమైంది. పవన్ కల్యాణ్ 'బ్రో' చిత్రంలో సాయిధరమ్ తేజ్ తమ్ముడిగా నటించిన శ్రీనివాస్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఏ స్టార్ ప్రొడక్షన్స్, ఏబి ఇంటర్‌నేషనల్ ఫిలింస్, అనిక ప్రొడక్షన్‌లు సంయుక్తంగా ఈ 'దీన్ తననా' చిత్రాన్ని హుస్సేన్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నాయి. తొలి షాట్‌ను నటుడు అలీ, శ్రీనివాస్‌లపై చిత్రీకరించారు. పదిరోజుల పాటు లండన్‌లోనే తొలి షెడ్యూల్ నిర్వహిస్తారు.

వెయ్ దరువెయ్ రిలీజ్‌కి రెడీ



సాయిరామ్ శంకర్, యషా శివకుమార్, హెబ్బా పటేల్ హీరో, హీరోయిన్లుగా సాయి తేజ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ మీద దేవరాజు పొత్తూరు నిర్మించిన చిత్రం 'వెయ్ దరువెయ్'. లక్ష్మీనారాయణ పొత్తూరు సమర్పణలో వస్తున్న ఈ మూవీకి కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం బాధ్యతల్ని నవీన్ రెడ్డి నిర్వర్తిస్తున్నారు. ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హరీష్ శంకర్ మాట్లాడుతూ,' కేవీఆర్ మాట్లాడితే నేరుగా గుండెకు తాకుతోంది. ఇంత తక్కువ టైంలో నిర్మాత దేవరాజ్, దర్శకుడు నవీన్ రెడ్డి ఈ సినిమాను గొప్పగా తీశారు. సాయి రామ్ శంకర్ నాకు బ్రదర్‌లాంటి వాడు. అతని ఫుల్ ఎనర్జీ ని ఈ చిత్రంలో చూడబోతున్నారు. ఈ సినిమాలోని పాట లు, లిరిక్స్ బాగున్నాయి. భీమ్స్ మంచి పాటలే కాదు.. మంచి మాట లు కూడా మాట్లాడతాడని తెలిసింది. ఈ సినిమాలో కామారెడ్డి నుంచి హీరో వస్తాడు. కానీ కామారెడ్డి నుంచి హీరోలే వస్తారని కేవీఆర్ నిరూపించారు. ఈనెల 15న ఈ చిత్రం రాబోతోంది. అందరూ చూసి సక్సెస్ చేయాలి' అని అన్నారు.

'తక్కువ డబ్బుతో ఎక్కువ ఆనందాన్ని సినిమా ఇస్తుంది. సినిమా అనేది వ్యసనం కాదు. హరీష్, మాలా శ్రీ ప్రేమ ఖైదీ సినిమా కోసం ఆడిషన్స్‌కి వెళ్లాను. ప్రభాస్ శ్రీను, సత్యం రాజేష్ వంటి హాస్యనటులంటే నాకు చాలా ఇష్టం. ఒక సినిమా హిట్టయితే ఎన్నో కుటుంబాల్లో సంతోషం నిండుతుంది. వచ్చిన సక్సెస్‌ను కాపాడుకోవడానికి చాలా కష్టపడాల్సి ఉంటుంది' అని కామారెడ్డి ఎమ్మెల్యే కేవీ రమణా రెడ్డి తెలిపారు.

నిర్మాత దేవరాజ్ మాట్లాడుతూ, 'ఓ మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం. సినిమా కచ్చితంగా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు. డైరెక్టర్ నవీన్ రెడ్డి మాట్లాడుతూ, 'మా ఈవెంట్‌కు గెస్టుగా వచ్చిన హరీష్ శంకర్‌కి, కేవీఆర్‌కి థ్యాంక్స్. కథ చెప్పిన వెంటనే నిర్మాత దేవరాజ్ ఓకే చెప్పారు. సాయి రామ్ శంకర్ మా చిత్రానికి ఎంతో కష్టపడ్డారు. ఈనెల 15న ఈ మూవీ రాబోతోంది. ఆడియెన్స్ అంతా మా సినిమాను చూడండి' అని అన్నారు.

సాయి రామ్ శంకర్ మాట్లాడుతూ, 'కమర్షియల్‌గా తీసిన ఈ సినిమాకు భీమ్స్ మంచి పాటలు, ఆర్ఆర్ ఇచ్చారు. ఈ సినిమాలో ప్రభాస్ శ్రీను అన్నకి మంచి పాత్ర దొరికింది. సత్యం రాజేష్‌ను మేం బాగా ఇబ్బంది పెట్టాం (నవ్వుతూ). మా నిర్మాతకు సినిమాలంటే ప్యాషన్. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు. బంపర్ ఆఫర్, అమ్మానాన్న ఓ తమిళమ్మాయి లాంటి ఎమోషన్స్‌తో ఈ సినిమా ఉంటుంది. చాలా తక్కువ టైంలో ఈ సినిమాను దర్శకుడు అద్భుతంగా తీశారు. సినిమాకు పని చేసిన ప్రతీ ఒక్కరికీ థ్యాంక్స్. మార్చి 15న మా సినిమా రాబోతోంది.' అని చెప్పారు.

కారును ఢీకొన్న వాటర్ ట్యాంకర్ ..చిన్నారి మృతి

- మరో నలుగురికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-రాజేంద్రనగర్

అతివేగంగా నడుపుతున్న వాటర్ ట్యాంకర్ ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టిన ఘటనలో మూడేండ్ల పాప అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతబస్తీ నవాబ్‌కుంట ప్రాంతానికి చెందిన ఓ కుటుంబం గురువారం మొయినాబాద్ నుంచి రాజేంద్రనగర్‌కు కారులో వెళ్తున్నారు. అయితే హిమాయత్ సాగర్ సర్వీస్ రోడ్ వద్ద అతివేగంగా ఎదురుగా వస్తున్న వాటర్ ట్యాంకర్ ఈ కారుని ఢీ కొట్టింది. దాంతో అందులో ప్రయాణిస్తున్న చిన్నారి సమీరా ఫాతిమా అక్కడికక్కడే మృతి చెందింది. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తోటి ప్రయాణికులు.. పోలీసులకు, 108 సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తీవ్రంగా గాయపడిన నలుగురిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు వాటర్ ట్యాంకర్ డ్రైవర్ అతివేగమే కారణమని పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న వాటర్ ట్యాంకర్ డ్రైవర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

- ఉన్నత విద్యామండలి చైర్మెన్‌కు వర్సిటీ కాంట్రాక్టు టీచర్ల జేఏసీ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా 14 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న 1,445 మంది కాంట్రాక్టు అధ్యాపకులందర్నీ రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్ల జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, వైస్ చైర్మెన్ ఎస్‌కే మహమూద్‌ను ఆ సంఘం చైర్మెన్ డాక్టర్ శ్రీధర్ కుమార్ లోధ్, వర్కింగ్ చైర్మెన్ ఎం రామేశ్వరరావు నేతృత్వంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్ల జేఏసీ కో చైర్మెన్ జి వెంకటేశ్వర్లు, నాయకులు రవీందర్‌రెడ్డి, పెంచాల శ్రీనివాస్, కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టులో సర్కారుకు షాక్

(మొదటిపేజీ తరువాయి)

కూడా నిలిపివేస్తున్నట్లు తెలిపింది. వాళ్ల నియామక గెజిట్ నోటిఫికేషన్ కూడా రద్దు చేస్తున్నట్లు తీర్పులో స్పష్టం చేసింది. గవర్నర్ తీసుకున్న నిర్ణయంపై పిటిషన్ దాఖలు చేయవచ్చునని చెప్పింది. ఆ అర్హత దాసోజు శ్రవణ్ కుమార్, కుర్ర సత్యనారాయణలకు ఉందని చెప్పింది. నిర్ణయం చట్టబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా లేనప్పుడు వివక్షతో ఉందని భావించిన వ్యక్తి హైకోర్టుకు రావచ్చునని రాజ్యాంగం చెబుతోందని వివరించింది. రాజ్యాంగంలోని 226 అధికరణం రక్షణ కల్పించిందని తెలిపింది. వివిధ కేసుల్లో సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం పిటిషనర్లు కోర్టులో పిటిషన్ దాఖలు చేసే హక్కుందని చెప్పింది.ఎమ్మెల్సీలుగా నామినేషన్ వేసేందుకు 2023 జులై 31న మంత్రివర్గం గవర్నర్‌కు సిఫార్సు చేసిందనీ, వాటిని ఆమోదించడం లేదా తిరస్కరించడం లేదా అనుమానాలు ఉంటే వాటికి వివరణ ఇవ్వాలని సిఫార్సులను ప్రభుత్వానికి తిప్పి పంపడం వంటివి చేయాలన్న నిబంధన అమలు కాలేదని తప్పుపట్టింది. అయితే, రాజ్యాంగం ప్రకారం గవర్నర్‌కు ఉత్తర్వులు, ఆదేశాలు జారీ చేయలేమని స్పష్టం చేసింది. గవర్నర్‌కు కోర్టులు ఉత్తర్వులు జారీ చేయలేవని, రాజ్యాంగంలోని 361 అధికరణం ప్రకారం గవర్నరు కోర్టుకు జవాబుదారీ కూడా కాదని తెలిపింది. ఈ కేసులోని ప్రత్యేక పరిస్థితులు, వాస్తవాలను దృష్టిలో ఉంచుకుని గవర్నర్ తగిన చర్యలు తీసుకుంటారని యోచిస్తున్నట్లు తీర్పులో వివరించింది.

అరాచక శక్తులకు కేంద్రంగా సందేశ్ ఖలీ ప్రాంతం

వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్

ఆ ప్రాంత బాధితులకు వ్యకాస పరామర్శ

- మమతా, బీజేపీ సృష్టించిన అరాచక గ్యాంగ్ లీడరే షాజహాన్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర 24 పర్గణ జిల్లాలో సందేశ్ ఖలీ ప్రాంతం అరాచక శక్తులకు కేంద్రంగా మారిందని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ అన్నారు. సందేశ్ ఖలీ ప్రాంతంలో అరాచకాలకు గురైన గిరిజన ప్రజలకు వ్యకాస అండగా ఉంటుందని తెలిపారు. సందేశ్ ఖలీ బాధితులను విచారించి వారి బాధలను పరిశీలించి వారికి మనోధైర్యం కల్పించేందుకు వెళ్లిన వ్యవసాయ కార్మిక సంఘం బృందంలో వెంకట్‌తో పాటు వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నాయకులు తుషార్ ఘోష్, అమియా పాత్ర తదితరులు ఉన్నారు. ఈ బృందం ముందు బాధితులు తమ గోడు వెల్లబోసుకున్నారు. 2011 నుండి సందేశ్ ఖలీ ప్రాంతంలో నిరుపేద గిరిజనులు ఎదుర్కొంటున్న బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయని తెలిపారు. ఆ ప్రాంతంలోని ఐదు పంచాయతీలను 2011 నాటికి లెఫ్ట్ ఫ్రంట్ గెలిచిందని, తృణమూల్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం నామినేషన్ వేసే అవకాశం కూడా లేకుండా నిరంకుశంగా వ్యవహరిస్తున్నదని అన్నారు. ఈ అరాచక గుంపులకు వ్యతిరేకంగా పోరాడుతున్న మాజీ శాసనసభ్యులు, గిరిజన ప్రజల నేత నిరాపత్ సర్దార్‌కు, వారి బృందానికి అభినందనలు తెలియజేసే కార్యక్రమాన్ని వ్యకాస బుధవారం కలకత్తాలో నిర్వహించింది. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మమతా బెనర్జీ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాలు సృష్టించిన అరాచక గ్యాంగులు బెంగాల్ రాష్ట్రమంతటా అకత్యాలకు తెగబడుతున్నారని అన్నారు. గత వామపక్ష ప్రభుత్వం పేదలకు భూములు పంచి వారి జీవితాలకు, భవిష్యత్తుకు భద్రతను కల్పించగా, మమత అధికారంలోకి రాగానే అరాచక శక్తుల చేతుల్లోకి అధికారం చేరిందని, కేంద్రంలోని బీజేపీ అండదండలతో విచ్చలవిడి భూ ఆక్రమణలు, కబ్జాలకు టీఎంసీ పార్టీ నేతలు తెగబడ్డారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ కబ్జాలను అడ్డుకున్న వారిపై దాడులు, దౌర్జన్యాలు, హత్యాకాండ సాగించారని, వారి అరాచకాలను ప్రశ్నించిన మహిళలపై అమానుషమైన మానభంగాలు చేశారని ఆయన తెలిపారు. ఇటువంటి అరాచక గుంపును ఆసరా చేసుకుని ఎన్నికల్లో లబ్ది పొందే దానికోసం ఇటు తృణమూల్ కాంగ్రెస్, అటు బీజేపీ ప్రభుత్వాలు చట్టాపట్టాలేసుకుని సాగాయని అన్నారు.

ప్రస్తుతం ఎన్నికలు దగ్గర పడుతున్న స్థితిలో తమ స్వార్థ ప్రయోజనాల కోసం బీజేపీ, టీఎంసీ ఒకదానిపై ఒకటి దుమ్మెత్తి పోసుకుంటు న్నాయని అన్నారు. రాష్ట్రంలోని తృణమూల్ కాంగ్రెస్ ఈ అరాచకాలకు పాల్పడుతున్న షేక్ షాజహాన్‌ను నిలువరించేందుకు కానీ, అరెస్టు చేసే దానికి కానీ ఎటువంటి ప్రయత్నం చేయలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని కోర్టులు తీవ్రంగా మందలించి, హెచ్చరించిన తర్వాత మాత్రమే ఆ నిందితున్ని అరెస్ట్ చేయటం, కేసును సీబీఐకి అప్పగించడం జరిగిందని తెలిపారు. దోషులను అరెస్టు చేయడం చేతగాని ప్రభుత్వం వారి దౌర్జన్యాలను అడ్డుకుంటున్న గిరిజన నేత, మాజీ శాసనసభ్యులు నిరాఫర్ సర్దారుపై భౌతిక దాడులు చేసి అక్రమంగా అరెస్టు చేసి బెయిల్ కూడా రాకుండా అమానుషంగా 20 రోజులు పాటు జైల్లో నిర్బంధించిందని అన్నారు. ఈ చర్యలను తీవ్రంగా పరిగణిస్తూ సుప్రీంకోర్టు టీఎంసీ ప్రభుత్వానికి చివాట్లు పెట్టిన తర్వాతే నీరా సర్దార్ని విడుదల చేయడం, అరాచక గ్యాంగ్ లీడర్ షాజహాన్‌ను అరెస్టు చేసినట్టు తెలిపారు.

సందేశ్ ఖలీలో జరుగుతున్న ఈ అరాచకాలను ఎదుర్కొం టున్న పేదలను ఆసరా చేసుకుని, అల్లర్లను మరింత పెంచి బెంగా ల్లో హిందూమత ఉన్మాదాన్ని రగిలిం చేందుకు బీజేపీ కుట్రలు, కుయుక్తులకు పాల్పడుతున్నదని అన్నారు. బీజేపీ ఉన్మాద చర్యలను బెంగాల్ ప్రజలు హర్షించరని, కచ్చితంగా తిప్పి కొడతారని ఆయన అన్నారు. బెంగాల్ ప్రజలు ప్రజాస్వామిక వాదులని, బీజేపీ తృణ మూల్ అరాచకాలు ఎదురొడ్డి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారని తెలిపారు. ప్రజాస్వామ్య వాతావరణం కోసం పోరాడుతున్న బాధితులకు అండగా వ్యవసాయ కార్మిక సంఘం విస్తృతంగా రాష్ట్రవ్యాప్త ప్రచారం చేయబోతున్నదని అన్నా రు. 25 లక్షల మంది ప్రజలను కలవాలని, గ్రామ గ్రామాన జనరల్ బాడీ సమావేశాలు జరపాలని, బాధితులకు అండగా ప్రజాతంత్ర వాదులందరిని సమీకరించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

కాంటినెంటల్ ఆస్పత్రిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం



హైదరాబాద్ : మార్చి 8 మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కాంటినెంటల్ ఆస్పత్రిలో ప్రతీ సంవత్సరంలాగే గురువారం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఎంటర్ ప్రెన్యూర్స్ తో, ఆస్పత్రిలోనే ఒక ఉమెన్ బజార్‌ను ఏర్పాటు చేశారు. ఈ బజార్‌లో మహిళలు సొంతంగా చేపట్టిన బిజినెస్, అందులో వారి ప్రతిభను స్టాల్స్ రూపంలో ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో 27 మంది మహిళలు పాల్గొనగా ఒక్కో బిజినెస్ ఉమెన్‌ది ఒక్కో విజయగాథ.కాంటినెంటల్ ఆస్పత్రి చైర్మెన్ డాక్టర్ గురు ఎన్‌రెడ్డి మాట్లా డుతూ మహిళలు వారనుకున్న గమ్యాన్ని చేరడానికి పోరాడుతున్న తీరు అందరికీ స్ఫూర్తిదాయకం అన్నారు. ఇలాంటి వారందరికీ తమ ఆస్పత్రి ఎల్ల ప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ వేడుకల్లో ఒక ఫైర్ సైడ్ చాట్‌సెషన్ నూ నిర్వహించారు. ఇందులో వి హబ్ సీఈవో దీప్తి రావుల, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ డైరెక్టర్ సుతాప పొద్దార్ రాయ్, బీజేపీ నేషనల్ పాలసీ ఇన్‌చార్జి కరుణ గోపాల్ పాల్గొని ఆస్పత్రి సిబ్బందికి విలువైన సూచనలి చ్చారు. ఈ ఆస్పత్రిలో మార్చి 1 నుంచి రియల్ డైమండ్స్ ఆఫ్ హైదరాబాద్ పేరుతో ఓ కార్యక్రమమూ చేపట్టారు. అనంతరం అత్యుత్త మసేవలందించిన మహిళా ఉద్యోగులు, డాక్టర్లను అవార్డులతోసత్కరించారు.

తాడిచర్ల సింగరేణికే....

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- తాడిచర్ల కోల్ బ్లాక్-2 ప్రేయర్ అప్రూవల్‌కు కేంద్రం సానుకూలం
- నైని బ్లాక్‌లో బొగ్గు ఉత్పత్తికి అడ్డంకులు తొలగించాలని కేంద్ర మంత్రికి వినతి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తాడిచర్ల కోల్ బ్లాక్ -2లో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ బొగ్గు ఉత్పత్తి చేయడానికి త్వరలోనే కేంద్ర ప్రభుత్వం ప్రేయర్ అప్రూవల్‌కు సానుకూలంగా స్పందించడం తెలంగాణ రాష్ట్రానికి, సింగరేణి కాలరీస్ సంస్థకు శుభవార్తని తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సింగరేణికి కావాల్సిన కోల్ బ్లాక్స్, సింగరేణి సమస్యలు, సింగరేణి అవసరాల గురించి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి, వర్చువల్ మీటరింగ్ విధానంతో పేదల ఇండ్లకు సౌర విద్యుత్తునందించే విషయమై కేంద్ర విద్యుత్ మంత్రి ఆర్.కె సింగ్‌ను వేర్వేరుగా కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వినతి పత్రాలు అందజేశారు. అనంతరం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అవసరాలు, ప్రజల ప్రయోజనాల దృష్ట్యా కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రంలో సింగరేణి సమస్యలు, కేటాయించాల్సిన బొగ్గు గనులు, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రధాన మంత్రి సూర్యగర్ ముఫ్త బిజిలి యోజన పథకం అమలుపై చర్చించినట్టు తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని తాడిచర్ల కోల్ బ్లాక్ -2 బొగ్గు బ్లాక్‌ను 2013లో సింగరేణి కాలరీస్ సంస్థకు కేటాయించారన్నారు. తాడిచర్ల కోల్ బ్లాక్ -2లో దాదాపు 5 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశం ఉందన్నారు. 30 సంవత్సరాల పాటు 182 మిలియన్ టన్నులు బొగ్గు నిక్షేపాలను వెలికితీసే అవకాశం ఉందని చెప్పారు. ఈ మైనింగ్‌ను గత ప్రభుత్వం ప్రొడక్షన్‌లోకి తీసుకొచ్చుంటే సింగరేణి సంస్థకు లాభాలు సమకూరేవన్నారు. తాడిచర్ల కోల్ బ్లాక్ -2లో బొగ్గు ఉత్పత్తికి గత ప్రభుత్వం పదేండ్లుగా ప్రేయర్ అప్రూవల్ తీసుకురాకపోవడం వల్ల తెలంగాణ రాష్ట్రానికి, సింగరేణి సంస్థకు ఆర్థికంగా తీవ్ర నష్టం చేసిందన్నారు. తెలంగాణలో పెరుగుతున్న ప్రజల విద్యుత్తు డిమాండ్ అవసరాలను తీర్చడానికి బొగ్గు ఉత్పత్తులను పెంచాలని, ప్రత్యేక చొరవ తీసుకొని కేంద్ర బొగ్గు గనుల మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి విన్నవించడం వల్ల తాడిచర్ల కోల్ బ్లాక్-2లో సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తికి ప్రేయర్ అప్రూవల్ త్వరలోనే ఇస్తామని సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. ప్రత్యేక చొరవ తీసుకొని కేంద్ర బొగ్గు గనుల మంత్రిని కలవడం వల్ల రాష్ట్రానికి మంచి మేలు జరిగిందన్నారు. తాడిచర్ల కోల్ బ్లాక్-2 మైనింగ్‌ను ప్రొడక్షన్‌లోకి తీసుకురావడం వల్ల సింగరేణి కాలరీస్‌కు లాభాలు, తెలంగాణ రాష్ట్రానికి ఆదాయం రానుందన్నారు.

కేంద్ర విద్యుత్తు మంత్రికి వినతి

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రధానమంత్రి సూర్యగర్ ముఫ్త బిజిలి యోజన పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యుత్తు సబ్ స్టేషన్స్‌లో ఉన్న పరిసర ప్రాంతాల్లో వర్చువల్ మీటరింగ్ విధానంతో సోలార్ ప్యానల్‌లను ఏర్పాటు చేసి అక్కడి నుంచే పేదల ఇండ్లకు కరెంటు సరఫరా చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రతిపాదనలను కేంద్ర విద్యుత్తు మంత్రి ఆర్.కె సింగ్‌కు అందజేసినట్టు తెలిపారు. ప్రధానమంత్రి సూర్యగర్ ముఫ్త బిజిలి యోజన పథకంలో రూఫ్‌టాప్ సోలార్ విదుత్తు ఉత్పత్తికి కేంద్ర ఇస్తున్న సబ్సిడీ పొందడానికి చాలా మంది పేదలు తమ ఇండ్లపై రూఫ్‌టాప్ వేయించుకోవడానికి అవకాశం లేకపోవడంతో పాటు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోలేని పరిస్థితుల్లో ఈ పథకానికి దూరమయ్యే అవకాశం ఉందన్నారు. వారికి ప్రయోజనం కల్గించడానికి వర్చువల్ మీటరింగ్ విధానాన్ని అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని కోరినట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ కాకుండా ఇతర అమౌంట్ మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే భరించి ఈ పథకాన్ని ముందుకు తీసుకుపోవాలనే ఆలోచనతో కార్యాచరణను సిద్ధం చేశామన్నారు. కేంద్రానికి సమర్పించిన మా ప్రతిపాదన సోలరైజేషన్‌ను త్వరగా ప్రజలకందించేందుకు ఉపయోగపడుతుందన్నారు. పేదలకు మేలు చేసేందుకు చేసిన మా ప్రతిపాదనపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని సమగ్ర పరిశీలన చేసిన తరువాత నిర్ణయం తీసుకుంటామని చెప్పినట్టు భట్టి వెల్లడించారు. డిప్యూటీ సీఎం వెంట ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ, సింగరేణి సంస్థల కాలరీస్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం, డిప్యూటీ సీఎం సెక్రెటరీ కృష్ణభాస్కర్ తదితరులున్నారు.

ధర్మశాల స్టేడియం. చుట్టూ మంచు కొండలు. అతి శీతల వాతావరణం. భారత్‌తో స్వదేశంలో విదేశీ పరిస్థితులు, విదేశీ జట్టుకు సుదూర స్వదేశీ పరిస్థితులు కనిపించే భిన్నమైన మైదానం. తేమ, పిచ్ స్వభావ రీత్యా స్వింగ్‌కు బ్యాటర్లు బెంబేలెత్తాలి. కానీ ధర్మశాల స్పిన్ టర్న్ తీసుకుంది. పేసర్లు నిప్పులు చెరిగే చోట స్పిన్నర్లు పది వికెట్లతో మాయాజాలం ప్రదర్శించారు. కుల్దీప్ యాదవ్ (5/72) ఐదు వికెట్ల ప్రదర్శనకు తోడు వందో టెస్టు మాయగాడు రవిచంద్రన్ అశ్విన్ (4/51), జడేజా (1/17) మెరువటంతో ఇంగ్లాడ్ తొలి ఇన్నింగ్స్‌లో 218 పరుగులకే కుప్పకూలింది.

చిచ్చర పిడుగు యశస్వి జైస్వాల్ (57), కెప్టెన్ రోహిత్ శర్మ (52 బ్యాటింగ్) అర్థ సెంచరీలతో దంచికొట్టారు. ఓపెనర్లు సెంచరీ భాగస్వామ్యంతో కదం తొక్కగా భారత్ తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు దిశగా దూసుకెళ్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ మరో 83 పరుగుల దూరంలోనే నిలిచింది. బంతితో, బ్యాట్‌తో ఇంగ్లాండ్‌ను బాదిన భారత్ ఐదో టెస్టు తొలి రోజు ఎదురులేని జోరు చూపించింది.

కుల్దీప్, అశ్విన్ మాయాజాలం

- కుల్దీప్ యాదవ్ ఐదు వికెట్ల మాయ
- ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ 218/10
- రోహిత్, యశస్వి అర్థ శతకాలు

భారత్ తొలి ఇన్నింగ్స్ 135/1
ధర్మశాల టెస్టు తొలి రోజు





నవతెలంగాణ-ధర్మశాల

భారత స్పిన్నర్లు మాయ చేశారు. ధర్మశాలలో ఊరట విజయం ఆశించిన ఇంగ్లాండ్‌కు తొలి రోజే చుక్కలు చూపించారు. చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (5/72), వందో టెస్టు మాయావీ రవిచంద్రన్ అశ్విన్ (4/51) మాయజాలంతో ఇంగ్లాండ్ విలవిల్లాడింది. తొలి ఇన్నింగ్స్‌లో స్టోక్స్‌సేన 218 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ జాక్ క్రాలీ (79, 108 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్) అర్థ సెంచరీతో రాణించినా స్పిన్ మ్యాజిక్ ముందు ఇంగ్లాండ్ బ్యాటర్లు తేలిపోయారు. బెన్ స్టోక్స్ (0), ఒలీ పోప్ (11) చేతులెత్తేయగా.. బెన్ డకెట్ (27), జో రూట్ (26), జానీ బెయిర్‌స్టో (29), బెన్ ఫోక్స్ (24) మంచి ఆరంభాలు దక్కినా స్పిన్‌కు చిత్తయ్యారు. తొలి రోజు 30 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసిన భారత్ 135/1 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌కు మరో 83 పరుగుల దూరంలోనే నిలిచింది. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (57, 58 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ రోహిత్ శర్మ (52 బ్యాటింగ్, 83 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్థ సెంచరీలతో చెలరేగారు. శుభ్‌మన్ గిల్ (26 బ్యాటింగ్, 39 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆకట్టుకున్నాడు.

ఓపెనర్లు మెరిసినా.. :

ధర్మశాలలో కీలక టాస్ నెగ్గిన ఇంగ్లాండ్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఉదయం సెషన్లో పేసర్లు బుమ్రా, సిరాజ్‌లు స్వింగ్ రాబట్టారు. బుమ్రా, సిరాజ్ నిప్పులు చెరుగగా.. ఇంగ్లాండ్ ఓపెనర్లు తప్పిదాలు చేస్తూనే ఉన్నారు. కానీ తొలి గంట ఆటలో పేసర్లను ఎదురొడ్డి ఓపెనర్లు నిలువటం ఆశ్చర్యం కలిగించింది. జాక్ క్రాలీ (79), బెన్ డకెట్ (27, 58 బంతుల్లో 4 ఫోర్లు) తొలి వికెట్‌కు శుభారంభం చేశారు. ప్రమాదకర పేసర్లకు వికెట్ ఇవ్వకుండా క్రీజులో నిలబడ్డారు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని చైనామన్ కుల్దీప్ విడదీశాడు. తొలి ఓవర్లోనే బెన్ డకెట్‌ను సాగనంపాడు. లెగ్‌సైడ్‌లో గిల్ సూపర్ క్యాచ్‌తో తొలి వికెట్‌లో భాగమయ్యాడు. ఒలీ పోప్ (11, 24 బంతుల్లో) ఎంతోసేపు క్రీజులో నిలువలేదు. కుల్దీప్ ఓవర్లో క్రీజు వదిలి ముందుకొచ్చిన పోప్.. మళ్లీ వెనక్కి వెళ్లాల్సి రాలేదు. జురెల్ మెరుపు స్టంపింగ్‌తో ఇంగ్లాండ్ 100 పరుగుల వద్ద రెండో వికెట్ కోల్పోయింది. ఓపెనర్ జాక్ క్రాలీ 9 ఫోర్లతో 64 బంతుల్లో అర్థ సెంచరీ సాధించి ఇంగ్లాండ్‌ను నడిపించాడు. తొలి సెషన్లో ఇంగ్లాండ్ 25.3 ఓవర్లలో 100 పరుగులు చేసింది. పేస్‌కు అనుకూలించే సెషన్లో రెండు వికెట్లనూ స్పిన్నర్ పడగొట్టడం విశేషం.

మాయకు విలవిల :

తొలి సెషన్‌లో ఇంగ్లాండ్, భారత్ సంతృప్తికర ప్రదర్శన చేయగా.. లంచ్ విరామం తర్వాత కథ మారింది. చైనామన్ స్పిన్నర్ కుల్దీప్‌కు.. వందో టెస్టు మాయావీ అశ్విన్, లెఫ్టార్మ్ స్పిన్నర్ జడేజా జత కలిశారు. దీంతో వికెట్ల జాతర సాగింది. జో రూట్ (26, 56 బంతుల్లో 4 ఫోర్లు)తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే పనిలో నిమగ్నమైన జాక్ క్రాలీని కుల్దీప్ సాగనంపాడు. క్రాలీ వికెట్లను గిరాటేసిన కుల్దీప్.. వందో టెస్టు హీరో జానీ బెయిర్‌స్టో (29, 18 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఉత్సాహంపై నీళ్లు చల్లాడు. రెండు ఫోర్లు, సిక్సర్లతో జోరందుకున్న బెయిర్‌స్టో.. కుల్దీప్ బంతికి వికెట్ల వెనకాల క్యాచౌట్‌గా నిష్క్రమించాడు. 175/3తో కుదురుకుంటున్న ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ ఒక్కసారిగా కుదేలైంది. ఒక్క పరుగూ జోడించకుండానే ఇంగ్లాండ్ మూడు కీలక వికెట్లు కోల్పోయింది. వరుస ఓవర్లలో బెయిర్‌స్టో, జో రూట్, బెన్ స్టోక్స్ (0) పెవిలియన్ బాట పట్టారు. క్రీజులో కుదురుకున్న రూట్‌ను జడేజా అవుట్ చేయగా.. బెన్ స్టోక్స్ కుల్దీప్ మాయలో పడ్డాడు. కుల్దీప్ ఐదో వికెట్ తీయగా.. ఇంగ్లాండ్ పీకల్లోతు కష్టాల్లో కూరుకుంది. ఇక్కడ్నుంచి టెయిలెండర్ల కథ అశ్విన్ ముగించాడు. రెండు ఓవర్లలోనే నాలుగు వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. ఇన్నింగ్స్ 50వ ఓవర్లో టామ్ హర్ట్లీ (6), మార్క్‌వుడ్ (0)లను అవుట్ చేసిన అశ్విన్.. ఇన్నింగ్స్ 58వ ఓవర్లో బెన్ ఫోక్స్ (24), జేమ్స్ అండర్సన్ (0)లను సాగనంపాడు. దీంతో ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ 57.4 ఓవర్లలో 218 పరుగులకే ముగిసింది. ఓపెనర్లు మంచి ఆరంభాన్ని అందించినా ఇంగ్లాండ్ మెరుగైన స్కోరు చేయలేదు. చివరి ఏడు వికెట్లను 43 పరుగుల వ్యవధిలోనే కోల్పోయింది.

యశస్వి దూకుడు :

యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (57) అర్థ సెంచరీతో చెలరేగాడు. షోయబ్ బషీర్ ఓవర్లో మూడు సిక్సర్లు సంధించిన జైస్వాల్.. మరో ఐదు బౌండరీలతో దండెత్తాడు. నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో 56 బంతుల్లోనే అర్థ సెంచరీ సాధించిన యశస్వి ఈ క్రమంలో ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా విరాట్ కోహ్లి రికార్డును బద్దలుకొట్టాడు. అర్థ సెంచరీ అనంతరం బషీర్ ఓవర్లోనే ముందుకొచ్చిన ఆడిన యశస్వి.. స్టంపౌట్‌గా నిష్క్రమించాడు. కెప్టెన్ రోహిత్ శర్మ (52 బ్యాటింగ్) ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో 77 బంతుల్లో అర్థ సెంచరీ సాధించాడు. గిల్ సైతం రెండేసి ఫోర్లు, సిక్సర్లు బాదటంతో స్కోరు బోర్డు పరుగులు తీసింది. శుభ్‌మన్ గిల్ (22 బ్యాటింగ్) తోడుగా రోహిత్ శర్మ క్రీజులో అజేయంగా నిలిచాడు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి 135/1తో కొనసాగుతున్న భారత్ మరో 83 పరుగుల తొలి ఇన్నింగ్స్ వెనుకంజలో నిలిచింది.

1000 టెస్టుల్లో వేగంగా వెయ్యి పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా యశస్వి జైస్వాల్ నిలిచాడు. 9 టెస్టుల్లోనే (16 ఇన్నింగ్స్‌లు) జైస్వాల్ ఈ ఘనత సాధించగా.. వినోద్ కాంబ్లి 12 టెస్టులు (14 ఇన్నింగ్స్‌లు), పుజారా 11 టెస్టులు (18 ఇన్నింగ్స్‌లు), మయాంక్ 12 టెస్టులు (19 ఇన్నింగ్స్‌లు), గవాస్కర్ 11 టెస్టులు (21 ఇన్నింగ్స్‌లు) ఆ తర్వాత స్థానంలో ఉన్నారు.

712 ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా విరాట్ కోహ్లి (655) రికార్డును యశస్వి జైస్వాల్ (712) అధిగమించాడు. ఓవరాల్‌గా సునీల్ గవాస్కర్ (774) తర్వాతి స్థానంలో నిలిచాడు.

50 టెస్టుల్లో అరంగ్రేటం చేసి ఏడేండ్ల తర్వాత కుల్దీప్ యాదవ్ 50 వికెట్ల క్లబ్‌లో చేరాడు. కానీ అత్యంత వేగంగా ఈ మార్క్ అందుకున్న స్పిన్నర్‌గా నిలిచాడు. కుల్దీప్ 1871 బంతుల్లోనే 50 వికెట్లు కూల్చగా.. అక్షర్ పటేల్ 2205, జస్‌ప్రీత్ బుమ్రా 2465 బంతులకు పడగొట్టారు. ఓవరాల్‌గా ఇంగ్లాండ్ స్పిన్నర్ జానీ బ్రిగ్స్ (1512) తర్వాతి స్థానంలో కుల్దీప్ నిలిచాడు.

స్కోరు వివరాలు

ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ : జాక్ క్రాలీ (బి) కుల్దీప్ 79, బెన్ డకెట్ (సి) గిల్ (బి) కుల్దీప్ 27, ఒలీ పోప్ (స్టంప్డ్) జురెల్ (బి) కుల్దీప్ 11, జో రూట్ (ఎల్బీ) జడేజా 26, జానీ బెయిర్‌స్టో (సి) జురెల్ (బి) కుల్దీప్ 29, బెన్ స్టోక్స్ (ఎల్బీ) కుల్దీప్ 0, బెన్ ఫోక్స్ (బి) అశ్విన్ 24, టామ్ హర్ట్లీ (సి) పడిక్కల్ (బి) అశ్విన్ 6, మార్క్‌వుడ్ (సి) రోహిత్ (బి) అశ్విన్ 0, షోయబ్ బషీర్ నాటౌట్ 11, జేమ్స్ అండర్సన్ (సి) పడిక్కల్ (బి) అశ్విన్ 0, ఎక్స్‌ట్రాలు : 5, **మొత్తం :(57.4 ఓవర్లలో ఆలౌట్) 218.**

వికెట్ల పతనం : 1-64, 2-100, 3-137, 4-175, 5-175, 6-175, 7-183, 8-183, 9-218, 10-218.

బౌలింగ్ : జస్‌ప్రీత్ బుమ్రా 13-2-51-0, మహ్మద్ సిరాజ్ 8-1-24-0, రవిచంద్రన్ అశ్విన్ 11.4-1-51-4, కుల్దీప్ యాదవ్ 15-1-72-5, రవీంద్ర జడేజా 10-2-17-1.

భారత్ తొలి ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ (స్టంప్డ్) బెన్ ఫోక్స్ (బి) షోయబ్ బషీర్ 57, రోహిత్ శర్మ బ్యాటింగ్ 52, శుభ్‌మన్ గిల్ బ్యాటింగ్ 26, ఎక్స్‌ట్రాలు : 0, **మొత్తం :(30 ఓవర్లలో వికెట్ నష్టానికి) 135.**

వికెట్ల పతనం : 1-104.

బౌలింగ్ : జేమ్స్ అండర్సన్ 4-1-4-0, మార్క్‌వుడ్ 3-0-21-0, టామ్ హర్ట్లీ 12-0-46-0, షోయబ్ బషీర్ 11-2-64-1.

నాదల్ ఔట్, నాగల్ ఇన్

ఇండియన్ వెల్స్ టెన్నిస్ టోర్నీ





కాలిఫోర్నియా : స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ నిష్క్రమణ.. భారత యువ కెరటం సుమిత్ నాగల్‌కు వరమైంది. 22 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల చాంపియన్ నాదల్ ఇండియన్ వెల్స్ టోర్నీ నుంచి తప్పుకున్నాడు. పూర్తి ఫిట్‌నెస్ సాధించని నాదల్.. ఇండియన్ వెల్స్ పోటీలో నిలువలేనని తెలిపాడు. 'ఇండియన్ వెల్స్ టోర్నీ నుంచి తప్పుకోవటం ఎంతో బాధగా ఉంది. ఇండియన్ వెల్స్‌లో ఆడటాన్ని నేను ఎంతగానో ఇష్టపడతానని అందరికీ తెలుసు. అందుకే ఎంతో ముందుగానే ఇక్కడికి చేరుకుని సాధన మొదలెట్టాను. కానీ గత వారం స్వీయ పరీక్షలో ఈ స్థాయి పోటీకి నేను ఇంకా సిద్ధంగా లేనని అర్థమైంది. అభిమానులకు, నాకు నేను అబద్ధం చెప్పుకోలేను. ఇది తేలికైన నిర్ణయం కాదు' అని నాదల్ ఓ ప్రకటనలో తెలిపాడు. రఫెల్ నాదల్ లేకపోవటం అభిమానులకు అతిపెద్ద లోటు అని ఇండియన్ వెల్స్ టోర్నమెంట్ డైరెక్టర్ టామీ హాస్ వ్యాఖ్యానించాడు. గాయంతో వరుసగా టోర్నీలకు దూరమవుతున్న నాదల్.. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్‌తో పాటు పారిస్ ఒలింపిక్స్‌కు సిద్ధమయ్యే అవకాశాలు ఉన్నాయి. నాదల్ ఫేవరేట్ మట్టికోర్టులో జరిగే ఈ రెండు ప్రతిష్టాత్మక ఈవెంట్లలో అత్యుత్తమ ప్రదర్శనతో నాదల్ వీడ్కోలు ప్రకటించే అవకాశం లేకపోలేదు.

ఇక ఫ్రెంచ్ యోధుడు తప్పుకోవటంతో సుమిత్ నాగల్ ఇండియన్ వెల్స్ ప్రధాన టోర్నీకి అర్హత సాధించాడు. అర్హత రౌండ్‌లో సుమిత్ నాగల్ రెండో మ్యాచ్‌లో ఓటమి పాలయ్యాడు. కానీ ప్రధాన డ్రా నుంచి ఎవరు తప్పుకున్నా.. అర్హత టోర్నీలో పోటీపడిన మెరుగైన ర్యాంకర్‌కు అవకాశం దక్కుతుంది. నిబంధనల ప్రకారం మెరుగైన ర్యాంక్ (101) కలిగిన సుమిత్ నాగల్.. నాదల్ స్థానంలో పోటీపడనున్నాడు. మెన్స్ సింగిల్స్ తొలి రౌండ్లో 2016 వింబుల్డన్ ఫైనలిస్ట్ మిలోస్ రావోనిక్ (కెనడా)తో నాగల్ తలపడనున్నాడు.

క్వార్టర్స్‌లో సింధు


• ఫ్రెంచ్ ఓపెన్ 2024



పారిస్ : తెలుగు తేజం పి.వి సింధు క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించింది. ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్‌లో ఫామ్ అందుకున్న సింధు.. అదే జోరు ఫ్రెంచ్ ఓపెన్‌లో కొనసాగిస్తుంది. మహిళల సింగిల్స్ విభాగంలో పి.వి సింధు మూడు గేముల మ్యాచ్‌లో విజయం సాధించి క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకుంది. అమెరికా షట్లర్ బీవెన్ జాంగ్‌పై 13-21, 21-10, 21-14తో సింధు మెరుపు విజయం సాధించింది. తొలి గేమ్‌లో నిరాశపరిచిన సింధు.. తర్వాత వరుసగా రెండు గేముల్లో దుమ్మురేపింది. ఏకపక్షంగా చివరి రెండు గేముల్లో గెలుపొంది క్వార్టర్‌ఫైనల్లో కాలుమోపింది. 55 నిమిషాల మ్యాచ్‌లో సింధు సాధికారిక ప్రదర్శన చేసింది. పురుషుల సింగిల్స్‌లో మాజీ వరల్డ్ నం.1 కిదాంబి శ్రీకాంత్‌కు నిరాశే ఎదురైంది. 2-19, 12-21, 20-22తో వరల్డ్ నం.17 చైనీస్ తైపీ షట్లర్ చో చెన్ చేతిలో పోరాడి ఓడాడు. తొలి గేమ్ నెగ్గిన శ్రీకాంత్, రెండో గేమ్‌లో నిరాశపరిచాడు. నిర్ణయాత్మక మూడో గేమ్‌ను టైబ్రేకర్‌లో చేజార్చుకుని ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ 750 నుంచి నిష్క్రమించాడు.

కాలం కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు

- మేడిగడ్డ బ్యారేజీకి సత్వరమే మరమ్మతులు చేయాలి
- లోవోల్టేజీతో కాలుతున్న మోటార్లు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్



నవతెలంగాణ - కరీంనగర్

తెలంగాణలో కరువు ప్రస్తుతం కాలంతో వచ్చింది కాదు.. అధికార కాంగ్రెస్ పార్టీ తెచ్చిందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఈనెల 12న కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ఆర్ మైదానంలో నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభ సన్నాహక సమావేశం నగరంలోని ప్రతిమ మల్టీప్లెక్స్‌లో గురువారం నిర్వహించారు. అనంతరం ఆయన కరీంనగర్ రూరల్ మండలంలోని ఇరుకుల్లా గ్రామంలో ఎండిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రైతాంగ అభివృద్ధి కోసం పదేండ్లపాటు అవిశ్రాంతంగా పనిచేసిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కృషిని నీరుగార్చే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన చెప్పేవన్నీ పచ్చి అబద్ధాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ఏడేండ్ల కాలంలో ఏనాడూ తెలంగాణలో కరువు రాలేదని గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో బీఆర్ఎస్ ప్రభుత్వానికి వచ్చిన మైలేజీని చెరిపేసేందుకే మేడిగడ్డ బ్యారేజీని మరమ్మతు చేయడం లేదని ఆరోపించారు. తమ పార్టీ మీద ఉన్న కోపాన్ని రైతులపై రుద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించడం సరికాదన్నారు. వెంటనే ప్రభుత్వం మేడిగడ్డ బ్యారేజీలో కాపర్ డ్యాం నిర్మించి.. ఒక పంపుతోని అయినా, నీళ్ల తోడి పొలాలకు అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఎండిపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని, ఈ సీజన్లో కొనుగోలు చేసే వడ్లకు 500 చొప్పున బోనస్ ఇచ్చేందుకు వెంటనే జీవో విడుదల చేయాలన్నారు. చాలామంది రైతులకు నేటి వరకు రైతుబంధు రాలేదని, పంట సాగు కోసం రైతులు తిరిగి వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారని వాపోయారు. లోవోల్టేజి కరెంట్ ఇవ్వడం వల్ల మోటార్లు కాలిపోతుండటంతో చిన్న సన్నకారు రైతులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ఎస్సారెస్పీ నుంచి నీళ్ల ఇచ్చే అవకాశం ఉన్నా.. కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తోందని విమర్శించారు. 24 గంటల ఉచిత విద్యుత్ ఎక్కడా రావడం లేదని, రైతు సమస్యలు పట్టించుకోకుంటే ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. అలాగే మహబూబ్‌నగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించారు. 'గొంతుకోస్తా.. మానవబాంబై పేలుతా అంటున్నారు.. ఆయన పక్కనే మానవబాంబులు ఉన్నాయి.. అవే ఆయన్ని కూల్చుతాయి' అని అన్నారు. రేవంత్‌ను ఖమ్మం, నల్లగొండ బాంబులే ఏమైనా చేయొచ్చని, బీఆర్ఎస్ నుంచి ఆయనకు ఎలాంటి ప్రమాదం ఉండదని చెప్పారు. ఐదేండ్ల పాలన చూసాకే.. ఎవరు గొప్పవాళ్లో ప్రజలకు తెలుస్తుందన్నారు. కరీంనగర్ అభివృద్ధిపై మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ప్రస్తుత ఎంపీ బండి సంజయ్ ఎవరు ఏం చేశారో చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణరావు, మెండి చంద్రశేఖర్, నాయకులు చల్లా హరిశంకర్, ఏనుగు రవీందర్‌రెడ్డి, సంపత్‌రావు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఏది?

- స్త్రీ,పురుషుల జీతాల్లో భారీ వ్యత్యాసాలు యాజమాన్యాలతో చర్చించడంలోనూ సమస్యలే
- పని ప్రదేశాల్లో లింగ వివక్ష : మహిళా ఉద్యోగులపై క్రిసిల్, డీబీఎస్ బ్యాంక్ ఇండియా సర్వే



'సమాన పనికి సమాన వేతనం' అనే సిద్ధాంతం మహిళలకు వర్తించడం లేదు. పురుషులతో సమానంగా వారు విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ జీతాలు మాత్రం తక్కువగానే ఉంటున్నాయి. ఉద్యోగాలు చేస్తున్న మహిళల్లో 23 శాతం మంది ఇలా తక్కువ జీతాలతో సరిపెట్టుకుంటున్నారు. 16 శాతం మంది మహిళా ఉద్యోగులు వివక్షను ఎదుర్కొంటున్నారు. రేటింగ్ సంస్థ క్రిసిల్, డీబీఎస్ బ్యాంక్ ఇండియా నిర్వహించిన సర్వేలో వెల్లడైంది.

న్యూఢిల్లీ : సర్వే ప్రకారం మహిళా ఉద్యోగులు భిన్నమైన వాతావరణంలో జీవితాలను గడుపుతున్నారు. ఇందులో 69 శాతం మహిళా ఉద్యోగులు ప్రధానంగా మెరుగైన జీతాన్ని, కెరీర్‌లో ఉన్నతిని కోరుకుంటున్నారు. స్వయం ఉపాధి పొందుతున్న మహిళల్లో 42 శాతం మంది స్వతంత్రతకు, అనుకూలమైన పనిగంటలకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

ఆసక్తికరమైన విషయమేమంటే కేంద్ర కార్యాలయాల్లో కాకుండా బ్రాంచీలలో పనిచేయడానికి మహిళా ఉద్యోగులు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వడం లేదు. కేవలం 3 శాతం మంది మాత్రమే బ్రాంచి కార్యాలయాల్లో పనిని కోరుకుంటున్నారు. ఇక స్వయం ఉపాధి పొందుతున్న మహిళల విషయానికి వస్తే సంపదను పెంచుకోవడం, వ్యాపారంలో పురోభివృద్ధి సాధించడంపై ఆసక్తిని కనబరుస్తున్నారు. దేశంలోని పది నగరాల్లో పనిచేస్తున్న 800 మంది మహిళా ఉద్యోగులు, స్వయం ఉపాధి పొందుతున్న వారిని ఇంటర్వ్యూ చేసి ఈ సర్వేను రూపొందించారు.

వేతనాలలో తేడాలు

పురుష, మహిళా ఉద్యోగుల మధ్య వేతన వ్యత్యాసం ఎక్కువగానే ఉంది. రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకూ వార్షిక వేతనం తీసుకుంటున్న పురుష, మహిళా ఉద్యోగుల మధ్య వేతన వ్యత్యాసం 18 శాతం ఉంటోంది. అదే రూ.41 లక్షల నుండి రూ.55 లక్షల వరకూ వార్షిక వేతనం తీసుకుంటున్న వారి మధ్య వేతన వ్యత్యాసం 30 శాతంగా ఉంది. పని ప్రదేశంలో కూడా లింగ వివక్ష కన్పిస్తోంది. రూ.41-55 లక్షల మధ్య వార్షిక వేతనం తీసుకుంటున్న మహిళా ఉద్యోగుల్లో 30 శాతం మంది వరకూ తాము లింగ వివక్షను ఎదుర్కొన్నామని తెలిపారు. రూ.10-25 లక్షల వార్షిక వేతనం అందుకుంటున్న మహిళా ఉద్యోగుల్లో మాత్రం 12 శాతం మంది మాత్రమే ఈ రకమైన వివక్షకు గురవుతున్నారు.

'జీతాల' సమస్యలు

మెట్రో నగరాల్లో పనిచేస్తున్న 42 శాతం మహిళా ఉద్యోగులు తమ యాజమాన్యాలతో జీతాల గురించి చర్చించే సమయంలో సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తోంది. అయితే తూర్పు, పశ్చిమ ప్రాంతాల్లో వారి అనుభవాలు భిన్నంగా ఉన్నాయి. కొల్‌కతాలో పనిచేస్తున్న 96 శాతం మహిళా ఉద్యోగులు జీతాలపై చర్చించే సమయంలో ఎలాంటి సమస్యలు ఎదుర్కోవడం లేదు. అహ్మదాబాద్‌లో మాత్రం 33 శాతం మందికి సమస్య ఎదురవుతోంది. చెన్నైలో 77 శాతం మందికి, హైదరాబాద్‌లో 41 శాతం మందికి సవాళ్లు తప్పడం లేదు.

ఆరోగ్యానికి ప్రాధాన్యత


ఇక మహిళలకు పని ప్రదేశంలో తగినంత విశ్రాంతిని కల్పించే విధానాలపై పూనేలో 35 శాతం మంది ఉద్యోగులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయంలో జాతీయ సగటు 5 శాతంగా నమోదైంది. మెట్రో నగరాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు బిజీ షెడ్యూల్ మధ్య కూడా ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

గత సంవత్సరం 66 శాతం మంది మహిళా ఉద్యోగులు సమగ్ర ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.

ఖర్చు ఎక్కువే

మహిళా ఉద్యోగుల్లో కేవలం 32% మంది మాత్రమే వారానికి ఒకసారి బయటికి భోజనానికి వెళుతున్నారు. లేదా ఆహారాన్ని ఆర్డర్ చేస్తున్నారు. మహిళా ఉద్యోగుల్లో 24 శాతం మంది రోజుకు నాలుగు గంటలకు పైగా పాటు ఆఫీసు పనికి దూరంగా ఉంటున్నారు. వివాహిత ఉద్యోగుల్లో 32 శాతం మంది గత సంవత్సరం 3-5 సార్లు విశ్రాంతి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లారు. అవివాహిత మహిళలతో పోలిస్తే ఇది రెట్టింపుగా ఉంది. సర్వేలో పాల్గొన్న మహిళల్లో దాదాపు సగం మంది (47 శాతం) తమ ఆదాయంలో 70 శాతానికి పైగా ఖర్చు చేస్తున్నారు. వీరిలో 39 శాతం మంది విహార యాత్రలు, షాపింగ్ కోసం తమ వద్ద ఉన్న క్రెడిట్ కార్డులను ఉపయోగిస్తున్నారు. ఈ విషయంలో పాన్-ఇండియా సగటు 33 శాతంగా ఉంది.

మాజీ మంత్రి మల్లారెడ్డి అల్లుడి అక్రమ నిర్మాణాల కూల్చివేత



నవతెలంగాణ-దుండిగల్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో మాజీ మంత్రి మల్లారెడ్డి ప్రభుత్వ స్థలంలో వేసిన రోడ్డును తొలగించిన అధికారులు.. తాజాగా ఆయన అల్లుని కాలేజీకి సంబంధించిన అక్రమ నిర్మాణాలనూ కూల్చేశారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, మర్రి లక్ష్మణ్‌రెడ్డికి సంబంధించిన ఎంఎల్ఆర్ఐటీ ఇంజినీరింగ్, ఏరోనాటికల్ కళాశాలల్లో అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులు తొలగించారు. కొద్ది రోజుల కిందటే కలెక్టర్ కలెక్టర్ నేతృత్వంలో అధికారులతో కలిసి పర్యటించి 405, 482, 484, 488, 592 సర్వే నెంబర్‌లలో పూర్తిగా 8 ఎకరాలలో కబ్జా చేసి కాలేజీ నిర్మాణాలు జరిగినట్టు గుర్తించారు. దాంతో గురువారం ఉదయం జేసీబీతో అధికారులు కూల్చివేతలు చేపట్టారు. అయితే అధికారులు కూల్చి వేస్తుండగా విద్యార్థులు అడ్డుగా రాగా.. పోలీసులు వారిని అక్కడి నుంచి పంపించారు. ఒకానొక సమయంలో కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యేలు కె.పి వివేకానంద, మాధవరం కృష్ణారావు, శంబీపూర్ రాజు, బండారి లక్ష్మారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం పాలనను విస్మరించి ప్రతిపక్షాల ఆస్తులను కూల్చివేయడం పనిగా పెట్టుకోవడం అమానుషమన్నారు. ఇది ముమ్మాటికీ కక్ష సాధింపేనని.. కూల్చివేతలను ఖండిస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ ప్రజలు గమనించాలని, హామీలను నెరవేర్చలేక ప్రజల దృష్టి మరల్చడానికే ఈ కూల్చివేతలు జరుపుతున్నారన్నారు.

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాము 25 సంవత్సరాలుగా కళాశాలలను నడుపుతున్నామని, మొత్తం 55 ఎకరాల స్థలంలో 40 ఎకరాలు పట్టా భూమి ఉందని తెలిపారు. 15 ఎకరాల భూమికి సంబంధించి ఆనాటి గ్రామపంచాయతీ హయాం నుంచి ఉందన్నారు. ఆ స్థలానికి ప్రతి సంవత్సరం లక్షల్లో పన్ను కడుతున్నామని, ఆ స్థలంపై ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు చేసి ఉన్నాయని తెలిపారు. కోర్టు పరిధిలో ఉన్న ఈ వివాదానికి సంబంధించి జడ్జి సైతం సోమవారం వరకు వేచి ఉండాలని అధికారులను ఆదేశించినప్పటికీ, కక్ష సాధింపు చర్యల్లో భాగంగా కూల్చివేతలు చేస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్‌ను కలిసే లోపల మరింత సిబ్బంది, బలగాన్ని పెంచి భవనం కూల్చి వేతలు చేపట్టారన్నారు. కూల్చివేతల్లో మున్సిపల్ కమిషనర్ కె.సత్యనారాయణ, డీఈ శ్రీనివాస్, అధికారి సాయిబాబా, దుండిగల్ సీఐ శంకరయ్య ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మోడీకి సెగ

(మొదటిపేజీ తరువాయి)

శాంతియుత మార్గంలో నేనూ నడవాలని అనుకుంటున్నాను. నాకు నేనే బాధ పడతాను. ఎవరినీ బాధ పెట్టను' అని బుధవారం లెహ్‌లో జరిగిన భారీ ర్యాలీని ఉద్దేశించి ప్రసంగిస్తూ వాంగ్‌చుక్ చెప్పారు. ఈ దీక్షలో మరి కొంతమంది భాగస్వాములవుతారని కాంగ్రెస్ నేత నామ్‌గియాల్ తెలిపారు. లఢక్‌లో రాజ్యాంగంలోని ఆరో షెడ్యులును అమలు చేసి, రాష్ట్ర హోదా కల్పించాలన్న తమ డిమాండ్‌ను కేంద్రం తిరస్కరించిందని ఆయన చెప్పారు. లఢక్‌లో ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళన ప్రారంభించాలని వారు నిర్ణయించారని అన్నారు. తమ డిమాండ్‌ను రాష్ట్రంలో పర్యటిస్తున్న ప్రధాని దృష్టికి తెచ్చేందుకు ప్రజలు భారీ ప్రదర్శన చేపట్టారు. మరోవైపు లెహ్ అపెక్స్ బాడీ (ల్యాబ్), కార్గిల్ డెమొక్రటిక్ అలయన్స్ (కేడీఏ)తో చర్చలు కొనసాగుతున్నాయని కేంద్రం తెలిపింది. అయితే చర్చల్లో ప్రతిష్టంభన కొనసాగుతోందని ల్యాబ్ కో-చైర్మన్ లక్రుక్ చెప్పారు.

తెలంగాణ కాలుష్య నియంత్రణ బోర్డు ఏర్పాటు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి బోర్డును ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్ పర్సన్‌గా, పీసీబీ సభ్య కార్యదర్శి కన్వీనర్‌గా 15 మంది సభ్యులతో బోర్డును ఏర్పాటు చేశారు. స్థానిక సంస్థల నుంచి మేడ్చల్ జిల్లా పరిషద్ చైర్మెన్ శరత్ చంద్రారెడ్డి, నిజామాబాద్ కార్పొరేటర్ మహ్మద్ హరూన్, నాగర్ కర్నూలు జెడ్పీ చైర్మెన్ బాలాజి సింగ్‌లను సభ్యులుగా నియమించింది. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య ఛాంబర్ల సమాఖ్య అధ్యక్షులు మీలా జయదేవ్, జేఎన్టీయూ ప్రొఫెసర్ విజయలక్ష్మి, భారత రైతు సంఘాల కన్సార్టియం అధ్యక్షులు చింపు సత్యనారాయణ రెడ్డి సభ్యులుగా ఉంటారు.

నవతెలంగాణ
హైదరాబాద్
శుక్రవారం మార్చి 8, 2024 www.navatelangana.com

రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్‌గా దీపక్ జాన్ బాధ్యతలు



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్‌గా దీపక్ జాన్ బాధ్యతలు స్వీకరించారు. గురువారం నాంపల్లి గృహకల్పలోని జరిగిన కార్యక్రమంలో బిస్సప్, ఫాదర్స్, పలు వురు క్రిస్టియన్ సంఘాల, కాంగ్రెస్ నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ... ఓ సామాన్య కుటుంబం నుంచి వచ్చి ఎలాంటి రాజకీయ వారసత్వం లేని తనను గుర్తించి ఈ బాధ్యత ఇచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి జాన్ కృతజ్ఞతలు తెలిపారు. క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమ అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం లో పని చేస్తానని తెలిపారు. త్వరలోనే రాష్ట్రమంత పర్యటించి క్రైస్తవులందరని ఏకం చేస్తామని వెల్లడించారు.

జవహర్ నగర్ కమ్యూనిటీ హాల్ అభివృద్ధి చేయాలి

- గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్
- జోనల్ కమిషనర్ రవి కిరణ్‌కు వినతి



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గంలోని గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో మెరుగైన సదుపాయాలతో అభివృద్ధి చేయాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ తెలి పారు. జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవి కిరణ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్‌లో కరెంట్ వైరింగ్,మరుగు దొడ్ల క్రమబద్ధీకరణ, లైట్లు వంటి పలు రకాల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి అనుమతులు జారీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ పాల్గొన్నారు.

నగరంలో సీఎం పర్యటన

- ఆర్మీ డెంటల్ కాలేజీ స్నాతకోత్సవానికి హాజరు
- ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి శంకుస్థాపన
- బాబు జగ్జీవన్ రామ్ భవన్ ప్రారంభం





నవతెలంగాణ-సిటీబ్యూరో

సీఎం రేవంత్‌రెడ్డి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గురువారం పర్యటించారు. ముందుగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా జవహర్‌నగర్‌లోని ఆర్మీ కాలేజ్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ స్నాతకోత్సవంలో పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం సికింద్రాబాద్ అల్వాల్ టిమ్స్ సమీపంలో హైదరాబాద్-రామగుండం రాజీవ్ రహదారిపై భారీ ఎలివేటెడ్ కారిడార్ (ఎస్‌హెచ్01) నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 11.3 కిలో మీటర్ల పొడవు, ఆరు లేన్ల వెడల్పుతో ఈ కారిడార్ రూపుదిద్దుకుంటోంది. ఈ సందర్భంగా గత రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్రానికి మధ్య గల వైరం గురించి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు కురిపించారు. హైదరాబాద్ నగర అభివృద్ధి మరిచారనీ, గతంలో తాము చేసిన అభివృద్ధే నేటికీ కన్పిస్తుందని చెప్పారు. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సఖ్యత లేకపోవడంతోనే రాష్ట్రంలో కొన్ని పనులు పెండింగ్‌లోనే ఉన్నాయనీ, ఇప్పుడు తాము అధికారంలోకి రావడంతో ఒక్కొక్కటిగా పూర్తి చేసేలా కృషి చేస్తున్నామని చెప్పారు. బంజారాహిల్స్‌లోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌ను ప్రారంభించిన అనంతరం సీఎం మాట్లాడారు.

ఎలివేటెడ్ కారిడార్ వివరాలు ఇలా..

కారిడార్ మార్గం..

1.ప్యారడైజ్ జంక్షన్-వెస్ట్ మారేడ్‌పల్లి - కార్ఖానా - తిరుమలగిరి - బొల్లారం -అల్వాల్ - హకీంపేట్ - తూంకుంట - ఓఆర్ఆర్ జంక్షన్ (శామీర్‌పేట్)

2.మొత్తం కారిడార్ పొడవు : 18.10 కిలో మీటర్లు

3. ఎలివేటెడ్ కారిడార్ పొడవు : 11.12 కిలో మీటర్లు

4. అండర్‌గ్రౌండ్ టన్నెల్ : 0.3 కిలో మీటర్లు

5. పియర్స్ : 287

6. అవసరమైన భూమి : 197.20 ఎకరాలు

7. రక్షణ శాఖ భూమి : 113.48 ఎకరాలు

8. ప్రయివేటు ల్యాండ్ : 83.72 ఎకరాలు

9. ప్రాజెక్టు వ్యయం : రూ.2,232 కోట్లు

ప్రాజెక్టుతో ప్రయోజనాలు..

1. రాజీవ్ రహదారి మార్గంలో సికింద్రాబాద్‌తో పాటు కరీంనగర్ వైపు ట్రాఫిక్ కష్టాలకు చెల్లు

2. కరీంనగర్ వైపు మెరుగైన ప్రయాణ సదుపాయం

3. ఇంధనం మిగులుతో వాహనదారులకు



తగ్గనున్న వ్యయం

4. నగరం నుంచి ట్రాఫిక్ ఆటంకాల్లేకుండా ఓఆర్ఆర్ వరకు చేరుకునే అవకాశం

సమాజ సేవలో రోటరీ క్లబ్ కృషి అభినందనీయం

- పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



నవతెలంగాణ-మెహిదీపట్నం

సమాజ సేవలో రోటరీ క్లబ్ కృషి అభినందనీయమని మంత్రి సీతక్క అన్నారు. రెడ్ హిల్స్ నీలోఫర్ ఆసుపత్రిలో రోటరీ క్లబ్ సహకారంతో అభివృద్ధి చేసిన నవజాత శిశువు ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీలోఫర్ ఆసుపత్రిలో నవజాత శిశువుల ఇంటెన్సీ కేర్ యూనిట్‌ను అభివృద్ధి చేయడానికి రోటరీ క్లబ్ ముందుకు రావడం చాలా అభినందనీయమన్నారు. సమాజ సేవకు తోడ్పడే స్వచ్ఛంద సంస్థలను మనం ఎప్పుడు గౌరవించాలని ఆమె స్పష్టం చేశారు. రోటరీ క్లబ్ చేపట్టే సహాయ కార్యక్రమాలలో తమ పూర్తి సహకారం ఉంటుందని ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో కార్య క్రమంలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ వాణి, రోటరీ క్లబ్ ప్రతినిధులు శంకర్ రెడ్డి, శరత్ చౌదరి, ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ ఉషారాణి, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

- సీఐటీయు నగర అధ్యక్షులు కుమారస్వామి



నవతెలంగాణ-అంబర్‌పేట:

మహిళల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుదని సీఐటీయు నగర అధ్యక్షులు కుమారస్వామి అన్నారు. గురువారం బతుకమ్మ కుంట లేబర్ అడ్డాపై అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని అంబర్‌పేట నియోజకవర్గంలోని భవన నిర్మాణ కార్మికుల లేబర్ అడ్డ బతుక మ్మ కుంటలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయు నగర అధ్యక్షులు జే.కుమార్ స్వామి హాజరై మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని మహిళా సమస్యలపై ప్రభుత్వాలు దృష్టి సారించడం లేదని వారి హక్కులకు భంగం కలిగే విధంగా ప్రభుత్వాలు పాలకులు వ్యవహరిస్తున్నారని విమర్శిం చారు. 1908లో న్యూయార్క్ నగరంలో వేలాది మంది మహిళలు తమ హక్కుల కోసం అనేక పోరాటా లు చేసి తమ హక్కులను సాధించుకు న్నారని, కానీ ప్రభుత్వాలు పాలకులు మహిళలను వంటింటి కే పరిమితం చేస్తూ ద్వితీయ శ్రేణి పౌరులుగానే చూస్తున్నారని మహిళలు పురుష లతో సమానంగా అనేక రంగాల లో పని చేస్తూ రానిస్తునారని, అయినా చిన్న చూపు చూస్తున్నా రని, భవనిర్మాణ కార్మికుల అడ్డా లపై మహిళలకు కనీస సౌక ర్యాలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని కనీస అంతర్జాతీ య మహిళా దినోత్సవం సందర్భంగా అడ్డాలపై మంచినీటి సౌకర్యం మూత్ర శాలలు, షెడ్లు ఏర్పాటు చేయా లని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో సీఐటీయు అంబర్‌పేట జోన్ కన్వీనర్ జి.రాములు కెవి పీఎస్ జిల్లా కార్యదర్శి బి.సుబ్బారావు అడ్డా నాయకులు వీర్య, తిరుపతి, మహిళా నాయకులు కాంతి వీరమ్మ ,రాణి, రమ తదితరులు పాల్గొన్నారు.

చేతి పంపునకు మరమ్మతులు..



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

గోషామహల్ ఎమ్మెల్యే టి. రాజా సింగ్, జాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ ఆదేశాలతో ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నామని. జాంబాగ్ డివిజన్ జనరల్ సెక్రెటరీ కె.రామకృష్ణ (కట్టప్ప) తెలిపారు. గురువారం జాంబాగ్ డివిజన్‌లోనీ బాలాజీ మందిర్, సిక్ గల్లి ప్రాంతాల్లో చేతిపంపు (బోర్వెల్) మరమతు పనులను వేసే కాలంలో ప్రజల దాహాన్ని తీర్చేందుకు కృషి చేస్తు న్నామన్నారు. ఈ కార్యక్రమంలో అనిల్ యాదవ్, అక్షయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సిటీ కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగం జాతీయ సదస్సు



నవతెలంగాణ - ధూల్ పేట్

ప్రభుత్వ సిటీ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం సిఎస్ ఐఆర్, ఢిల్లీ సౌజన్యంతో 2024 ఏప్రిల్ 3,4 తేదీలలో రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నదని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బాలభాస్కర్ తెలిపారు. 'ఎనర్జీ మెటీరియల్స్, పరికరాలలో పురోగతి' అనే అంశంపై నిర్వహిస్తున్న సదస్సు బ్రోచర్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్బన్ ఉద్గారాలను తగ్గించడం, సుస్థిర జీవనం కోసం కొత్త పదార్థాలను సృష్టించడం చాలా కీలకమన్నారు. పర్యావరణ హితమైన పదార్థాలు అవసరమని, ఈ విషయమై ఈ సదస్సులో లోతైన చర్చలు జరుగుతాయన్నారు. డాక్టర్.నైన వినోదిని చైర్మన్ గా, డాక్టర్.కె.పర్వతాలు సమన్వయకర్తగా నిర్వహిస్తున్న ఈ సదస్సులో సిఎస్ ఐఆర్ నుండి ముగ్గురు శాస్త్రవేత్తలు ప్రధాన వక్తలుగా పాల్గొంటారని తెలిపారు. దేశవిదేశాల శాస్త్రవేత్తలు, వివిధ విశ్వవిద్యాలయాల, కళాశాల ఆచార్యులు, పరిశోధక విద్యార్థుల నుండి పత్రాలను ఆహ్వానిస్తున్నామన్నారు. డిగ్రీ, పిజి విద్యార్థులు పోస్టర్ ప్రెజెంటేషన్‌లో పాల్గొనవచ్చన్నారు. సదస్సు కరపత్రం ఆవిష్కరణలో డాక్టర్.వాసుదేవరెడ్డి, డాక్టర్.నీరజ, డాక్టర్. చిన్నికృష్ణ, డాక్టర్.లక్ష్మీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి నుంచి 11 వరకు శ్రీలక్ష్మీనరసింహస్వామి అఖండ జ్యోతియాత్ర



నవతెలంగాణ-అంబర్‌పేట:

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు శ్రీలక్ష్మీనరసింహస్వామి 30వ అఖండ జ్యోతియాత్ర నిర్వహిస్తున్నట్లు అఖండ జ్యోతియాత్ర కమిటీ చైర్మెన్ సద్ది వెంకటరెడ్డి, ఉపాధ్యకులు దుగ్యాల పవన్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి పడాల శ్రీకాంత్, అసిస్టెంట్ కార్యదర్శి ఎస్.పి.ఉపేంద్రరావులు తెలిపారు. నగరంలోని బర్కత్‌పూర యాదాద్రి భవనం నుంచి శనివారం ఉదయం 10.30 గంటలకు ఈ అఖండ జ్యోతి యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. నారాయణగూడ, ఆర్టీసీ క్రాస్‌రోడ్డు , ముషీరాబాద్, తార్నాక, ఉప్పల్, ఘట్కేసర్, భువనగిరి మీదుగా ఈ నెల 11న యాదాద్రి చేరుకుంటుందన్నారు. అఖండ జ్యోతిని యాదాద్రి దేవాలయ అధికారులకు అప్పగిస్తామని వారన్నారు. ఈ అఖండ జ్యోతియాత్రను కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, బీర్ల ఐలయ్య, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, యాదాద్రి దర్మకర్త బి. నర్సింహమూర్తి, ఈవో ఎం.రామకృష్ణరావులు ప్రారంభిస్తారని వారు తెలిపారు.

మెస్‌చార్జీలు, స్కాలర్ షిప్‌లను పెంచాలని

సంక్షేమ భవన్ ముట్టడి

- వందలాది మంది విద్యార్థులతో వంటావార్పు



నవతెలంగాణ-మెహిదీపట్నం

పెరిగిన ధరల ప్రకారం బీసీ,ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల మెస్‌చార్జీలను, స్కాలర్ షిప్‌లను పెంచాలని బీసీ విద్యార్థి సంఘం నాయకులు వేముల రామకృష్ణ నాయకత్వంలో వందలాది విద్యార్థులు మాసబ్ ట్యాంక్ లోని తెలుగు సంక్షేమ భవన్‌ను ముట్టడించి అక్కడే వంటావార్పు నిర్వహించారు. హాస్టల్ కి వచ్చి మా బాధలు చూడండి. మా బ్రతుకులు బాగుపరచండి. మా భోజనం తినండి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ధర్నాకు హాజరైన రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఆరు సంవత్సరాల క్రితం ఆనాటి ధరల ప్రకారం నిర్ణయించిన మెస్‌చార్జీలు, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం నేటికీ కొనసాగించడం దురదృష్టకరమన్నారు. ఇటీవల కాలంలో అన్ని నిత్యవసర వస్తువుల ధరలు మూడు రేట్లు పెరిగాయని కానీ ప్రభుత్వం పాత మెస్ చార్జీలే ఇవ్వడంతో హాస్టల్, గురుకుల పాఠశాల విద్యార్థులకు నాసిరకం ఆహారం పెడుతున్నారన్నారు. బయట హెూటల్లో ఒకపూట భోజనం రూ.60లు ఉంటే హాస్టల్ విద్యార్థుల కు రూ.10 ఎలా సరిపోతుందని ఆయన ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు ప్రభుత్వం పూర్తి ఫీజులు మంజూరు చేస్తూ బీసీ విద్యార్థుల పట్ల వివక్షత చూపడం శోచనీయమన్నారు. ఇతర కులాల విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్మెంట్ ఇస్తూ బీసీ విద్యార్థుల పట్ల ప్రభుత్వం తీవ్ర వివక్షత చూపుతుందని ఆయన ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని విద్యార్థుల మెస్‌చార్జీలను, స్కాలర్షిప్లను పెంచాలని అలాగే ఇంజనీరింగ్ పీజీ తదితర కోర్సులు చదివే బిసి విద్యార్థుల పూర్తి ఫీజు ప్రభుత్వమే భరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీసీ సంక్షేమ సంఘం నాయకత్వంలో ప్రభుత్వంపై పోరాటం తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ ధర్నాలో బీసీ నాయకులు నీల వెంకటేష్, గుజ్జ కృష్ణ, కృష్ణ యాదవ్, నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

భాషా పండితుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-ధూల్‌పేట్

తెలంగాణ రాష్ట్రంలోని తెలుగు, హిందీ, ఉర్దూ, మరాఠీ భాష పండితుల ఆత్మీయ సభను మార్చి 10న ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లోని ప్రకాశం హాల్‌లో నిర్వహించనున్నట్లు భాష పండితుల ఆత్మీయ సభ కన్వీనర్ వివేక్ భవాని, కో కన్వీనర్ డాక్టర్.ఎస్. విజయ భాస్కర్ తెలిపారు. ఈ పండితుల ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, మంత్రి సీతక్క, పొన్నం ప్రభాకర్ విశిష్ట అతిథులుగా మల్లు రవి, కోదండరాం ఆత్మీయ అతిథులుగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి గాల్ రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొనను న్నారనీ తెలిపారు. పీ.ఆర్.టీ.యు తెలంగాణ అధ్యక్ష, కార్యదర్శులు ఉమాకర్ రెడ్డి, పర్వతి సత్యనారాయణ, ఆర్.యు.పీ.పీ.తెలంగాణ అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్లా, కాంతి కృష్ణ, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్.ఎస్.విజయ భాస్కర్ తదితరులు పాల్గొననున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని భాషోపాధ్యాయులు సంఘాల కతీతంగా పెద్ద యెత్తున పాల్గొని జయప్రదం చేయాలని వివేక్ భవాని, విజయ భాస్కర్ లు కోరారు. రాష్ట్రంలోని భాష పండితుల బలాన్ని, బలగాన్ని నాయకులకు, అధికారులకు తెలియజేయడానికి ఈ ఆత్మీయ సమ్మేళనం ఎంతో తోడ్పడుతుందని పేర్కొన్నారు.

'నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా'



నవతెలంగాణ-అంబర్‌పేట

అంబర్‌పేట నియోజక వర్గాన్ని ఆదర్శ వంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపడుతు న్నామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. రాజకీ యాలకతీతంగా అభివృద్ధిలో అన్ని డివిజన్‌ల లోని బస్తీలు, కాలనీలకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే బడ్జెట్ ద్వారా మంజూ రైన నిధులతో అన్ని డివిజన్‌ల పరిధిలోనూ నూతన సీవరేజీ, డ్రైనేజీ పైప్ లతో పాటు సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతు న్నామని వివరించారు. న్యూ పటేల్ నగర్‌లో సుమారుగా రూ.6 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా వేయనున్న సీసీ రోడ్డు పనులకు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, అంబర్‌పేట కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమంలో సం బంధిత అధికా రులు డిఈ మజీద్, వర్క్ ఇన్ స్పెక్టర్ రమేష్, పాషా, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్, సీనియర్ నాయకులు లవంగు ఆంజనేయులు, మల్లేష్ యాదవ్, శ్రీనివాస్ గుప్తా, జాకీ బాబు, మహేష్ ముది రాజ్, మల్లికార్జున యాదవ్, ప్రధాన కార్యదర్శి జాఫర్ నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



- కోఠిలోని డైరెక్టర్ కార్యాలయం ముందు ధర్నా
- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎం.నరసింహ డిమాండ్


నవతెలంగాణ-సుల్తాన్ బజార్

నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో రాష్ట్రవ్యాప్తంగా పనిచేయుచున్న దాదాపు 17వేల మంది కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మూడు నెలలుగా జీతాలు లేక అనేక ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారని, కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధుల్ని తీసుకువచ్చి వెంటనే ఉద్యోగుల జీతాలు చెల్లించాలని ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయుసీ) రాష్ట్ర అధ్యక్షులు ఎం.నరసింహ డిమాండ్ చేశారు.

గురువారం కోఠిలోని ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్ కార్యాలయం ముందు ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫీల్డ్ లెవల్‌లో ప్రజలకు సేవలు అందిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు మంచి పేరు తీసుకొస్తూ విధులు నిర్వహిసున్నటువంటి కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మూడు నెల లుగా జీతాలు లేకపోవడంతో అనేక ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారని, తిండికి పిల్లల ఫీజులకు డబ్బులు లేక ఉద్యోగుల కష్టాలు వర్ణనాతీతమని వారు ఈ సందర్భంగా తెలియజేశారు. జీతాలు చెల్లించని పక్షంలో మరొక మారు సమ్మె నోటీసు ఇచ్చి పూర్తిగా విధులను బహి ష్కరించి ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్ కార్యాల యం ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్ వినపత్రం అందజేశారు. ఈ విషయంపై ఉదయం నుంచి కేంద్ర ప్రభుత్వ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడడం జరిగిందని తొందరలోనే కార్మికులకు జీతాలు అందే విధంగా తగు చర్యలు తీసుకుంటామని వారు ప్రతినిధి బంధానికి హామీ ఇచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా నాయకులు రామస్వామి జైపాల్ రెడ్డి సెకండ్ ఏఎన్ఎం యూనియన్ రాష్ట్ర కోశాధికారి జి పద్మ, ఎన్ హెచ్ ఎం యూనియన్ నాయకులు బాల సుబ్రహ్మణ్యం, రెండవ ఏఎన్ఎంల నాయకురాలు సువర్ణ, జయమ్మ, సుజాత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ఉద్యోగుల పోస్టులను బ్యాక్‌లాగ్స్ లేకుండా భర్తీ చేయాలి

ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో ధర్నా



నవతెలంగాణ-ముషీరాబాద్

9వేల 210 గురుకులాల ఉద్యోగుల పోస్టులను బ్యాక్ లాగ్ లేకుండా పూర్తిగా భర్తీ చేయాలని తెలంగాణ గురుకుల అభ్యర్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఇంద్ర పార్క్ ధర్నా చౌక్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఓయూ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు ఎల్లాల దత్తాత్రేయ తెలంగాణ గురుకుల అభ్యరులు మాట్లాడుతూ గురుకుల నియామకాలలో పై స్థాయి నుంచి భర్తీ చేయడంతో గందరగోళం నెలకొందన్నారు. ఒకే వ్యక్తికి నాలుగు ఉద్యోగాలలో అవకాశం వచ్చిన ఒకే ఉద్యోగం కేటాయించాలన్నారు. గత ప్రభుత్వం రద్దు చేసిన రెలింక్విష్మెంట్ ఆప్షన్ కొనసాగించి తదుపరి మెరిట్‌లో ఉన్న అభ్యర్థిని ఎంపిక చేయాలన్నారు. ఒక్క పోస్టు బ్యాక్ లాగ్స్ ఏర్పడకుండా మొత్తం భర్తీ ప్రక్రియ చేపట్టాలి. గత ప్రభుత్వాలు తమను మోసం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. 9210 పోస్టులలో ఒక్క బ్యాక్ లాగ్స్ కూడా లేకుండా భర్తీ ప్రక్రియ చేపట్టి అభ్యర్థులందరికీ న్యా యం జరిగేలా చేసి మన ప్రభుత్వంలో భాగస్వామ్యులుగా టీచర్‌గా పనిచేయాలనే కలను నెరవేర్చాలని కోరారు. కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో తమకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.గురుకులాల ఉద్యోగుల నియామకాలలో సీఎం రేవంత్ రెడ్డి ఒంటెద్దు పోకడను చేపడుతే వారి ఇంటివద్దే ధర్నాను చేపడుతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో పలువురు గురుకుల టీచర్ అభ్యర్థులు పాల్గొన్నారు.

ఆస్తి పన్నుపై 90శాతం వడ్డీ మాఫీ

- ఈ రాయితీని సద్వినియోగించుకోవాలి
- చార్మినార్ జోనల్ కమిషనర్ టీ.వెంకన్న



నవతెలంగాణ-ధూల్‌పేట్

జీహెచ్ఎంసీ ప్రాపర్టీ ట్యాక్స్ బకాయిలపై విధించిన వడ్డీలో 10శాతం చెలిస్తే, 90 శాతం మాఫీ అవుతుందని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ టీ.వెంకన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్తి పన్నుపై 90 శాతం వడ్డీ మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉ త్తర్వులు జారీ చేసిందన్నారు. 2023- 24 ఆర్థిక సంవ త్సరానికి చెందిన 90శాతం వడ్డీ మాఫీ చేస్తున్నట్లు, మిగతా 10 శాతం వడ్డీని వన్ టైమ్ సెటిల్ మెంట్(ఓ టి ఎస్)లో భాగంగా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. జీఓ జారీ కి ముందు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 20 24 మార్చి వరకు వడ్డీ పెనాల్టీలతో సహా మొత్తం ఆస్తి పన్ను బకాయిలు చెల్లించిన పన్ను చెల్లింపుదారులందరికి కూడా ఈ స్కీమ్ వర్తిస్తుందన్నారు. వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చెల్లించిన 90 శాతం వడ్డీ భవిష్యత్తు (తదుపరి)బిల్లులో వారికి సర్దు బాటు చేయడం జరుగుతుందని తెలిపారు.ఆస్తి పన్ను బకాయిలపై విధించిన వడ్డీలో 90 శాతం మాఫీచేస్తూ ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ ఉత్తర్వులు జారీ చేయడంతో రాయితీ తో చెల్లింపులు కొనసాగుతు న్నాయన్నారు. పన్ను దారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రంజాన్ పండుగకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

- ఎమ్మెల్యే ముఠా గోపాల్



నవతెలంగాణ-ముషీరాబాద్

రంజాన్ పండగకు ముస్లిం సోదరులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో ఆర్యవైశ్య సంఘంలో రంజాన్ పవిత్ర మాసం ప్రారంభం సందర్భంగా పలు సమస్యలతో మైనార్టీ సోదరులు ఇబ్బంది పడకుండా అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం ప్రారంభ సందర్భంగా ముస్లిం సోదరులకు ఎటువంటి సమస్యలు తలెతకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో అధికారులు వాటర్ వర్క్స్ అధికారులు జీఎం రామకృష్ణ, డి జీఎంలు మోహన్ రాజ్, కార్తీక్ రెడ్డి, ఏఎంహెచ్ ఓ మైత్రేయి, స్ట్రీట్ లైట్ అధికారిని జ్యోతిర్మయి, జీహెచ్ఎంసీ డిఈ సన్నీ, పోలీస్ అధికారులు ఎస్ఐ జయరాజ్, నయీమ్, ట్రాఫిక్ ఏఎస్ఐ యాదగిరి, అంజుమన్ సొసైటీ అధ్యక్షులు అక్తర్ అలీ, ఐరన్ మర్చంట్ అధ్యక్షులు ఆదాం సబ్, జమా మజీద్ అధ్యక్షులు మమ్మద్ నాజర్ అలీ, బిలాల్ మస్జీద్ అధ్యక్షులు దిల్బర్ బాయ్, ఫాతిమా మజీద్ అధ్యక్షులు మహమ్మద్ జాంగిర్, బులక్పూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు మహమ్మద్ అలీ, రహీం, చాంద్ పాషా, ఇస్మాయిల్, మీడియా ఇన్‌చార్జ్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు ఆర్గానిక్ ఫుడ్ తీసుకోవాలి

- గర్భాశయ సమస్యలు ఉన్నవారికి సరోగసి సరైంది
- ఇది సంస్కృతికి విరుద్ధం కాదు
- ప్రముఖ గైనకాజీస్టు, స్త్రీ వైద్యునిపుణులు డా.పద్మజ



నవతెలంగాణ-ఓయూ

గర్భిణులు జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని.. ఆర్గానిక్ ఫుడ్ తీసుకోవాలని ప్రముఖ గైనకాజీస్టు, స్త్రీ వైద్య నిపుణులు డా.పద్మజ సూచించారు. గర్భాశయ సమస్యలు ఉన్న వారికి సరోగసి సరైందని తెలిపారు. అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా నవతెలంగాణకు వారు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రస్తుతానికి గర్భిణులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు ?

గర్భిణులు ఖచ్చితంగా నెలకు ఒక్కసారి డాక్టర్ చూపించుకోవాలి. గతంలో 3 లేక 5 నెలలకు ఒక్కసారి డాక్టర్స్ దగ్గంకు వెళ్లే వారు. తరువాత కొన్ని ప్రసవాలు ఇంట్లోనే జరిగేవి. ప్రస్తుతం నెల తప్పిన నాటి నుంచి డాక్టర్స్ వద్దకు వెళ్లాల్సిన అవసరం ఏర్పడింది. స్థానికంగా తప్పనిసరిగా స్త్రీ వైద్యురాలు ఉంటే తప్పనిసరిగా ప్రతినెలా అక్కడ చూయించు కుంటే ఎంతో ఎంతో మంచిది. ప్రస్తుతానికి అందరికీ దీని గురించి ఎంతో కొంత అవగాహన ఉంది.

లేటు వయస్సులో పెండ్లీలు చేసుకున్న దంపతులకు సకాలంలో సంతానం కలగక పోవడానికి గల కారణాలు ?



ప్రస్తుతానికి ఆలస్యంగా పెండ్లీలు చేసుకున్న వారు పలు రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారు. పాత కాలంలో 18 నుంచి 22 సంవత్సరాల లోపు పెండ్లీలు చేసుకోవడం వల్ల వెంటనే వారికి సంతానం కలిగేది. పుట్టిన పిల్లలు సహితం ఆరోగ్యంగా ఉండేవారు. ప్రస్తుతానికి జీవితంలో స్థిరపడేంత వరకు పెండ్లీలు చేసుకోవడం లేదు. అలాగే ఇక జాబ్స్ , ఆర్మీ,అథ్లెటిక్, సినిమాల్లో పని చేసే వారు సంతానం కొంత వరకు వాయిదా వేస్తున్నారు. సహజంగా 22 నుంచి 28 సంవత్సరాల మధ్య వయస్సులో అత్యధికంగా సంతానం కలిగే అవకాశం ఉంది. ఇక 28 నుంచి 33 సంవత్సరాల తరువాత రాను రాను సంతాన అవకాశాలు తగ్గుతూ వస్తాయి. ఇక 36 సంవత్సరాల తరువాత ఇంకా సంతానం కలిగే అవకాశాలు అరుదుగా ఉంటాయి. దీనికి గల కారణాల విషయానికి వచ్చేసరికి " ఎగ్స్ ఫీక్స్" సంఖ్యలో ఉండి వయస్సు పెరుగుతున్న రీత్యా వాటి సంఖ్య తగ్గుతూ వ స్తుంది. 45 -48 సంవత్సరాలు వచ్చే సరికి నేలసరి (పీరి యడ్స్) ఆగి పోయె ఛాన్స్ ఎక్కువగా ఉంటుంది. అందువలన ఆలస్యం గా పెండ్లీలు చేసుకున్న దంపతులకు తప్పనిసరిగా వైద్య అవసరం ఎంతైనా ఉంది. ఇక పురుషుల్లో 40 -45 సంవత్సరాలు దాటితే వీర్య కణాల తగ్గుతుంది.

న.తె : కొంత మంది గర్భిణులు 6 లేక 7 నెలలకు ముందే డెలివరీ కావడానికి గల కారణాలు ? కొన్ని సమయాల్లో ఇలా పుట్టిన శిశువులు మరణిస్తున్నారు.

డా.పద్మజ : నెలలు పూర్తిస్థాయిలో నిండక ముందే డెలివరీకి గల కారణాల్లో మొదటిది గర్భాశయంలో లోపాలు. గర్భాశయం చిన్న గా ఉండటం, తగిన సైజు లో లేకపోవడంతో పాటుగా దాని ఆకారం తేడాగా ఉండటం, గర్భాశయం లోపల అడ్డుగోడలు ఉండటం. రెండోది.. గర్భాశయం ముఖ ద్వారం వదులుగా ఉండటం.. దీని వలన నెలలు నిండక ముందే గర్భిణులు ప్రసవించటానికి అవకాశాలు ఉంటాయి. గర్భాశయంలో కవలలు లేక ముగ్గురు ఉన్నపుడు కూడా త్వరగా డెలివరీ అవుతారు. ఇక ఇతర కారణాలు ఇన్ఫెక్షన్స్, అధిక పనిభారం, దూర ప్రయాణాలు కొంత కారణం అని చెప్పాలి. నెలలు నిండక మునుపు 28 వారాల తరువాత జన్మించిన శిశువులను బతికించే అవకాశాలు ఉన్నాయి. కానీ అంతకన్నా తక్కువగా ఉంటే చెప్పలేం. 28 వారాల తరువాత అయితే 60 శాతం శిశువు లు బ్రతికేందుకు అవకాశం ఉంది. 32 వారాలు దాటితే 80 శాతం అవకాశం ఉంది. ఇక పుట్టిన ప్రతీ శిశువు బరువు, అవ యవాల అభివద్ధిని బట్టి బతికే అవకాశాలు ఉంటాయి. మేన రికం పెండ్లీల వల్ల ప్రత్యేక లోపాలు ఉన్న శిశువు లు పుడుతు న్నారు.. వాటి కారణాలు ? వీటిని ముందే నివారించేందుకు ఉన్న వైద్య సదుపాయాలు ఎంత వరకు ఉన్నాయి.

మేనరికపు పెండ్లీల వల్ల అవయవ లోపాలు ఉన్న పిల్లలతో పాటు అంగవైకల్యం గల పిల్లలు పుడుతున్నారు. దీని నివారణకు దంపతులు గర్భధారణకు ముందే ఇద్దరి జన్యు పరీక్షలు చేసి వాటిలో ఉన్న లోపాలకు తగ్గ నివారణ ఉపాయాలు సూచిస్తారు. దానికి తగ్గ సలహాలు సూచనలు కూడా ముందే ఇస్తాం. గర్భధారణకు ముందు ,తరువాత ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వైద్యులు చెబుతారు. ప్రధానంగా మేనరికపు పెండ్లీలు చేసుకోవడం అంత ఉత్తమం కాదు.

డా.పద్మజ పెర్టిలిటి సంతాన సాఫల్య కేంద్రం ద్వారా ఎంత మంది అమ్మతనము పొందారు. ?

మా వద్దకు వచ్చే దంపతులకు 60 నుండి 70 శాతం వరకు సంతానం కలుగుతుంది.

గైనకాలజిస్టు వత్తి లో నాడు నేడు ఉన్న తేడాలు. ప్రస్తుతం ఉన్న టెక్నాలజీ ద్వారా గర్భిణులకు ఎంత వరకు సులభతరమైన వైద్యం అందుబాటులో ఉన్నది ?

1997 సంవత్సరంలో భువనగిరిలో మా ఆస్పత్రిని ప్రారంభించాము. నేడు హబ్సిగూడాలో కూడా మా వైద్యశాలకు ఎంతో మంది గర్భిణులు, మహిళలు వస్తున్నారు. ఇక స్కాన్, రక్త పరీక్షల విషయానికి వస్తే, పాత కాలంలో అవిలేక పోవడంతో ప్రతీ ప్రసవం తల్లికి బిడ్డకు జీవన్మరణ సమస్యలా ఉండేది. ప్రసవాల సమయంలో అధిక రక్తస్రావం అయితే దాని నివారణకు అవసరమైన మందులు లేక పోవడం మత్తిచ్చే (ఎనస్తీషియా) సౌకర్యాలు లేక పోవడం, ఫిడ్స్ వస్తే ఎలా చేయాలి లాంటి సమస్యలు ఉండేవి. ప్రస్తుతానికి మాత్రం ఇంజక్షన్స్ లభ్యత అధికంగా ఉండటంతో ప్రసవం ముందు తరువాత అధిక రక్తస్రావాన్ని అరికట్టేందుకు వీలు అవుతుంది. నేడు అనేక మెడిసిన్స్ అందుబాటులో ఉన్నాయి. ఎనస్తీషియా సేవలు కూడా బాగా పెరిగాయి. నేటి అధునాతనమైన టెక్నాలజీతో గైనకాలజీస్టుల సేవలు సులభతరం అయ్యాయి. ఇక గర్భాశయంలో బేబీ అవయవ లోపాలు తెలుసు కోవడానికి, ఉమ్మనీరు ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవడం, బేబీ హార్ట్ బీట్ తెలుసుకోవడానికి, అల్ట్రాసౌండ్ స్కానింగ్ ఎంతో ఉపయోగపడుతుంది.

భార్య లేక భర్త అధిక బరువు వల్ల సకాలంలో పిల్లలు పుట్టకపోవడానికి ఎంత వరకు కారణం అవుతుంది ?

ప్రస్తుతానికి ఊబకాయం సమస్యగా మారింది. దీని వల్ల మహిళల్లో అండాల నాణ్యత తగ్గి పోవడ తో గర్భ ధారణ జరగటానికి అధిక సమయం పడుతుంది. గర్భధారణ జరిగిన కానీ ఒక వేళ గర్భస్రావం (అబార్షన్), అయ్యే అవకాశాలు అధికంగా ఉంటాయి. గర్భధారణతో పాటుగా అధిక చక్కర, బీపీ, వచ్చే ఛాన్స్ అధిక బరువు వల్ల అవుతుంది. ఇలాంటి మహిళల్లో సాధారణ ప్రసవాల కన్నా ఆపరేషన్స్ జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇక మగవారిలో వీర్య కణాల సంఖ్య తగ్గి పోవడంతో పాటుగా వాటి కదలికలు తగ్గిపోవడంతో గర్భధారణ ఆలస్యం అవుతుంది. ఊబకాయం అటు మహిళలకు, ఇటు పురుషులకు అంత శ్రేయస్కరం కాదు.

ప్రస్తుతానికి సహజ ప్రసవాలు తగ్గి ఆపరేషన్స్ సంఖ్య రెట్టింపు కావడానికి గల కారణాలు ?

పూర్వకాలంలో ఎలాంటి వైద్యసేవలు అందుబాటులో లేక గత్యంతరం లేక భరించే వారు.కానీ నేడు తల్లికి బిడ్డకి సమస్యలు రావద్దు ఎందుకంటే ఒక్కరు లేదా ఇద్దరికే జన్మనిస్తారు కాబట్టి ఇక తల్లికి బిడ్డకి ఇబ్బంది లేకుండా ఆరోగ్యంగా ప్రసవం కావాలి అన్న పరిస్థితిలో అటు కుటుంబ పెద్దలు ఇటు గర్భిణులు ఆపరేషన్స్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఇంక కొందరు రిస్క్ తీసుకునేందుకు సిద్ధంగా లేరు. డెలివరీ అనేది ప్రతీ మహిళకు జీవన్మరణ సమస్య కాబట్టి, కొందరు నొప్పులు భరించటానికి ఇబ్బంది పడుతూ ఆపరేషన్ దిశగా అడుగులు వేస్తున్నారు. ప్రస్తుతానికి శారీరక శ్రమ లేకుండా సున్నితంగా పెరగడం వల్ల డెలివరిలు అయ్యే పెల్విస్ సరిగ్గా అభివద్ధి చెందటము లేదు. అందుకే సహజ ప్రసవానికి ఇబ్బంది అవుతున్నది. ప్రధానంగా అమ్మాయిలు సహజ ప్రసవానికి మానసికంగా సిద్ధంగా లేరు. పుట్టే పిల్లలు కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆరోగ్యంగా ఉండటానికి వైద్యులపై సిజేరియన్స్‌కి ఒత్తిడిని తెస్తున్నారు. ఇంకా పలు రకాల అనారోగ్య సమస్యల వల్ల కూడా ఇలా సిజేరియన్ వైపు అడుగులు వేస్తున్నారు. నా వద్దకు వచ్చే ప్రత్యేకం అయినవి కేసులు కాబట్టి (రిస్క్), కాబట్టి 70 శాతం నుండి 80 శాతం వరకు ఆపరేషన్స్ చేయాల్సి వస్తుంది.

ఆరోగ్యకరమైన శిశువులు కలగాలంటే గర్భం దాల్చిన నాటి నుంచి ఒక మహిళ ఎలాంటి ఆరోగ్యపరమైన జాగ్రత్తలు పాటించాలి..?

గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే పిల్లలు తల్లి ఆరోగ్యం గా ఉంటారు. ఇక గర్భదారణకు ముందే "ప్రీ నేటర్ కేర్"లో అవసరమైన పరీక్షలు చేయించు కోవాలి. థైరాయిడ్, విటమిన్ బీ 12, విటమిన్ డీ ఏ స్థాయిలో ఉన్నాయి, రూబెల్లా లాంటి ఇన్ఫెక్షన్స్ ఉన్నాయా అని ముందుగానే తెలుసుకుని తరువాత గర్భధారణకు వెళ్లాలి. దీని వలన చాలా వరకు సంతాన సమస్యలు తగ్గించుకోవచ్చు. గర్భధారణ జరిగిన తరువాత ప్రతినెలా వైద్యుల సలహాలు అవసరం అయితే స్కానింగ్ చేయించుకోవాలి. 7 నెలల తరువాత నెలకు రెండుసార్లు, అవసరమైనప్పుడు అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించుకోవాలని సూచించారు. ఇంకా అవసరం అయితే ఇతర నిపుణుల సలహాలు, సూచనలు తీసుకుంటే డెలివరీ సవ్యంగా జరిగే అవకాశాలు ఉన్నాయి.

ఒక సీనియర్ వైద్యురాలుగా అద్దె గర్భం పై మీ అభిప్రాయం ?

దీనిపై నేను 10 సంవత్సరాలు వర్క్ చేశాను. దీనిని కేవలము 1 శాతం మాత్రమే సెలబ్రిటీలు దుర్వినియోగం చేస్తున్నారు. కానీ 99శాతం మంది ఎవరైతే సంతానం కోసం అన్ని రకాలుగా ట్రీట్మెంట్ తీసుకొని తరువాత కూడా సఫలం కాని వారు 5 నుండి 10 సార్లు ఐవీఎఫ్ చేసుకొని సఫలం కానీ వారు, ఇక తల్లికి గర్భాశయ సమస్యలు ఉన్నవారికి ఈ సరోగసి విధానం ఎంతో శ్రేయస్కరం. ఇది మన సంసతికి ఎలాంటి విరుద్ధంగా అనటానికి వీలులేదు. అద్దె గర్భం ఇచ్చిన వారు తీసుకునే వారు సంతోషంగా సరోగసి పద్ధతికి ఒప్పుకుంటున్నారు. ఇక్కడ ఎవరిని నిర్బంధించాల్సిన అవసరం లేదు. నేడు కొత్తగా " అల్ట్రూస్టిక్ " సరోగసి అనే నూతన పద్ధతి వచ్చింది. ఈ పద్ధతిలో మన దగ్గరి వారు మనకు సహాయం చేయాల్సి ఉంది. దీని వల్ల మనవాళ్లు నిర్బంధం గా ఫీల్ అవుతారు. సరోగసి అత్యంత అవసరమైన విషయం. గర్భాశయం ద్వారా పిల్లలు కనలేని వారికి ఇది మంచి పద్ధతి .

నూతనంగా గైనకాలజిస్టు వత్తి లోకి వచ్చే వారికి మీరిచ్చే సలహాలు సూచనలు ?

ఇది నిబద్ధతతో, ఇష్టంతో చేసే వత్తి అధిక సమయం కేటాయించాలి. తీసుకున్న, చేసిన కేసుకు న్యాయం చేకూర్చాలి.

మీ సుదీర్ఘమైన అనుభవం లో మీరూ ఎదుర్కొన్న అతి క్లిష్టమైన కేసులు ఏమైనా ఉన్నాయా ?

చాలా వరకు ఉన్నాయి. ఈ వత్తి రీత్యా అవి సహజం మూలకణాలు భద్రపరిచడము వల్ల పుట్టబోయే పిల్లలకు భవిష్యత్తులో వచ్చే రోగాలు నయం చేయడానికి ఎంత వరకు ఉపయోగపడుతాయి. ఇది సామాన్యుడికి ఎప్పుడు అందు బాటులో వస్తుంది ? మూల కణాల (స్టెమ్‌సెల్స్)పై ఇంకా పరిశోధనలు జరుగు తున్నాయి. బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్‌కు, పుట్టకతో వచ్చే కంటి చూపునకు సంబంధించిన సమస్యలకు మూల కణ టెక్నా లజీ ఉపయోగ పడుతుంది. భవిష్యత్తులో మూలకణాల విని యోగం విస్తతంగా అయ్యే అవకాశాలు ఉన్నాయి. సామాన్య లకు అందుబాటులోకి రావడానికి సమయం పడుతుంది.

అండాలు, వీర్యలు నిల్వ చేసే సౌకర్యం మీ ఆస్పత్రిలో ఉందా ? ఉంటే వీటిని అవసరం అయిన వారికి దేని ఆధారంగా ఇస్తారు.?

ఈ సౌకర్యం ఆలస్యంగా పెండ్లీలు అయిన వారికి ఉపయోగ పడుతుంది. 28 నుంచి 32 వయస్సు గల మహిళల్లో అండాలు నాణ్యతతో పాటు యాక్టివ్‌గా ఉంటాయి.కానీ ఆ వయస్సులోనే సంతానం వద్దు అనుకునే వారి అండాలు స్టోర్ చేసి అవసరం అయినప్పుడు వాడుకుంటున్నారు. అలాగే పురు షులలో కూడా కొన్ని రకాల చికిత్స ల తరువాత వీర్య కణాల నాణ్యత తగ్గుతుంది. అలా అనుకున్నప్పుడు చికిత్స కు ముందే వీర్య కణాలు భద్రపరుచు కోవచ్చు. పుట్టబోయే పిల్లలకు తల్లిదం డ్రుల నుంచి వంశపారంపర్యంగా జబ్బులు వస్తాయా ? రాకు ండా ఉండాలంటే ముందస్తుగాఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి ?

బీపీ,షుగర్ లాంటివి పిల్లలకు రాకుండా ఉండాలంటే జీవన విధానంలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దాంతో వీటిని కొంత వరకు నివారించేందుకు అవకాశం ఉంది.

గర్భిణులు ఆరోగ్యానికి మీరు ఇచ్చే సలహాలు సూచనలు ?

జీవన విధానాన్ని నిర్లక్ష్యం చేయరాదు. జంక్ ఫుడ్స్ కు దూరంగా ఉండాలి. ఇంటి ఆహారం తీసుకోవాలి. మంచి ఆహారం, గాలి,నిద్రతో పాటుగా వ్యాయమం అవసరం ఎంతైనా ఉంది. స్వచ్ఛమైన పాలు, కూరగాయలు భుజించాలి. ఇక ప్లాస్టిక్ గ్లాస్, ప్లేట్స్ కు దూరంగా ఉండాలి. పేపర్ ప్లేట్స్, గ్లాస్‌లు కూడా వాడకూడదు. ఆర్గానిక్ ఫుడ్ తీసుకుంటే మంచిది. మన జీవ గడియారాన్ని ఆటంక పరిచే పనులు చేయవద్దు

కవల పిల్లలు పుట్టడానికి గల కారణాలు ?

అండం, వీర్యం,కణం కలిసేప్పుడు బేబీ ఏర్పడే సమయంలో అండా లు రెండుగా చీలిపోయి కవలలుగా ఏర్పడతారు.ఇది సహజం గా జరిగే పద్ధతి .ఇక ఐవీఎఫ్, టెస్ట్ ట్యూబ్ బేబీ పద్ధతిలో చికిత్స తీసుకునే సమయంలో కవలలు పుట్టడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎందుకంటే మనం ఏ పద్ధతిలో " ఎంబ్రియోస్ " లోపల ప్రవేశ పెట్టడం వలన ఆ సమయంలో కవలలు పుట్టే అవకాశం ఉంది. కొందరు దంపతులు కవల పిల్లలు కావాలని వస్తున్నారు.కానీ కవలల వల్ల అనేక సమస్యలు ఉన్నాయి.మన దేశంలో ఐవీఎఫ్‌లో కూడా ఒక బేబీని ఎంబ్రీయెస్‌లో పెట్టితే బాగుంటుందని అభిప్రాయం కూడా వస్తుంది. దీని వల్ల అనేక ఆర్థిక పరమైన, ఆరోగ్య పరమైన ఇబ్బందులు ఉండవు. ఒక బేబీ పద్ధతి మంచిది...

వివిధ రంగాలల్లో రాణిస్తున్న మహిళలు

- పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తుంది
- విజయ డెయిరీ మన అందరిది ప్రోత్సాహిస్తూ..ఆశీర్వదించండి..
- విజయ డైరీ మేనేజింగ్ డెరెక్టర్, ఐఏఎస్ చిట్టెం లక్ష్మీ



నవతెలంగాణ-ఓయూ

మహిళా అమ్మగా, చెల్లిగా, అక్క, చెల్లి, అమ్మమ్మ, నాయనమ్మ వంటి పాత్ర రాణిస్తూ, ఉద్యోగరీత్యా వివిధ రంగాల్లో పలువురు మహిళలు ముందుకెళ్తున్నట్లు తెలిపారు. అదే విధంగా నేటి సమాజంలో మహిళలు పలు హెూదాల్లో సత్తా చాటుతున్నారని, నేడు పలు ప్రభుత్వ, ప్రయివేటు సెక్టార్లే కాకుండా వివిధ రంగాల్లో స్వయం ప్రతిపత్తితో ముందుకు సాగుతున్నారని విజయ డెయిరీ మేనేజింగ్‌డైరెక్టర్ (ఎండీ),ఐఏఎస్ చిట్టెం లక్ష్మి పేర్కొ న్నారు. మహిళాదినోత్సవం పురస్కరించుకొని వివిధ అంశా లపై తన అభిప్రాయాలను పాలుపంచుకు న్నారు. మహిళలు ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో ఇంటి బాధ్య తలో భాగంగా తమ పిల్లల్ని ఉత్తమ పౌరులుగా తీర్చిది ద్దాలని, భవిష్యత్ అవసరాల కోసం వారిని చదువు, సంస్కృ తి పట్ల వారికి ఎన్నో విషయాలపైన అవగాహన పెంచా ల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె సూచిం చారు. ప్రస్తుతం ప్రస్తుతం గ్లోబలైజేషన్ కాలంలో మాతృ మూర్తులు అందరూ సమాజ వికాసం కోసం కృషి చేయా ల్సిన బాధ్యత వారిపైన ఉందని గుర్తు చేశారు.అన్ని సెక్టార్స్ లో పనిచేస్తున్న మహిళలు వారిలో ఉన్న నైపుణ్యాలతో పని చేస్తు సమాజ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని సూచించారు.

విజయ అందరిదీ ఆదరించండి, అభిమానించండి

ఇక విజయడయిరీని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నాలు చేస్తున్నామని ఆమె చెప్పారు. విజయ పాలు, పాల ఉత్పత్తులు వినియోగదారుల అభిరుచులకు, కాలానికి అనుగుణంగా, అందజేస్తామని, ఇది మన అందరి సంస్థ దీనిని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తు చేశారు. కొత్త తరహా బిజినెస్‌తో ఉత్పత్తులు ఉంటాయి అన్నారు.నేరుగా పాల రైతులను కలిసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సంస్థ అభివృద్ధికి అందరూ కృషి చేస్తే తోడ్పాటు సాయాన్ని అం దించాలని సూచించారు. తోటి మహిళలకు అందరికీ ఆమె ప్రపంచ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారు


- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ గ్లోరీ ఎస్ స్వరూప్..



నవతెలంగాణ-బంజారాహిల్స్

మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని ముఖ్య అతిథిగా విచ్చేసిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ జనరల్ డాక్టర్ గ్లోరీ ఎస్ స్వరూప్ తెలిపారు. హైదరాబాద్ ప్రాంతంలో అతిపెద్ద బీఎన్ఐ చాప్టర్ 'బీఎన్ఐ క్యాపిటల్ చాప్టర్' ఆధ్వర్యంలో హైదరాబాద్ పార్క్ హయత్‌లో గురువారం అంతర్జాతీయ మహిళా దినో త్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్లోరీ మాట్లాడుతూ బీఎన్ఐ నెట్‌వర్కింగ్ శక్తి అద్భుతమై నదన్నారు. ఎంఎస్‌ఎంఈ అనేది ప్రభుత్వ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సంస్థ అన్నారు. ఇది ఎంఎస్‌ఎంఈ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ రంగంలో అగ్రగామిగా ఉందన్నారు. ఇన్‌స్టిట్యూట్ కెపాసిటీ బిల్డింగ్, రీసెర్చ్, కన్సల్టెన్సీ, స్కిల్లింగ్, ఎడ్యుకేషన్, ఎక్స్‌టెన్షన్‌పై దృష్టి పెట్టి అనేక సేవలు అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా బీఎన్ఐ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజనా షా మాట్లాడుతూ జనాభాలో సగభాగం ఉన్న మహిళలకు సమాన హక్కులు ఉండాలన్నారు. మహిళలకు ప్రత్యేకమైన అనేక లక్షణాలు ఉన్నాయన్నారు. వాటిలో మహిళలు మాత్రమే సమ ర్థంగా ఉంటారన్నారు. అందులో ముఖ్యంగా సహనం, సామాజిక నైపుణ్యాలు, ఒప్పించే శక్తి, సానుభూతి, చర్చల నైపుణ్యాలు కావచ్చ న్నారు. వీరు సేల్స్, హెచ్‌ఆర్, కౌన్సెలింగ్, క్రియేటివిటీ, రిలేషన్ షిప్ మేనేజర్లు, అకౌంట్ సర్వీసింగ్ తదితర వృత్తులలో రాణిస్తారన్నారు. మహిళలను భాగస్వామ్యం చేయకపోవడం, సమాన అవకాశాలు ఇవ్వకపోవడం వల్ల, వాళ్ల ప్రతిభను సమర్థవంతంగా ఉపయోగించుకోలేక పోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎన్ఐ క్యాపిటల్ అధ్యక్షుడు సందీప్ జైన్, వైస్ ప్రెసిడెంట్ పురుషోత్తం ఆది, కార్యదర్శి, కోశాధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విటమిన్ 'డి' లోపంతో పోరాటం చేస్తున్న భారతీయ మహిళలు



- అపోలో క్రెడిల్ అండ్ చిల్డ్రన్స్ ఆస్పత్రిలో వైద్యుల అవగాహన

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

భారతీయ మహిళలు విటమిన్ 'డి' లోపంతో పోరాడుతున్నారని అపోలో క్రెడిల్ అండ్ చిల్డ్రన్స్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని 'స్ట్రాంగ్ ఉమెన్ స్ట్రాంగ్ భారత్' థీమ్తో అపోలో క్రెడిల్ అండ్ చిల్డ్రన్స్ ఆస్పత్రి (జూబ్లీ హిల్స్)లో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నటి కుశిత కల్లాపు హాజరయ్యారు. ఈ వేడుకలలో వైద్యులు మాట్లాడుతూ 90 శాతం మంది మహిళలు ఈ సమస్యతో సతమతమవుతున్నారని చెప్పారు. ఇది స్త్రీ ఎముకల ఆరోగ్యాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అపోలో క్రెడిల్ విటమిన్" డి "పరీక్షను అతి తక్కువ ధరకే 199 రూపాయలకే చేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా అపోలో క్రెడిల్ అండ్ చిల్డ్రన్స్ హాస్పిటల్ (జూబ్లీ హిల్స్) కన్సల్టెంట్ పీడియాట్రిషియన్ డాక్టర్ షర్మిల మాట్లాడుతూ, మహిళలకు సమాన అవకాశాలు కల్పిస్తే ప్రగతిని వేగవంతం చేయవచ్చన్నారు. వివిధ రంగాలలో పోటీ పడుతున్నప్పుడు సహజమైన సామర్థ్యాన్ని కోల్పోకూడదన్నారు. సాధికారత పొందిన మహిళ నిజమైన సంకేతం.. ఆమె ఎంతమందికి అధికారం ఇవ్వగలదన్న దానిపై ఆధారపడి ఉంటుందన్నారు. ఆరోగ్యపరంగా స్త్రీలందరూ గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ వ్యాక్సిన్ తీసుకోవడం తప్పనిసరి అన్నారు. ప్రతీ కొన్ని నిమి షాలకు ఒక ప్రాణం సర్వైకల్ క్యాన్సర్‌తో పోతుందన్నారు. పదిహేను సంవత్స రాల కంటే తక్కువ వయస్సు ఉన్న వారు కేవలం రెండు షాట్‌లతో దీనిని నివారిం చవచ్చున్నారు. పెద్దవారైనప్పటికీ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అపోలో క్రెడిల్ అండ్ చిల్డ్రన్స్ హాస్పిటల్ (జూబ్లీ హిల్స్) కన్సల్టెంట్ ప్రసూతి, గైనకాలజిస్ట్ డాక్టర్ స్వాతి గోగినేని మాట్లాడుతూ భారతీయ స్త్రీలందరికీ విటమిన్ డి లోపం ఉందన్నారు. వేషధారణ వల్ల కావచ్చు లేదా సూర్యరశ్మి తగలక పోవడం వల్ల కావచ్చున్నారు. ఇది విటమిన్ 'డి'కి ప్రధాన మూలమన్నారు. దీనివల్ల అనేక లక్షణాలతో ముడిపడి ఉంటుందన్నారు. అవి నీరసం, తక్కువ శక్తి స్థాయిలు, అలసట, కండరాల నొప్పులు, ఎముకల నొప్పులు, శరీర నొప్పులు, ఋతు క్రమరాహిత్యం, పేలవమైన పునరుత్పత్తి ఫలితాలు అన్నారు. రోజూ కనీసం అరగంట నుంచి గంట వరకు సూర్యరశ్మి శరీరానికి తగలడం అవసరమన్నారు. ప్రతిరోజూ వ్యాయామం చేయడం మంచిదన్నారు. కాల్షియం, విటమిన్'డి' ఆహారాలు అయిన పాలు, గుడ్డులోని తెల్లసొన, చేపలు, కాలేయం వంటి వాటిని తీసుకోవడం ముఖ్యమన్నారు. విటమిన్ 'డి'తనిఖీ చేయించుకోవడం, సరైన మోతాదు తీసుకోవడానికి వైద్యుల సలహా తీసుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అపోలో క్రెడిల్ అండ్ చిల్డ్రన్స్ ఆస్పత్రి(జూబ్లీ హిల్స్) కన్సల్టెంట్ ప్రసూతి వైద్యుడు అండ్ గైనకాలజిస్ట్ అండ్ ల్యాప్ సర్జన్ డాక్టర్ హారిక బోనం మాట్లాడుతూ సాధారణ బీఎంఐ నిర్వహించడం చాలా ముఖ్యమన్నారు. సాధారణ బీఎంఐ స్థాయిలు ఋతు సమస్యల నుంచి విముక్తి పొందేలా చేస్తాయన్నారు. గర్భం ధరించడంలో సమస్యలు, మెనోపాజ్ ఆందోళనలు తగ్గించబడతాయని తెలిపారు.

అన్ని రంగాల్లో రాణిస్తూ సమాజంలో తమ ప్రతిభను నిరూపించాలి

- లాలగూడా స్టేషన్‌హౌస్ ఆఫీసర్ పల్లె పద్మ



నవతెలంగాణ-ఓయూ

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ తనదైన ప్రతిభను సమాజంలో నిరూపిస్తూ ముందుకు దూసుకెళ్తుందని లాలాగూడ పోలీస్ స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ పల్లె పద్మ తెలిపారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని, అంది వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటూ, తనదైన ముద్ర వేసుకుంటూ ముందుకెళ్తున్నట్లు తెలిపారు. సమాజంలో మహిళలు తమ ప్రతిభను నిరూపించుకోవాలని సూచించారు. నగర సీపీ శ్రీనివాస్‌రెడ్డి మహిళలపై నమ్మకంతో లాలాగూడ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు ఇవ్వడంతో వారికి ధన్యవాదాలు తెలిపారు.లాలాగూడ పోలీస్ స్టేషన్‌లో పది మంది మహిళా పోలీస్ ఉద్యో గులు పని చేస్తు న్నా రని, వారు వృత్తి పట్ల నిబద్ధతతో పనిచేస్తున్నారన్నారు. తనపై లాలాగూడ ప్రజలకు స్థానికులకు ఉన్న నమ్మకాన్ని వారి ఆకాంక్షలకు అనుగుణంగా శక్తి మేరకు పనిచేస్తానని ఆమె చెప్పారు. స్థానిక పిఎస్ పరిధిలో ఇంటర్, కళా శాలాల వద్ద ఉదయం సాయంత్రం వేళలో అక్కడ గస్తీ పెంచి టీజింగ్ లేకుండా చూస్తున్నట్లు తెలిపారు. పలు కళాశాలలో స్కూల్స్, వద్ద అవగాహన నిర్వహిస్తున్నామన్నారు.

మహిళలుగా పుట్టడం గర్విస్తున్నాం.. మహిళ పోలీసులు

మహిళలుగా పట్టడం గర్విస్తున్నామని, అన్ని రంగాలల్లో మహిళలు అనేక విజయాలు సాధిస్తున్నారని లాలాగూడ పోలీస్ స్టేషన్‌లో పలువురు మహిళా పోలీస్ సిబ్బంది తెలిపారు. ఒక మహిళ ఇన్‌స్పెక్టర్‌గా వద్ద పని చేయటం గర్వకారణం ఉందన్నారు. ఈ వృత్తి ఛాలెంజ్‌గా ఉందని, పోలీస్ డిపార్టుమెంట్‌లో పనిచేయటం చాలా ఛాలెంజ్‌గా ఉంటుందన్నారు. అటు కుటుంబాన్ని, ఇటు ఉద్యోగాలను బ్యాలెన్స్ చేసుకుంటూ ముందుకు సాగుతున్నట్లు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. తమ కుటుంబ సభ్యులు ప్రోత్సాహంతోనే నేడు ఈ వృత్తిలో రాణిస్తూ, ప్రజలకు సేవలు అందిస్తున్నామని వారు సంతృప్తి వ్యక్తం చేశారు. గతంలోపై ఉన్నతాధికారులతో మాట్లాడాలంటే కొంత భయపడే వాళ్లమని, నేడు నేరుగా పైఅధికారులతో వృత్తి పరమైన అంశాలపై షేర్ చేసుకుంటున్నామని వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కె.పావని, కృష్ణ టి చైతన్య, జి.ఉషారాణి, డి.ప్రియాంక, జ్యోతి, ఎస్.శిరీష, రిజ్వాన బేగం, యామిని తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలలో క్యాన్సర్‌పై అవగాహన అవసరం



నవతెలంగాణ-బంజారాహిల్స్

గ్రామీణ ప్రాంతాలలో నివసించే ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సీఈవో తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులు కల్పిం చడానికి బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ కు క్రిటికల్ రివర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ చెందిన ప్రతినిధులు చంద్ర చంద్రగిరి సి ఎఫ్ ఓ క్రిటికల్ రివర్ టెక్నాలజీస్ వారి నేతృత్వంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సీఈవో డాక్టర్ కేకృష్ణయ్యకు రూ.20లక్షల చెక్కును అందజేశారు. సీఈవో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో క్యాన్సర్ పై అవగాహన ఉచిత స్క్రీని ంగ్ క్యాంపులు నిర్వహణకు ఆర్థిక సహాయాన్ని అందించిన సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ తద్వారా ఇప్పటికే ఆస్పత్రి ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ తరహా కార్యక్రమాలను మరింత విస్తృతపరచడానికి వీలవుతుందని, క్రిటికల్ రివర్ టెక్నాల జీస్, బసవతారకం వారి ఈ సంయుక్త కార్యాచరణ పలు వురు రోగుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని ఆశిస్తున్న ట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో క్రిటికల్ రివర్ టెక్నాల జీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన చంద్ర చంద్రగిరి, సీఎఫ్ఓ తో పాటు వినాయకుల్లా షేక్, డైరెక్టర్, క్రిటికల్ రివర్ టెక్నాలజీస్ రీత్‌గ్వారి, మార్కెటింగ్ డైరెక్టర్, క్రిటికల్ రివర్ టెక్నాలజీస్ శ్రీని పట్నాని, హెడ్ ఆపరేషన్ సంపత్ పతి, అడ్మిన్ మేనేజర్, క్రిటికల్ రివర్ టెక్నాలజీస్ వారితో సీఈవో డాక్టర్ కే కృష్ణయ్య, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ టీఎస్‌రావు, అసోసియేట్ డైరెక్టర్ అకాడమిక్స్ యాడ్ లైఫ్ డాక్టర్ కల్పనా రఘు నాథ్, మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ సెంథిల్ రాజప్ప పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- పెద్ద అంబర్ పేట మున్సిపల్ కౌన్సిలర్ కందాడ అనుపమ



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎద్ద అంబర్ పేట మున్సిపల్ కౌన్సిలర్ కందాడ అనుపమ అన్నారు. ఆమె నవతెలంగాణతో మాట్లాడుతూ 'ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవడం సంతోషంగా ఉంది. మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుంది. విద్యా , ఉగ్యోగ, ఆర్థిక రాజకీయ, సామాజికంగా విజయం సాధిస్తూ, వాటి పురోభివృద్ధిలో ముందడుగు వేయాలి. ఇప్పటికీ చదువుకు దూరమై,అభివృద్ధి కి నోచుకోని ఆడపిల్లలు ఎందరో ఉన్నారు. చదువు సమాజనికి వెలుగని, ప్రతీ ఆడపిల్ల చదువుకు ప్రభుత్వాలు బాధ్యత వహించాలి. చదువుతోనే సాధికారత సాధ్యం అని.. నేటి ఆధునిక గ్లోబలైజేషన్ కాలంలో అభివృద్ధి వేగవంతం అయ్యే దిశగా మహిళలు పయనించాలి. సమా జంలో మహిళలకు చదువుతో పాటు గౌరవం ఉండాలి. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపు చ్చుకుని మహిళలు మరింత అభివృద్ధి సాధికారత సాధించే దిశగా అడుగులేయాలి. వంటింటికి పరిమితం కాక బాధ్యతతో పాటు స్వేచ్ఛను మహిళలు కలిగి ఉండాలి' అని అన్నారు.

చుదరమ్మా సతులారా...!



నవతెలంగాణ - ధూల్ పేట్

స్త్రీలను ప్రకృతితో పోల్చుతారు. ప్రకతి ఎంతో అందమైనది. ఎంతో ఆహ్లాదాన్నిస్తుంది. విలయాన్ని కూడా చూపుతుంది. విషాదాన్ని కూడా నింపు తుంది. స్త్రీలు కూడా అంతే.. అంటూ అంతర్జాతీయ మహిళ దినోత్సవ సంద ర్భంగా నవతెలంగాణతో సహాయ కార్మిక అధికారి డాక్టర్.బి.నీలిమా కష్ణమూర్తి మాట్లాడారు. ఆమె మాటల్లో.. 'ఈ సకల చరాచర సృష్టిలో స్త్రీత్వాన్ని అనుభ విస్తున్న అన్ని ప్రాణులను అభినందించవలసిందే. అందుకే భారతీయతలో నదులను నదీమ తల్లు లుగా, గోవులను గోమాతలుగా, భూమిని భూదేవిగా, ఆరోగ్య ప్రదాయినియైన తులసి మొక్కను తులసి తల్లిగా, వేప చెట్టును అమ్మవారుగా, అంతెందుకు మన దేశాన్ని భరత మాతగా ఆరాధించుకుంటున్నాం. స్త్రీలను గౌరవించు కుంటున్నాం.

- మహాలక్ష్మిగా..

ఆడవాళ్ళు మహాలక్ష్మిగా ఉండాలంటారు మన పెద్దలు. అంటే బంగారు నగలన్నీ అలంకరించుకొని తిరుగుమనా! చూడగానే కట్టూబొట్టూ, నడక నడత హుందాగా ఉండాలని భావన. అన్నమయ్య మాటల్లో చెప్పాలంటే కలశాబ్ధి కూతురట గంభీరాలకే మరుదు, తలప లోకమాత యట దయ మరి యేమరుదు, అమర వందితయట అట్టే మహిమ యేమరుదు ... అని అమ్మవారి గుణగణాలను పొగిడి, ఇన్ని గుణాలున్నాయి గనుకనే తమితో శ్రీవేంకటేశుడు తానె వచ్చి పెండ్లాడెనన్నాడు. నిజమే మహిళలు సముద్ర మంత గంభీరంగా, కలశంలాగా గుంభనంగా ఉండాలి. దయాగుణంలో లోకమాతలవ్వాలి.పాలజలనిధిలోన పసనైన మీగడలాగ, మేలిమి తామరలోన మించు వాసన లాగా ఉండాలి. జయలక్ష్మి, వరలక్ష్మి, సంగ్రామ వీరలక్ష్మిలాగా ప్రవర్తించాలి. అందుకే అమ్మాయి పుడితే మా యింట మహాలక్ష్మి పుట్టిందంటారు.

- జీవన యానం పోటీ పడి..

మారుతున్న కాలానికి అనుగుణంగా మగువలూ మారుతున్నారు. ఉరుకుల పరుగుల ఈ జీవన యానంలో కాలంతో పోటీ పడి పరుగెడుతున్నారు. ఆదిపరాశక్తి. ఒక చేత వంట పనులు, ఒకచేత పిల్లల లాలన, ఒకచేత ఇంటి నిర్వహణ, మరోచేత ఉద్యోగ బాధ్యతలను ఎంతో సమర్థ వంతంగా నిర్వహిస్తు న్నారు. ఈ పరుగులో మహిళలు కొన్ని విషయాలను గుర్తుంచుకుంటే మరింత రాణించగలరు. ఇక్కడ వారు తమ అస్తిత్వానికి పెద్దపీత వేయాలి. వ్యక్తిత్వానికే అగ్రతాంబూలం యివ్వాలి. ఆత్మవిశ్వాసమే వారి ఆయుధం కావాలి. చెరగని చిరునవ్వే వారి ఆభరణమవ్వాలి.

- దుస్తుల వల్ల మీకు కాదు..

ముఖ్యంగా యువతులు జీన్స్ పాంట్ వేయండి. చిరిగినది కాదు. దుస్తుల వల్ల మీకు కాదు, మీ వల్ల దుస్తులకు అందం రావాలి. మత్తు పదార్థాల మత్తులో కాదు, నిస్వార్థమైన ప్రేమ మత్తులో కుటుంబాన్ని తూగించండి. అమ్మనో, అత్తమ్మనో, అమ్మమ్మనో, కాకుంటే యూట్యూబ్లోనో నేర్చుకొని వండి వడ్డించండి. ఇంటిల్లిపాదిని ఆరోగ్యంగా ఉంచండి. మన నాగరికతను లోకానికి చూపించండి. ప్రపంచానికి బ్రతకడమెట్లో నేర్పించండి. నాడు గుర్రమెక్కి యుద్ధం చేసిన ఝాన్సీరాణి, రుద్రమ దేవీ మీరే. నేడు స్కూటీ నడిపి కాలేజ్ కు వెళ్ళే సింహవాహినీ మీరే.

ఏమైనా.. అన్నీ మీరై...

బస్సు నడిపినా, కారు నడిపినా, విమానమైనా, విద్యయైనా, వైద్యమైనా, సాంకేతికమైనా, సదాచారమైనా, రాజకీయమైనా, రణరంగమైనా.... అన్ని దిక్కులా, అన్ని చెరగులా, అన్నీ మీరై, మీరే అంతై, నింగీ, నేలను ఏకం చేస్తూ మా యింటి మహారాణులుగా మెలగాలి. ప్రతి వనితా భావి తరాలకు ఆదర్శ మవ్వాలి. బంగారు భవిష్యత్తును అందించుటలో మీ పాత్రను సమర్థవంతంగా నిర్వహించి విజయ లక్ష్ములు కావాలని మనసారా కోరుకుంటూ... అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.'

ప్రేరణ ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కృపా విజ్ఞాన్ సైంటిఫిక్ స్కూల్ విద్యార్థుల తల్లులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ షేక్.సలీమా ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలు వారి హక్కుల గురించి తెలుసుకోలేక అణిచివేతకు గురవుతున్నారనీ, దేశంలో మహిళల పట్ల వివక్ష, హింసా పెరిగిపోతుందన్నారు. మహిళలంతా ఏకమై వివక్షకు, హింసకూ వ్యతిరేకంగా పోరాడాని పిలుపునిచ్చారు. సభ అనంతరం పోటీల్లో గెలిచన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రేరణ ఫౌండర్ శరత్ సుదర్శి, స్కూల్ ప్రిన్సిపాల్స్ సుదర్శి కృపా, టాన్యా ఉపాధ్యాయులు అనుపమ, రీటా మిశ్ర, నాగమణి, కామేశ్వరి,శ్రావణి, అర్జున్, మంగ, కల్పన, మౌనిక, రెహమత్ సుల్తానా, రజిత తదితరులు పాల్గొన్నారు.

మానవ సమాజానికి మూలం మహిళ

- మహిళలు లేనిది ప్రపంచం లేదు
- మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినప్పుడే దేశం అభివృద్ధి సాధిస్తుంది
- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మానవ సమాజానికి మూలం మహిళ అని మహిళలు లేనిది ప్రపంచం లేదని,మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినపుడే ప్రపంచ,దేశం అభివృద్ధి సాధించటం జరుగుతుందని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నవతెలంగాణతో పలు విషయాలను తెలిపారు.

ప్రశ్న.... మీ రాజకీయ ప్రస్థానం ఎలా ఎవుడు ప్రారంభమైంది

మేయర్ : నా రాజకీయ ప్రస్థానం మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ గ్రామ సర్పంచ్ గా ప్రారంభమైనది.గ్రామ సర్పంచ్ గా బాలాపూర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామ పంచాయతీగా తీసుక రావటానికి ప్రజలు,అధికారుల సహకారంతో ముందుకు సాగటం జరిగింది. ఆ సమయంలో ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు నా వంతు కృషి చేయటం జరిగింది. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములోనే ఉత్తమ గ్రామ సర్పంచ్ గా అవార్డును అందుకోవటం జరిగింది. మహిళలను ఆర్థికాభివద్ధి కోసం ప్రత్యేకంగా కుట్టుమిషన్ శిక్షణా కార్యక్రమం నిర్వహించటంతో ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ముందుకు సాగాను.

ప్రశ్న : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు మీరు ఇస్తున్న సందేశం ఏమిటి?

మేయర్ : సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించటం కోసం ప్రతి ఒక్కరూ. ముందుకు సాగాలి. నేటి సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా చదువుకొని ముందుకు సాగుతున్నారు. విద్య, ఉద్యోగ రంగాలలో పాటు, ప్రజా ప్రతినిధులుగా, డాక్టర్ గా,యాక్టర్ గా సైంటిస్టుగా విమానాలను నడిపే పైలెట్గా అన్ని రంగాల్లో మహిళలు విజయం సాధిం చటం పురుషలకు సమానంగా ముందుకు సాగుతున్నారు.

ప్రశ్న : మహిళ పై జరుగుతున్న దాడులపై ఏ విధంగా స్పందిస్తారు?

మేయర్ : సమాజంలో ఎంతో మార్పు వచ్చినప్పటికీ నేటికీ మహిళల పై దాడులు,అఘాయిత్యాలు రోజురోజుకి పెచ్చరిల్లి పోతున్నాయి. నిందితులను చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి. కొంత మంది రాజకీయ నాయకులు స్వార్ధ ప్రయోజనాల కోసం క్రూరమైన దురహంకార దుర్మార్గులను వెనకేసుకు రావడంతో ఇలాంటి దాడులు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అగంతకులకు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవటం జరుగుతుంది. ప్రతి ఒక్కరూ ఇలాంటి దాడులను అరికట్టటం కోసం సహాయ సహకారాలు అందించాలి.

ప్రశ్న : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు మీరు ఇస్తున్న సందేశం ఏమిటి ?

మేయర్ : సమాజంలో మహిళలు పురుషులకు ధీటుగా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి ముందుకు సాగాలి. విద్య, ఉద్యోగ,రాజకీయ,సామాజిక రంగాల్లో రాణించటం కోసం ప్రతి ఒక్క మహిళ కృషి పట్టుదలతో చదువుకొని జాతీయ అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకావాలి. మహిళలు లేనిది ప్రపంచం లేదని ప్రతి ఒక్కరు గుర్తించాలి.

ప్రశ్న : రానున్న కాలంలో మీ రాజకీయ ప్రస్థానం ఏమిటి?

మేయర్ : రానున్న కాలంలో రాజకీయంగా అనేక ఉన్నత పదవులను అలంకరించి నిత్యం ప్రజా సేవకే నా జీవితాన్ని అంకితం చేయటం ఆదర్శంగా నిలవడమే లక్ష్యం. మానవ సేవే మాధవ సేవగా భావించి నా రాజకీయ జీవితం ముందుకు సాగటం కోసం నా కార్యాచరణ ఉంటుంది. ప్రస్తుతం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్గా గత నాలుగు సంవత్సరాలుగా కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి రాష్టంలోనే ఆదర్శ మున్సిపల్ కార్పొరేషన్గా ఢిల్లీలో అవార్డును అందుకోవటం జరిగింది. రానున్న కాలంలో మరిన్ని రాజకీయ పదవులను పొందటం ఖాయం.





రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ గా ఒబెదుల్లా కొత్వాల్ హజ్ హౌస్ లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఒబెదుల్లాకు పుష్పగుచ్ఛం అందజేసి ,శాలువాతో సత్కరించారు. ఒబెదుల్లాకు శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు.

'ప్రోత్సహిస్తే ప్రతి ఆడపిల్లా లీడరే'



నవతెలంగాణ - ధూల్‌పేట్

'ఆడ పిల్లలలో ప్రతిభ ఉంటుంది. అది ముందుగా కుటుంబం, సమాజం గుర్తిస్తే ప్రతి ఆడపిల్లా లీడరే. చాలా వరకు బయట ఎలా మాట్లాడుతుందో.. లేదో, పొలిటికల్, అధికారు లుగా కష్టమే అనేది ఉంటుంది. అలా కాకుండా అమే భావ కల్పిస్తే వారిలో లీడర్షిప్ లక్షణాలు ఉంటాయి. లేకుండా ఏ అడ పిల్ల ఉండదు.. ఎందుకంటే ఇంట్లో అమే లీడర్. దీన్ని గుర్తించి ప్రోత్సహించాలి. ప్రస్తుతం అన్నిట్లో రాణిస్తున్నారు. గతంలో పోలిస్తే సమాజంలో చాలా మార్పులు వచ్చాయి. కానీ ఇప్పటికీ కొందరిలో ఆడ పిల్ల పుట్టిందంటే తల్లి, దండ్రులు, కొందరు కుటుంబీకులు వద్దనుకుంటారు. అలా ఉండకూడదు. నేడు వారే తల్లిని, తండ్రిని చూస్తున్నారు. ఆడపిల్లా అంటే కుడబెట్టాలి అనే ఆలోచనలో నుండి బయటకు రావాలి. మగ పిల్లలు అంటే వారసత్వం అంటారు. కానీ ఆడ పిల్లతోనే వారసత్వం వస్తుంది.' అని చార్మినార్ జోన్ అర్బికల్చర్ డిడి అమీనా అన్నారు.

ప్రతీ మహిళ సూపర్ ఉమెనే..!

- నాడీ సంబంధ నమస్యల నుంచి సూపర్ ఉమెన్‌ను రక్షించండి
- డా. నివేదిత



నవతెలంగాణ-బేగంపేట్

ఆధునిక యుగంలో మహిళలు పనితో పాటు జీవిత నమతుల్యతను కాపాడుకోవడం, రోజువారి సవాళ్లను ఎదుర్కొంటూ ముందుకు సాగడం కొన్ని సార్లు కూడా శారీరకంగా, మానసికంగా ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఒత్తిడితో కూడిన నిశ్చల జీవనశైలి కారణంగా మధుమేహం, రక్తపోటు, ఊబకాయం వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాదపడుతున్న మహిళల నంఖ్య పెరుగుతోంది. దీర్ఘకాలిక ఒత్తిడి వారి 'మానసిక ప్రశాంతత, హార్మోన్ల నమతుల్యత, మొత్తం ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. దీంతో మైగ్రేన్, ఫిట్స్, ఆటో ఇమ్యూన్ న్యూరోలాజికల్ డిజార్డర్స్ డిమెన్షియా, పార్కిన్సన్స్, స్ట్రోక్ వంటి కొన్ని నాడీ సంబంధ వ్యాధులతో నహా వివిధ ఆనారోగ్య నమస్యలకు దారి తీస్తుందని కిమ్స్ నన్‌షైన్, బేగంపేట ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ నివేదిత సాయి చంద్ర తెలిపారు.

వారు మాట్లాడుతూ ప్రతీ మహిళ సూపర్ ఉమెన అని.. నాడీ సంబంధ నమస్యల నుంచి సూపర్ ఉమెన్‌ను రక్షించాలన్నారు. మైగ్రేన్ దాదావు 30 శాతం మంది స్త్రీలను ప్రభావితం చేస్తుందన్నారు. ఋతుక్రమం సమయంలో హార్మోన్ల మార్పులతో నహా తలనొప్పి తీవ్రతను ప్రభావితం చేస్తున్నట్లు గుర్తించారు. ఫిట్స్‌కు నంబంధించి లింగ బేధం లేనప్పటికి ఈస్ట్రోజెన్ హార్మోన్ మూర్ఛ పరిమితిని తగ్గిస్తోంది. ఏది ఏమైనప్పటికి మూర్ఛ ఉన్న స్త్రీల పట్ల వివక్ష చూపకూడదని చెప్పారు. ప్రపంచ జనాభాలో దాదావు 3 నుంచి 4శాతం మందిలో దీర్ఘకాలిక కండరాల - ఆస్థిపంజర నొప్పితో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఇది పురుషుల కంటే మహిళల్లో 6 రెట్లు ఎక్కువ. చాలా సార్లు మహిళలు అనుభవించే మానసిక ఒత్తిడే కారణమని చెప్పవచ్చు. ప్రపంచ వ్యాప్తంగా సంభవిస్తున్న మరణాలు లేదా అంగవైకల్యానికి సంబంధిం చి టాప్ 5 ప్రధాన కారణాల్లో బ్రెయిన్ స్ట్రోక్ ఒకటి. హార్మోన్లు స్త్రీలను మధ్యవయస్సు వరకు వారిని రక్షిస్తాయి కాని రుతుక్రమం ఆగిపోయిన స్త్రీలు పురుషులతో నమానంగా ప్రమాదంలో ఉన్నారన్నారు. మనదేశంలో 5 ఏండ్లకు పైబడిన స్త్రీలు వయస్సుతో వచ్చే డీజనరేటివ్ డిసిజెస్ డిమెన్షియా, పార్కిన్సన్స్‌తో సమస్యలు ఎక్కువ. మరికొన్ని అరుదైన వ్యాధులు పురుషులతో పోలిస్తే 3 టీ 1 నిష్పత్తిలో మహిళల్లో ఎక్కువ కనిపిస్తాయని తెలిపారు. మొదటి దశలో గుర్తించి చికిత్స ప్రారంభిస్తే మహిళల్లో మెరుగైన వరిస్థితులు ఉంటాయని డాక్టర్ నివేదిత తెలి పారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని మన దినచర్యలో చేర్చినప్పుడే ఈ వ్యాధులను చాలా వరకు నివారించవచ్చు. 'నమతుల ఆహారం తీసుకోవడం, జంగ్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండటం, శారీర కంగా ధృడంగా, చురుగ్గా ఉండటం, ధూమపానం, మధ్యపానం మానుకోవడం, యోగా, ధ్యానం, స్నేహితుల ద్వారా ఒత్తిడిని ఆదిగమించవచ్చు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నందర్భంగా మహిళలు వారు చేసే గొప్ప పనులకు ప్రోత్సహిస్తూనే వారికి అండగా ఉండి వారి ఆరోగ్య అవనరాలకు తోడ్పాటు అందిద్దాం' అని డాక్టర్ నివేదిత సాయిచంద్ర తెలిపారు.

మహిళల విజయాలను స్మరించుకునేందుకే మహిళా దినోత్సవం

- నేడే అంతర్జాతీయ మహిళా దినోత్సవం

(పులికంటి మల్లికార్జున్)



నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని అన్ని దేశాలలో ఘనంగా జరుపుకుంటున్నారు. ప్రతీ సంవత్సరం మార్చి ఎనిమిదవ తేదీన నిర్వహించేఈ వేడుక ప్రతి సంవత్సరం ఒక ప్రత్యేక థీమ్ తో జరుపుతారు. అందులో భాగంగా ఈ 2024 సంవత్సరంలో ఆర్థిక రంగంలో మహిళలను ముందుకు తీసుకుని వెళ్ళే దిశగా థీమ్‌ను నిర్ధారించారు. పురోగతి వేగవంతం కావాలంటే మహిళా సామర్థ్యాన్ని పెట్టుబడిగా పెట్టాలని, ఇది మహిళా సాధికారతను సాధించడానికి ఉపయోగపడుతుందని నిర్ణయించారు.

ప్రపంచ మహిళా దినోత్సవం జరుపుకోవడం అనేది 1911 వ సంవత్సరం మార్చి 8 నుండి ఆనవాయితీగా వస్తున్నది. లింగ సమానత్వం, మహిళల హక్కుల విషయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం చాలా ప్రాముఖ్యతను కలిగి ఉన్నది. ప్రపంచ వ్యాప్తంగా మహిళలు సాధించిన సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ విజయాల గురించి అవగాహన పెంచడానికి ఇది ఒక వేదికగా ఉపయోగపడుతుంది. సమాజంలో లింగ ఆధారిత వివక్ష, హింస, విద్య, ఉపాధి అంశాలలో వివక్షత తో సహా మహిళలు ఎదుర్కొంటున్న నిరంతర సవాళ్లు, అడ్డంకులను, అన్యాయాలను హైలెట్ చేయడానికి మహిళా దినోత్సవం ఒక శక్తివంతమైన వేదికగా పనిచేస్తుంది. మహిళలు సామాజిక ఆర్థిక రాజకీయ రంగాలలో తాము ఎదుర్కొన్న వివక్షతను గుర్తు చేసుకుంటూ మహిళ సమానత్వం ,సాధారికత , గతంలో తాము చేసిన పోరాటాలను, సాధించిన విజయాలను స్మరించుకుంటూ భవిష్యత్తులో తాము సాధించవలసిన లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాఫల్యతకు కార్యాచరణను రూపొందించుకునే అవకాశం ఈ మహిళా దినోత్సవం అనే వేదిక ద్వారా సాకారం అవుతుంది. ఈ సందర్భంగా సామాజిక ఆర్థిక రాజకీయ తదితర రంగాలలో విజయాలు సాధించిన మహిళలను గౌరవించడం ఆనవాయితీగా వస్తోంది.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం చరిత్ర, పరిణామం

ఆదిమ సమాజంలో మాతృస్వామ్య వ్యవస్థలో ఆధిపత్య పాత్రను పోషించినటువంటి మహిళ, పితృ స్వామి వ్యవస్థలోకి సమాజం పరిణామం చెందడంతో తీవ్ర వివక్షతకు లోనయ్యింది. నేటి పితృ స్వామి సమాజం మహిళను ఆర్థికంగా, సామాజికంగా ,రాజకీయంగా, అణచివేసింది. ఎంతో అభివృద్ధి సాధించినవిగా చెప్పుకుంటున్న అమెరికా, యూరప్ దేశాలలో 20వ శతాబ్దపు వరకు కూడా మహిళలకు ఓటు హక్కు లేదు. మహిళా శ్రామికులకు పురుషుల తో సమానంగా వేతనాలు చెల్లించేవారు కారు. భారతదేశంలో మహిళల పరిస్థితి అధ్వానంగా ఉండేది. సమాజంలో బాల్యవివాహాలు, వరకట్నం, కన్యాశుల్కం తదితర సామాజిక రుగ్మలతో భారతీయ సమాజంలో మహిళలు తీవ్రంగా బాధపడ్డారు. ఇలాంటి పరిస్థితులలో తమకు ఓటు హక్కు కల్పించాలని ,పురుష శ్రామికులతో సమానంగా తమకు వేతనాలు చెల్లించాలని, లింగ వివక్షతకు చరమగీతం పాడాలని కోరుతూ అమెరికా యూరప్ లలో మహిళలు ప్రారంభించిన ఉద్యమాలే అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఊపిరి పోసినాయి.

1908వ సంవత్సరం లో న్యూయార్క్ నగరంలోని వస్త్ర పరిశ్రమలో పనిచేసే 15వేల మంది మహిళలు పురుషులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని, పని గంటలు తగ్గించాలని, మహిళలకు ఓటు హక్కు కల్పించాలని కోరుతూ సోషలిస్ట్ పార్టీ ఆఫ్ అమెరికా నాయకత్వంలో న్యూయార్క్ నగర వీధులలో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 1909వ సంవత్సరం ఫిబ్రవరి 28న సోషలిస్ట్ పార్టీ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో అమెరికాలో మొట్టమొదటి మహిళా దినోత్సవ నిర్వహించారు.

తర్వాత ఆగస్టు 1910 సంవత్సరంలో డెన్మార్క్ లోని కోపెన్ హగన్ నగరంలో ఇంటర్నేషనల్ సోషలిస్ట్ ఉమెన్స్ కాన్ఫరెన్స్ ప్రారంభమైంది. అమెరికా సోషలిస్టులు ప్రారంభించిన ఉమెన్స్ డే తో ప్రేరణ పొందిన క్లారా జెట్కిన్, కేట్ డుంకర్ లాంటి జర్మనీ సోషలిస్ట్ ప్రతినిధులు అంతర్జాతీయంగా ఒక మహిళ దినోత్సవం ఉండాలని ఆ సమావేశంలో ప్రతిపాదించారు. ఆ సమావేశానికి హాజరైన 17 దేశాలకు చెందిన 100 మంది మహిళ ప్రతినిధులు దానికి మద్దతు తెలపడంతో ఆ ప్రతిపాదన ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. కానీ ఉమెన్స్ డే కు నిర్థిత తేదీ అంటూ ఏమి నిర్ణయించలేదు.

తొలిసారిగా 1911 వ సంవత్సరంలో మహిళా దినోత్సవ వేడుకలు ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ తదితర దేశాలలో జరుపుకవడం ప్రారంభించారు. తర్వాత ఐక్యరాజ్యసమితి 1975 సంవత్సరంలో అధికారికంగా మహిళా దినోత్సవాన్ని నిర్వహించడం ప్రారంభించింది. అప్పటినుండి ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు మహిళా దినోత్సవం నిర్వహించడం ప్రారంభించాయి.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 8న జరుపుకునే కారణాలు

అది మార్చ్ 8, 1857 వ సంవత్సరం న్యూయార్క్ లో వస్త్ర పరిశ్రమలో పనిచేసే వేల మంది మహిళా కార్మికులు లింగ వివక్షతకు వ్యతిరేకంగా పని గంటలు తగ్గించాలని, వేతనాలు పెంచాలని కోరుతూ సమ్మెకు దిగినారు. ఆ సమ్మె ప్రపంచంలో మహిళా కార్మికులు చేసిన మొట్టమొదటి వ్యవస్థీకృత సమ్మె.

అది మార్చ్ 8, 1917 సంవత్సరం. జారిస్ట్ రష్యాలోని పెట్రోగ్రాడ్ ప్రస్తుత సెయింట్ పీటర్స్ బర్గ్ లో వేల మంది మహిళా కార్మికులు అప్పటి జార్ చక్రవర్తి మోదటి ప్రపంచ యుద్ధంలో పాల్గొనడాన్ని నిరసిస్తూ మాకు "రొట్టె మరియు శాంతి" కావాలనే నినాదాలతో ర్యాలీని చేపట్టినారు. అప్పుడు జార్ చక్రవర్తికి వ్యతిరేకంగా మార్చ్ 8న మహిళలు చేసిన ఈ ఉద్యమం రష్యాలో ఫిబ్రవరి విప్లవానికి అంతిమంగా అక్టోబర్ విప్లవానికి దారి తీసి జార్ సామ్రాజ్యాన్ని అంతం చేసి రష్యాలో కమ్యూనిస్టు పరిపాలనకు నాంది పలికింది.

చరిత్రలో గొప్పగా నిలిచిపోయిన ఈ రెండు మహిళా ఉద్యమాలు మార్చి 8న జరగడంతోఐక్యరాజ్యసమితి 1977వ సంవత్సరంలో ' మార్చ్ 8' ని అంతర్జాతీయ మహిళా దినోత్సవ రోజుగా అన్ని దేశాల అంగీకారంతో ఆమోదించింది. ఆరోజు నుండి మార్చ్ 8 ని అంతర్జాతీయ మహిళా దినోత్సవం గా ప్రపంచ దేశాలు జరుపుకోవడం ప్రారంభించాయి.

దారుషిఫా అంధ బాలుర పాఠశాలలో మహిళా దినోత్సవం





నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మందడి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం అంధ బాలుర పాఠశాల దారుషిఫాలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ డిప్యూటీ కమిషనర్ సరితా రెడ్డి, బాల భవన్ సూపరిటెండెంట్ విజయలక్ష్మి పాల్గొని మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ సరితా రెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, అంధ విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులు చేసే కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఇంచార్జ్ అంజుమ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అసాధ్యాన్ని సుసాధ్యం చేసే శక్తి మహిళలకే ఉంది

- అంగన్వాడి ఉపాధ్యాయురాలు సరస్వతి నీరజ



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట.

ఏ రంగంలోనైనా అసాధ్యాన్ని సుసాధ్యం చేసే శక్తి మహిళలకే ఉందని ం రంగారెడ్డి రంగారెడ్డి డివిజన్ సెక్టర్ 3 గిరి నగర్ కేంద్ర అంగన్వాడి ఉపాధ్యాయురాలు సరస్వతి నీరజ అన్నారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని గురువారం ఆమె నవతెలంగాణ తో మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో శాస్త్ర సాంకేతిక రంగాలతో పాటు మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని పురుషులతో సమానంగా స్త్రీలు మేము సైతం అంటూ ముందడుగు వేస్తున్నారని తెలిపారు.ధైర్యే సాహసే లక్ష్మీ అన్న చందంగా మహిళలు వారి నైపుణ్యం కనబరుస్తూ ప్రతి లక్ష్యాన్ని అవలీలగా ఛేదిస్తున్నార న్నారు.ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు మహిళల పట్ల వివక్ష చూపకుండా సమన్యాయం కల్పించాలని అన్ని విధాలుగా ప్రోత్సహిం చాలని ఆమె వ్యాఖ్యానించారు.దివి నుంచి భువికి ఎదుగుతున్న నేటి మహిళలు అత్యంత సాహసోపేతంగా దూసు కెళ్తున్నారు.సాఫ్ట్వేర్ రంగంలో అద్భుత ప్రతిభ కనబరుస్తూ మహిళలు, యువతులు శక్తిని చాటుతున్నారన్నారు. భవిష్యత్తులో కూడా మరింత ఉన్నత స్థాయికి ఎదిగే విధంగా మనోధైర్యంతో మహిళలు సత్తా చాటాలన్నారు.సమస్త మహిళ లోకానికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రత్యేకతను గుర్తించాలి..

- గోషామహల్ ట్రాఫిక్ ఏసీపీ డి. ధనలక్ష్మి



నవతెలంగాణ - ధూల్ పేట్

అంతర్జాతీయ మహిళా దినోత్సవ ప్రత్యేకతను గుర్తించాలని... ఆ రోజు సెలవు ప్రకటించాలని గోషామహల్ ట్రాఫిక్ ఏసీపీ డి. ధనలక్ష్మి అన్నారు. వారు మాట్లాడుతూ 'ప్రస్తుతం మహిళలు అన్నింట్లో రాణిస్తున్నారు. ప్రోత్సాహం కల్పించాలి. స్వతంత్ర, గణతంత్ర దినోత్సవాలకు వాటిని గుర్తు చేసుకుంటాం. మహిళా దినోత్సవాన్ని ప్రత్యేకత, ప్రాధాన్యతను తెలపాలి. 33శాతం రిజర్వేషన్, అవకాశాలు చెప్పడం తోపాటు మహిళా పోరాటాల ప్రత్యేకత తెలియచేయాలి.



హర హర మహాదేవా..శంభో శంకర

ఆహ్లాదం..ఆధ్యాత్మికం..కీసరగుట్ట

నవతెలంగాణ-కీసర

చక్కటి ఆహ్లాదకర వాతావరణం..చుట్టూ ఎతైన కొండలు..పచ్చని చెట్ల పొదలు..పక్షుల కిలకిలరాగాలు..తమ అందాలను ఆవిష్కరిస్తూ మెరిసే దృశ్యాల మధ్య పచ్చని చెట్ల నుంచి వచ్చే పరిశుభ్రమైన గాలిని పీల్చుకుంటూ మరో వైపు దైవస్మరణ చేసుకుంటూ కాసేపు అన్నీ మరిచి కాలక్షేపం చేయాలంటే ఎవరికి ఇష్టం ఉండదు..ఈ దృశ్యాలన్నీ నగర ప్రాంతానికి అత్యంత చేరువలో ఉన్న సుప్రసిద్ధ శైవక్షేత్రమైన కీసరగుట్టలో సందర్శకులను ఇట్టే ఆకట్టుకుంటాయి. ప్రతి నిత్యం కాలుష్యపు కోరల్లో సతమతమయ్యే నగర వాసులకు ఒకింత ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించే కీసరగుట్ట సందర్శకులకు ఒక మధురానుభూతిని మిగులుస్తుంది. జిల్లాలోని నలుమూలాల నుంచి వచ్చే భక్తులకు, యాత్రికులకు ఇక్కడి చారిత్రాత్మక, సాంస్కృతిక వైభవానికి నిలిచింది.

జిల్లాలోనే అతి పురాతనమైన శైవక్షేత్రంగా పేరొందిన కీసరగుట్ట దేశంలోని





ద్వాదశ జ్యోతిర్లింగాలతో సమానంగా వెలుగొందుతుంది. ఈ క్షేత్రంలో కొలువైన శ్రీరామలింగేశ్వర స్వామి ప్రతి ఏడాది మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులచే ప్రత్యేక పూజలందుకుంటున్నాడు. లక్షలాది మంది భక్తులు, వీఐపీలు, రాజకీయ ప్రముఖులు స్వామి వారిని దర్శించుకుంటారు. ఆలయం పశ్చిమాభిముఖంగా ఉండటం ఇక్కడి విశేషం. స్వామి వారికి కుడి వైపున భవానీ అమ్మవారు, ఎడమవైపున శివదుర్గా అమ్మవారు, విఘ్న నాయకుడు కొలువయ్యారు.

కేసరిగిరి పురాణం ప్రకారం స్థలకథ..ద్వాపర యుగంలో రావణుడిని సంహరించిన అనంతరం సీతా సమేతంగా అయోధ్య నగరానికి బయలుదేరిన శ్రీరాముడు బ్రహ్మహత్యా పాపాన్ని పోగొ ట్టుకునేందుకు మహర్షుల సూచన మేరకు పలు ప్రాంతాల్లో శివలింగ ప్రతిష్ఠ చేయాలని సంకల్పించాడు. అలా ఈ ప్రాంతం గుండా తన పరిహరంతో వెలుతున్న రాముడు ఇక్కడి ప్రకృతిని చూసి ఆనందించి శివలింగ ప్రతిష్ఠ చేయాలని మహర్షులను కోరాడు. వారు సంతోషించి సుమూహుర్తం నిశ్చయించారు. కాశీ క్షేత్రానికు వెళ్లి గొప్ప శివ లింగం తేవాల్సిందిగా హనుమంతుడిని శ్రీరాముడు ఆజ్ఞాపించాడు. కాశీకి వెళ్లిన హనుమంతుడికి ఈశ్వరుడు నూటోక్క శివలింగాల రూపంలో కనిపించాడు. దీంతో హనుమంతుడు అన్ని శివలింగాలను తీసుకుని ఆకాశమార్గమున బయులుదేరాడు. ఇక్కడ మహర్షులు నిర్ణయించిన ముహూర్తం సమీపిస్తున్నది కానీ హనుమంతుడు రాలేదు. వెంటనే శ్రీరాముడు ఈశ్వరుడిని ప్రార్థించగా ప్రత్యక్షమై శివలింగ రూపాన్ని ధరించి కొలువైయ్యాడు. అలా ఆ శివలింగానికి రామలింగేశ్వర స్వామి అనే పేరు వచ్చింది. అనంతరం శివలింగాలతో వచ్చిన



హనుమంతుడు వీటిలో కావాల్సినవి ప్రతిష్టంచండి, మిగిలినవి కాశీలో ఉంచి రావాలని అన్నాడు. శ్రీరాముడు జరిగిన కథను హనుమంతుడికి వివరించాడు. తాను చేసిన పని ఉపయోగ పడకపోవడంతో ఆగ్రహించిన హను మంతుడు లింగాలను విసిరివేయగా పరిసర ప్రాంతాల లో చెల్లాచెదురుగా పడ్డాయని భక్తులు విశ్వసిస్తారు. అప్పుడు హనుమంతుడి పేరుమీద కేసరిగిరిగా ప్రసిద్ధి చెందుతుందని శ్రీరాముడు వరమిచ్చాడు. శాంతించిన హనుమంతుడు విసిరిన లింగాలలో ఒక దానిని శ్రీస్వామి వారి వామ భాగంలో ప్రతిష్టించాడు. అదే మారుతీ కాశీ విశ్వేశరాలయం.

క్షేత్రంలో సందర్శనీయ స్థలాలు..

1) ప్రధాన ఆలయానికి పక్కన సీతమ్మ వారు పూజించి తరించిన సీతమ్మ గుహ
2) కాశీ నుంచి తెచ్చిన ఆంజనేయ ఆగ్రహానికి గురై తోకతో విసిరేయగా చెల్లాచెదురుగా పడి ఉన్న శివలింగాలు గుట్టపై ఆలయానికి ఎదురుగా కన్పిస్తాయి.
3) ఆంజనేయ స్వామి తీసుకొచ్చిన నూటొక్క లింగాలలో ఒక లింగాన్ని శ్రీరాముడు ఆలయానికి వామ భాగాన ప్రతిష్ఠించాడు. దాన్నే మారుతీ కాశీ విశ్వేశ్వరాలయంగా పిలుస్తున్నారు.
4) ఆలయానికి పక్కన అక్కన మాదన్నలు నిర్మించిన ఆలయం. దాని వెనుకలే ఏకశిలా విజయస్థూపం కన్పిస్తుంది. దీనిపై మత్స్య, కుర్మ, వరహ గణపతి, కేసరి, ఆంజనేయ విగ్రహాలున్నాయి.
5) ఆలయానికి వెళ్లే దారిలో పురావస్తు తవ్వకాలల్లో బయటపడిన కట్టడాలు
6) ప్రధాన గుట్ట దిగువ భాగాన ఉన్న మరో గుట్టపై గయుడు వేట కోసం వచ్చి శుక్రచార్యున్ని కుమార్తె దేవసేనను రక్షించిన మూడు బావులు కన్పిస్తాయి.
7) సీతమ్మ గుహకు వెళ్లేదారిలో కుడివైపున విఘ్నేశ్వరుడు, శివలింగం, తెల్లతామరకొలను పక్కన శివలింగం, నంది ఒకే చోట దర్శనమిస్తాయి.
8) తామరకొలను నుంచి స్వామి దర్శనం వచ్చే దిగువ భాగంలో శ్రీరామ పాదాలు కన్పిస్తాయి.
9) మరోచోట చతురస్రాకారపు చామిడిలో శివలింగం, తామర కొలను మధ్య రాతి స్తంబాలతో కట్టిన చతురస్రాకారపు గర్భాలయంలో శివలింగం కన్పిస్తుంది.

మహాశివరాత్రికి ముస్తాబైన శ్రీ కాశీ విశ్వనాథ ఆలయం

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

నేరేడ్‌మెట్ మెయిన్ రోడ్డులో ఉన్న చరిత్రాత్మకమైన శ్రీ అన్నపూర్ణ శ్రీ కాశీ విశ్వనాథ దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను మూడు రోజులు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నెల 7వ తేదీన ప్రారంభమై 9వ తేదీ వరకు వేడుకలు జరగనున్నాయి. ఇప్పటికే దేవాలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ ఆలయానికి పరిసర ప్రాంతాల నుంచి దాదాపు లక్ష మంది భక్తులు హాజరై శ్రీ కాశీ విశ్వనాథుడిని దర్శించుకుంటారని ఆలయ కమిటీ సభ్యులు చెబుతున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. గురువారం గణపతి పూజ, అఖండ దీపారాధన, పుణ్య హవాచనం, గణపతి హెూమం, నవగ్రహ హెూమం, రుద్ర హెూమం సహస్ర పట్టాభిషేకం తదితర కార్యక్రమాల జరిపారు. 8వతేదీన మహాశివరాత్రి సందర్భంగా ఉదయం నాలుగు గంటల నుంచి సుప్రభాత సేవ, ప్రాతఃకాలసేవ, ప్రత్యేక శివ పంచాయతన పూజ, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం సామూహిక అర్చనలు జరగనున్నాయి. రాత్రి 11 గంటలకు లింగోద్భవ కాలం ఏకాదశ రుద్రాభిషేకం, 11 రకాల పండ్ల రసాలతో నిర్వహిస్తారు. రాత్రి 12 గంటలకు శివపార్వతుల కల్యాణ మహెూత్సవం జరుగుతుంది. 09న ఉదయం 9 గంటలకు స్వామివారికి అన్నాభిషేకం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం శివ పార్వతుల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు కార్యక్రమంతో మహాశివరాత్రి మహెూత్సవ ఘట్టం ముగియనున్నది.

ఆలయ చరిత్ర..

ఓల్డ్ నేరేడ్‌మెట్ మెయిన్ రోడ్డులోని శ్రీ అన్నపూర్ణ సమేత శ్రీ కాశీ విశ్వనాథ దేవాలయం 1925లో చిన్నగా రేకుల షెడ్డు వేసి శివాలయంగా నిర్మించారు. అప్పుడు ఈ శివాలయానికి శ్రీ శివ భక్త భజన మందిరం అని నామకరణం చేశారు. 60 ఏండ్ల వరకు ఒక రేకుల షెడ్యూల్‌లోనే ఉన్నది. ఆ తర్వాత బొంబాయి పెంకులతో మరో నూతన మందిరం అప్పట్లో నిర్వహించారు. ఆ తర్వాత 1980లో ఇప్పుడున్న నూతన దేవాలయం నిర్మించి, కాశీ నుంచి పవిత్రమైన శివలింగాన్ని తెచ్చి ఇక్కడ ప్రతిష్ఠించి శ్రీ కాశీ విశ్వనాథ ఆలయంగా నామకరణం చేశారు. అప్పటి నుంచి ఆలయం అభివృద్ధి చెందుతూ భక్తులు రాక



పెరిగింది. కోరిన కోరికలు తీర్చే దేవుడని భక్తుల ప్రగాఢమైన విశ్వాసం. ఈ దేవాలయంతో పాటు శ్రీ అన్నపూర్ణ దేవి దేవాలయం, నవ గ్రహ దేవాలయం, శ్రీ ముత్యాలమ్మ, శ్రీ నల్ల పోచమ్మ, సుబ్రమణ్య స్వామి, నాగదేవత పుట్ట ఉండడం తో అనునిత్యం భక్తుల రద్దీతో మన్ననలు పొందుతోంది.



మహిళ శక్తితోనే ఉత్తమ సమాజం

- దేశాభివృద్ధిలో నారీశక్తి కీలకపాత్ర
- ప్రముఖ వ్యాపార వేత్త ఈటల జమున



నవతెలంగాణ-బోడుప్పల్

సమాజ పుట్టుకకు కారణం మహిళ, మాతృ స్వామిక వ్యవస్థలో మహిళలే కుటుంబాలు నడిపారు. ఏ ఇంట్లో అయితే మహిళలు ఇంటిని గొప్పగా నడుపుతారో.. ఆ ఇంట్లో సంతోషం ఉంటుందని ప్రముఖ పారిశ్రామికవేత్త ఈటెల జమున తెలిపారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఆమె మాటాడుతూ.. ఒకప్పుడు మహిళలు ఇంటికే పరిమితం అయ్యేవారు, ఇప్పుడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు.

రాజకీయంలో మహిళల పాత్ర గొప్పగా ఉంది..

కరోనా వైరస్ ప్రపంచాన్నే పీడిస్తున్న సమయంలోనూ కుటుంబాలను వదిలి ఆస్పత్రుల్లో గొప్పగా సేవలు అందించారు. చట్ట సభల్లోనూ మహిళల పాత్ర గొప్పగా ఉంది. ప్రధాని నరేంద్ర మోడీ తెచ్చిన 33శాతం రిజరేషన్‌తో ఈ భాగస్వామ్యం మరింత పెరగనుంది. భేటీ బచావో- బేటీ పడావో నుంచి మొదలుకొని సుకన్య సమృద్ధి యోజన వరకు అనేక రకాల కార్యక్రమాల ద్వారా మహిళల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం శ్రమిస్తుంది. నారీ శక్తితో దేశాన్ని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దడానికి మోడీ చేస్తున్న కృషి అభినందనీయం. ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్న మహిళాలోకానికి మహళా దినోత్సవ శుభాకాంక్షలు.

కాంగ్రెస్‌తోనే మహిళా సాధికారత

- కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.కే.దుర్గ



నవతెలంగాణ-బోడుప్పల్

దేశంలోని మహిళలను అత్యంత శక్తివంతమైన వారిగా తీర్చడానికి కృషి చేసిందే నాటి ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ, ఆమె ప్రధానిగా ఉన్న సమయంలోనే మహిళల సమృద్ధి కోసం పాటుపడింది. అనంతరం యూపీఏ చైర్ పర్సన్‌గా సోనియా గాంధీ మహిళల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు అమల్లోకి తెచ్చింది. మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చేందేలా ప్రోత్సాహం అందించింది. రాజకీయాలలో మహిళలకు స్థానిక సంస్థలలో 33 శాతం రిజర్వేషన్ అమలు చేసి రాజకీయాల్లో మహిళల పాత్రను పెంచడంలో విశేషంగా కృషి చేసింది. మహిళ రిజర్వేషన్ బిల్లును ఆమోదించి ఇంకా అనేక మంది మహిళలకు చట్ట సభల్లో ప్రాతినిధ్యం పెంచేందుకు అన్ని పార్టీలు కృషి చేయాల్సిన అవసరం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో కూడా మారిన కాలమాన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మహిళలకు అన్ని రంగాలలో ప్రోత్సాహం అందేలా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేయాలని కోరుతున్నాం.

ఉద్యోగం బాధ్యత పెంచింది

- మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలి
- ఎంఎస్ హసీనా, మేడిపల్లి తహశీల్దారు



నవతెలంగాణ-బోడుప్పల్

మహిళలు ఇంటికే పరిమితం అనేది ఒకప్పు డి నినాదం. నేడు ట్రెండ్ మారింది. ఆకాశంలో సగం.. అవకాశాలలో సగం అనేది నేటి నినాదం అని మేడిపల్లి తహశీల్దారు ఎంఎస్ హసీనా స్పష్టం చేశారు. అంతర్జాతీయ మహిళ దినోత్స వం సందర్భంగా "నవతెలంగాణ" తో మాట్లాడు తూ.. ప్రస్తుతం మహిళలు పోటీ ప్రపంచంలో అన్నింటి లోనూ.. అందరితోనూ పోటీ పడేలా ఎదగాలన్నారు. గృహిణిగా ఇంటి బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తునే.. ఉద్యోగ బాధ్యతలను సక్రమం గా నిర్వహించడం ప్రధాన కర్తవ్యంగా పెట్టుకోవడం ద్వారా లక్ష్యాన్ని చేరుకోవచ్చు.

ఉద్యోగం బాధ్యతగా చేయాలి

నేను నా భర్త ప్రోత్సాహంతోనే ఈ ఉద్యోగం సాధించాను. పెళ్లి అనేది చదువుకు, ఉద్యోగానికి అడ్డంకి కాకూడదనేది ముందుగానే నిర్ణయించుకున్నాను. ప్రస్తుతం నేను చేస్తున్న ఉద్యోగం హెూదాలా కాకుండా బాధ్యతగా నలుగురికి సాయం చేయాలనేదే నా లక్ష్యం.

మహిళలు ధృఢంగా ముందుకు సాగాలి

నేటి పోటీ ప్రపంచంలో మహిళలు తమలోని భయాన్ని వీడి ధృఢంగా ముందుకు సాగాలి. ఉద్యోగం, కుటుంబ రెండింటిని సమన్వయం చేసుకుని అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని సలహ ఇచ్చారు. ఈ సందర్భంగా మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

అన్నింట్లో మహిళల సాధికారత పెరగాలి

- పీర్జాదిగూడ కార్పొరేషన్ నగర కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు శ్రీలత బద్రూ నాయక్



నవతెలంగాణ-బోడుప్పల్

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు అవుతున్న ఇప్పటికీ మహిళ సాధికారత విషయంలో కావాల్సిన అభివృద్ధి జరగలేదు. గతంతో పోలిస్తే అన్ని రంగాల్లో మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరిగింది. కానీ ఇంకా జనాభాకు అనుగుణంగా పెరగలేదు. ఇంకా కొన్ని చోట్ల మహిళల విషయంలో ఆంక్షలు, వివక్ష కొనసాగుతుంది. ఇవన్నీ పోవాలంటే అందరిలోనూ అందరూ సమానమే అనే భావన రావాలి. అది కుటుంబం నుండే మొదలు కావాలి. భారత రాజ్యంగం కల్పించిన హక్కులను ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమలు అయిన రోజే మనకు ఈ వివక్షలు లేని సమాజం ఏర్పాటు అవుతుంది. ముఖ్యంగా ప్రభుత్వాలు, పాలకులు మహిళ సాధికారత కోసం విశేషంగా కృషి చేయాలి. మహిళలు నేటి సమాజంలో అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నా కొన్ని చోట్ల విపరితమైన ఆంక్షాలు, అవమానాలు ఎదుర్కొంటున్నారు. ఇవన్నీ పోవాలంటే పాలకులు రాజ్యాంగాన్ని తూచా తప్పకుండా అమలు చేయాలనేది నా భావన.

మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

- పురుషులతో సమానంగా రాణిస్తున్నారు
- కాంగ్రెస్ నాయకురాలు ఈగ శ్వేత ముదిరాజ్



నవతెలంగాణ-జవహర్‌నగర్

పురుషులతో సమానంగా మహిళలు పోటీపడుతున్నారని, కుటుంబం, సమాజంలో మహిళల పాత్ర చాలా కీలకమని కాంగ్రెస్ దమ్మాయిగూడ మహిళా అధ్యక్షురాలు శ్వేతా ముదిరాజ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఒక మహిళగా జన్మించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఒక పురుషుడి జీవితంలో తల్లిగా, సోదరిగా, భార్యగా, స్నేహితురాలుగా స్త్రీలు బహుళ పాత్రలు పోషిస్తారని తెలిపారు. పురుషులు వారి జీవితంలో మహిళలు లేకుండా మనుగడ సాగించలేరని అన్నారు. మహిళల్లో సంకల్ప శక్తి ఎక్కువగా ఉందని, ఏదైనా సాధించగలరని పేర్కొన్నారు. మహిళలు డాక్టర్లు, పోలీసులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, రాజకీయాలు వంటి పలు రంగాలలో సత్తా చాటుతున్నారు. మహిళలు తమ కలల సాకారం కోసం అహర్నిశలూ పాటుపడాలని సూచించారు. రాజకీయాలలో స్త్రీలు రాణించాలన్నారు.

విభిన్న రంగాలలో మహిళలు సత్తా చాటుతున్నారు

- రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మీ



నవతెలంగాణ-జవహర్‌నగర్

అన్ని రంగాల్లో పురుషుల కంటే మహిళలు మెరుగ్గా రాణిస్తున్నారని జవహర్ నగర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళల జీవితం అంటే చదువు, వృత్తి, అభిరుచులు, వివాహం, స్వతంత్రంగా ఉండటం వంటి విషయాలపై నిర్ణయాలు వారే తీసుకోవాలన్నారు. మహిళా అధికారులందరూ ధైర్యంగా ఉండాలని, పలు రంగాలలో సాధించిన విజయాలు రానున్న తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో తల్లి మొదటి గురువు అని, తల్లి ద్వారానే ప్రతి ఒక్కరూ ప్రపంచానికి పరిచయం అవుతారని తెలిపారు. పురుషుల కంటే స్త్రీలకు నిబద్ధత ఎక్కువ కాబట్టి ఏదైనా సాధించగలరని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర పోలీసు శాఖలో వేల మంది మహిళలు సమర్థవంతంగా పని చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా మణులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

రాజకీయాల్లో మహిళల సత్తా చూపాలి

- జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య



నవతెలంగాణ-జవహర్‌నగర్

మహిళలు అన్ని రంగాలల్లో రాణిస్తున్నారు. గృహిణిగా, ఉద్యోగ వ్యాపార రంగాలలో రాణించినట్లే రాజకీయాలలో కూడా సత్తా చాటాలని జవహర్ నగర్ మేకల కావ్య అన్నారు. ఇటీవల పార్లమెంటులో మహిళా బిల్లు ఆమోదం పొందడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. మహిళలు రాజకీయాలలో రాణించాలంటే తమ కుటుంబ సభ్యులు సపోర్టు చేయాలన్నారు. తమ కుటుంబ సభ్యుల సపోర్ట్ వల్ల ఈరోజు జవహర్ నగర్ మేయర్ స్థానంలో ఉండడం చాలా సంతోషంగా, గర్వంగా ఉందని తెలిపారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వాలు ఇంకా మెరుగైన చర్యలు చేపట్టాలి. ఈ సందర్భంగా మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

స్త్రీని గౌరవించే చోట అభివృద్ధి ఉంటుంది

- ఎన్.సృజన, ఐద్వా మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు



నవతెలంగాణ-బోడుప్పల్

సమాజంలో స్త్రీ ఎక్కడ గౌరవింపబడుతుందో అక్కడ అభివృద్ధి ఉంటుందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఐద్వా అధ్యక్షురాలు ఎన్.సృజన అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడు తూ స్త్రీలు నేడు అన్నిరంగా ల్లోనూ ముందున్నారని తెలిపారు. ఈ సంఖ్య మరింత పెరగాలని, ఏ రంగంలోనైనా విజయం సాధించాలంటే ముందు ఆరోగ్యంగా ఉండాలన్నారు. అందుకోసం నిత్యం పౌష్టికాహారం తీసుకోవా లని సూచించారు. ప్రతి పురుషుడి విజయంవెనుక స్త్రీఉంటుందని తన విజయం వెనుక తల్లి, భార్య, కుమార్తె ఉన్నారని వివరించారు.

సమాజంలో మహిళల పాత్ర కీలకం

- నవజ్యోతి విద్యాసంస్థల చైర్మెన్, కరస్పాండెంట్ మలిరెడ్డి ఇందిరా రవీంద్రారెడ్డి (ఎంఏ.బీ.ఎడ్)



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మహిళ సృష్టికే ఒక కానుక..ఆమె శక్తి అపారం.. ఆమె యుక్తి అమూల్యం. మహిళల శక్తి ముందు ఏ శక్తి నిలబడలేదని, సమాజంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డినగర్ డివిజన్ ఆదర్శనగర్‌కు చెందిన నవజ్యోతి విద్యాసంస్థల చైర్మెన్, కరస్పాండెంట్ ఇందిరా రవీంద్రారెడ్డి అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆమె గురువారం నవతెలంగాణతో మాట్లాడారు. ఆడదే ఆధారం మన కథ ఆడనే ఆరంభం అవుతుందని ఊహ తెలిసిన నాటి నుంచి బంధాలు, బాధ్యతలు కుటుంబ సంతోషం, బంగారు భవిష్యత్తు అహర్నిశలు కృషి చేస్తుంది. ప్రేమ, ఆప్యాయత, అనురాగాలు పంచి తన ఇంటితో పాటు సంఘాన్ని, దేశాన్ని నందనవనంగా మార్చే మహిళా మూర్తులందరికి శతకోటి పాదాభివందనాలు అని ఆమె తెలిపారు. "యాత్ర నార్యంతు పూజ్యంతే రమంతే తత్ర దేవతా"అని పెద్దలు ఎప్పుడో మహిళలకు దేవతలతో పాటు ఉన్నత స్థానాన్ని కల్పించారు. ప్రస్తుతం మన దేశ రాష్ట్రపతి పదవి తోపాటు, దేశఆర్థిక వ్యవస్థనీ మహిళలకు అప్పజెప్పారంటే మనం స్త్రీకి ఇచ్చే గౌరవం అర్థమవుతుంది. సహనం, ఓర్పు, విచక్షణాజ్ఞానం, మనోధైర్యం అనేవి మహిళలకు స్వతహాగా ఉండే ప్రధాన గుణగణాలన్నారు. ఈ సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా అధికారుల పబ్లిక్ సెలవులు రద్దు

- ఉత్తర్వులు జారీ చేసిన హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

నవతెలంగాణ-సిటీబ్యూరో



హైదరాబాద్ జిల్లా పరిధి లోని ప్రభుత్వ కార్యాలయాలలో 08-03-2024, 09-03-2024, 10-03-2024 తేదీలలో జిల్లా అధికారులు పబ్లిక్ సెలవులను హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి రద్దు చేశారు. ఈ మేరకు హైదరాబాద్ జిల్లా, కలెక్టరేట్, తహసీల్దార్లు, సూపరింటెండెంట్లు, సిబ్బంది, వారి కార్యాలయాలు యథావిధిగా నడపాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

'శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి'

నవతెలంగాణ-సంతోష్ నగర్

హైదరాబాద్ నగరాన్ని భద్రత సేఫ్ సిటీగా తీర్చదిద్దడంలో అన్ని వర్గాల ప్రజలు రాజకీయ నాయకులు పోలీసులతో సహకరించాలని సౌత్ ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ టి. స్వామి కోరారు. గురువారం పాతబస్తీ సౌత్ ఈస్ట్ జోన్ సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతల్ బస్తి పరిధిలోని తదితర ప్రాంతాల్లో కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నలుగురు ఏసీపీలు, 8 మంది సీఐలు 220 మంది పోలీసులతో నేతృత్వం వహించారు. ఈ ప్రాంతంలోని పలు వాణిజ్య కేంద్రాలను 400 నివాసగృహాలను తనిఖీ చేశారు. క్షుణ్ణంగా తనిఖీ చేసిన పోలీసులు 1500 మంది ఆధార్ కార్డులు క్షుణ్ణంగా తనిఖీలు చేసి ఆరుగురు అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించారు. సరైన ధ్రువపత్రాలు లేని 12 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఓ ఇంట్లో గుట్టు చప్పుడు కాకుండా మద్యం అమ్మకాలు చేస్తున్న ఓ మహిళను అదుపులోకి తీసుకొని 45 క్వార్ట ర్ బాటిళ్లను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. అసాంఘిక శక్తుల ఆగడాలను గుర్తించి వాటిని అరికట్టడమే ధ్యేయంగా కార్డాన్ సెర్చ్ నిర్వహించామని తెలిపారు.

త్వరలో అంతర్జాతీయ స్కిల్ యూనివర్సిటీ

- తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు
- తెలంగాణలో నాణ్యమైన విద్యా వ్యాప్తికి ప్రభుత్వం కృషి
- టీచర్ ట్రైనింగ్ శిక్షణా సంస్థ పటిష్ట పరుస్తాం
- ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్శిటీలో రౌండ్ టేబుల్ సమావేశం

నవతెలంగాణ-సిటీబ్యూరో



తెలంగాణ రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో త్వరలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం అడుగులు వేస్తోందని, ఈ అంశంపై అటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇటు మంత్రి వర్గ సహచరులు, అధికారులు చాలా చిత్తశుద్ధితో ఉన్నారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పేర్కొన్నారు. తెలంగాణా విద్యా శాఖ, ఉన్నత విద్యా మండలి, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో "తెలంగాణాలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు, ఇంటర్న్షిప్, ఉద్యోగాల కల్పన, విద్యార్థుల అభివృద్ధి" అనే అంశంపై గురువారం డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం అటు విద్యలో మరో వైపు ఐటీలో దేశంలోనే అగ్రగామిగా ఉందని, దీన్ని మరింత అందిపుచ్చుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ కళాశాలల్లో అభ్యసించే ఏ విద్యార్థి కూడా నైపుణ్యం లేకుండా ఉపాధి అవకాశాలు కోల్పోరాదని ఆ దిశగా ఉన్నత విద్యా మండలి, తెలంగాణ విద్యా శాఖ అధికారులు కృషి చేయాలని సూచించారు. డిగ్రీ స్థాయిలో విద్యాభ్యాసం చేస్తున్నప్పుడే విద్యార్థులు రాష్ట్రంలోని ప్రఖ్యాత పరిశ్రమల్లో ఇంటర్న్షిప్ పొందేలా చర్యలు చేపట్టాలని తద్వారా విద్యార్థికి పరిశ్రమలతో అనుసంధానం ఏర్పడి ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు. పరిశ్రమలకు కావాల్సిన రీతిలో విద్యార్థులను తీర్చిదిద్దడానికి విద్యా సంస్థలకు కూడా అవకాశం ఏర్పడుతుందన్నారు. హైదరాబాద్ లో ప్రఖ్యాత ఐటీ కంపెనీలు ఉన్నాయని ఆయా బహుళజాతీ సంస్థలు, ప్రఖ్యాత పారిశ్రామిక సంస్థలు ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణా ప్రాంతం నుంచి మరింత మంది ఉపాధి పొందడానికి ఇది దోహద పడనుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణా ఉన్నత విద్యా మండలి చేస్తున్న ప్రయత్నాన్ని అభినందిస్తూనే అటు ప్రభుత్వంతో ఇటు పారిశ్రామిక సంస్థలతో కో ఆర్డినేషన్ కోసం ఓ ప్రత్యేక సెల్ ను ఏర్పాటు చేసి విద్యా శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో మంత్రి సమక్షంలో ఉన్నత విద్యా మండలి - బి.ఎఫ్.ఎస్.ఐ. మధ్య కుదిరిన అవగాహనా ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. అనంతరం ఉన్నత విద్యా మండలి రూపొందించిన తెలంగాణ రాష్ట్ర విద్యాభివృద్ధి గణాంకాల నివేదికను, డైరీ ని మంత్రి ఆవిష్కరించారు.

కార్యక్రమంలో పాల్గొన్న విద్యా శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం ఐఏఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థల్లో అభ్యసించే విద్యార్థులకు ఆయా కోర్సుల్లో నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక శిక్షణను ఇచ్చేలా ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని దీనికి అన్ని విద్యా సంస్థలు, పారిశ్రామిక వేత్తలు సహకరించాలని కోరారు. ఇంజినీరింగ్ విద్యను, ఇతర డిగ్రీ కోర్సులను అభ్యసించే విద్యార్థులను అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కార్యక్రమాలను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పాల్గొన్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొ.లింబాద్రి అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఉన్నత విద్య స్థూల నమోదు జాతీయ స్థాయి సగటు కంటే ఎక్కువగా ఉందని, రాష్ట్ర విద్యారంగంలో అమలు అవుతున్న కార్యక్రమాలు ఉన్నతమైన గుర్తింపు పొందాయని వివరించారు. కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్లు ప్రొ. వెంకట రమణ, ప్రొ. ఎస్.కె. మహమూద్, కార్యదర్శి ప్రొ. శ్రీరాం వెంకటేష్ తదితరులు ప్రసంగించారు. సదస్సులో పలు విశ్వవిద్యాలయాల ఉపకులప తులు ప్రొ. రవీందర్, ప్రొ.గోపాల్ రెడ్డి, పలు పరిశ్రమల అధినేతలు బి.వి. మోహన్ రెడ్డి, శేకర్ రెడ్డి, శ్రీని రాజు, మమత, ఫిక్కీ నుంచి రాజీవ్ జూల కంటి, రిటైల్ మేనేజ్మెంట్ ప్రతినిధి సమీర్ నర్సాపూర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

తెలంగాణ సాహిత్య అకాడమిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

మెరుగైన సమాజం కోసం స్త్రీ పురుషులు ఇరువురు సంఘటితమై సమన్వయం చేసుకుంటూ ఒక స్ఫూర్తితో ముందుకు సాగాలని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి అన్నారు. మహిళ సాధికారతను మరింత సాధించడానికి చేయవలసిన కృషి గురించి వారు అనేక సూచనలు చేశారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఉదయం నుండి సాయంత్రం వరకు తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యాలయంలో వివిధ రంగాలకు చెందిన అనేకమంది ప్రముఖ మహిళలతో మెరుగైన సమాజం కోసం సమ్మిళిత స్ఫూర్తితో 'అనే అంశంపై 'చర్చ గోష్టి, కవి సమ్మేళనం' నిర్వహించారు.

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య కవులు కళాకారులతో పాటు సాహితీవేత్తలు మేధావులు అంతా కలిసి ఒక వారధిగా ఉండి, మహిళల అభివృద్ధి కొరకు ప్రభుత్వం ఏది అయితే అమలు చేయాలంటుందో వాటిని పూర్తి స్థాయిలో అమలు చేయాల్సిన అవసరం ఉంది అని ప్రముఖ కవయిత్రి మహెజబీన్ సూచించారు.

మానవ సంబంధాలు బాగా తగ్గుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో అమ్మాయిలు తమను తాము రక్షించుకోవడానికి, సంస్కరించుకోవడానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, అమ్మాయిలకు చెప్పే జాగ్రత్తలన్నీ అబ్బాయిలకు కూడా చెప్పాలని ప్రముఖ కవయిత్రి నెల్లుట్ల రమాదేవి సూచించారు.

మహిళా దినోత్సవ సందర్భంగా మహిళల కష్టాల గురించే గాక మన ఆడపిల్లలతో పిల్లలు పుట్టడం, సెక్స్ గురించికూడా మాట్లాడుతూ నేటి ఆడపిల్లలకు సరైన అవగాహన కల్పించాలన్నారు హిప్నో పద్మాకమలాకర్. మహిళలు తమకు తాము సంస్కరించుకోవడానికి పురుషులను శత్రువులుగా చూడాల్సిన అవసరం లేదన్నారు ఉప్పల పద్మ. జీవితం గురించి లౌక్యం జరుగుతున్న మార్పులను ఎప్పటికప్పుడు అమ్మాయిలతో మాట్లాడుతూ ఉండాలన్నారు కృష్ణవేణి. మహిళా సాధికారత కోసం కృషి చేయాలని చెబుతూ అభము శుభము తెలియని అమ్మాయిలను ఎత్తుకుపోయి వేశ్యాగృహాలకు అమ్ముకోవడాన్ని తీవ్రంగా పరిగణించాలన్నారు. సమాజంలో మనం ఏ అమ్మాయిల ఎదుగుదల గురించి మాట్లాడుకుంటామో ఆ వర్గం వారు లేకుండా చర్చలు చేయడము సబబు కాదని డాక్టర్ రజిని సూచించారు. మహిళా సాధికారత మహిళ అభ్యుదయం తదితరాలపై చదివిన కవితలు అలరించాయి. ఈ కార్యక్రమంలో అనేకమంది మహిళలు విద్యార్థినులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయాలి



- కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్
- ఎమ్మెల్యే మల్లారెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి రానివ్వం: రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్

నవతెలంగాణ-మేడ్చల్

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని కండ్లకోయలో ఈ నెల 9వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నిర్వహించే గెట్ వే ఐటి పార్క్ శంకుస్థాపన అనంతరం నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్యకర్త పదిమంది చొప్పున నాయకులను 50వేల మందికి తగ్గకుండా సభకు తరలించాలని సూచించారు. కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రివర్గ సభ్యులు హాజరవుతారని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన 90 రోజుల్లో ఇప్పటికే నాలుగు గ్యారెంటీలను అమలు చేసిందని అన్నారు.రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి రానివ్వబోమని అన్నారు. గత పది సంవత్సరాల కాలంలో ఎఫ్ టి ఎల్, ప్రభుత్వ భూములు ఎక్కడెక్కడ కబ్జా పెట్టావో ప్రభుత్వానికి అప్పగిస్తే అప్పుడు కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకునే అంశంపై ఆలోచిస్తామని ఎద్దేవా చేశారు.మల్లారెడ్డి అనే వ్యక్తి భూ కబ్జా కోరని అలాంటి వ్యక్తికి సీఎం రేవంత్ రెడ్డి సైతం సహకరించడని తెలియజేశారు.మల్లారెడ్డి కాంగ్రెస్ లోకి వచ్చే ప్రసక్తి లేదని వస్తే తరిమి తరిమి కొడతామని కార్యకర్తలు అలాంటి వ్యక్తి గురించి ఆలోచించవద్దని అన్నారు. ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు కబ్జా పెట్టారో వాటినన్నిటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకునేంత వరకు విడిచే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రమణారెడ్డి,మున్సిపల్ అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్ యాదవ్,వేముల శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సత్యనారాయణ, నాయకులు గోమారం బాల్ రెడ్డి,బైరీ ఈశ్వర్,రొయ్యపల్లి మల్లేష్ గౌడ్,షహీన్ పాషా,రాజశేఖర్ రెడ్డి,వెంకటేష్,అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE XXII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD

O.S No. 1035 OF 2019

Between:
ICICI BANK LIMITED ...Plaintiff
AND
Kalmali Basavaraj ...Defendant

To
Kalmali Basavaraj
S/O K Virupakshappa
Flat No 303, JK Classic Enclave, Chaitanya Colony, OPP Gayathri Residency Manikonda, Hyderabad-89 ...Defendant

Whereas the above named plaintiff filed suit against the defendants for Recovery of Claim and the same is posted to **20-03-2024** at 10-30 A.M for your appearance. You are hereby directed by the Hon'ble Court to appear before the said Court on the date and time mentioned above. Otherwise the matter will be heard on your absence.

//BY ORDER OF THE COURT//
B.PRAVEEN KUMAR,
Advocate
Office at 105, Plot 31, Hanmanth Reddy Complex, ChittareddyColony, Tadbund XRoad, Secunderabad-09

PASSPORT MISSING

I, Lakkanigam Ramacharyulu, S/o. Lakkanigam Raghavendra Rao, aged 61 years, occ. Pvt Servent, R/o. H.No.11-8-217/1/406, Sree Homes, Kranthi Nagar, Saroonagar, Huda Colony, Kothapet, Hyderabad - 500 035, RR Dist, that I further state that my passport was lost while going to take xerox copy of my Passport at Saroornagar, and unable to trace it finders may please contact me 9392362718, **Passport No. T236819,** Date of Issue is 21-10-1994 and Date of Expiry on 20.10.2004. Place of Issue Hyderabad

---

LOST OF DOCUMENTS

I, Sri Thulluri Malyadri S/o Thulluri Thiripalu, Office Address: Plot No 92, Rajiv Gandhi Nagar IE Prashanth Nagar, Kukatpally-500072,T.S. I Lost my Original link Sale Deed Document No:9295/2013, SRO Sangareddy (R.O) (1711,) Open Plot Bearing No.253, In Survey No's. 591/అ, 591/అ2, 591/అ3, 591/అ4 admeasuring 315 Sq.Yds., which is equivalent to 263.34 Sq.Mtrs., At the time of shifting our office I lost my original link documents , if any body found kindly let us know by contacting following number -**9849166855.**

పేరు మార్పు

సానికొమ్ము శ్రీకాంత్ తండ్రి వెంకటసుబ్బయ్య సానికొమ్ము, వయస్సు 38 ఏళ్లు, నివాసం: ఫ్లాట్ నెం.309,మంజీరా ట్రినిటీ హెూమ్స్, ధర్మ ఫేజ్, కెపిహెచ్బి కాలనీ, కూకట్పల్లి, మేడ్చల్, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం-500085, అను నేను ఇక్కడ ప్రకటించునది ఏమనగా..సానికొమ్ము శ్రీకాంత్ అనే (నా పాత పేరు) నా పేరును భవిష్యత్‌లోని అన్ని అవసరాల కోసం సానికొమ్ము శ్రీకాంత్‌రెడ్డి (కొత్త పేరు)గా మార్చుకుంటున్నాను.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE: AT ALAIR
O.S.No.119 OF 2020

Between:
Thummala Bakkamma and others ....Plaintiffs
AND
Sudi Muthyam Reddy and others ....Defendants

To
3. Gopishetti Mahesh, S/o. Lokesh war, Age 34 years, Occ: Business, R/o. H.No.23-6-918/11, Rajaroy Devidi, Shalibanda, Hyderabad.
4. Adam Shilpa, W/o. Adam Bharath Kumar, Age 40 years, Occ: House Wife, R/o.H.No.10-5-342/34, Kondareddy Nagar, Thukaram Gate, Jamal Osmania, Hyderabad. 500007.

NOTICE

That the above case is filed by the plaintiffs against the defendants for Partition and Recovery Possession of their 4/5th share in the Suit Schedule property and for Cancelation of the Registered Documents as null and void and not binding on them and said matter is posted on 11-03-2024 for your appearance. If you fail to appear on 11-03-2024 at 10.30AM before the above said Hon'ble Court either in person or through your advocate, the matter will be decided exparte as per law.

// BY ORDER OF THE HON'BLE COURT//
S.SREEKANTH
Advocate,Bhongir.

LOST OF DOCUMENTS

నేను S.వీరయ్య తండ్రి: S.భద్రయ్య R/o. 1-7-139/44, ఎస్.ఆర్.కె.నగర్, జమిస్తాన్ పూర్, ముషీరబాద్, హైదరాబాద్. గత 04-03-2024 రోజు న చిక్కడపల్లి నుండి R.T.C క్రాస్‌రోడ్ మార్గం మధ్యలో ఒరిజనల్ సేల్ డీడ్స్ నెం: 640/2001 మరియు 6402/2001 డాక్యుమెంట్ లు పోయి నవి. నేను (S.వీరయ్య) మరియు ఎం.ఎ.గపూర్ లు, ప్రతినిధులుగా సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (CITU) కోసం 2001లో కొనుగోలు చేయడం జరిగింది. ఎవరికైన దొరికిన చో క్రింది నెంబరకు తెలుపగలరు.

నెం: 9490098026

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE: AT ALAIR
I.A.NO.387 OF 2020
IN
O.S.No.119 OF 2020

Between:
Thummala Bakkamma and others ...Petitioners/Plaintiffs
AND
Sudi Muthyam Reddy and others ...Respondents/ Defendants

To
3. Gopishetti Mahesh, S/o. Lokesh war, Age 34 years, Occ: Business, R/o. H.No.23-6-918/11, Rajaroy Devidi, Shalibanda, Hyderabad.
4. Adam Shilpa, W/o. Adam Bharath Kumar, Age 40 years, Occ: House Wife, R/o.H.No.10-5-342/34, Kondareddy Nagar, Thukaram Gate, Jamal Osmania, Hyderabad-500 007.

NOTICE

That the above case is filed by the plaintiffs against the defendants for Partition and Recovery Possession of their 4/5th share in the Suit Schedule property and for Cancelation of the Registered Documents as null and void and not binding on them and said matter is posted on 11-03-2024 for your appearance. If you fail to appear on 11-03-2024 at 10.30AM before the above said Hon'ble Court either in person or through your advocate, the matter will be decided exparte as per law.

// BY ORDER OF THE HON'BLE COURT//
S.SREEKANTH
Advocate,Bhongir.

PUBLIC NOTICE

The General Public/All Concerned are hereby informed that my client **1.MOHIT AGARWAL** S/o NARESH KUMAR AGARWAL AND 2. **INDRA AGARWAL** W/O NARESH KUMAR AGARWAL R/o Navkar Prathul Residency, Tirumallgiri, Secunderabad, Telanagana have entered into an agreement of sale with **1.Mr. ASWIN SATYANARAYANA** S/o Late Sri G. SATYANARAYANA AND **2.NELLYPALLY SAMYOGEETHA** W/o Late Sri G. SATYANARAYANA Both are the Residents of House No.4-49/9, HMT Nagar Colony, Rama Krishna Nagar Society, Nagaram, Hyderabad-500 083, for the purchase of residential house Bearing No: 32-74/148 B (Now H. No. 1-30-254/6, PTI NO:1160117354), On Plot No.148 B, In Sy Nos. 387 to 390, Admeasuring 160 Sq. Yards, or 133.76 Square Meters, super built up area 2000 Square Feet, Situated at Telecommunication Colony, Alwal Village and Municipality, Malkajgiri Mandal, R R District now under **Medchal-Malkajgiri district,** Telangana.

If anybody has any right, interest, claim part or full over the above said property, they may contact the undersigned **within (7) days** from the date of this notice, otherwise my client will proceed with sale deed and will be deemed that there are no claims over the subject property and no claims whatsoever shall be entertained thereafter.

BANSAL &ASSOCIATES
Preethi Bansal, Advocate
Counsel for the Plaintiff
2-2-140 & 96, Adarsh Tower, Ranigunj, Sec-bad, T.S.-500 003
Cell No:9701093197

IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL DISTRICT JUDGE, SANGA REDDY DISTRICT, AT: SANGA REDDY
I.A.No.376 of 2023
IN
O.S.No.164 of 2023

Between:
K.PHANI BHUSHAN RAO ...Petitioner/Plaintiff
AND
N.VENKATESHWARA RAO ...Respondent/Defendant

NOTICE

To
M.VENKATESHWARA RAO, S/o. M.Laxman Rao, age 53 years, Occ: Business, R/o.23, C-1 Block, Shikara Apartments, Panjagutta, Hyderabad -500 082, T.S.s

Please take notice that the petitioner/plaintiff has filed the above Interim Application vide I.A.No. 376/2023 in O.S.No. 164/2023 for Interim Injunction against the respondent/defendant before the Hon'ble Court and the same is posted **on 26-03-2024** for your appearance if any, hence you are hereby directed to appear before the Hon'ble court **on 26-03-2024, at 10.30 a.m.** either in person or through Advocate, failing which the matter will be decided in your absence as per law. Hence this Notice

//BY THE ORDER OF THE HON'BLE COURT//
M/s.K.RAJ SHEKAR,
P. SHIVA KUMAR DAS,
HARI PRASAD
Advocate's
Off: 3-3-1017/A, beside Ranga Stores, Qutbiguda, Hyd-27, T.S, Cell:9848453789

IN THE COURT OF THE HON'BLE VIII JUNIOR CIVIL CITY CIVIL COURT AT HYDERABAD
O.S.NO.125 OF 2024

BETWEEN:
SUMITHRA ...PLAINTIFF
AND
THE TAHSILDHAR BHADHURPURA
2) ALL CONCERNED ...DEFENDANT

Please take notice that the plaintiff herein filed the above suit against defendants and all concerned for declaration of Legal Heirs. The plaintiff no 1 to 6 daughters and 7 to 12 grandchildrens of late Bramananda Chary and late Rajamani the said stands posted **to 12-3-2024** for your appearance if fail to appear before the said Hon'ble court **on 12-3-24 at 10:30Am** the matter will be decided in your absence.

K.ANITHA
Advocate
H No- 18-3-3/6
Maniknagar, chatrinaka
Hyderabad

NOTICE BY COURT ORDER
IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE: MEDCHAL MALKAJ DISTRICT AT: MALKAJGIRI
I.A.No.11 OF 2023
IN
O.S.No. 217 OF 2021

BETWEEN:
N. Satyanarayana .....Petitioner/Plaintiff
AND
Vasagoni Venkatesham & Others ....Respondents/Defendants

To,
R8. M/s. OTIS Infra Developers, Partnership firm having office at Office at 5-3-125,Main Road, Yapral Village, Malkajgiri Mandal, Medchal Malkajgiri District-087. rep. by its partners
1. Sri N. Sanjeeva Rao, S/o. N. Rama Rao,
2. Sri T. Srinivas Reddy, S/o. Raja Reddy,
3. Sri T. Linga Rao, S/o. T. Narayana Rao,
R9. Smt. Podduturu Sarojini Devi, W/o. Podduturu Santosh Reddy, aged about 63 years, Oce: House wife,R/o. H.No.5-9-43/5-8-31, Yellamma Gutta, besides Vijay Talkies, Nizamabad District, Telangana.

Please take notice that the above named Plaintiff filed the above O.S. No.217 of 2021 against Vasagoni Venkatesham and Others for Declaration of Title, in the above case the Plaintiff filed I.A. No.11/ 2023 to implead you as Respondents No.9. The notices were sent to you to appear before the Hon'ble Court, but you are avoiding same and as such the same could not be served on you. Hence you are hereby informed to take notice of the same and appear before the above said Hon'ble Court on 02-04-2024 at 10.30 a.m. either in person or through your Advocate duly instructed by you and file reply on your behalf.Otherwise, the matter will be decided in your absence as exparte.

SWAMY BANDAMIDI
ADVOCATE.
Shop No. 332, 3rd Floor, LPT Market, L.B. Nagar, Hyderabad-500074.
Cell: 9441742656.
Date: 05-03-2024,
Place: Hyderabad.

NOTICE BY COURT ORDER
IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE: MEDCHAL MALKAJ DISTRICT AT: MALKAJGIRI
I.A. No. 1544 OF 2022
IN
O.S. No. 218 OF 2021

BETWEEN:
V. Dattatreya Sarma .....Petitioner/Plaintiff
AND
Vasagoni Venkatesham & Others ....Respondents/Defendants

To,
R8. M/s. OTIS Infra Developers, Partnership firm having office at Office at 5-3-125,Main Road, Yapral Village, Malkajgiri Mandal, Medchal Malkajgiri District-087. rep. by its partners
1. Sri N. Sanjeeva Rao, S/o. N. Rama Rao,
2. Sri T. Srinivas Reddy, S/o. Raja Reddy,
3. Sri T. Linga Rao, S/o. T. Narayana Rao,
R9. Smt. N. Vani W/o. N. Sanjeeva Rao,Aged 43 years, Occ: House wife,R/o. Plot No.113 & 114, Maruthi Nagar, Road No.3,Dr. A.S. Rao Nagar, Malkajgiri Mandal,Medchal Malkajgiri, Hyderabad.

Please take notice that the above named Plaintiff filed the above O.S. No.218 of 2021 against Vasagoni Venkatesham and Others for Declaration of Title, in the above case the Plaintiff filed I.A. No.1544/2022 to implead you as Respondents No.9. The notices were sent to you to appear before the Hon'ble Court, but you are avoiding same and as such the same could not be served on you. Hence you are hereby informed to take notice of the same and appear before the above said Hon'ble Court on 02-04-2024 at 10.30 a.m. either in person or through your Advocate duly instructed by you and file reply on your behalf.Otherwise, the matter will be decided in your absence as exparte.

SWAMY BANDAMIDI
ADVOCATE.
Shop No. 332, 3rd Floor, LPT Market, L.B. Nagar, Hyderabad-500074.
Cell: 9441742656.
Date: 05-03-2024,
Place: Hyderabad.

IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL DISTRICT JUDGE, SANGA REDDY DISTRICT, AT: SANGA REDDY
O.S.No.164 of 2023

Between:
J. PHANI BHUSHAN RAO ...Plaintiff
AND
M.VENKATESHWARA RAO, ...Defendant

NOTICE

To
M.VENKATESHWARA RAO, S/o. M.Laxman Rao, age 53 years, Occ: Business, R/o.23, C-1 Block, Shikara Apartments, Panjagutta, Hyderabad -500 082, T.S.s

Please take notice that the plaintiff has filed the above suit against the defendant for **PARTITION & SEPARATE POSSESSION** before the Hon'ble Court and the case is posted **on 26-03-2024** for your appearance if any, hence you are hereby directed to appear before the Hon'ble court **on 26-03-2024, at 10.30.a.m.** either in person or through Advocate, failing which the matter will be decided in your absence as per law. Hence this Notice

//BY THE ORDER OF THE HON'BLE COURT//
M/s.KRAJ SHEKAR,
P.SHIVA KUMAR DAS,
HARI PRASAD
Advocate's
Off: 3-3-1017/A, beside Ranga Stores, Qutbiguda, Hyd-27, T.S.
Cell:9848453789

NOTICE BY COURT ORDER
IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE: MEDCHAL MALKAJ DISTRICT AT: MALKAJGIRI
I.A.No.9 OF 2023
IN
O.S. No. 214 OF 2021

BETWEEN:
B SM Sadaksharaiah .....Petitioner/Plaintiff
AND
Vasagoni Venkatesham & Others ....Respondents/Defendants

To,
R8. M/s. OTIS Infra Developers, Partnership firm having office at Office at 5-3-125,Main Road, Yapral Village, Malkajgiri Mandal, Medchal Malkajgiri District-087. rep. by its partners
1. Sri N. Sanjeeva Rao, S/o. N. Rama Rao,
2. Sri T. Srinivas Reddy, S/o. Raja Reddy,
3. Sri T. Linga Rao, S/o. T. Narayana Rao,
R9. Smt.K.Chandana, W/o.K Venkatramana Reddy, Aged about 45 years, Oce: House wife,R/o. H.No. 8-5-210/25, Flat No.205,Vaishnavi Residency, Shiva Enclave, Near Dubai Gate,Old Bowenpally, Secunderabad, Telanagana.

Please take notice that the above named Plaintiff filed the above O.S.No.214 of 2021 against Vasagoni Venkatesham and Others for Declaration of Title, in the above case the Plaintiff filed I.A. No.9/ 2023to implead you as Respondents No.9. The notices were sent to you to appear before the Hon'ble Court, but you are avoiding same and as such the same could not be served on you. Hence you are hereby informed to take notice of the same and appear before the above said Hon'ble Court on 02-04-2024 at 10.30 a.m. either in person or through your Advocate duly instructed by you and file reply on your behalf. Otherwise, the matter will be decided in your absence as exparte.

SWAMY BANDAMIDI
ADVOCATE.
Shop No. 332, 3rd Floor, LPT Market, L.B. Nagar, Hyderabad-500074.
Cell: 9441742656.
Date: 05-03-2024,
Place: Hyderabad.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ అయిన రాపాక కిష్టయ్య తండ్రి: ఎల్లయ్య,వయస్సు: 55 సం॥లు, వృత్తి: వ్యవసాయం, R/o. మందనపల్లి, ఆలేరు మండలం,యాదాద్రి భువనగిరి జిల్లా గారు దివి.13.04.2006 రోజున అసలు పట్టాదారులైన గొట్టం బుచ్చిరెడ్డి తండ్రి: మల్లారెడ్డి మరియు గొట్టం రవీందర్‌రెడ్డి గారల నుండి Sy.No.659/A, 660/A మొత్తం 5.20 అయిదు ఎకరముల ఇరవై గుంటల భూమిని రిజిస్ట్రేషన్ సేల్ డీడ్ ద్వారా కొనుగోలు చేశాడు. ఈ భూమి శభాష్‌గూడెం,H/o. నాగపూరి మం॥ చేర్యాల రెవెన్యూ పరిధిలో కలదు. అయితే నా క్లయింట్ తన పేరు మీద భూమి మూటేషన్ చేసుకోని కారణంగా కొందరు వ్యక్తులు పోర్జరీ సంతకాలతో ఈ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అందువలన నా క్లయింట్ సిద్ధిపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో Declaration of Title and Cancellation of Registration Sale deeds and Recovery of Possession సివిల్ దావాను గుమ్మడిదల రామదాస్ మరియు ఇతరుల మీద పైల్ చేయడం జరిగింది. మోడెపు కళావతి ఈ భూమిని 28.08.2021 రోజు శ్రీపతి శ్రీనుకు మరియు తాడెమ శ్రీనివాస్ ముదిరాజ్ గార్లకు అమ్మడం జరిగింది. ఈ భూములకు సంబంధించి అదనపు జూనియర్ సివిల్ జడ్జి సిద్దిపేట కోర్టులో సివిల్ దావా OS.No.778 OF 2022 కేసు నడుస్తున్నది. కావున సమస్త ప్రజలకు తెలియజేయునది ఈ భూములను కొనుగోలు చేసిన వ్యక్తుల పైన మరియు అమ్మిన వ్యక్తుల పైన నా క్లయింట్ సివిల్ క్రిమినల్ చర్యలు తీసుకుంటారని ఇందు మూలంగా హెచ్చరించనైనది.

ఈ భూమికి హద్దులు:
తూర్పు : కుమ్మరి హన్మయ భూమి
పడమర : బిటి రోడ్డు
ఉత్తరం : కొంతం యాదయ్య భూమి
దక్షిణం : రిజర్వు ఫారెస్ట్

ఇట్లు
వాది తరపు న్యాయవాది
బీమగాని శ్రీనివాస్ గౌడ్
B.A.,LL.B
Advocate,Alair.
Cell:8978368703.

IN THE COURT OF THE HON'BLE II ADDL., JUNIOR CIVIL JUDGE-CUM-VI ADDL., METROPOLITAN MAGISTRATE, MEDCHAL MALKAJGIRI COURTS, Uppal AT: L.B.NAGAR
O.S.No.956 of 2022 (New)
O.S.No.243 of 2019 (Old)

Between:
Canara Bank, Peerzadiguda Branch, Medchal Malkajgiri ...Plaintif
And
Sri.D.Shambu Prasad ...Defendant

To
Sri.D.Shambu Prasad S/o. D.Kumara Swamy, aged about 40 years, Occ: Business, R/o.H.No.3-22/8, Gandhi Nagar, Parvathapur, Hyderabad.

Take notice that the above named Plaintiffs have instituted the above suit against you for recovery of **Rs.2,52,877/-** together with costs and future interest. You are hereby summoned to appear before the Hon'ble Court in person **on the 01st April, 2024, at 10.30 am.** In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.

//By Order of the Court//
N.Venugopala Rao
Advocate
1-2-234/2/1, Plot No: 2/P Road No.4. SRL Colony Kothapet Hyderabad

---

IN THE COURT OF V SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS AT: HYDERABAD
E.P.NO.9 OF 2024
IN
O.S.No.619 OF 2021

Between:
Mrs.A.L.Kamala ...Petitioner/Decree Holder
And
Smt. Rupe Rao Laxmi ...Respondent/Judgment Debtor

TO
Smt.Rupe Rao Laxmi W/o.Shri R.Damodhar #House No.1-6-174/22/H/26 situated at Bapuji Nagar, Zamistanpur, Hyderabad-500020

Please take notice that the above named Decree Holder filed ER NO.9 Of 2024 in D.S.No.619 of 2021 for sale of EP schedule property for realization of an amount of **Rs.25,03,925/-** (Rupees Twenty five Lakhs Three Thousand Nine Hundred and Twenty five only) against you before the said Hon'ble Court. The matter stands posted **to 27-03-2024** and you shall appear before the above said court **at 10:30 A.M. on 27-03-2024** either in person or through an advocate. Otherwise the matter will be heard and decided as per law,

SCHEDULE OF IMMOVABLE PROPERTY OF JDR TO BE SOLD

All that the portion of house bearing Municipal No.1-6-174/22/H/26 ad measuring 42.18 sq yds situated at Bapuji Nagar, Zamistanpur, Hyderabad with all easements bounded by:

NORTH H. No.1-6-174/22/H/25
SOUTH: Portion of House
EAST: H.No.1-6-174/22/H/26/A
WEST: Road

(By the order of the Court)
R.CHAKRADHAR
V. VIMALANAND, ADVOCATES
6-1-295/1, PADMARAD NAGAR, SECUNDERABAD, 500020

IN THE COURT OF THE PRL.JUNIOR CIVIL JUDGE MEDCHAL-MALKAJGIRI DISTRICT: AT MEDCHAL
O.S.NO. 165 OF 2024

BETWEEN:
Smt.Chirra Anusha ...Plaintiff
AND
All concerned and others ...Defendants

To,
1.To All Concerned
2.Smt.Chirra Laxmi, W/o. Janardhan Reddy, A/a.57yrs , Occ: Sarpanch, Both R/o Banjara Village, Nellikuduru Mandal, Mahabubabad District, T.S-506 101.
3.M/s Bajaj Housing Finance Limited., Rep.By its authorised officer, ATC Building, 2 nd Floor, Office No.3A & 3B, Above Passport office, Ameerpet, Hyderabad, T.S-500 038.
...Defendants

Please take notice that the above plaintiff has filed the above suit for declaration to declare her as legal heir of Late Chirra Rajesh, with regard to the Flat No.G-2, Plot No.12 &13, having builtup area 1009 Sq.ft (including common area) with UDS of land 25 Sq.yds (out of total 510 Sq.Yds) and Car parking area, situated at Sumanth Sai Emerald, Srinivasa Nagar Colony, Nizampet Village, Quthubullapur Mandal, Medchal-Malkajgiri District Vide Regd.Doc.No.27625/ 2018 **dt.21.12.2018.** Take notice that the above said case is posted to **08.04.2024 at 10.30 A.M.** for any objection, the concerned person or persons shall be direct to appear before this court either in person or through advocate on the above said date. In case, failure to appear on the said date, the case will be heard and decided ex-parte, as per law.

(BY ORDER OF THE COURT)
P. VENKANNA,
CH.V.S.PRASAD,
Advocates,
Flat No.107-A, Sri Datta Sai Apartments, RTC X Roads, Opp: NABARD, Musheerabad, Hyderabad-20. Cell: 9848868344.

స్త్రీ లేకపోతే జననం లేదు. స్త్రీ లేకపోతే గమనం లేదు. స్త్రీ లేకపోతే సృష్టిలో జీవం లేదు. స్త్రీలేకపోతే అసలు సృష్టే లేదు".. కంటిపాపలా కాపాడే 'స్త్రీమూర్తి'కి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.



చరిత్రలో స్త్రీల స్థానం ప్రత్యేకం!



- జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఏ చరిత్ర తీసుకున్నా.. స్త్రీలకు ప్రత్యేక స్థానం ఉందని ఎండీ సుదర్శన్ రెడ్డి అన్నారు. జలమండలి ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి ఎండీ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎండీ మాట్లాడుతూ ఆడ, మగ అనే తేడా ఆలోచనల్లో కూడా ఉండకూడదన్నారు. సృష్టించే శక్తి మహిళలకే ఉందని కొనియాడారు. మహిళల కోసం అనేక చట్టాలున్నాయని కానీ వాటిని అమలు చేయడంలో విఫలమవుతున్నారన్నారు. ఫిన్లాండ్ లాంటి దేశాల్లో చట్ట సభల్లో అత్యధిక శాతం మహిళలే ఉన్నారని తెలిపారు. మనదేశంలోనూ అనేక విభాగాల్లో స్త్రీలదే పై చేయిగా ఉందని పేర్కొన్నారు. ఒలింపిక్స్‌ల్లో అత్యధిక మెడల్స్ సాధించిన ఘనత మహిళల సొంతమన్నారు. కల్పనా చావ్లా లాంటి వనితలు ఆస్ట్రోనాట్ రంగంలో రాణించిన విషయం గుర్తు చేశారు. ఈ కాలపు మహిళలు కూడా.. వారి స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. మరో ముఖ్య అతిథిగా హాజరైన రాఖీ కంకారియా మాట్లాడుతూ.. మహిళలు శక్తి స్వరూపులు అన్నారు. వారు లేకుంటే సృష్టే లేద న్నారు. వ్యక్తిగత, ఉద్యోగ ప్రయాణంలో వచ్చే అడ్డంకులన్నీ తొలగించుకుంటూ.. సొంత బలంతో విజయ పథంలో దూసుకెళ్లాలన్నారు. అనంతరం.. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలిచిన ఉద్యోగులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, జలమండలి ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏజే సుగంధిని, జనరల్ సెక్రటరీ బిల్కిస్ భాను, యాక్టివ్ అర్చనా వెంకటరెడ్డి, వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంబాబు యాదవ్, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.నారాయణ, ఇతర మహిళ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ విద్యావంతురాలు అయినప్పుడు కుటుంబంతో పాటు దేశం అభివృద్ధి చెందుతుంది. సమాజంలో మహిళలు ఆత్మగౌరవంతో, స్వశక్తితో ఎదిగేందుకు అవకాశాలు కల్పించాలి. అప్పుడే వాళ్లు పురుషులతో సమానంగా సమాజంలో గౌరవంగా జీవించగలుగుతారు. అన్నింట్లో మహిళలు స్వతహాగా నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛను కల్పించినప్పుడే మహిళ సాధికారతకు అవకాశం ఏర్పడుతుంది. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. ప్రభుత్వాలు అంతర్జాతీయ మహిళ దినోత్సవం వచ్చినప్పుడు మాత్రమే మహిళల సాధికారత, ఆత్మగౌరవం, హక్కుల కోసం మాట్లాడుతున్నాయి. కానీ అది అచరణలో అమలు జరగడం లేదు. ఇకనైనా ప్రభుత్వాలు మహిళల హక్కులపై చిత్తశుద్ధితో పనిచేయాలి. ప్రతిఒక్కరికి అంతర్జాతీయ మహిళ దినోత్సవ శుభాకాంక్షలు.

– ఎస్.శ్యామలీల, బి.కిరణ్మయి, టి.యాదమ్మ, సీఐటీయూ నాయకురాళ్లు

అమ్మను పూజించండి
భార్యను ప్రేమించండి
సోదరిని దీవించండి
అన్నిటికంటే ముఖ్యంగా

జీవితంలో నలుగురు స్త్రీలను
ఎప్పుడూ మరవకు..
నిన్ను పుట్టించిన తల్లి,
నీతో పాటు పుట్టిన
సోదరి, నీకోసం పుట్టిన భార్య
నీకు పుట్టిన కూతురు

ఆడపిల్లలు చదువుకోవాలి

ఆడపిల్ల చదువుకుంటే పుట్టినిల్లు, మెట్టినిల్లే కాకుండా తద్వారా సమాజం ప్రగతి పథంలో నడుస్తుంది. ఆడపిల్ల చదువు పట్ల ప్రతిఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలి. మహిళలు ఎలాంటి పరిస్థితినైనా సులువుగా చక్కబెడతారు. అయితే ప్రస్తుతం దేశంలో మహిళల పట్ల జరుగుతున్న అఘాత్యాలు బాధకారం. ఇలాంటివి అరికట్టలంటే ప్రతి తల్లి తమ కొడుకులకు మంచి నడవడిక, మర్యాద, విలువలు నేర్పించాలని మహిళ దినోత్సవం సందర్భంగా కోరుకుంటున్నాను. మగపిల్లలను సన్మార్గంలో నడిపించినప్పుడే మహిళ పట్ల జరుగుతున్న అఘ్యాతాలు ఆగిపోతాయి.

– ఆర్.రోహిణి, విద్యాశాఖాధికారిణి, హైదరాబాద్ జిల్లా

చదువుతోనే మార్పు సాధ్యం

సమాజంలో మార్పు చదువుతోనే సాధ్యమవుతుంది. చదువు వల్ల ఆడపిల్లల్లో ఆత్మ స్థైర్యం పెరుగుతుంది. వారి హక్కులు, రక్షణకు గల చట్టాలు, జీవితంలో ఉన్నత స్థానం చేరుకోవటానికి గల మార్గాలు, వారి ఆరోగ్యం పట్ల అవగాహన ఏర్పరుచుకుంటారు. పాఠశాల స్థాయిలో వారికి అవగాహన కల్పించటానికి వారి కలలు సహకారం చేసుకోవటానికి విద్యాశాఖ, పోలీసు, మహిళ శిశు సంక్షేమ, ఆరోగ్యశాఖతో పాటు ఎన్జీవోస్‌తో కలిసి పనిచేస్తున్నాయి. తల్లిదండ్రుల ఆలోచనలో మార్పు తేవడానికి ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాము. వివక్షతో ఆడపిల్ల స్వేచ్ఛ హరించే హక్కు ఎవరికి లేదు.

– ఎస్.రజిత, జెండర్ ఈక్విటీ కో-ఆర్డినేటర్, జిల్లా విద్యాశాఖ





























కమ్యూనిజం వర్ధిల్లితేనే మహిళకు సమానత్వం

'మహిళా దినోత్సవం' అన్నా, 'శ్రామిక మహిళా దినోత్సవం' అన్నా ఈ రోజు అంతర్జాతీయ సంఘీభావ దినోత్సవం. శ్రామిక మహిళా ఉద్యమం తన బలాన్ని, నిర్మాణాన్ని సమీక్షించుకోవాల్సిన రోజు. అయితే ఇది మహిళలకు మాత్రమే ప్రత్యేకించిన రోజు కాదు. మార్చి 8 అనేది శ్రామికులకు, రైతాంగానికి, కార్మిక వర్గానికి యావత్ ప్రపంచ కార్మిక వర్గానికి చారిత్రాత్మకమైన, మరుపురాని రోజు. మహిళా దినోత్సవం నాడు ప్రత్యేకించి శ్రామిక, రైతాంగ మహిళా సమావేశాలు నిర్వహించడం మీదే ఎందుకు దృష్టి పెడుతున్నాం? ఏ లక్ష్యం కోసం మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామో ఈ రోజు గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

1910 నుండి మహిళా సమానత్వం గురించి, మగవాళ్ళతో పాటు మహిళలకు కూడా రాజకీయ పాలనాధికారం గురించి తీవ్రమైన చర్చ మొదలయింది. అభివృద్ధి చెందిన దేశాలన్నింటా కార్మిక వర్గం శ్రామిక మహిళల హక్కుల గురించి పోరాటాలు నిర్వహిస్తూ ఉన్నది. కానీ పెట్టుబడిదారులు శ్రామిక మహిళలకు హక్కులు ఇవ్వనిరాకరించారు. దాంతో అమెరికాలో సోషలిస్టులు మహిళలకు ఓటు హక్కు కోసం పట్టుబట్టి పోరాటాలు నిర్వహించారు. 1909 ఫిబ్రవరి 28న శ్రామిక మహిళలకు రాజకీయ హక్కులు కల్పించాలనే డిమాండ్‌తో అమెరికా అంతటా ప్రదర్శనలు, మీటింగ్‌లు జరిగాయి. ఒకరకంగా చెప్పుకోవాలంటే ఇదే 'మహిళా దినోత్సవమే'. మహిళా దినోత్సవ నిర్వహణకు సంబంధించి చొరవ చేసింది అమెరికన్ మహిళా కార్మిక వర్గమే అని చెప్పుకోవచ్చు.

మహిళా ఐక్యతను పెంపొందించి

1910లో జరిగిన శ్రామిక మహిళల రెండవ అంతర్జాతీయ సదస్సులో క్లారాజెట్కిన్ అంతర్జాతీయ శ్రామిక దినోత్సవాన్ని జరుపుకోవాల్సిన అవసరం గురించి లేవనెత్తారు. మహిళలకు ఓటింగ్ హక్కు సాధించుకోవడం ద్వారా మహిళా ఐక్యతను పెంపొందించుకుని సోషలిజం సాధనను బలోపేతం చెయ్యాలనే నినాదంతో ప్రతి దేశంలో ప్రతి ఏడాది ఒకే రోజున 'మహిళా దినోత్సవం' నిర్వహించుకోవాలని సదస్సు పిలుపునిచ్చింది. ఈ కాలంలో మహిళలకు వయోజన ఓటు హక్కు కల్పించడం ద్వారా పార్లమెంటును మరింత ప్రజాస్వామికరించాలనే అంశం కీలక ప్రాధాన్యతను సంతరించుకుంది. మొదటి ప్రపంచ యుద్ధానికంటే ముందు ఒక్క రష్యాలో మినహా అన్ని దేశాల్లోనూ కార్మికులకు ఓటు హక్కు ఉంది. కేవలం మహిళలు, మతిస్థిమితం లేని వాళ్లను మాత్రమే ఈ హక్కు నుండి మినహాయించారు. అదే సందర్భంలో పెట్టుబడిదారి సమాజం అభివృద్ధి చెందుతున్న కొద్ది దేశ ఆర్థిక వ్యవస్థలో మహిళల భాగస్వామ్య అవసరాలు అంతకంతకూ పెరుగుతూ వచ్చాయి. ఫ్యాక్టరీలలో, వర్క్‌షాపులలో, ఆఫీసులలో పని చేయడానికి మహిళల అవసరం ఏటికేటికీ పెరుగుతూ వచ్చింది. పురుషులతో సమానంగా మహిళలూ పని చేసి దేశ సంపద పోగు చేయడంలో తమవంతు కృషి చేశారు. అయినా మహిళలకు ఓటు హక్కు లేదు.



అగ్గిలా రాజుకున్నాయి

మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు ఆహార ఉత్పత్తుల ధరలు విపరీతంగా పెరిగిపోయి ఇంటిపట్టున ఉండే గృహిణులు కూడా ఇందుకు గల రాజకీయ కారణాలను అర్థం చేసుకుని దోపిడీని ప్రశ్నించే స్థాయికి ఎదిగారు. తిరుగుబాట్లు, రోడ్లమీదకొచ్చి ప్రదర్శనలు చెయ్యడం, నిరసన తెలపడం నానాటికీ పెరిగిపోయింది. ఈ నిరసనలు ఒక్కో దేశం నుండి ఇంకో దేశానికి అగ్గిలా రాజుకున్నాయి. ఆస్ట్రియా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాలన్నింటా ఇలాంటి ఉద్యమాలు నడిచాయి. మార్కెట్లలో షాపుల మీద పడి ధ్వంసం చేయడం, వ్యాపారస్తులను చితకబాదడం సాధారణమయింది. అయితే ఇలాంటి కార్యక్రమాల వల్ల ప్రయోజనం లేకుండా పోతుందని, పెరిగిన ధరలకు మూలకారణం ప్రభుత్వం అనుసరిస్తున్న రాజకీయ విధానాల్లో ఉందని శ్రామిక మహిళలు అర్థం చేసుకున్నారు. పరిస్థితుల్లో మార్పు రావాలంటే రాజకీయాల్లో మార్పు తీసుకురావాలనీ, అందుకోసం మహిళలకు ఓటు హక్కు కల్పించాలనే డిమాండ్ ముందుకొచ్చింది. దీని సాధనకై ప్రతి దేశంలో విధిగా మహిళా దినోత్సవం నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా మహిళలందరికీ ఈ హక్కుల సాధన సాధ్యం కావాలంటే ఉమ్మడి లక్ష్యంతో అంతర్జాతీయ సంఘీభావంతో ఉద్యమాలు నడపాలనీ, ఏటా శ్రామిక మహిళల నిర్మాణ బలాన్ని అంచనా వేసుకుంటూ సోషలిజం సాధన దిశగా ఎలాంటి కార్యక్రమాలు రూపొందించుకోవాలో మహిళా దినోత్సవం రోజున సమీక్షించుకోవాలని నిర్ణయం జరిగింది.

మనం తృప్తి పడకూడదు

మహిళా దినోత్సవ స్ఫూర్తితో చేసిన ఎన్నో పోరాటాల ఫలితంగా మహిళలకు ఓటు హక్కుతో పాటు పౌర హక్కులు కూడా లభించాయి. పురుషులతో సమానంగా స్త్రీలకు అన్ని హక్కులూ దక్కాయి. తమ జీవితాలను మరింత మెరుగ్గా తీర్చిదిద్దుకునే అవకాశాలు మహిళలకు లభించాయి. అయితే హక్కులు సాధించుకోవడంతోనే మనం తృప్తి పడకూడదు. ఆ హక్కులను ఎలా ఉపయోగ పెట్టుకోవాలనే మెళకువ సంపాదించుకోవాలి. ఓటు హక్కును స్వీయ ప్రయోజనాలకు, కార్మికవర్గ శ్రేయస్సుకు ఎలా ఉపయోగించుకోవాలో అర్థం చేసుకుంటేనే ఆ హక్కు మన చేతిలో వజ్రాయుధంగా మారుతుంది.

హింసలేని సమాజం రావాలి

మహిళలు హక్కులు సాధించుకొని వంద ఏండ్లు దాటి పోయింది. అభివృద్ధిలో వేగంగా దూసుకుపోతున్నాం. మహిళలు కూడా అన్ని రంగాల్లో మగవారితో సమానంగా శ్రమిస్తున్నారు, రాణిస్తున్నారు. అయితే అదే స్థాయిలో హింస, వివక్ష కూడా పెరిగిపోతోంది. ఇది అంతం కావాలి. మహిళలపై హింసలేని సమాజం రావాలి.

కమ్యూనిజం వర్ధిల్లితేనే మహిళలకు మౌలికమైన సమానత్వం లభిస్తుంది' అంటారు ప్రముఖ మహిళా ఉద్యమ నాయకురాలు కొల్లంతాయ్. కాబట్టి మహిళలంతా ఏకతాటిపై నిలబడి అలాంటి సమానత్వం కోసం ఉద్యమించాలి. అభ్యుదయ మహిళా సంఘాలన్నీ ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు అలాంటి నినాదంతో పోరాటాలు రూపొందించుకోవాలి.

సమరశీలతకు అద్దం పట్టిన

1911 మార్చి 19న తొలి అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిపారు. అంచనాలకు మించి జయప్రదమైంది. జర్మనీ, ఆస్ట్రియాలలో శ్రామిక మహిళా ప్రదర్శనలు సముద్రంలా పోటెత్తిపోయాయి. చిన్న చిన్న పట్టణాలు, పల్లెల్లో కూడా మహిళా సమావేశాలు జయప్రదంగా జరిగాయి. శ్రామిక మహిళల సమరశీలతకు అద్దం పట్టిన తొలి ప్రదర్శన ఇది. మగవాళ్లు ఇంటి పట్టున ఉండి పిల్లల్ని చూసుకునేవారు. వంటింటికే పరిమితమైన గృహిణులు తొలిసారిగా వీధికెక్కారు. 1913లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మార్చి 8వ తేదీకి మార్చారు. అప్పటి నుండి మార్చి 8 మహిళా దినోత్సవంగా, శ్రామిక మహిళల సమరశీలతకు గుర్తుగా మారింది.



మహిళా

ఈ సమాజానికి మహిళే ఒక ఆధారం
మన సృష్టికి స్త్రీ ఒక శ్రీకారం,
అన్నీ తాను అయి
మన జీవితాలకు జీవన ప్రాకారమై
తరతరాలుగా సాగుతున్న స్ఫూర్తి

ఒక మనసుకు శ్రుతి అయి
జెత కలిసే సతి అయి
ఇల్లాలై,తల్లి అయి
అచ్చమైన సిరి అయి

కష్టం అయినా, సుఖమైనా
స్వాగతించే చెలి అవుతుంది
త్యాగం అవుతూ, స్వేదం అవుతూ
ప్రేమను పంచే ప్రేమ ధాత్రి అవుతుంది

అంక్షలు ఎన్ని ఎదురయినా
అడ్డుకట్టలు ఎన్ని ఎదురయినా
అవమానాలను ఎన్నింటినో దిగమింగి
గెలిచి సంకల్పం చాటుతుంది

బానిసలా చూస్తున్నా
భారమెంత వేస్తున్నా
ఆత్మశక్తితో, ధైర్యంతో
సాధించాలి అనే తపిస్తుంది

తను చదువుల నెలవై
పదవుల కొలువై
కల చెదరని నది అయి
వెను తిరగని తెగువై

తాను సాగింది
అంత ఎత్తైన శిఖరాన
స్వప్నాలే సాధించే
స్వేచ్ఛమైన సఖిలా

- దామెర్ల హష్మీ బాబు
7660057095
DYFI హైదబాద్ జిల్లా అధ్యక్షుడు

ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా విడుదల

- సజీవంగా బయటకు రావడం ఆశ్చర్యమే : సాయిబాబా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



మావోయిస్టులతో సంబంధమున్న కేసులో నిర్దోషిగా ఢిల్లీ యూనివర్శిటీ మాజీ ప్రొఫెసర్ జీఎస్ సాయిబాబా గురువారం నాగ్‌పూర్ జైలు నుంచి విడుదలయ్యారు. ముంబాయి హైకోర్టు తీర్పు ఇచ్చిన రెండు రోజుల అనంతరం విడుదలైన ఆయన విలేకరులతో మాట్లాడారు. "నా ఆరోగ్యం ఎంతో క్షీణించింది. ప్రస్తుతం మీతో మాట్లాడలేను. నాకు చికిత్స అవసరం. ఆరోగ్యం కుదుటపడిన అనంతరం మీతో మాట్లాడతా" అని అన్నారు. తన రాక కోసం ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులను ఆయన కలుసుకున్నారు.

సజీవంగా బయటకు రావడం ఆశ్చర్యమే : సాయిబాబా

దారుణ పరిస్థితుల మధ్య జైలు జీవితం అనుభవించానని.. చివరకు సజీవంగా బయటకు రావడం ఆశ్చర్యంగా ఉందని ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబా పేర్కొన్నారు. మావోయిస్టులతో సంబంధమున్న కేసులో నిర్దోషిగా తేలి, జైలు నుంచి విడుదలైన అనంతరం మీడియాతో మాట్లాడారు. అత్యంత దారుణ, కఠిన పరిస్థితుల మధ్య ఎనిమిదేండ్లు జైలు జీవితం గడిపానని అన్నారు.'వీల్‌ఛైర్ నుంచి బయటకు కదలలేకపోయా. సొంతగా టాయిలెట్‌కి వెళ్లలేకపోయా. కనీసం పైకి లేచే పరిస్థితి లేదు. అక్కడ పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. జీవితం ముందుకు సాగడం కష్టమనిపించింది. కానీ, ఈరోజు సజీవంగా బయటకు రావడం నిజంగా ఆశ్చర్యమే' అని సాయిబాబా పేర్కొన్నారు. తనపై పెట్టిన కేసు కల్పితమైందన్నారు. జైలు నుంచి బయటకు వచ్చిన వెంటనే మీడియాతో మాట్లాడేందుకు నిరాకరించిన ఆయన.. ఆరోగ్యం ఎంతో క్షీణించిందని, ప్రస్తుతం ఏమీ మాట్లాడలేనన్నారు. మీడియా, న్యాయవాదుల విజ్ఞప్తితో మనసు మార్చుకున్న ఆయన.. జైల్లో తాను అనుభవించిన వేదనను వివరించారు. ఇదే విషయంపై సాయిబాబా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. వాస్తవాలు లేవని రెండుసార్లు ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసినప్పటికీ ఈ కేసును ఎందుకు ఇంతకాలం సాగదీశారని ప్రశ్నించారు. పదేళ్ల జీవితం వథా అయ్యిందని, దాన్ని ఎవరు తిరిగి తెచ్చిస్తారని అన్నారు.

దురుద్దేశపూరితం

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల బాండ్ల అమ్మకపు వివరాలను వెల్లడించడంలో విఫలమైన ఎస్‌బీఐపై గురువారం కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) సంస్థ తరఫున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. దీనిని సత్వరమే విచారణకు చేపట్టాలని కోరారు. 2019 ఏప్రిల్ నుండి విక్రయించిన ఎన్నికల బాండ్ల వివరాలను మార్చి 6వ తేదీ లోగా ఎన్నికల కమిషన్‌కు సమర్పించాలంటూ సుప్రీంకోర్టు ఎస్‌బీఐని ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే గడువు ముగిసినప్పటికీ ఎస్‌బీఐ ఆ వివరాలు అందజేయలేదు.

ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించేందుకు జూన్ 30వ తేదీ వరకూ గడువు ఇవ్వాలని ఎస్‌బీఐ చైర్మెన్ దినేష్ కుమార్ ఖేరా సుప్రీంకోర్టును అభ్యర్థించారు. ఎన్నికల బాండ్లకు సంబంధించిన సమాచారం, పత్రాలు దేశంలోని వివిధ ఎస్‌బీఐ శాఖలలో ఉన్నాయని, వీటన్నింటినీ డీకోడింగ్ చేయడం కష్టమైన పని అని, కొంత సమయం అవసరమవుతుందని తెలిపారు. తొమ్మిది పేజీలతో కూడిన ఈ దరఖాస్తు వచ్చే సోమవారం విచారణకు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఎస్‌బీఐ దరఖాస్తుతో పాటే కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను కూడా విచారించాలని ప్రశాంత్ భూషణ్ ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్‌ను కోరారు. దీనిపై జస్టిస్ చంద్రచూడ్ స్పందిస్తూ దరఖాస్తు నెంబరుతో వివరాలను ఈ-మెయిల్ ద్వారా పంపాలని సూచించారు. 'మీ పిటిషన్‌ను రిజిస్ట్రీ వెరిఫై చేయగానే మీ జూనియర్లు ఈ-మెయిల్ పంపవచ్చు. నేను ఆదేశాలు జారీ చేస్తాను' అని ఆయన తెలిపారు. ఏడీఆర్‌తో పాటు కామన్‌కాజ్ అనే సంస్థ కూడా ఈ పిటిషన్‌లో భాగస్వామి అయింది.

ఎన్నికల బాండ్ల పథకాన్ని వ్యతిరేకిస్తూ పిటిషన్లు దాఖలు చేసిన వారిలో ఏడీఆర్ కూడా ఉంది. ఈ పిటిషన్లపై గత నెల 15న సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు వెలువరిస్తూ ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసింది. బాండ్లు కొనుగోలు చేసిన వారి వివరాలను మార్చి 6 లోగా ఎన్నికల కమిషన్‌కు అందజేయాలని ఎస్‌బీఐని ఆదేశించింది. ఆ వివరాలను మార్చి 13వ తేదీ లోగా అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచాలని ఎన్నికల కమిషన్‌ను కూడా ఆదేశించింది. ఈ ప్రక్రియ యావత్తూ సార్వత్రిక ఎన్నికల ప్రకటనకు ముందే పూర్తయితే ఓటర్లు ఓ నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంటుంది.

ఏడీఆర్ పిటిషన్‌లో ఏముంది?

కోర్టు ఆదేశాలను ఎస్‌బీఐ ఉద్దేశపూర్వకంగానే ధిక్కరించిందని, ఆ బ్యాంకుపై చర్యలు చేపట్టాలని ఏడీఆర్, కామన్‌కాజ్ సంస్థలు తమ పిటిషన్‌లో కోరాయి. పిటిషనర్ల తరఫున ప్రశాంత్ భూషణతో పాటు న్యాయవాదులు చెరస్ డి సౌజా, నేహా రథి కోర్టుకు హాజరయ్యారు. గడువు పొడిగించాలంటూ ఎస్‌బీఐ సమర్పించిన దరఖాస్తు దురుద్దేశపూరితంగా ఉన్నదని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను విఘాతం కలిగించేందుకు ఆ బ్యాంక్ ప్రయత్నిస్తోందని ఏడీఆర్ ఆరోపించింది.

ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించేందుకు ఎస్‌బీఐకి మరింత సమయం అవసరం లేదని, ఆ సమాచారాన్ని బహిర్గతం చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఆ బ్యాంకుకు ఉన్నాయని తెలిపింది. ఎన్నికల బాండ్ల నిర్వహణ కోసం ఎస్‌బీఐకి ఇప్పటికే ఐటీ వ్యవస్థ ఉన్నదని గుర్తు చేసింది. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత అవసరమని ఏడీఆర్ పునరుద్ఘాటించింది. రాజకీయ పార్టీలకు ఎవరు విరాళాలు అందజేశారు, ఎంత మొత్తంలో ఇచ్చారు అనే సమాచారాన్ని తెలుసుకునే ప్రాథమిక హక్కు రాజ్యాంగంలోని 19 (1) (ఏ) ద్వారా ప్రజలకు సంక్రమించిందని వాదించింది. 'వివిధ రాజకీయ పార్టీలకు విరాళాలు అందించిన వారి వివరాలు ఎన్నికల లోగా ప్రజలకు తెలియకుండా ఉంచేందుకు ఎస్‌బీఐ ఉద్దేశపూర్వకంగా ప్రయత్నిస్తోంది. పైగా బాండ్లకు సంబంధించిన సమాచారాన్ని పూర్తిగా, త్వరగా తెలుసుకోవచ్చునంటూ 2019 మార్చి 15న కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌కు ఎస్‌బీఐ వైఖరి భిన్నంగా ఉంది' అని తెలిపింది.

విరాళాలను ఫ్రీజ్ చేయాలి

2017-18 నుండి 2022-23 వరకూ రూ.12,008 కోట్ల విలువ కలిగిన ఎన్నికల బాండ్లను విక్రయించారని ఏడీఆర్ తెలిపింది. వీటిలో బీజేపీకి రూ.6,564 కోట్లు (సుమారు 55%) అందాయి. ఈ ఐదు సంవత్సరాల కాలంలో కాంగ్రెస్‌కు అందిన విరాళాలు కేవలం రూ.1,135 కోట్లు (9.5%) మాత్రమే. అదే కాలంలో తృణమూల్ కాంగ్రెస్‌కు రూ.1,096 కోట్ల విరాళం లభించింది. కాగా రాజ్యాంగ విరుద్ధమైన ఎన్నికల బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలు పొందిన సొమ్మును స్తంభింపజేయాలంటూ మాజీ అధికారి ఈఏఎస్ శర్మ ఎన్నికల కమిషన్‌ను కోరారు. వివరాలు అందజేయడానికి లోక్‌సభ ఎన్నికలు ముగిసే వరకూ ఎస్‌బీఐ గడువు కోరిన నేపథ్యంలో ఎన్నికల బాండ్ల ద్వారా పార్టీలు పొందిన విరాళాలను ఎన్నికల కమిషన్ కానీ లేదా సుప్రీంకోర్టు కానీ స్తంభింపజేయాలని పలువురు నిపుణులు కూడా అభిప్రాయపడుతున్నారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు నాలుగు శాతం డీఏ పెంపు

- ఉజ్వల పథకం కింద గ్యాస్ సిలిండర్ రాయితీ గడువు పొడిగింపు : కేంద్ర క్యాబినెట్ నిర్ణయం
- పెట్టుబడిదారుల ప్రోత్సాహకాల పథకానికి ఆమోదం
- లోక్‌సభ ఎన్నికల ముందు మోడీ సర్కార్ తాయిలాలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరవు భత్యం (డీఏ) 4 శాతం పెరిగింది. దీంతో ఇప్పటివరకు ఉన్న 46 శాతం డీఏ 50శాతానికి చేరుకుంటుంది. పెంపు 2024 జనవరి 1 నుంచే అమల్లోకి వస్తుందని కేంద్ర మంత్రి పియూశ్ గోయల్ తెలిపారు. తాజా నిర్ణయంతోదాదాపు కోటి మంది ఉద్యోగులు, పెన్షనర్లు ప్రయోజనం పొందనున్నారని అన్నారు. గురువారం ప్రధాని మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి పియూశ్ గోయల్ మాట్లాడారు. ఉజ్వల లబ్దిదారులకు వంట గ్యాస్ సిలిండర్‌పై ఇస్తున్న రాయితీ గడువును పొడిగించింది. ఒక్కో సిలిండర్‌పై ప్రస్తుతం ఇస్తున్న రూ.300 సబ్సిడీని ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే ఆర్థిక సంవత్సరానికీ ఈ రాయితీని వర్తింప జేసింది. ఏడాదికి 12 సిలిండర్ల వరకు ఈ రాయితీ లభిస్తుంది. మార్చి 31తో ఈ గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో క్యాబినెట్ సమావేశంలో ఈ పొడిగింపు నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల పది కోట్ల కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుందని కేంద్ర మంత్రి పీయూశ్ గోయల్ తెలిపారు. ప్రభుత్వ ఖజానాపై రూ.12 వేల కోట్ల భారం పడనుందని చెప్పారు.

పెట్టుబడిదారుల ప్రోత్సాహకాల పథకానికి ఆమోదం

ఉత్తర పూర్వ పరివర్తన పారిశ్రామికీకరణ పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. పదేండ్ల పాటు ఉత్తర్ పూర్వ రూపాంతర పారిశ్రామికీకరణ పథకం-2024 కోసం వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ, పరిశ్రమల ప్రోత్సాహం, అంతర్గత వాణిజ్యం ప్రతిపాదనను ఆమోదించింది. మొత్తం రూ.10,037 కోట్లతో నిర్వహించనుంది. కొత్త యూనిట్లను స్థాపించడానికి, ఇప్పటికే ఉన్న యూనిట్ల విస్తరణను చేపట్టడానికి పెట్టుబడిదారులకు ఈ పథకం కింద ప్రోత్సాహకాలు అందుబాటులో ఉంటాయి.

ముడి జూట్‌కు కనీస మద్దతు ధర

2024-25 సీజన్ కోసం ముడి జూట్‌కు కనీస మద్దతు ధరలకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. 2024-25 సీజన్‌లో రా జూట్ ఎంఎస్‌పి (టిడిఎన్-3 మునుపటి టిడి-5 గ్రేడ్‌కి సమానం) క్వింటాల్‌కు రూ.5,335గా నిర్ణయించింది. ఇది మొత్తం దేశ సగటు ఉత్పత్తి వ్యయం కంటే 64.8 శాతం రాబడిని నిర్ధారిస్తుందని కేంద్ర మంత్రి తెలిపారు. కమీషన్ ఫర్ అగ్రికల్చరల్ కాస్ట్స్ అండ్ ప్రైసెస్ (సీఏసీపీ) సిఫారసుల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. 2024-25 సీజన్‌కు ఎంఎస్‌పీ గత సీజన్‌తో పోలిస్తే ముడి జూట్‌కి క్వింటాల్‌కు రూ.285 పెరిగింది. ప్రస్తుత సీజన్ 2023-24లో, ప్రభుత్వం రూ.524.32 కోట్లతో 6.24 లక్షల కంటే ఎక్కువ ముడి జూట్‌లను రికార్డు స్థాయిలో సేకరించింది. దీనివల్ల దాదాపు 1.65 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరిందని అన్నారు. జ్యూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (జేసీఐ) ప్రైస్ సపోర్టు కార్యకలాపాలను చేపట్టడానికి కేంద్ర ప్రభుత్వ నోడల్ ఏజెన్సీగా కొనసాగుతుంది. అటువంటి కార్యకలాపాలలో ఏవైనా నష్టాలు ఉంటే, కేంద్ర ప్రభుత్వం పూర్తిగా రీయింబర్స్ చేస్తుందని అని అన్నారు.

మేడిగడ్డ పగుళ్లు పరిశీలన

సందర్శించిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ బృందం

నవతెలంగాణ-భూపాలపల్లి

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మూడు బ్యారేజీలను నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల బృందం గురువారం పరిశీలించింది. బుధవారం రాత్రి హన్మకొండలో బస చేసిన బృందం గురువారం ఉదయాన్నే జయశంకర్ జిల్లా మహదేవ్‌పూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీ క్యాంప్ ఆఫీస్‌కు చేరుకుంది. చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల బృందం అక్కడి అధికారులతో భేటీ అయ్యారు. అనంతరం బ్యారేజీ వద్దకు వెళ్లి ఏడో బ్లాక్‌లో కుంగిపోయిన ప్రాంతం.. దిగువ భాగంలో ఏర్పడిన పగుళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. గేట్ల సామర్థ్యం, కుంగుబాటుకు కారణాలపై ఈ కమిటీ పూర్తిగా అధ్యయనం చేయనున్నది. అక్కడి నుంచి మధ్యాహ్నం అన్నారం, సరస్వతీ బ్యారేజీలను సందర్శించారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్ : మోడీ

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆయన విమర్శించారు. నగరంలో జరిగిన ర్యాలీని ఉద్దేశించి మోడీ ప్రసంగిస్తూ జమ్మూకాశ్మీర్ విజయ గాథ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోందని, ఇక్కడి సరస్సుల్లో ఎక్కడ చూసినా 'కమలం' కన్పిస్తోందని చెప్పుకొచ్చారు. 'యాభై సంవత్సరాల క్రితం ఏర్పడిన జమ్మూకాశ్మీర్ క్రికెట్ అసోసియేషన్ లోగో కమలం. బీజేపీ గుర్తు కూడా అదే. కమలంతో రాష్ట్రానికి గాఢమైన అనుబంధం లేదా?' అని ప్రశ్నించారు. వివాహాలు చేసుకునేందుకు ప్రజలు జమ్మూకాశ్మీర్ వస్తున్నారని, ఇక్కడ జీ-20ని నిర్వహించడాన్ని ప్రపంచం చూసిందని అన్నారు. ఒకప్పుడు జమ్మూకాశ్మీర్‌కు ఎవరు వెళతారని జనం అనుకునే వారని, ఇప్పుడు రాష్ట్రంలో పర్యాటకం అన్ని రికార్డులను అధిగమించిందని చెప్పారు. గత సంవత్సరం రెండు కోట్ల మందికి పైగా ప్రజలు రాష్ట్రాన్ని సందర్శించారని తెలిపారు. అభివృద్ధి చెందిన భారత్ ప్రాధాన్యత రాష్ట్ర అభివృద్ధేనని అన్నారు. కొత్తగా ఎంపికైన ప్రభుత్వోద్యోగులకు మోడీ ఈ సందర్భంగా నియామక పత్రాలు అందజేశారు.

కేంద్రం సహకరించకపోతే కొట్లాడుతం..

మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కారిడార్ ఉత్తర తెలంగాణ అభివృద్ధికి ముఖద్వారంగా నిలుస్తుందని చెప్పారు. భూముల కేటాయింపు, చాంద్రాయణ గుట్ట రక్షణ శాఖ భూముల లీజ్ రెన్యూవల్ చేయకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం జాప్యం చేసిందనీ, తాము అధికారంలోకి రాగానే తక్షణమే అధికారులతో సమీక్షించి రక్షణ శాఖకు భూములు అప్పగించామనీ చెప్పారు. కేంద్రాని కి రాష్ట్రం, రాష్ట్రానికి కేంద్రం పరస్పరం సహకరించుకోవడం వల్లే ఈ సమస్య త్వరగా పరిష్కారమైందన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో రాజీవ్ ఎలివేటెడ్ కారిడార్ అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్టు గుర్తు చేశారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో గంజా యి, డ్రగ్స్, పబ్బులు పెరిగాయి తప్పితే నగరాన్ని ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు.

రెండో దశలో 75 కిలో మీటర్ల మెట్రో విస్తరణ చేపట్టబోతున్నామని వెల్లడించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా కేంద్రంతో భేషజాలకు వెళ్లం.. ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలని, ఎన్నికలు ముగిశాక అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. అభివృద్ధి కోసం భవిష్యత్‌లోనూ కేంద్రాన్ని అడుగుతూనే ఉంటామని, కేంద్రం సహకరించకపోతే కొట్లా డుతామన్నారు. తమ పోరాటం ఫలించిందని మాజీ మంత్రి కేటీఆర్ అంటున్నారని.. ఆయన ఏం పోరాటం చేశారని ప్రశ్నించారు. ట్విట్టర్‌లో వ్యంగంగా పోస్టులు పెట్టడం తప్పితే కేటీఆర్ చేసిందేమీ లేదన్నారు. తాము కేంద్రం నుంచి అనుమతులు తీసుకొస్తే కేటీఆర్ పోరాటం చేశారని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం ఇందిరాపా ర్కు వద్ద కేటీఆర్ ఆమరణ దీక్ష చేయాలని సూచించారు. కేటీఆర్ చచ్చుడో.. అభివృద్ధికి నిధులు వచ్చుడో తేలే వరకు దీక్ష చేపట్టాలన్నారు. ఈ దీక్షకు తమ కార్యకర్తలే కంచె వేసి కేటీఆర్‌ను కాపాడుతారని చెప్పారు.

స్నాతకోత్సవానికి రావడం సంతోషం కలిగించింది

కాలేజీ స్నాతకోత్సవానికి హాజరు కావడం సంతోషం కలిగించిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. జవహర్‌నగర్‌లోని సికింద్రాబాద్ ఆర్మీ కాలేజ్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ స్నాతకోత్సవ వేడుకల్లో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలేజీలో ప్రతి విద్యార్థినీ అభినందిస్తున్నానని, కృషి, అంకితభావం మిమ్మల్ని ఇక్కడికి తీసుకొచ్చాయని చెప్పారు. సక్సెస్‌ను ఆస్వాదించాలి కానీ, ఎప్పుడూ బాధ్యతలను మరిచిపోవద్దన్నారు. మీరు చేసే పనులు మీ కుటుంబానికే కాదు.. కాలేజీకీ గుర్తింపును తీసుకొస్తాయన్నారు. ఏసీడీఎస్ మన సైనికుల పిల్లలకు సేవలందించడం సైన్యానికి, దేశానికి గర్వ కారణం అన్నారు.

అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి

జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బంజారాహిల్స్‌లో బాబు జగ్జీవన్ రామ్ భవన్‌ను సీఎం ప్రారంభించారు. జగ్జీవన్ రామ్ రాజకీయాల్లో ఉన్నంత కాలం గాంధీ కుటుంబం, కాంగ్రెస్ పార్టీతో కొనసాగారని తెలిపారు. దేశంలో ఎన్నో సంస్కరణలకు కృషి చేశారని గుర్తు చేశారు. లోక్‌సభ స్పీకర్‌గా తెలంగాణ బిల్లుకు ఆమోదం తెలిపింది జగ్జీవన్ రామ్ కూతురు మీరాకుమా రి అని, రాష్ట్రమంతా ఆమెను ఎప్పుడూ గుర్తు పెట్టుకుంటుందన్నారు. దళితులు, గిరిజనులు, బీసీ, మైనార్టీలందరికీ ఒకే చోట ఇందిరమ్మ ఇండ్లు కేటాయించేలా అధికారులను ఆదేశించామని చెప్పారు. గతంలో రెసిడెన్షియ ల్ స్కూల్స్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు విడివిడిగా ఉండేవని, ప్రతి నియోజకవర్గంలో ఒకే క్యాంపస్‌లో గురుకులాలన్నీ ఉండేలా ఏర్పాటు చేసి కులాల మధ్య అంతరాలను చెరిపేయాలనుకుంటున్నామని తెలిపారు. పైలెట్ ప్రాజెక్టుగా కొడంగల్‌లో శంకుస్థాపన చేశామని తెలిపారు. చదువు మీద పెట్టేది ఖర్చు కాదు పెట్టుబడి అని, చదువుకుంటేనే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తామని చెప్పారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఆకునూరి మురళి లాంటి వారికి చదువుకుంటేనే గుర్తింపు, గౌరవం వచ్చినట్టు తెలిపారు. కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదని, ఒకసారి దొరల చేతుల్లో ఉంటే.. మరోసారి దళితుల చేతుల్లో ఉంటుందన్నారు. దొరలకు ఇష్టం ఉన్నా, లేకున్నా నేడు అసెంబ్లీలో గడ్డం ప్రసాద్‌ను అధ్యక్షా అని పిలవాల్సిందే అన్నారు. చదువును ఎవరూ నిర్లక్ష్యం చేయొద్దని, చదువే లక్ష్యంగా పెట్టుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు.

మహిళలూ మీకు జోహార్లు..

- అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

(జి.రేణు యాదవ్)

మారుతున్న కాలానికి అనుగుణంగా నేడు మహిళలు పురుషులతో సమానంగా పోటీ పడుతూ అన్ని రంగాల్లో తమదైన శైలిలో సత్తా చాటుతున్నారు. అవని నుంచి అంతరిక్షం వరకూ ప్రతీ చోట తమదైన ముద్ర వేస్తూ ముందుకెళ్తున్నారు. పలుచోట్ల లింగ వివక్ష ఆనవాళ్లు ఉన్న ఘటనలు నేటికీ వెలుగు చూస్తూనే ఉన్నాయి. సామాజికంగా వెనుకబాటును తరిమికొట్టే శక్తిగా మహిళా లోకం స్వశక్తమవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు మేధావులు అభిప్రాయపడుతున్నారు. సమాజ నిర్మాణంలో సగ భాగమైన స్త్రీ సమానత్వమే ప్రగతికి మూలం. ఈ నినాదంతో ఐక్యరాజ్య సమితి ప్రతి ఏటా మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. సామాజికాభివృద్ధిలో మహిళల శ్రమకు సరైన ప్రాధాన్యత లేకపోతే సమాజాభివృద్ధి చెందదని పలువురి సామాజిక వేత్తల అభిప్రాయం.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం..

1857లో జరిగిన సమ్మెకు గుర్తుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నారు. శాంతి, సమాజ పురోగతి, మానవ హక్కుల పూర్తి వినియోగం, ప్రాథమిక హక్కుల పరిరక్షణ లాంటివి సాధ్యమవ్వడానికి మహిళల ప్రమేయం కీలకమని గుర్తించారు. మహిళలను ప్రోత్సహించి వారికి సమాన హోదా కల్పించేందుకు 1910లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రారంభించారు. ఈ నేపథ్యంలో మహిళలకంటూ ఓ ప్రత్యేక రోజును కేటాయించారు.

అన్ని రంగాల్లోనూ మహిళలు

మహిళలు వేగంగా దినదినాభివద్ధి చెందుతున్నారు. దశాబ్దం క్రితం మహిళలకు నేటి మహిళలకు ఎంతో వ్యత్యాసం ఉంది. నేడు అన్ని రంగాల్లో ప్రతిభను చాటుతూ దూసుకెళ్తున్నారు. ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో కీలక పాత్ర పోషిస్తూ పురుషులతో సమానంగా సత్తా చాటుతున్నారు. అంతరిక్షం, విమానయానం, మెట్రో, క్రీడలు లాంటి సాహసోపేత రంగాల్లోనూ మహిళా శక్తి పెరుగుతోంది.

మహిళలకు ప్రత్యేక చట్టాలు

మహిళలపై దాడులు, లైంగిక దాడులను అరికట్టేందుకు, వారి హక్కులను రక్షించడానికి కాలక్రమేణా చాలా చట్టాలు రూపుదిద్దుకున్నాయి. ఈ చట్టాలను ప్రభుత్వాలు సక్రమంగా అమలు చేస్తే దేశంలో మహిళలపై వివక్ష, లైంగిక దాడులు ఇప్పటికే కనుమరుగయ్యేవి. కానీ నేడు అలా జరగడం లేదు. రోజురోజుకూ మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వాలు కూడా పట్టించుకోకపోవడంతో అతివల ఆర్తనాదాలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి.



రాజకీయాల్లో వివక్ష

రాజకీయాల్లో మహిళలకు 50 శాతం అవకాశం కల్పిస్తున్నా ఇంకా వివక్ష కొనసాగుతూనే ఉంది. పదవులు సతులవే.. కానీ పెత్తనం మాత్రం పతులే కొనసాగిస్తున్నారనేది అక్షర సత్యం. మహిళలు అన్ని రంగాల్లో మరింత సాధికారిత సాధించాలంటే వారు చైతన్యవంతులవుతూ మార్పు కోసం మనోధైర్యంతో ముందడుగు వేస్తేనే ఇది సాధ్యమవుతుందని పలువురు మేధావులు అభిప్రాయపడుతున్నారు.

తప్పని కష్టాలు

గర్భస్థ శిశువు దశ నుంచి వృద్ధాప్య దశ వరకూ మహిళలు అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. అమ్మ కడుపులోనే తొలి గండాన్ని దాటలేకపోతున్న ఆడ బిడ్డలు కొందరుండగా.. భూమ్మీదకు వచ్చాక జీవితాంతం బాధ పడుతున్నవారు ఎందరో ఉన్నారు. ఎదిగే వయస్సులో ఇంట్లో వ్యత్యాసం, ఎదిగాక ప్రేమ పేరుతో వేధింపులు, అంగీకరించకపోతే దాడులు, పని చేసే ప్రదేశంలో తోటివారు, పెండ్లయ్యాక అత్తింటివారి వేధింపులు.. ఇలాంటి ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్న పరిస్థితి నేడు కనిపిస్తోంది. ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పని చేసి చట్టాలపై అవగాహన కల్పిస్తే ఈ పరిస్థితుల నుంచి మహిళలకు విముక్తి కలిగే అవకాశం లేకపోలేదు. స్త్రీ, పురుషులకు సమానమైన వేతనాలు, మహిళా ఉద్యోగుల కోసం ప్రత్యేక వసతులు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎన్నో కష్టాలు, బాధలను తట్టుకుంటూ.. అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగించుకుంటూ.. జీవితగమనంలో ముందుకు సాగుతూ.. తమదైన శైలిలో అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు. వ్యాపారం, రాజకీయం, విద్య, వైద్యం, ఉద్యోగం, క్రీడలు, సామాజిక, సేవా రంగాల్లో తమదైన ముద్ర వేస్తున్నారు. అటు కుటుంబానికి, ఇటు వత్తికి సమాన ప్రాధాన్యతనిస్తున్నారు. పురుషులు మాత్రమే చేయగలరనే భావనను పటాపంచలు చేస్తూ.. అవలీల గా అన్ని పనులు చేయగలమని మహిళలు నిరూపిస్తున్నారు. లాలించే అమ్మగా.. ఆప్యాయతను పంచే సోదరిగా.. జీవితాంతం తోడుండే సహచరిగా.. ఇలా ఎన్నో పాత్రలు పోషిస్తూ.. సష్టికి ప్రతిరూపంగా నిలుస్తున్నది మహిళ. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'నవతెలంగాణ' ప్రత్యేక కథనం.

మహిళలకు సెల్ఫ్ మోటివేషన్ ముఖ్యం



మహిళలకు సెల్ఫ్ మోటివేషన్ ఎంతో ముఖ్యం. ఎవరిపైనా ఆధారపడకుండా డిపెండెంట్‌గా ఉండాలి. ఫ్యామిలీ వీక్‌నెస్‌ను స్ట్రెంత్‌గా చేసుకుని ముందుకు సాగాలి. చదువును మధ్యలోనే ఆపేసి ఇప్పటికీ అక్కడక్కడ చైల్డ్ మ్యారేజెస్ చేస్తున్నారు. ఉన్నత చదువులు చదివితే ఎప్పటికీ ప్రమోషన్‌లాగా ఉంటుంది. మహిళలు అన్ని రంగాల్లో మరింతగా రాణించాల్సి అవసరం ఎంతైనా ఉంది. మహిళలు ఉన్నత చదువులతో అందరికీ ఆదర్శంగా నిలవాలి.

– విజయకుమారి, డీఈఓ, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

ఒక్కరోజే కాదు... ప్రతిరోజూ మహిళా దినోత్సవమే...



మహిళా దినోత్సవం మార్చ్ 8న ఒక్కరోజే జరుపు కోవడం కాదు, ప్రతిరోజు మహిళా దినోత్సవం జరుపు కోవాలి. నేడు అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మహిళలు మారుతున్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక సాధనలపై ఉత్సాహం చూపిస్తున్నారు. మహిళలు ఆధునిక టెక్నాలేజీ వినియోగించుకుని మంచి ప్రతిభ కనబరుస్తున్నారు. అన్ని వర్గాలకు చెందిన మహిళలు ఉన్నత స్థానాలకు చేరుకుం టున్నారు. అలాంటి వారు పక్కవారితో పోల్చుకోకుండా, తోటి మహిళలను, బాధిత మహిలకు చేయూతగా నిలువాలి. మహిళాగా ఉండి సాటి మహిళలనుపైకి తీసు కెళ్లే విధంగా సహకారం అందించాలి. వచ్చే మహిళా దినోత్సవానికల్లా కనీసం ఒక్క మహిళకైనా చేయూత నిచ్చామని సంతృప్తి పొందాలి, నలుగురిలో గర్వంగా చెప్పుకోవాలి. సీసీఎస్, మహిళా పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులు ఎంతో ఆశతో వస్తారు. మేడం మాయింట్లో నరకం అనుభవిస్తున్నా... ఏం చేయాలో తెలియని పరిస్థితి ఉందని కొందరు మహిళలు, యువతులు వస్తుంటారు. ఇంకొందరు భర్త వేధిపులకు గురిచేస్తున్నాడని, లేదా మరో మహిళతో సన్నిహితంగా ఉంటూ పిల్లలను పట్టించు కోవడం లేదని వారు సమస్యలు చెప్పుకుంటారు. బాధితు లు ఎలాంటి సమస్యపై వచ్చినా వారి పూర్తి వివరాలు సేకరిస్తాం. తాము భార్యాభర్తలను రెండు వర్గాల వారిని పిలిపించి నచ్చజెప్తాం. సాధ్యమైనంత మేరకు భార్యా భర్తలిద్దరు కలిసి జీవించే విధంగా కౌన్సిలింగ్ అందిస్తాం. కుటుంబం విడిపోతే వచ్చే ఇబ్బందులు, కలిసి జీవిస్తే కలి గే ప్రయోజనాలపై వివరిస్తాం. కొందరు రెండు మూడు కౌన్సిలింగ్‌లకే కలిసిపోతారు, మరి కొందరికి కొంత టైం పడుతుంది. బాధితులకు భరోసా కల్పిస్తాం. అవసరమైతే న్యాయసహాయం అందిస్తాం. బాధితుల్లో వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఉంటారు. వారికి చదువు విషయంలోగానీ, ఆర్థిక పరిస్థితుల్లోగానీ, ఉపాధి విషయంతోగానీ ఉన్నత స్థాయిలోవున్న మహిళలు ఆదుకోవాలి. ఇప్పటి నుంచి మొదలు పెడితే వచ్చే వహిళా దినోత్సవానికల్లా కొంతలో కొంత మేలు జరుగొచ్చు.

– డీసీపీ కవితా

ఆత్మస్థైర్యంతో మహిళలు ముందడుగు వేయాలి

- కుత్బుల్లాపూర్ ప్రయివేటు పాఠశాలల సంఘం అధ్యక్షురాలు అల్వాల వనజ అశోక్



నవతెలంగాణ–జగద్గిరిగుట్ట

ప్రతి రంగంలో మహిళలు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలని అప్పుడే సమాజాభివృద్ధి సిద్ధిస్తుందని కుత్బు ల్లాపూర్ మండల ప్రయివేటు పాఠశాల సంఘం అధ్యక్షు రాలు, అశోక్ మెమోరియల్ చాణిక్య హై స్కూల్ చైర్మన్, కరస్పాండెంట్ అల్వాల అశోక్ అన్నారు.ప్రపంచ మహిళా దినోత్సవం పురస్కరించుకొని గురువారం నవతెలం గాణతో ఆమె మాట్లాడారు ముందుగా సమస్త మహిళా మణులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆకాశంలో సగం,అవకాశాల్లో సగం, అన్నింటా సగం అంటూ ప్రపంచ మహిళ దినోత్సవ వేడు కలు నేడు మహిళలు,యువతులు అంగరంగ వైభవంగా జరుపుకుంటున్నారన్నారు. కానీ..విధిరాతను ఎదిరించి ఆత్మ గౌరవానికి ప్రతీక నిలుస్తూ ఎందరో మహిళామణులు చరిత్రలో తమకంటూ ఒక ప్రత్యేక పేజీని,స్థానాన్ని సాధిం చుకుంటున్నారన్నారు. మహిళల స్థితిగతులు బాగుపడందే సమాజం అభివృద్ధి చెందదన్నారు.ఏ పక్షి అయిన ఒక్కరెక్కతో ఎగరలేదు.. అని వివేకానందుని మాటలు స్మరిస్తూ మహిళలు రాణిస్తున్నారన్నారు. పురుషులతో దీటుగా అన్ని రంగాల్లో మేము సైతం అంటూ నేల నుండి నింగి దాకా మనోధైర్యంతో అడుగులు వేస్తున్నారన్నారు.

సమసమాజంలో అన్ని మారుతున్నాయి మహిళల ఆలోచన ధోరణి తప్ప.. అయితే సమాజంలో కొందరు మహిళలు ఆత్మగౌరవంతో స్వశక్తితో తమ ఆర్థిక అవసరా లను తీర్చుకోగలిగే ఉన్న స్థితికి చేరుకొని స్త్రీ శక్తి అంటే ఏంటో ప్రపంచానికి తెలుపుతూనే ఉన్నారన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న సాంకేతికత పరిజ్ఞానం దృష్ట్యా మహిళలపై దాడులు జరుగుతున్నా యన్నారు. ఎన్ని చట్టాలు మారిన ఫలితం శూన్యమ న్నారు.నిందితులకు కఠిన శిక్షలు పడినా మార్పు రావడం లేదని వాటిని అరికట్టే విధంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు.మహిళలు అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ అవరోధాలు అధిగమిస్తూ ముందుకు సాగాలన్నారు.

'మీ కోసం మేమున్నాం' అంటూ షీ టీమ్స్ 'భరోసా'

- పోకిరీల ఆగడాలకు ఎప్పటికప్పుడు అడ్డుకట్ట

నవతెలంగాణ–సిటీబ్యూరో

పోకిరీల వేధింపులు పెచ్చుమీరుతున్నాయి. రోడ్లు, కాలేజీలు, రద్దీప్రాంతాలు, మెట్రో ట్రైన్‌లో, చివరకు దేవాలయాలు, ఉత్సవాలల్లో సైతం పోకిరీకలు రెచ్చిపోతున్నారు. గణేష్, బోనాల ఉత్సవాలు, బతుకమ్మ, నవరాత్రుల సమయంలో దేవుని దర్శనంకోసం దేవాలయానికి వచ్చే మహిళలపట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. నుమాయిష్‌లోను అమ్మాయిలను, మహిళల తాకుతూ ఏమీ తెలియనట్టు నటిస్తున్నారు. వారు పెట్టే ఇబ్బందులు తట్టుకోలేక గృహిణులు, యువతులు, విద్యార్థినులు సతమతం అవుతున్నారు. కొందరు వెంటబడి వేధింపులకు గురిచేస్తుంటే, మరికొందరు మంచివారిగా పరిచయం చేసుకుని వేధింపులకు దిగుతున్నారు.. యువతులు కాలేజీకి వెళ్లినా పోకిరీల బెడదకు గురవుతున్నారు... ఉద్యోగాలకు వెళ్లేవారిని వక్రబుద్ధితో చూస్తున్నారు... షీ బృందాలు ప్రత్యేక నిఘా వేసినా ఆకతాయిల ఆగడాలు శృతిమించు తున్నాయి... అమ్మాయిలు కనిపిస్తే చాలు వేధింపులకు గురిచేస్తున్నారు. వారికి తెలియకుండానే ఫోటోలు తీస్తున్నారు. అసభ్యకరంగా తాకుతూ పైశాచిక ఆనంధం పొందుతున్నారు. పోకిరీలకు సింహస్వప్నంగా ఉన్న షీ బృందాలు ఎప్పటికప్పుడు ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేస్తున్నాయి. బాధిత యువతులకు, మహిళలకు 'మీ కోసం మేమున్నామని భరోసా' ఇస్తున్నాయి.

సమాచారమిస్తే చాలు...

నగరంలో 'షీ' బృందాల పనితీరుతో దేశవ్యాప్తంగా పేరు ప్రతిష్టలు సంపాదించడంతో రాజస్తాన్, ఒడిషా, మహారాష్ట్రతోపాటు వివిధ రాష్ట్రాల్లో సైతం షీ బృందాలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. మహిళలకు భరోసాగా నిలిచిన 'షీ'బృందాలకు సమాచారమిస్తే చాలు వాలిపోతు న్నాయి. ప్రజల్లో ఉంటూనే నిఘా వేస్తున్నారు. రహస్య కెమెరాతో చిత్రీకరి స్తున్నాయి. మహిళలకు ఫోన్లుచేసి అసభ్యకరంగా మాట్లాడినా, అభ్యంతరకరమైన మెసేజ్‌లు, ఫొటోలు పంపించినా పోకిరీల తాట తీస్తున్నాయి. పట్టుబడ్డ మైనర్లకు వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

పదేండ్లలో 11020ల ఫిర్యాదులు

'షీ' బృందాలకు 2014 నుంచి 2024 వరకు మొత్తం 11020 ఫిర్యాదులు అందాయి. బాధితులు నేరుగాకానీ, ఈమెయల్, ట్విట్టర్, ఫేస్‌బుక్, వాట్సాప్‌తోపాటు డయాల్ తదితర విధాలుగా 2014లో 98 ఫిర్యాదులు అందగా, 2020కల్లా 1032 ఫిర్యాదు వచ్చాయి. ఇక 2024 ఇప్పటి వరకు 11020 ఫిర్యాదు అందాయి. 2014లో 12 మందిని రెడ్‌హ్యాండెండ్‌గా పట్టుకోగా 2020లో 177, 2024లో 220 మందిని షీ బృందాలు నేరుగా పట్టుకున్నాయి. వీరిపై ఇప్పటి వరకు 2091 పెట్టీ కేసులు నమోదు చేయగా, 1074 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. 4026 మందిని వార్నింగ్ ఇచ్చి వదిలేశారు పట్టుబడిన వారిలో 7683 మంది మైనర్లు, మేజర్లున్నారు. వారికి కౌన్సిలింగ్ అందించారు. మరోసారి తప్పుచేస్తే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించి పంపించారు.

ఈవ్‌టీజింగ్‌ను అరికడదాం : డీసీపీ డీ.కవితా

ఆడపిల్ల అంటే మరో అమ్మ అని, అమ్మే సృష్టికి మూలమని, ఈవ్‌టీజింగ్‌ను అరికట్టి, అమ్మను రక్షించుకుందామని డీసీపీ డీ.కవితా అన్నారు. పోకిరీలు, ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నగరంలో షీ బృందాలు ప్రత్యేక నిఘా వేశాయని గుర్తు చేశారు. ఎవరూ చూడడం లేదని ఈవ్‌టీజర్లు రెచ్చిపోతున్నారని, అలాంటి వారికి అడ్డుకట్ట వేస్తున్నా మన్నారు. ఆకతాయిలు, పోకిరీల ఆగడాలను అరికట్టేందుకు మహిళలను చైతన్య పరుస్తున్నామని తెలిపారు. పోస్టర్లు, కరపత్రాలతోపాటు, ఉద్యోగ, విద్యా సంస్థలల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలి పారు. అయితే అధికశాతం బాధితులు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రాకపోవడంతో ఆకతాయిలు రెచ్చిపోతున్నారని అభిప్రాయపడ్డారు. ఈవ్‌టీజింగ్‌ను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలన్నారు. ఎక్కడైనా అమ్మాయిలను వేధింపులకు గురిచేసినట్టు గమనిస్తే మనకెందుకులే అనుకోకుండా, వారిని నివారించేందుకు ప్రయత్నించాలని సూచించారు. ఇందులో భాగంగానే స్లమ్స్‌లో సైతం అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని, ఇందుకుగాను వాలెంటరీల సేవలను ఉపయోగిస్తామని తెలిపారు. ఎవరైనా మహిళలను వేధింపులకు గురిచేస్తే బాధితులు నేరుగాగానీ, ఎస్ఎంఎస్, వాట్సప్‌తోపాటు డయాల్ 100 ద్వారాగానీ ఫిర్యాదు చేయాలని.. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

'బేటీ బచావ్‌తోపాటు బేటా శిఖావ్'



అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రతీ సంవత్సరం మార్చ్ 8వ తేదీన ఆడవాళ్లకు అన్నిటిలో సమాన హక్కులు ఉండాలన్న ఉద్దేశంతో జరుపుకుంటాం. లింగ సమానత్వం, ప్రసవ హక్కులు కల్పించడం, మహిళలపై జరుగుతున్న హింసా, దాడులు నిర్మూలించడం అనేది ముఖ్య ఉద్దేశం. దీని కోసం ప్రభుత్వాలు, ప్రజలు అవగాహనతో మార్పు రావడం హర్షణీయం. అన్ని రంగాలల్లో హహిళలు పురుషలతో సమానంగా దూసుకెళ్తున్నారు. భావితరాలను తీర్చిదిద్దడంలో మహిళల పాత్ర ముఖ్య మైంది. వారు వాళ్ల అమ్మాయిలకు ఎలా ఉండాలో చెప్పడంతోపాటు కుటుంబంలోవున్న పురుషలకు, అబ్బాయిలకు కూడా స్త్రీని గౌరవించడం నేర్పించాలి. 'బేటీ బచావ్‌తోపాటు బేటా శిఖావ్' అనే నినా దాన్ని ఈ మహిళా దినోత్సవం సందర్భంగా పిలుపునిస్తున్నా... అందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

– జీ.ఎస్. చంద్రజ్యోతి
జీఎం(ఎఫ్ అండ్ ఏ),
ప్రధాన కార్యదర్శి టీజీవోస్ అసోసియేషన్, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ యూనిట్.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

15 నుంచి ఒంటిపూట బడులు

- పది విద్యార్థులకు యథావిధిగా ప్రత్యేక తరగతులు: విద్యాశాఖ ఉత్తర్వులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు యాజమాన్యాల్లోని అన్ని పాఠశాలల్లో ఈనెల 15 నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన గురువారం ఉత్తర్వులను విడుదల చేశారు. ఈ క్రమంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు జరుగుతాయని తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తారని పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థులకు యథావిధిగా ప్రత్యేక తరగతులను నిర్వహించాలని స్పష్టం చేశారు. పదో తరగతి పరీక్షా కేంద్రాలుండే బడుల్లో మాత్రం మధ్యాహ్న ఒంటిగంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తరగతులను నిర్వహిస్తామని తెలిపారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఏప్రిల్ 23వ తేదీ పాఠశాలలకు చివరి పనిదినమని పేర్కొన్నారు. రాష్ట్రంలో పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు ఈనెల 18 నుంచి వచ్చేనెల రెండో తేదీ వరకు జరుగుతాయి. ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులుంటాయి.

సమాజ పురోగతిలో మహిళల పాత్ర కీలకం

- టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమాజ పురోగతిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్జీవోల సంఘంలో మహిళల భాగస్వామ్య పెరిగిందన్నారు. రాబోయే రోజుల్లో వారు చట్టసభల్లో ప్రత్యేక స్థానాన్ని పొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. సమాజంలో, కుటుంబంలో మహిళల వల్లే పురోగతి ఉంటుందన్నారు. వారి అభివృద్ధికి సమాజం మొత్తం అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణగౌడ్, మహిళా నేత శైలజ, మాధవి, నగర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, హరికృష్ణ, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, కొండల్‌రెడ్డి, గోవర్ధన్, ప్రభాకర్‌రెడ్డి, నాగిరెడ్డి, మహేష్, వరలక్ష్మి, ప్రశాంతి, ఉమ, రజనీ, ప్రభాకర్, శ్రీనివాస్, అరుణ్ కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

టీజీవో కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లోని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. మహిళా ఉద్యోగులు సామాజిక బాధ్యతతో అన్ని వర్గాల వారికి ఆదర్శంగా ఉండాలనీ, వారిలో చైతన్యం తేవాలని టీజీవో అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎ సత్యనారాయణ అన్నారు. టీజీవో మహిళా ప్రతినిధి దీపారెడ్డి మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండా ధైర్యంగా సమన్వయంతో సమిష్టిగా ఉండి సమాజానికి సేవ చేయాలని కోరారు. వారు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీజీవో అసోసియేట్ ప్రెసిడెంట్ బి శ్యామ్, కోశాధికారి ఎం ఉపేందర్‌రెడ్డి, నాయకులు శిరీష, సుజాత, సబిత, లావణ్య, మహేశ్వరి, చంద్రిక, నుస్రత్, అమూల్య, జి అరుణ, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

010 పద్దు ద్వారా వేతనాలివ్వాలి

- టీఎంఎస్టీఏ ప్రతిపాదనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాలివ్వాలని టీఎంఎస్టీఏ డిమాండ్ చేసింది. ఈ మేరకు పీఆర్సీ కమిటీ చైర్మెన్ శివశంకర్‌ను గురువారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూతం యాకమల్లు, ప్రధాన కార్యదర్శి కె నగేశ్ నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. పీజీటీలు తొమ్మిది, పది తరగతులతోపాటు ఇంటర్ తరగతులను బోధిస్తున్న కారణంగా జూనియర్ లెక్చరర్ల (జేఎల్) స్థాయి వేతనాలివ్వాలని తెలిపారు. ప్రిన్సిపాళ్లకు పదోన్నతుల చానెల్‌ను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రిన్సిపాళ్లు, పీజీటీలకు గెజిటెడ్ హోదా కల్పించాలని సూచించారు. ఆరోగ్య కార్డులివ్వాలని తెలిపారు. కారుణ్య నియామకాలను చేపట్టాలనీ, టీజీటీలకు పదోన్నతుల చానెల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎంఎస్టీఏ సహాధ్యక్షులు ఎన్ ఆంజనేయులు, ఉపాధ్యక్షులు కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా : నవీన్ కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎంఎల్సీ అభ్యర్థిగా బీఆర్ఎస్ పార్టీ తరపున పోటీకి ఎన్.నవీన్ కుమార్ రెడ్డిని పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. ఉమ్మడి పాలమూరు జిల్లా నేతల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఈ మేరకునిర్ణయించినట్టు తెలంగాణ భవన్ ఒక ప్రకటనలో తెలిపింది.

మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

- గవర్నర్ తమిళిసై

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలను దేవతాశక్తి గా ఆరాధించే గొప్ప సంప్రదాయం మనదని ఆమె గుర్తుచేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును తెచ్చినందుకు ఆమె ప్రధాని మోడీకి ధన్యవాదాలు తెలిపారు.ఈ బిల్లుతో ప్రజాస్వామ్యంలో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుందని తెలిపారు.

ఐఎంజీ భూముల కేటాయింపు రద్దు కరెక్టే

- 17 ఏండ్ల నాటి భూవివాదంపై హైకోర్టు తీర్పు



హైదరాబాద్ : ఐఎంజీ అకాడమీస్ భారత్ ప్రయివేట్ లిమిటెడ్(ఐఎంజీబీపీఎల్) కంపెనీకి అపధర్మంగా కొనసాగుతున్న నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వం భారీ ఎత్తున భూముల కేటాయింపులను ఆ తర్వాత వచ్చిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం రద్దు చేసిన విషయం విదితమే. ఈ వివాదంపై హైకోర్టు 17 ఏండ్ల తర్వాత గురువారం తీర్పు చెప్పింది. హైటెక్ సిటీకి సమీపంలోని మామిడిపల్లి, సెంట్రల్ యూనివర్సిటీ, జూబ్లీహిల్స్ వంటి ప్రాంతాల్లో ఏకంగా 856 ఎకరాలతో పాటు పలు స్పోర్ట్స్ స్టేడియాలను ఆ కంపెనీకి కట్టబెడుతూ చేసిన ఎంఒయూను వైఎస్ సీఎం అయ్యాక రద్దు చేశారు. 2003లో నారా చంద్రబాబు ప్రభుత్వ చర్యను రద్దు చేస్తూ 2006లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేసేందుకు ప్రత్యేకంగా చట్టం తెచ్చింది. ఒక్కరి కోసం చట్టం చేయడాన్ని ఆ కంపెనీ సవాల్ చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. ఆ కంపెనీకి ఏర్పాటైన వారం రోజులలోపే వందల ఎకరాలు, నిర్వహణ ఖర్చులు, బిల్లుల మాఫీ లాంటివి ఇవ్వడాన్ని తప్పు పట్టింది. పిటిషనర్(ఐఎంజీ భారత్)కి రాజ్యాంగ హక్కులు ఏమీ కలగలేదని చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం 17 ఏండ్ల సుదీర్ఘ విచారణ తర్వాత గురువారం తీర్పు చెప్పింది.

అనుమతించకున్నా ధర్నా చేస్తాం

ధైర్యముంటే పర్మిషన్ ఇవ్వాలి

- జీవో 3తో మహిళలకు అన్యాయం
- న్యాయపోరాటం చేసి తీరుతాం
- రేవంత్ సర్కారువి మహిళా వ్యతిరేక నిర్ణయాలు : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున హైదరాబాద్ ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద భారత జాగృతి ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నాను నిర్వహించి తీరుతామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 3తో నియామకాల్లో మహిళలకు జరుగుతున్న అన్యాయానికి నిరసనగా ధర్నాకు అనుమతించాలని మూడు రోజుల క్రితమే పోలీసులను కోరినట్టు ఆమె తెలిపారు. పోలీసుల నుంచి దానిపై ఎలాంటి అభిప్రాయం రాలేదనీ, రాకపోయినా ధర్నా చేసేందుకు ప్రయత్నిస్తామని వెల్లడించారు. రేవంత్ రెడ్డి సర్కారుకు ధైర్యముంటే ధర్నాకు అనుమతించాలని ఆమె సవాల్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కవిత విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెచ్చిన జీవో 3తో మహిళలకు నియామకాల్లో తరతరాల పాటు నష్టం జరిగే ప్రమాదముందని హెచ్చరించారు. ఇదే విషయాన్ని ప్రజలకు వివరించాలని భావించామని చెప్పారు. ప్రజాపాలనలో ఎవరైనా, ఎక్కడైనా ధర్నాలు చేసుకోవచ్చంటూ కాంగ్రెస్ ఇచ్చిన మాట తప్పిందని విమర్శించారు.

రాష్ట్రంలో కరవు పరిస్థితులపై ఆమె మాట్లాడుతూ "ఇది కరువు కాదు. కాళేశ్వరం ప్రాజెక్టును, కేసీఆర్‌ను బద్నాం చేయాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి సృష్టించిన కృత్రిమ కరువు " అని వ్యాఖ్యానించారు. అవగాహనరాహిత్యంతో ప్రభుత్వం చెరువులను నింపలేకపోయిందనీ, దాంతో ఆ నెపాన్ని ప్రకృతి వైపరిత్యంగా చిత్రీకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి అనుభవరాహిత్యం కారణంగా రైతులు, ప్రజలు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ప్రతి పక్షాలను పదే పదే బెదిరించడం అప్రజాస్వామికమని స్పష్టం చేశారు. నిజానికి రాష్ట్రంలో పోలీసులు స్వేచ్ఛ తో పనిచేస్తే ముఖ్యమంత్రిపై వందల కేసులు పెట్టాల్సి ఉండేవారని వ్యాఖ్యానించారు. అంతు చూస్తామని...మానవ బాంబులవుతారని ముఖ్య మంత్రి మాట్లాడడం దుర్మార్గమని ధ్వజమెత్తారు.

బీజేపీ ఎంపీ అర్వింద్ ఎక్కడ నుంచి పోటీ చేసినా ఓడిస్తానని కవిత ఈ సందర్భంగా శపథం చేశారు.ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కోరుట్లలో అర్వింద్‌ను ఓడించానని తెలిపారు.రానున్న పార్ల మెంటు ఎన్నికల్లోనూ ఓడిస్తాననీ, అదే తన ఎజెండా అని స్పష్టం చేశారు. అయితే, తాను పోటీ చేసే విషయంలో పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని అన్నారు. అలాగే, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి ప్రాంతీయ పార్టీలను బొందపెట్టేందుకు చూస్తున్నారని, అది ఆ పార్టీలతో సాధ్యం కాదన్నారు.

విధానపర అంశాలు మరిచి వ్యక్తిగత దూషణలు

- మీడియా సమావేశంలో మాజీమంత్రి సింగిరెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీఎం రేవంత్‌రెడ్డి విధానపర అంశాలపై మాట్లాడకుండా వ్యక్తిగత దూషణలు చేస్తున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. పాలమూరు బహిరంగసభలో రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. రేవంత్‌రెడ్డి పాలమూరు బిడ్డకాదనీ, చంద్రబాబు పెంపుడు బిడ్డఅనీ విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్, బీఆర్ఎస్ నేత నాగేందర్ గౌడ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తన పక్కనున్నవారితో రేవంత్‌కు ముప్పు ఉందనీ, అందుకే కేసీఆర్ పేరు పెట్టి వారిని తిడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆయన వ్యాఖ్యలను హైకోర్టు, సుప్రీం కోర్టులు సుమోటోగా తీసుకుని చర్యలు తీసుకోవాలని కోరారు. పాలమూరు మీద ప్రేమ ఉంటే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి మోడీ సభలో జాతీయహోదా కావాలని ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో సర్వం నష్టపోయిన పాలమూరుకు సాగునీళ్లు, ఐదు మెడికల్, ఒక ఫిషరీస్ కాలేజీలు ఇచ్చింది కేసీఆర్ అని గుర్తుచేశారు. రాష్ట్రంలో కరెంటు, రవాణా, ట్రాఫిక్ అన్ని రంగాల్లో నిస్తేజం నెలకొందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి ఈసారి 55 సీట్లు కూడా వస్తాయో? రావో తెలియదన్నారు. కాంగ్రెస్ చిన్నసైజు ప్రాంతీయ పార్టీ అని విమర్శించారు.

రేవంత్‌రెడ్డికి మోడీ పెద్దన్న అయితే రాహుల్ గాంధీ ఏం అవుతాడు? అని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలకు నియామకపత్రాలిచ్చి 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని గొప్పలు చెప్పుకోవడం దుర్మార్గమన్నారు. కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు అప్పచెప్పినందుకు రేవంత్, కాంగ్రెస్ పాలమూరు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీ ఉమ్మడి శత్రువు కేసీఆర్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హుందాగా మాట్లాడాలనీ, లేకుంటే జరగబోయే పరిణామాలకు ఆయనే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

రాజా రిత్విక్‌కు రజతం

- జాతీయ బ్లిట్జ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో సత్తాచాటిన యువకెరటం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

జాతీయ బ్లిట్జ్ చెస్ ఛాంపియన్‌షిప్-2024లో తెలంగాణ గ్రాండ్ మాస్టర్ రాజా రిత్విక్ రజత పతకాన్ని సాధించారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో గురువారం ఈ పోటీలు జరిగాయి.

6వ సీడ్‌గా ఆడుతున్న రాజా రిత్విక్ అన్ని రాష్ట్రాల నుంచి వచ్చిన 224 మంది అగ్రశ్రేణి క్రీడాకారులు పాల్గొన్న ప్రతిష్టాత్మక నేషనల్ బ్లిట్జ్ టోర్నమెంట్‌లో, 11 రౌండ్లలో 9 పాయింట్లు సాధించి టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. రిత్విక్ 7 గేమ్‌లు గెలిచి, 4 గేమ్‌లు డ్రా చేసుకున్నాడు. హైదరాబాద్‌లోని కేఎల్ యూనివర్శిటీలో ఇంజినీరింగ్ చదువుతున్న రాజా రిత్విక్, రేస్ చెస్ అకాడమీలో ప్రముఖ కోచ్ ఎన్ రామరాజు ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నారు.

ఈ జాతీయ బ్లిట్జ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో పశ్చిమ బెంగాల్‌కు చెందిన జీఎం ఘోష్ దీప్తాయన్ 9.5 పాయింట్లతో బంగారు పతకాన్ని, గోవాకు చెందిన ఎఫ్ఎం వాజ్, ఈథాన్ 9 పాయింట్లతో కాంస్య పతకాన్ని అందుకున్నారు. అంతకుముందురోజు జరిగిన జాతీయ ర్యాపిడ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో రాజా రిత్విక్ కాంస్య పతకం గెలుచుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షులు కేఎస్ ప్రసాద్ అభినందనలు తెలిపారు.

పోటీపరీక్షలకు ఉచిత కోచింగ్, వసతి కల్పించాలి

- డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షల కోసం ఉచిత కోచింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలనీ, వసతి కల్పించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్ష, కార్య దర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్ ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు.హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రూప్-1,2,3 రాత పరీక్ష తేదీలను టీఎస్‌పీఎస్సీ ప్రకటించిందని చెప్పారు. డీఎస్సీ నోటిఫికేషన్లు విడుదలైందని అన్నారు.గత ప్రభుత్వం నోటిఫికేషన్లను ఇచ్చిన ప్పటికీ పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకేజీ వల్ల అవి రద్దయ్యాయని విమర్శించారు. ఇప్పటికే కొన్నేండ్లుగా నిరుద్యోగులు ఫీజులు కట్టి కోచింగ్ తీసు కుంటున్నా రని చెప్పారు.మరింత కాలం చదవాల్సిన అవసరం ముందన్నారు. పేద,మధ్యతరగతి నిరుద్యోగ యువకు లు కోచింగ్ కోసం ఫీజులు కట్టడానికి, వసతి ఏర్పాటుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.అప్పులు చేసి చదువు కుంటున్నారని అన్నారు. నెలకు రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు ఖర్చవుతుందన్నారు. ఈ పరీక్షల కోసం రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 15 లక్షల మంది నిరుద్యోగ యువకులు సన్నద్ధమవుతున్నారని వివ రించారు. వారి కోసం ప్రతి నియోజకవర్గంలో ఉచిత కోచింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి వసతి కల్పించాల ని కోరారు.ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేయాల నీ,ప్రయివేట్ కోచింగ్ కేంద్రాల ఫీజుల దోపిడిని అరికట్టాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.

గ్రూప్-2,3కి దరఖాస్తు చేసుకునే అవకాశమివ్వాలి

- టీఎస్‌పీఎస్సీ చైర్మెన్‌కు ఏఐవైఎఫ్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకుని గ్రూప్-2,3 రాసే కొత్త అభ్యర్థులకు కూడా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించాలని ఏఐవైఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ పి మహేందర్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధర్మేంద్ర నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రూప్-2, దరఖాస్తు గడువును గతేడాది ఫిబ్రవరి 16 వరకు, గ్రూప్-3 దరఖాస్తు గడువు గతేడాది ఫిబ్రవరి 23 వరకు అవకాశం కల్పించారని తెలిపారు. వాస్తవానికి గత ప్రభుత్వం నిరు ద్యోగులకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. పోటీ పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా లక్షలాదిమంది యువత భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టిందని తెలిపారు. ప్రశ్నాపత్రాల లీకేజీ కారణంగా నిరుద్యోగుల్లో అసహనం పెరిగిపోయిందని పేర్కొన్నారు. అందుకే ఎక్కువ మంది అభ్యర్థులు అప్పుడు దరఖాస్తు చేసుకోలేదని తెలిపారు. గ్రూప్-2,3కి దరఖాస్తు చేసుకునేందుకు మరో వారంరోజుల పాటు గడువు ఇవ్వాలని కోరారు. పారదర్శకంగా, జవాబుదారీతనంగా, ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి సత్యప్రసాద్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆర్ బాలకృష్ణ, నాయకులు కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ రాక ముందే హామీలు అమలు చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వానికి ఎస్‌డబ్ల్యూఎఫ్ విజ్ఞప్తి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎన్నికల కోడ్ రాకముందే హామీలు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఎస్‌డబ్ల్యూఎఫ్ కోరింది. ఎన్నికల మానిఫెస్టోలో పొందుపర్చిన ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, వేతన ఒప్పందాల అమలు, అరియర్స్ చెల్లింపు, కార్మికోద్యమంపై ఆంక్షలు ఎత్తేయడం వంటి హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేసింది. గురువారం ఈ మేరకు ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్.రావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీలో కార్మికోద్యమంపై ఆంక్షలు తొలగించనందున తమ సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకుపోలేని పరిస్థితిలోకి కార్మికులు నెట్టబడ్డారని విమర్శించారు. మహాలక్ష్మి పథకం అమలు తర్వాత ప్రతి సర్వీసు కూడా రెండు నుంచి మూడు గంటల లేటవుతున్నదని పేర్కొన్నారు. నగరంలో మధ్యాహ్నం షిఫ్ట్‌లో 2 గంటలు ఆలస్యంగా బస్సును ఇచ్చి కూడా పూర్తి డ్యూటీ చేయాలని ఒత్తిడి చేస్తున్న ఫలితంగా అర్ధరాత్రి డ్యూటీలు దిగే పరిస్థితి నెలకొందని వాపోయారు. శాస్త్రీయంగా రన్నింగ్ టైమ్ ను నిర్ణయించాలని కోరుతున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదని తెలిపారు. ఆర్టీసీ ఈ స్థితికి ఎదగడానికి కార్మికుల కృషినే అని పేర్కొన్నారు. 2024లో ఉన్నా 2013 నాటి వేతనాలతోనే కుటుంబాలను నెట్టుకురావాల్సిన దుస్థితి నెలకొందని వాపోయారు. ఆర్టీసీలో వేతన ఒప్పందాలు, సర్వీసు కండీషన్లపై ఒప్పందాలన్నీ ద్వైపాక్షికంగా జరిగాయని తెలిపారు. ఇప్పుడు కార్మిక సంఘాలకు అనుమతి ఇవ్వకుండానే, కార్మిక సంఘాలతో ఎటువంటి ఒప్పందం లేకుండానే, ప్రభుత్వం ఏకపక్షంగానే వేతన ఒప్పందంపై ప్రకటన చేసే పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వెలువడక ముందే ఆర్టీసీలో కార్మిక సంఘాలను అనుమతిస్తూ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీ మేరకు 2017, 2021 వేతన ఒప్పందాలను, అరియర్స్‌ను తక్షణమే చెల్లించాలని కోరారు. 2017 నాటికి వున్న డి.ఎ. 31 శాతాన్ని మెర్జ్ చేస్తూ ఆనాడు రాష్ట్ర ప్రభుత్వోద్యోగులతో సమానమైన వేతనాలు పొందేలా ఫిట్మెంట్‌ని నిర్ణయించాలనీ, అలాగే 2021 నాటి వేతన ఒప్పందాన్ని నిర్ణయించాలని కోరారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు.

టానిక్ వైన్ మార్టు మోసాలు

- అబ్కారి శాఖ అదాయానికి భారీ గండి
- రూ.100 కోట్ల వరకు పన్ను ఎగవేత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టానిక్ వైన్ మార్టు పేరుతో లిక్కర్ మార్కెట్లో అడుగు పెట్టిన సంస్థ అబ్కారి శాఖ అధికారులతో కుమ్మక్కై, దాదాపు రూ.100 కోట్ల వరకు సర్కార్ ఖజానాకు గండి కొట్టినట్టు తెలుస్తోంది. గత సర్కార్ హయాంలోని అధికారులతో కలిసి ఈ మోసాలకు పాల్పడినట్టు గుర్తించారు. వివరాల్లోకి వెలితే ...బీఆర్ఎస్ ప్రభుత్వం 2016 ఎలైట్ వైన్స్‌ల ఏర్పాటుకు నోటిఫికేషన్ ఇచ్చింది. టానిక్ బెవరేజ్ సంస్థ ఒక్కరే నగరంలో ఎలైట్ వైన్స్ ఏర్పాటు చేసేందుకు టెండర్ దాఖలు చేయడంతో సులువుగా అనుమతి పొందింది. దీన్ని అదనుగా తీసుకున్న సంస్థ క్యూ బై పేరుతో తమ సంస్థలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది పేరుతో నగర వ్యాప్తంగా 10 సాధారణ వైన్స్‌లను అనుమతి తీసుకుంది. అయితే అందులో ఎలైట్ వైన్స్‌ల మాదిరిగా విదేశీ లిక్కర్ అమ్మకాలు సాగించింది. టానిక్ మోసాలపై దృష్టి పెట్టిన కాంగ్రెస్ సర్కార్ అవినీతిని బయటకు తీసినట్టు తెలుస్తోంది. గత సర్కార్ హయాంలోని ఓ ఉన్నతాధికారితో పాటు పలువురు ముఖ్యుల హస్తం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ లిక్కర్ మోసాలపై చర్యలు తీసుకునేందుకు సర్కార్ సమాయత్తమౌతోందని సమాచారం.

మెహందీ, హెన్నా తయారీలో ప్రమాదకర రసాయనం

- నగ్రీస్ హెర్బ్స్‌ను సీజ్ చేసిన డీసీఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హెన్నా, మెహందీ, తయారు చేస్తున్న నగ్రీస్ హెర్బ్స్ యూనిట్లలో సోదాలు చేసి నిబంధనలు పాటించకుండా హెన్నా, మెహందీ పౌడర్లు తయారు చేస్తున్నట్లు డ్రగ్ కంట్రోల్ అధికారులు గుర్తించారు. గురువారం హైదరాబాద్‌లో తనిఖీలు చేపట్టారు. పాకీజా పేరుతో వీటిని మార్కెట్ చేస్తున్నారు. అనుమతులు లేకుండా హెన్నా, మెహందీ, తయారు చేయడమే కాకుండా దీనిలో ప్రమాదకర పిక్రామిక్ అనే విషపూరిత రసాయనాన్ని ఉపయోగిస్తున్నట్టు నిర్ధారించారు. దీంతో ఆ సంస్థను సీజ్ చేసి ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. దీంతో హెన్నా, మెహందీలు తయారు చేయొద్దని అధికారులు సూచించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన శిక్షలు తప్పవనిడ్రగ్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ వీ.బీ.కమలాసన్ రెడ్డి హెచ్చరించారు. జుత్తు రాలకుండా, తెల్లబడకుండా, చేతులు అందంగా ఉండేందుకు చాలా మంది హెన్నా, మెహందీ, వాడుతున్నారు. మార్కెట్‌లో దొరికే చాలా ఉత్పత్తులు కొనుగోలు చేసి వినియోగిస్తున్నారు. అయితే వాటిలో రసాయనాలు మోతాదుకు మించి ఉపయోగిస్తున్నారు. ఈ విషయం తెలియకుండా హెన్నా, మెహందీ వాడుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. మహబూబ్ నగర్ జిల్లాలో జడీ బ్యూటీ నౌరిషింగ్ హెయిర్ ఆయిల్ తో ఎపిలెప్సీ, యాంగ్జైటీ చికిత్స లభిస్తుందంటూ ప్రజలను తప్పుదారి పట్టిస్తుండటంతో వాటిని సీజ్ చేశారు. అదే విధంగా జడ్చర్లలో బెల్లాకేర్ సిరప్ తో రక్తస్రావ సమస్యలు, బహిష్టు సమస్యలు, ఆడవారిలో సంతాన లేమి సమస్యలకు చికిత్స లభిస్తుందంటూ ప్రచారం చేసుకుంటుండంతో వాటిని సీజ్ చేశారు.

30 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని అమలు చేయాలి : డీటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఉద్యోగులకు 30 శాతం ఫిట్‌మెంట్‌తో రెండో వేతన సవరణ సంఘం (పీఆర్సీ)ని అమలు చేయాలని డీటీఎఫ్ కోరింది. ఈ మేరకు పీఆర్సీ కమిటీ చైర్మెన్ శివశంకర్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం సోమయ్య, టి లింగారెడ్డి గురువారం కలిసి ప్రతిపాదనలను సమర్పించారు. ఉద్యోగుల కనీస వేతనం రూ.32 వేలు, గరిష్ట వేతనం రూ.2,68,950గా ఉండాలని కోరారు. గతేడాది జులై ఒకటి నుంచి పీఆర్సీని అమలు చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న 33.67 డీఏకు 30 శాతం ఫిట్‌మెంట్ కలిపి వేతన సవరణ చేయాలని కోరారు. పెరిగిన ద్రవ్యోల్బణం, పెరుగాల్సిన జీవన ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని వేతన సవరణ కమిషన్ సిఫారసులను చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి రాజిరెడ్డి, రాష్ట్ర అకడమిక్ సెల్ కన్వీనర్ బి రామకృష్ణ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మల్లయ్య, ప్రధాన కార్యదర్శి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి ని వినియోగించుకున్న 24.05 కోట్ల మహిళలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా ఇప్పటి వరకు 24.05 కోట్ల మంది మహిళలు జీరో టికెట్‌పై ప్రయాణించారు. ఈ పథకం కింద తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, నాన్-లగ్జరీ బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడికైనా మహిళలు ఉచితంగా ప్రయాణించేందుకు అనుమతిస్తున్న విషయం విదితమే. ఈ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతేడాది డిసెంబర్ 9న ప్రారంభించారు. జనవరి నెలలో మహిళా ప్రయాణికుల సంఖ్య రోజుకు 28.10 లక్షలకు పెరిగింది. కాగా ఆ సంఖ్య ఫిబ్రవరి నెలలో రోజువారీ 30.56 లక్షలకు పెరిగింది. ఈ నెలలో మహిళా ప్రయాణీకుల ఉచిత ప్రయాణం రోజు వారీ గణాంకాలను పరిశీలిస్తే... మార్చి ఒకటిన 32.08 లక్షల మంది, మార్చి 2న 31.81 లక్షలు, మార్చి 3న 26.24 లక్షలు, మార్చి 4న 33.18 లక్షలు, మార్చి 5న 32.04 లక్షలు, మార్చి 6న 32.95 లక్షల మంది మహిళలు బస్సుల్లో జీరో టికెట్ విధానంలో ప్రయాణించారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 24.05 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారు.

కేరళ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒటిటి వేదిక

- కేరళ ప్రభుత్వం మరో ఘనత
- దేశంలోనే తొలి ప్రభుత్వ 'ఒటిటి'గా 'సి స్పేస్'

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఇంటర్నెట్ ఆధారిత సేవల రంగంలోనూ కేరళ ప్రభుత్వం దూసుకుపోతోంది. ర్యాపిడ్, ఓలా వంటి వాటికి ప్రత్యామ్నాయంగా 'కె - రైడ్', ముంబయిలో డబ్బా వాలాల తరహా సేవలకు ఇంటర్నెట్ జోడించి కుండబశ్రీ లబ్దిదారుల ద్వారా 'లంచ్ బెల్' వంటి వినూత్న సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిన అక్కడి ప్రభుత్వం తాజాగా వినోదరంగంలోనూ సరికొత్త రికార్డు నమోదు చేసింది. నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ వంటి ఒటిటి సంస్థలకు ప్రత్యామ్నాయంగా దేశంలోనే తొలిసారి ప్రభుత్వ ఆధ్వర్యంలో 'సి - స్పేస్' పేరిట ఒటిటి వేదికను ప్రారంభించింది. తిరువనంతపురంలో గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సిస్పేస్‌ను కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రారంభించారు. దేశంలో తొలి ప్రభుత్వ రంగ ఓటిటి ప్లాట్‌ఫాం ఇదేనని రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి సాజి చెరియన్ తెలిపారు. ప్రస్తుతం ఉన్న ప్రైవేటు ఓటిటిల్లో ప్రసారమవుతున్న కంటెంట్‌ల్లో చాలా తేడాలున్నాయని, వాటి ప్రసారాల్లో సవాళ్లు ఎదురవుతున్నాయని రాష్ట్ర ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ షాజి ఎన్ కరున్ అన్నారు. వాటికి ప్రతిస్పందనగా సిస్పేస్ ను ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఈ ఓటిటి యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్, ఐఒఎస్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అన్నారు. ఈ ఓటిటిలో రూ.75 ధరకే యూజర్లు కొత్త చిత్రాలు చూడొచ్చని, తక్కువ నిడివి ఉన్న కంటెంట్ ను సగం ధరకే వీక్షించే అవకాశం కల్పిస్తున్నామని అన్నారు. "పే ఫర్ వ్యూ" ఆధారంగా నిర్మాతలకు చెల్లింపులు చేస్తారని పేర్కొన్నారు. ఈ సిస్పేస్ వేదిక ద్వారా నూతన దర్శకులు తమ చిత్రాల కోసం 'క్రౌడ్ ఫండింగ్' చేసుకునే సదుపాయం కల్పించినట్లు తెలిపారు.

అయితే, ఒటిటి వేదికల్లో నిర్మాతలే నేరుగా చిత్రాలను విడుదల చేస్తే తమ ఆదాయాలు తగ్గుతాయని పలువురు ఎగ్జిబిటర్లు, పరిశ్రమ వ్యక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో థియేటర్లలో విడుదలైన సినిమాలను మాత్రమే సిస్పేస్ లో విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాధారణ విద్యాశాఖ మంత్రి వి శివన్‌కుట్టీ, ఆహార, పౌర సరఫరాల మంత్రి జీఆర్ అనిల్, ఎమ్మెల్యే అంటోనీ రాజు, మేయర్ ఆర్య రాజేంద్రన్ కూడా పాల్గొన్నారు.



నేడు కాంగ్రెస్ మొదటి జాబితా!

- 9-11 సీట్లకు అభ్యర్థులను ప్రకటించే అవకాశం
- కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ భేటీ
- తెలంగాణ నుంచి హాజరైన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టీ, మంత్రి ఉత్తమ్
- తెలంగాణ తో పాటు మరో 9 రాష్ట్రాల అభ్యర్థుల ఎంపికపై జరిగిన చర్చ
- 10 రాష్ట్రాల నుంచి 60 మంది అభ్యర్థుల ఎంపిక

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రానున్న లోక్ సభ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులకు సంబంధించి మొదటి జాబితాపై కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు చేసింది. ఈ జాబితాలో పది రాష్ట్రాల నుంచి దాదాపు 60 సీట్లకు అభ్యర్థులను చోటు కల్పించనుంది. గురువారం అక్బర్ రోడ్ లోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ అగ్రనేత సోనియాగాంధీ, పార్టీ జనరల్ సెక్రెటరీ(సంస్థాగత) కేసీ వేణుగోపాల్, ముఖ్యనేతలు జైరాం రమేష్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, అధిర్ రంజన్ చౌదరి, అంబికా సోని, ముకుల్ వాస్నిక్, టీఎస్ సింగ్ డియో సహా సీఈసీ సభ్యులు పాల్గొన్నారు. మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ వర్చువల్ మోడల్ లో హాజరయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ, కర్నాటక, కేరళ, ఛత్తీస్‌గడ్, హర్యానా, ఢిల్లీ, ఈశాన్య రాష్ట్రాలతో సహా వివిధ రాష్ట్రాల్లో లోక్‌సభ అభ్యర్థుల ఎంపికపై వేరు వేరుగా చర్చించారు. ఇండియా కూటమి లో ఇతర పార్టీలతో పొత్తుల నేపథ్యంలో... దాదాపు 10 రాష్ట్రాల నుంచి ఫస్ట్ లిస్ట్ లో 60 పైగా స్థానాలకు అభ్యర్థులను ప్రకటించనున్నట్టు తెలిసింది.

9-11 సీట్లకు అభ్యర్థుల ఖరారు...

రాష్ట్రం నుంచి దాదాపు 9-11 స్థానాలకు అభ్యర్థులను సీఈసీ ఖరారు చేసినట్లు తెలిసింది. సింగిల్ నేమ్స్, ఎలాంటి పోటీ, వివాదాలకు తావు లేని స్థానాలు ఇందులో ఉంటాయని మీటింగ్ లో పాల్గొన్న ముఖ్య నేతలు తెలిపారు. తెలంగాణకు సంబంధించిన అభ్యర్థుల ఎంపికలో సీఎం, పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఈసీ మెంబర్ ఉత్తమ్ కుమార్ రెడ్డిలు హాజరయ్యారు. రాత్రి ఎనిమిది గంటలకు ప్రారంభమైన ఈ సమావేశం దాదాపు అరగంట పాటు సాగింది. పలు దఫాలుగా రాష్ట్ర ముఖ్యనేతలో భేటి అయిన రాష్ట్ర ఇన్‌చార్జీ దీపా మున్షి పీసీసీ చీఫ్ రేవంత్... అందరి అభిప్రాయాలను క్రోడికరించి, వడపోసి ఆశావాహుల జాబితాను తయారు చేసి హైకమాండ్ కు సమర్పించినట్టు తెలిసింది. మొత్తం 14 స్థానాలకు సంబంధించిన ఆశావాహుల వివరాలు ఇందులో ఉన్నట్టు సమాచారం. పలు స్థానాలకు సింగిల్ నేమ్స్ ఉండగా, అసెంబ్లీ ఎన్నికల టైంలో తమ సీట్లను త్యాగం చేసిన వారికి ఎంపీ ఎన్నికల్లో అవకాశం కల్పించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అలాగే ముఖ్యనేతలు కుటుంబ సభ్యులు పోటీ పడుతోన్న మరో మూడు స్థానాల్లో అభ్యర్థుల ఎంపికను పార్టీ అగ్రనాయకత్వానికి వదిలేసినట్లు తెలిసింది. ఈ లిస్ట్ ఆధారంగా ఖర్గే నేతృత్వంలోని సీఈసీ సభ్యులు అభ్యర్థులను ఎంపిక చేశారు.

ఖమ్మం, భువనగిరి, నాగర్ కర్నూల్ స్థానాలపై పీటముడి

అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించిన ఖమ్మం నియోజక వర్గంలో అభ్యర్థుల ఎంపిక పార్టీకి కాస్తంత ఇబ్బందికరంగా మారినట్లు నేతలు చెబుతున్నారు. ఇక్కడి నుంచి డిప్యూటీ సీఎం భట్టి సతీమణి నందిని సీటు ఆశిస్తున్నారు. గత వారం ఢిల్లీ పర్యటనలో భాగంగా భట్టి పలువురు అగ్రనేతలను కలిసి లాబీయింగ్ కూడా చేశారు. అలాగే మంత్రులు పొంగులేటి తన తమ్ముడు ప్రసాద్ రెడ్డికి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు మంత్రి తుమ్మల తన కుమారుడు యుగెంధర్ కు ఈ సీటు కేటాయించాలని కోరుతున్నట్లు సమాచారం. దీంతో ఫస్ట్ లిస్ట్ లో ఖమ్మం సీటు ప్రకటనకు బ్రేక్ పడే అవకాశం ఉంది. అలాగే భువనగిరి నుంచి మంత్రి కోమటి రెడ్డి కుటుంబ సభ్యులు టికెట్ ఆశిస్తున్నారు. మరోవైపు చామల కిరణ్ కుమార్ రెడ్డి ఈ సీటు నుంచి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇక నాగర్ కర్నూల్ సీటుకు పార్టీ సీనియర్ నేత మల్లు రవి పోటీ పడుతున్నారు. ఇందుకోసం ప్రస్తుతం ఉన్న ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి పోస్ట్ ను కూడా రిజైన్ చేసేందుకు రెడీ అయ్యారు. ఢిల్లీలో పార్టీ అగ్రనేతలతో పాటు, సీఎం రేవంత్ ను కూడా కలిసి కోరారు. హైకమాండ్ ఆశిర్వాదం తనకే ఉన్నందున, ఆ సీటు తనకే దక్కుతుందని ఆయన భావిస్తున్నారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే సంపత్ ఈ సీటు తనకు కేటాయించాలని పట్టుబడుతున్నారు. అలాగే మరికొన్ని స్థానాల్లో కొత్త పేర్లు ఉండే అవకాశం ఉంది.

మొదటి జాబితాలో రాహుల్ పేరు

మొదటి జాబితాలో అగ్రనేత రాహుల్ గాంధీ పేరు ఉండనుంది. అయితే రాహుల్ గాంధీ ఎక్కడి నుంచి పోటీచేస్తారో జాబితా ద్వారా తెలుపుతామని సీఈసీ మెంబర్- ఉత్తమ్ మీటింగ్ అనంతరం వెల్లడించారు. సాధ్యమైనంత త్వరగా కాంగ్రెస్ తొలి లిస్ట్ అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందన్నారు. కొన్ని రాష్ట్రాల్లో పోటీచేసే అభ్యర్థులపై మాత్రమే చర్చ జరిగిందన్నారు.

సీఈసీ పరిశీలనలో కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా....

1. మహబూబ్‌గర్: వంశీచంద్ రెడ్డి
2. కరీంనగర్ : ప్రవీణ్ రెడ్డి
3. నిజామాబాద్ : జీవన్ రెడ్డి
4. పెద్దపల్లి : గడ్డం వంశీకృష్ణ
5. జహీరాబాద్ : సురేష్ శెట్కార్
6. సికింద్రాబాద్ : బొంతు రామ్మోహన్/ఆయన సతీమణి
7. నల్గొండ : జానారెడ్డి/రఘువీర్ రెడ్డి
8. భువనగిరి : చామల కిరణ్ కుమార్ రెడ్డి/కోమటిరెడ్డి కుటుంబ సభ్యులు
9. మహబూబాబాద్ : బలరాం నాయక్
10. వరంగల్ : అద్దంకి దయాకర్ /సర్వే సత్యనారాయణ
11. చేవెళ్ల : సునీత మహేందర్ రెడ్డి 12. హైదరాబాద్: ఫిరోజ్ ఖాన్/ ముస్లిం వర్గానికి చెందిన మహిళ అభ్యర్థి
13. నాగర్ కర్నూల్ : మల్లు రవి/ సంపత్ కుమార్
14. ఖమ్మం : నందిని/ ప్రసాద్ రెడ్డి/ యుగంధర్
15. మెదక్ : నీలం మధు/మైనంపల్లి
16. మల్కాజ్ గిరి: చంద్ర శేఖర్
17. ఆదిలాబాద్: పార్టీకి చెందిన సీనియర్ నేత పేరు

18 నుంచి టెన్త్ పరీక్షలు

- వెబ్‌సైట్‌లో విద్యార్థుల హాల్‌టికెట్లు
- 5,08,385 మంది హాజరు
- 2,676 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈనెల 18 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభమవుతాయి. వచ్చేనెల రెండో తేదీ వరకు జరుగుతాయి. 5,08,385 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతారు. ఇందులో 2,57,952 మంది అబ్బాయిలు, 2,50,433 మంది అమ్మాయిలున్నారు. వారి కోసం 2,676 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. ఫస్ట్ లాంగ్వేజ్ కాంపోజిట్ కోర్సు సబ్జెక్టుకు మాత్రం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. సైన్స్ సబ్జెక్టును రెండు విడతల్లో నిర్వహిస్తున్నామనీ, ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్‌ను వేర్వేరు రోజుల్లో ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులు, సిబ్బంది మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను తేవడాన్ని నిషేధించామని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుల కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామనీ, విద్యార్తులు 040-23230942 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. హాల్‌టికెట్లు, ముద్రించిన నామినల్ రోల్స్‌ను డీఈవోల ద్వారా సంబంధిత పాఠశాలలకు పంపించామని తెలిపారు. హెడ్మాస్టర్ల ద్వారా వాటిని తీసుకోవాలని కోరారు. www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచామనీ, వాటిని విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. మాధ్యమం, సబ్జెక్టులకు సంబంధించి ఏమైనా తప్పులుంటే సంబంధిత పాఠశాలల హెడ్మాస్టర్ల దృష్టికి తేవాలని కోరారు.

ప్రచారం ఘనం.. ఆచరణ శూన్యం

- 'ది స్కిల్ ఇండియా' వంటి కార్యక్రమాల తీరు
- ఐటీఐలపై వేల కోట్ల ఖర్చు.. ఫలితం మాత్రం నిల్
- అప్రెంటిస్‌షిప్‌లకు చెల్లింపులూ తక్కువే
- చట్టాల అమలులో కేంద్రానికి లేని చిత్తశుద్ధి
- అనుకూల కథనాలతో ప్రచారార్భాటాలు
- మోడీ సర్కారు తీరుపై యువతలో అసంతృప్తి



కేంద్రంలోని మోడీ సర్కారు ప్రవేశపెట్టే ఏ పథకమైనా.. తీవ్ర ప్రచారానికి నోచుకుంటున్నది. కానీ, అమలు తీరే అందుకు పూర్తి భిన్నంగా ఉంటున్నది. 2014లో కేంద్రంలో తొలిసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి.. ఎన్డీయే రెండో టర్మ్ పూర్తి కావస్తున్న ఈ సమయానికీ.. మోడీ ప్రభుత్వం పలు పథకాలను, కార్యక్రమాలను ప్రవేశపెట్టింది. కానీ, ప్రచారంలో ఉన్న శ్రద్ధను ఆచరణలో చూపెట్టలేకపోతున్నది. ఫలితంగా అనేక పథకాలు నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవటం లేదు. అందులో ఒకటే 'ది స్కిల్ ఇండియా' కార్యక్రమం.

న్యూఢిల్లీ : దేశంలోని శ్రామిక శక్తిలో నైపుణ్యాలు పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 'మేకిన్ ఇండియా', 'డిజిటల్ ఇండియా' విస్తృత ప్రచారాల్లో భాగంగా 2015, జులై నెలలో కేంద్రం దీనిని తీసుకొచ్చింది. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తామనీ, దేశంలో నిరుద్యోగాన్ని పారదోలుతామని హామీ ఇచ్చి మోడీ సర్కారు 2014లో అధికారంలోకి వచ్చింది. అయితే, అధికారంలోకి వచ్చాక ఆ వాగ్దానాన్ని నిలబెట్టుకోలేకపోయింది. ఉపాధి కల్పనలు చేయలేకపోయింది. స్కిల్ ఇండియా'తో నైపుణ్యాలు మెరుగుపర్చి, ఉపాధి కల్పనకు తోడ్పాటునందిస్తామన్న మోడీ సర్కారు మాటలు వాస్తవానికి కార్యరూపం దాల్చలేదు. నిపుణులు సంతోష్ మెహ్రోత్రా భారత ఉపాధి సంక్షోభాన్ని విశ్లేషిస్తూ.. "2012 నుంచి ప్రభుత్వం, ప్రభుత్వ రంగంలో కూడా ఒక సంవత్సరం కంటే తక్కువ కాంట్రాక్ట్‌తో అనధికారిక ఉద్యోగాల వాటా పెరిగింది. ఇది శ్రామికశక్తిని, నిరుద్యోగ యువతను నిరుత్సాహపర్చే అంశం" అని అన్నారు.

పథకాల అమలులో నిర్లక్ష్యం.. నిరుద్యోగులపై భారం

ఐటీఐలు, పరిశ్రమలకు నైపుణ్యం కలిగిన కార్మికులను అందించే, విద్యావంతులైన యువతకు నిరుద్యోగం తగ్గేలా చూడాలనే లక్ష్యంతో వారి క్రాఫ్ట్‌మెన్ ట్రెనింగ్ స్కీమ్ (సీటీఎస్) కింద యువతకు ఒకటి నుంచి రెండు సంవత్సరాల వరకు వృత్తి నైపుణ్య శిక్షణను అందిస్తారు. ప్రస్తుతం దేశంలో 14,789 (ప్రభుత్వ, ప్రయివేటు) వద్ద ఉన్న ఐటీఐలు 1950లలో తయారీలో నైపుణ్యం కలిగిన కార్మికులను పెద్ద ఎత్తున అందించటానికి స్థాపించబడ్డాయి. అయితే, కేంద్రంలోని మోడీ సర్కారు మాత్రం వీటిని నిర్లక్ష్యం చేస్తున్నది. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన కింద 1.1 కోట్ల మంది ప్రజలు నైపుణ్యం పొందారని నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ పేర్కొన్నది. స్కిల్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. నిరుద్యోగ భారాన్ని యువతపై మోపారు. యువతకు నైపుణ్యం లేకపోయినా దేశంలో చాలా ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని ఆయన అన్నారు.

యువతలో నైపుణ్యాభివృద్ధి జరగలేదు : నిపుణులు

దేశంలోని యువతకు, నిరుద్యోగులకు నైపుణ్యాభివృద్ధి జరగలేదనీ, ఇప్పటికీ వారు నిరుద్యోగ సమస్యను, ఉద్యోగాల్లో ఉన్నవారు తక్కువ వేతన సమస్యను ఎదుర్కొంటున్నారని కొందరు నిపుణులు చెప్తున్నారు. జీన్ డ్రేజ్ గణాంక అంచనాల ప్రకారం.. 2014-15 నుంచి 2021-22 మధ్య వాస్తవ వేతనాల వృద్ధి రేటు సంవత్సరానికి 1 శాతం కంటే తక్కువగా ఉన్నది. స్కిల్లింగ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో చేరిన తర్వాత కూడా, ఉద్యోగం సాధించడం కష్టమని విద్యార్థులు చెప్తున్నారని కొందరు పరిశోధకులు వివరిస్తున్నారు. గుజరాత్‌లోని దేడియాపాడులో గల ఐటీఐలోని ఆదివాసీ విద్యార్థులు మాట్లాడుతూ.. "ఈ అభివృద్ధి మా కోసం కాదు. ఇతరుల కోసం, ఇతర పెత్తందారీల కోసం. మేము ఆదివాసీలు ఎప్పుడూ అట్టడుగున ఉంటాం. మా భూములు, అడవులను ప్రభుత్వం లాక్కుంటుంది. మేము మాత్రం చిన్నపాటి పని కోసం వెతుక్కోవాల్సి ఉంటుంది" అని అన్నారు.

'ఐటీఐలకు ప్లేస్‌మెంట్ పెద్ద సవాలే'

ఐటీఐలకు ప్లేస్‌మెంట్ పెద్ద సవాలుగా ఉన్నదని పలువురు ప్రిన్సిపాల్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశంలో చాలా మంది గ్రాడ్యుయేట్లు ఉన్నప్పటికీ ఉద్యోగం కోసం ఎక్కువ దూరం వారు వెళ్లలేరనీ, స్థానికంగా తక్కువ వేతనాలతో నిలదొక్కుకోలేక ఇబ్బందులు పడుతున్నారని అంటున్నారు. నైపుణ్యాల సముపార్జనకు విద్యాసంస్థల్లో శిక్షణ సరిపోదని, అందువల్ల విద్యార్థులు ప్రాక్టికల్ నాలెడ్జ్ పొందడానికి పరిశ్రమల్లో అప్రెంటీస్‌గా ఉండాలని గ్రహించి 1961లో అప్రెంటిస్‌షిప్ చట్టం తీసుకొచ్చింది అప్పటి ప్రభుత్వం. ఈ చట్టం ప్రకారం.. పరిశ్రమలు ఉన్న రాష్ట్రంలోని కనీస వేతనంలో కనీసం 70 శాతం అప్రెంటిస్‌లకు చెల్లించాలి. అయితే, ఆ చెల్లింపులు సైతం ఇప్పుడు సక్రమంగా జరగటం లేదనీ, చట్టం అమలు పేలవంగా ఉన్నదనీ, ప్రభుత్వాధికారుల పర్యవేక్షణ లోపించి.. అప్రెంటీస్‌లు ఇబ్బందులు పడుతున్నారని నిపుణులు, విశ్లేషకులు అంటున్నారు. మోడీ పాలనలోని అస్తవ్యస్త ఆర్థిక వ్యవస్థ, ఉద్యోగాల కొరత, అప్రెంటిస్‌షిప్ కాంట్రాక్టులలో లోపాలు, పరిశ్రమలపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవటం కారణంగా దేశంలోని విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారు. నైపుణ్యాభివృద్ధిలో భాగంగా స్కిల్ ఇండియా వంటి ప్రోగ్రామ్‌ల అమలులో భాగంగా ప్రభుత్వ ఐటీల కోసం వేల కోట్లు వెచ్చిస్తున్నా. అందుకు తగిన ఫలితాలు మాత్రం రావటంలేదని పరిశోధకులు అంటున్నారు. ఐటీల ప్లేస్‌మెంట్ రేటు 0.1 శాతం కంటే తక్కువగా ఉన్నదన్న నిటి ఆయోగ్ గణాంకాలను వారు ఉదహరిస్తున్నారు.

ప్రధాని అవాస్తవాలు

2022లో తన పుట్టినరోజున ప్రధాని మోడీ 40 లక్షల మంది ఐటీఐ విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. నైపుణ్యాలపై వారికి సందేశమిచ్చారు. గత ఎనిమిదేండ్లలో ఐటీఐల్లో నాలుగు లక్షలకు పైగా సీట్లు వచ్చాయనీ, విద్యార్థులకు కొత్త అవకాశాలు, ఉద్యోగాలు కల్పిస్తున్నామంటూ విద్యార్థులు పడుతున్న నిరుద్యోగ వాస్తవికతను పూర్తిగా కప్పిపుచ్చుతూ మోడీ ప్రసంగించారు. దేశంలో నిరుద్యోగ రేటు గతేడాది అక్టోబరులో 10.05 శాతానికి పెరిగిందని పలు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇది రెండేండ్లలో అత్యధికం కావటం దేశంలోని నిరుద్యోగ తీవ్రతకు అద్దం పడుతున్నదని విశ్లేషకులు అంటున్నారు. మోడీ స్వంత రాష్ట్రం గుజరాత్‌లోని దేడియాపాడ గ్రామంలోని యువకులు ఏడాదిలో కొన్ని నెలలు కాంట్రాక్టు కార్మికులుగా తీసుకునే మధ్యవర్తులపై ఆధారపడుతున్నారు. అక్కడి ఆదివాసీలకు సాగు తప్ప వేరే జీవనోపాధి లేదు. గుజరాత్‌లోని ఒక ఐటీఐలో ఫిట్టర్ కోర్సు చేసి, స్థిరమైన ఆదాయ వనరు లేకుండా ఇప్పుడు గ్రామానికి తిరిగి వచ్చిన యువకులు అక్కడ చాలా మంది ఉన్నారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్ తర్వాతే డీఎస్సీ నిర్వహించాలి

- డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-1 ప్రిలిమ్స్ తర్వాతే డీఎస్సీ రాతపరీక్షలను నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మే చివరి వారంలో సివిల్స్ ప్రిలిమ్స్, జూన్ తొమ్మిదిన గ్రూప్-1 ప్రిలిమ్స్ ఉన్నాయని తెలిపారు. జూన్ చివరి వారం లేదా జులై మొదటి వారంలో డీఎస్సీ రాతపరీక్షలను నిర్వహించాలని సూచించారు. అందుకు తగ్గట్టు షెడ్యూల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్త నోటిఫికేషన్ ప్రకారం పూర్తి స్థాయిలో సిలబస్ ఇవ్వాలని కోరారు. స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులకు ఇంతవరకు పూర్తి స్థాయిలో సిలబస్ ఇవ్వలేదనీ, వెంటనే విడుదల చేయాలని తెలిపారు. 95 శాతం స్థానికులకు పోస్టులు ఉండగా మిగిలిన ఐదు శాతం స్టేట్ ఓపెన్‌లో అన్ని జిల్లాలకూ అవకాశమివ్వాలని సూచించారు.

13 మందిపై మాల్‌ప్రాక్టీస్ కేసులు

- ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మ్యాథమెటిక్స్-2బి, జువాలజీ, హిస్టరీ పేపర్-2 పరీక్షను నిర్వహించామని ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు 3,75,157 మంది దరఖాస్తు చేయగా, 3,66,389 (97.7 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. 8,768 (2.3 శాతం) మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. కరీంనగర్‌లో ఇద్దరు, వికారాబాద్‌లో తొమ్మిది, ములుగులో ఇద్దరు చొప్పున కలిపి మొత్తం 13 మంది విద్యార్థులపై మాల్‌ప్రాక్టీస్ కేసులను నమోదు చేశామని తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం మ్యాథమెటిక్స్-2బి, జువాలజీ, హిస్టరీ పేపర్-2 పరీక్షకు సెట్ సీ ప్రశ్నాపత్రాన్ని ఎంపిక చేశామని వివరించారు. ఆసిఫాబాద్, వరంగల్, హన్మకొండ, సిరిసిల్ల, యాదాద్రి భువనగిరి, వికారాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ఇంటర్ బోర్డు నుంచి పరిశీలకులు వెళ్లి పరీక్షను పరిశీలించారని పేర్కొన్నారు. ఈ పరీక్ష ప్రశాంతంగా, అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా జరిగిందని తెలిపారు.

కాంట్రాక్ట్ ప్రొఫెసర్లను రెగ్యులర్ చేయాలి

ఇకపై కాంట్రాక్టు వ్యవస్థ వద్దు : ప్రొఫెసర్ హరగోపాల్

ఓయూలో తెలంగాణ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ అధ్యాపకుల మహా సదస్సు



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. గురువారం ఓయూలో డాక్టర్ ఏ.పరశురామ్ అధ్యక్షతన తెలంగాణ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్(యూటీఏసీ-టీఎస్) ఆధ్వర్యంలో మహా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును ఉద్దేశించి హరగోపాల్ మాట్లాడుతూ.. అన్ని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇక మీదట యూనివర్సిటీల్లో కాంట్రాక్ట్ వ్యవస్థనే ఉంచకూడదన్నారు. కాంట్రాక్టు అధ్యాపకుల ఉద్యోగ భద్రత ప్రభుత్వం తీసుకోవాల్సిన అవసరం ఉందని.. ఇది సామాజిక న్యాయంలో భాగం అన్నారు. విశ్వవిద్యాలయాలు సమాజానికి వెన్నెముక లాంటివని చెప్పారు.

ప్రొ.కోదండరామ్ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి సమస్యను విన్నవించి న్యాయం జరిగేటట్టు చూస్తానని అధ్యాపకులకు హామీనిచ్చారు.

ప్రొ.పీఎల్ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాలలో కాంట్రాక్ట్ అధ్యాపకుల వ్యవస్థ కొనసాగడం దురదృష్టకరమని.. వీళ్లని రెగ్యులరైజ్ చేయడం రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కు అన్నారు. ప్రొ.రమా మేల్కోటే మాట్లాడుతూ.. ప్రభుత్వం కాంట్రాక్ట్ అధ్యాపకులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఇది సామాజిక బాధ్యత అన్నారు. ఈ సదస్సులో అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.జితేందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ డా.ప్రేమయ్య, పాలమూరు యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ భూమయ్య, చేగుంటి రవికుమార్, కేయూ నుంచి డాక్టర్ సాదు రాజేష్, డాక్టర్ చిర్రా రాజు, టీయూ నుంచి డాక్టర్ వినీత పాండే, డాక్టర్ రవికుమార్, ఎంజీఎం నుంచి డాక్టర్ శ్యాంసుందర్, డాక్టర్ తిరుపతి, జేఎన్టీయూ నుంచి డాక్టర్ శివారెడ్డి, డాక్టర్ సురేష్, జేఎన్ఎఫ్ఏయూ నుంచి డాక్టర్ రామకృష్ణయ్య, డాక్టర్ కాంతారెడ్డి, శాతవాహన యూనివర్సిటీ నుంచి డాక్టర్ యశ్వంత్, టీయూ నుంచి డాక్టర్ నారాయణ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి డాక్టర్ నాగరాజు, ట్రిబుల్ ఐటీ బాసర నుంచి డాక్టర్ శ్రీశైలం, ఉపేందర్, డాక్టర్ కృష్ణ ప్రసాద్ తదితరులు ప్రసంగించారు.

ఈ సదస్సులో తెలంగాణలోని అన్ని విశ్వవిద్యాలయాల కాంట్రాక్ట్ అధ్యాపకులు పాల్గొన్నారు.

యువకులు మత్తుకు బానిసలవొద్దు

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సురేందర్

- మెడికల్ డిస్ట్రిబ్యూటర్లపై దాడులు
- దగ్గు సిరపు టాబ్లెట్స్ స్వాధీనం



నవతెలంగాణ- కోదాడరూరల్

గంజాయి, సిరప్ మత్తు పదార్థాలకు అలవాటు పడి యువకులు జీవితాలు నాశనం చేసుకోవద్దని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ అన్నారు. టానెక్స్ సిరప్, నైట్రవేట్ 10 ఎంజి టాబ్లెట్ అనే డ్రగ్స్‌ను యువకులకు సరఫరాపై నమ్మదగిన సమాచారంతో గురువారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ల సమక్షంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సూర్యాపేట జిల్లా మట్టంపల్లిలోని న్యూ దుర్గాభవాని మెడికల్ షాప్‌పై దాడులు నిర్వహించారు. షాప్ యజమాని రమావత్ రవీందర్ ఇంట్లో టానెక్స్ సిరప్, నైట్రవేట్ 10ఎంజి టాబ్లెట్స్ 10 షీట్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

వారికి సప్లై చేసిన కోదాడలోని శ్రీ వెంకట సాయి సర్జికల్ అండ్ మెడికల్ డిస్ట్రిబ్యూషన్ అండ్ సాయి దుర్గ ఫార్మా డిస్ట్రిబ్యూషన్‌పైనా దాడులు చేశారు. అమ్మకాల వివరాలు సేకరించి దానికి సంబంధించిన పూర్తి సమాచారం సమర్పించాల్సిందిగా నోటీసులు జారీ చేశారు.

మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమలు చేయాలి

మహిళలపై జరుగుతున్న దాడులు అరికట్టాలి : టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి



నవతెలంగాణ-సంగారెడ్డి

మహిళ రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని, మహిళలపై జరుగుతున్న దాడులు అరికట్టాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టీఎస్‌యూటీఎఫ) సంగారెడ్డి జిల్లా మహిళా సబ్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం 'దేశాభివృద్ధిలో మహిళల పాత్ర' అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చావ రవి మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ బిల్లు చట్టం చేసినా 2029 వరకు ఇంప్లిమెంటేషన్ కోసం ఆపడం ఎంతవరకు సమంజసమన్నారు. పని ప్రదేశంలో, ప్రయాణంలో మహిళా ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు రక్షణ కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం అందించాలని కోరారు. మహిళా ఉద్యోగులకు రెండేండ్ల చైల్డ్ కేర్ లీవ్ ఇవ్వాలని, క్లాస్ కో టీచర్, క్లాస్‌కు ఒక తరగతి గది ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన మండలానికి ఒక పబ్లిక్ స్కూల్ ఏర్పాటులో ప్రభుత్వ పాఠశాలలను ఎంచుకోవాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30శాతం పీఆర్సీ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం సంగారెడ్డి జిల్లా విద్యాధికారి ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జిల్లాలోని మహిళా ఉపాధ్యాయులు విరామమెరగక కృషి చేస్తూ పిల్లలకి మంచి విద్యాబుద్ధులు నేర్పిస్తూ మంచి ఫలితాల కోసం ప్రయత్నిస్తున్నారని అభినందించారు. మహిళలు తమ ఇంటిని చక్కబెట్టుకోవడమే కాకుండా ఈ సమాజాన్ని చక్కబెట్టే ప్రయత్నంలో ముందున్నారని కొనియాడారు. అనంతరం జిల్లా ట్రెజరీస్ డిప్యూటీ డైరెక్టర్ కవిత కుమారి, యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి టీ.లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు వై.జ్ఞానమంజరి మాట్లాడుతూ.. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని, మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు హెల్త్ కార్డ్స్ జారీ చేసి ఉచిత వైద్యం అందించాలన్నారు. కస్తూర్బా బాలిక విద్యాలయాల్లో పనిచేస్తున్న టీచర్లు, సిబ్బంది అందరికీ సమాన పనికి సమాన వేతనం ఇస్తూ బేసిక్ పే వర్తింపజేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన మూడు డీఏలు వెంటనే ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సదస్సులో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. సువర్ణ, అమరేశ్వరి, ఎం.శామయ్య సంగారెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే.అశోక్, బి. సాయిలు, కార్యదర్శులు బి. అరుణశ్రీ, జీ.విశాలి, వి.అనురాధ, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహిళా విభాగం కన్వీనర్ లీల కుమారి, నాయకులు జ్యోతి, జోత్స్నా, నాగమణి, విజేత, కౌసల్య, స్వప్న, సుచరిత, సౌభాగ్య, సంగారెడ్డి జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాల్స్, మోడల్ స్కూల్ పాఠశాల ప్రిన్సిపల్స్, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.